ఈనాడు

గుంటూరు 4-5-2026 సోమవారం సిటీ సంపుటి 31 సంచిక 28
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Guntur, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajahmahendravaram, Suryapet, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

తండ్రి ప్రేమా.. తక్కువేం కాదు

అమ్మతనం స్త్రీని పూర్తిగా మార్చేస్తుంది. మూర్తీభవించిన మాతృత్వం.. హృదయం నిండా ప్రేమ... తనలో నుంచి వచ్చిన చిన్ని ప్రాణిపై మమకారం... ఇంతకుముందు అనుభూతిలో కూడా లేని ఓ బాధ్యత... స్థిరమైన చిత్తం... ధైర్యం! అన్నీ ఆమెను పరిపూర్ణవతిగా మారుస్తాయి.

మరి నాన్న మాటో...

తండ్రి అవుతున్నానన్న కబురు పురుషుల్లోనూ చాలా మార్పులు తెస్తుందంటున్నాయి అధ్యయనాలు. వారి మెదడు, శరీరం తండ్రి కావడానికి సిద్ధమవుతాయి. ఆప్యాయత, అంకిత భావం వచ్చేస్తాయి. ఇంతకూ...ఇదంతా హార్మోన్ల మహిమ.



భార్య గర్భిణి అని తెలియగానే భర్త ఆమెను కంటికి రెప్పలా చూసుకుంటాడు. అంతకు ముందు భార్యాభర్తల మధ్య ఉన్న మనస్పర్థలూ సమసిపోతాయి. మొత్తంగా ఒక పాజిటివ్ దృక్పథం వచ్చేస్తుంది. ఇదంతా యాదృచ్ఛికంగా జరిగేది కాదని... దీని వెనక హార్మోన్ల మాయాజాలం ఉంటుందని చెబుతున్నారు నిపుణులు. గర్భిణులలో హార్మోన్ల మార్పులు చోటు చేసుకుంటాయి. పురుషుల్లో ఎలాంటి మార్పూ ఉండదని భావించేవారు. అయితే కాబోయే తండ్రుల మెదళ్లలోనూ చాలా మార్పులు జరుగుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దీంతో వారికి తెలియకుండానే కాబోయే తల్లి పట్ల, రాబోయే బిడ్డ పట్ల రక్షణాత్మకమైన, బాధ్యతాయుత మైన మానసిక స్థితికి చేరుకుంటారు.

వెల్లువెత్తే ప్రేమ హార్మోన్లు...

- మనిషి మెదడులో తల్లిదండ్రులుగా వ్యవహరించే గుప్త సామర్థ్యం ఉంటుంది. దాన్ని ఆలోపేరంటల్ సబ్‌స్ట్రేట్ అని పిలుస్తారు. బిడ్డ పుట్టబోతున్న కబురు వినగానే అది క్రియాశీలం అవుతుంది.
- మాతృత్వం స్త్రీలను మార్చినట్లే, తండ్రి అవుతున్నానన్న భావన పురుషులను కూడా మార్చేస్తుంది. బిడ్డ సంరక్షణలో ఎక్కువగా పాలు పంచుకోవాలన్న భావన ఎంత ఎక్కువ ఉంటే ఆ పరివర్తన అంత లోతుగా ఉంటుంది. అంతఃస్రావ, నాడీ వ్యవస్థల్లో మార్పులు జరుగుతాయి. టెస్టోస్టిరాన్, వాసోప్రెసిన్ వంటి హార్మోన్లలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వారిలో దూకుడు స్వభావం తగ్గుతుంది. ప్రశాంత చిత్తం పెరుగుతోంది.

(మిగతా 2లో)

నాలుగిం‘టి’పై దృష్టి పెట్టండి

పిల్లల్లో టైప్-1 మధుమేహాన్ని గుర్తించండి

కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ సూచన 10లో

యుద్ధం ముగింపునకు మూడంచెల ప్రణాళిక

14 పాయింట్లతో అమెరికాకు సమర్పించిన ఇరాన్

నగల దుకాణంలో కాల్పుల కలకలం

తెలంగాణలోని కరీంనగర్ నడిబొడ్డున ఐదుగురు దుండగుల దుశ్చర్య

తుపాకులతో చొరబడి బెదిరింపు

కిలోకుపైగా బంగారు ఆభరణాలతో పరారీ 12లో

ఎంవోయూల వారోత్సవం!



పరిశ్రమల గ్రౌండింగే ప్రధాన లక్ష్యం

కనీసం 100 కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం

కార్యాచరణ రూపొందించిన పరిశ్రమల శాఖ

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో పరిశ్రమల గ్రౌండింగ్ కోసం వినూత్న కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. సోమవారం నుంచి వారం రోజుల పాటు అవగాహన ఒప్పందాల(ఎంవోయూ) వారోత్సవాన్ని నిర్వహించనుంది. రాష్ట్ర ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్న పారిశ్రామికవేత్తలలో రోజుకు కొందరు చొప్పున వారం రోజులపాటు సమావేశమై యూనిట్ల గ్రౌండింగ్‌ను వేగవంతం చేసే దిశగా కసరత్తు చేయనుంది. ప్రభుత్వ పరిధిలో పరిష్కరించే అవకాశం ఉన్న సమస్యలపై వెంటనే నిర్ణయం తీసుకోనుంది. కూటమి అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు నిర్వహించిన ఎస్ఐపీబీలు, విశాఖపట్నంలో గత ఏడాది నవంబరులో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో వివిధ రంగాలకు చెందిన 749 కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటిద్వారా సుమారు రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు, 22.39 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. వాటిలో మెజారిటీ ఎంవోయూలు గ్రౌండింగ్ కావాల్సి ఉంది.

ఒక్కో సంస్థకు 40 నిమిషాల వ్యవధి

ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్న ఒక్కో సంస్థకు కనీసం 40 నిమిషాలు కేటాయించనున్నారు. వారికి సమయాన్ని.. తేదీని ఖరారు చేస్తూ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇలా నిత్యం కనీసం 12-15 మంది పారిశ్రామికవేత్తలతో సమావేశం కావాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఈ మేరకు వారం రోజుల్లో కనీసం 100 కంపెనీల ప్రతినిధులతో సమావేశం కావొచ్చు. రాష్ట్రప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్న అన్ని కంపెనీలకూ అధికారులు సమాచారం పంపారు. ఎంవోయూల వారోత్సవాన్ని ప్రారంభించడానికి ముందుగా మంత్రులు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులతో ప్రభుత్వం సోమవారం సమీక్షించనుంది. ఎంవోయూలు ఎంతమేరకు అమలులోకి వచ్చాయి? అవి ఏదశల్లో ఉన్నాయి? మరింత వేగంగా గ్రౌండింగ్ చేయడానికి (మిగతా 2లో)

రూ.1,000 కోట్ల పైబడిన పెట్టుబడులపై దృష్టి

విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో 538 సంస్థలు ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి. వాటిద్వారా సుమారు రూ.11.38 లక్షల కోట్ల పెట్టుబడులు.. 14.03 లక్షల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. వాటిలో పరిశ్రమల శాఖకు సంబంధించి రూ.1,000 కోట్లకు పైబడి పెట్టుబడి పెట్టే 165 ఎంవోయూలను గుర్తించి. వాటిని ఎస్ఐపీబీలో ఆమోదించి.. గ్రౌండింగ్ చేయాలన్నది ప్రభుత్వం ఆలోచన.

నేడే ఓట్ల లెక్కింపు

4 రాష్ట్రాలు, పుదుచ్చేరిలో ఏర్పాట్లు పూర్తి

ఫలితాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి

దిల్లీ: కాళ్లకు చక్రాలు కట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విస్తృత ప్రచారం ఎంత మేరకు ఫలిస్తుంది.. కేంద్రంలోని అధికార కూటమిపై విపక్షాలు ఎక్కుపెట్టిన అస్త్రాలు ఏ మేరకు విజయవంతమవుతాయి. దేశంలో భిన్న ప్రాంతాల్లో ఓటర్ల మనోగతం ఎలా ఉంది.. అనేది సోమవారం తేలిపోనుంది. హోరాహోరీగా సాగిన శాసనసభ ఎన్నికల సమరంపై ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు ఎంతవరకు నిజమవుతాయనేదీ కొన్ని గంటల్లో తేటతెల్లం కానుంది. పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, తమిళనాడు రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో గత నెల జరిగిన శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం 8 గంటలకు మొదలుకానుంది. ఇవి కొన్ని రాష్ట్రాలకే పరిమితమైనా రాజకీయ పరిణామాల నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికే సన్నాహక కౌంటింగ్ కసరత్తును పూర్తి చేయడంతోపాటు ఎలాంటి అవకతవకలు, ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంది. ఆయా కేంద్రాల్లోకి అనధికారిక వ్యక్తులెవరూ అడుగుపెట్టడానికి వీల్లేకుండా ఎన్నికల సంఘం ఈసారి క్యూఆర్ కోడ్ ఆధారిత ఐడీ కార్డుల పద్ధతిని ప్రవేశపెట్టింది.



పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్‌లో స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా సిబ్బంది పహరా

బిర్యానీ.. మిఠాయిలకు ఆర్డర్లు

ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో ఆయా పార్టీలు గెలుపు తమదేననే ధీమాలో ఉన్నాయి. విందులు, సాంస్కృతిక కార్యక్రమాలకూ ఏర్పాట్లు చేస్తున్నాయి. పశ్చిమబెంగాల్‌లో మోదీశ్రీ (కాషాయ రంగుతో), జొయ్ బంగ్లా (తృణమూల్ చిహ్నంలో ఒకటైన ఆకుపచ్చ రంగుతో) పేరిట రకరకాల మిఠాయిలు సిద్ధమవుతున్నాయి. రసగుల్లా, రాజ్‌భోగ్‌లను ఆయా రంగుల్లో సిద్ధం చేయడంలో తామంతా తలమునకలైనట్లు (మిగతా 2లో)



విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలో ఓ పరీక్ష కేంద్రం వద్ద డ్రోన్‌తో పోలీసుల నిఘా

గతేడాదితో పోలిస్తే సులువుగానే ‘నీట్’

- కటాఫ్ మార్కులు పెరిగే అవకాశం ఉందంటున్న నిపుణులు
- రాష్ట్రంలోని 180 కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్ష

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే-కానూరు: దేశవ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన నీట్ (యూజీ)- 2026 ప్రశ్నపత్రం గతేడాదితో పోలిస్తే సులువుగానే ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. వృక్ష, జంతు, రసాయన, భౌతికశాస్త్రాల్లో ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎక్కువ ప్రశ్నలు జతచేసేలా, అధిక సమయం తీసుకునేలా ఉన్నాయని చెప్పారు. చాలా ప్రశ్నలు సులువుగా, మరికొన్ని కష్టంగా ఉన్నాయని.. విద్యార్థులు తెలిపారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో రాష్ట్రంలో 25 పట్టణాల్లోని 180 కేంద్రాల్లో నిర్వహించిన నీట్ ప్రశాంతంగా ముగిసింది. పోలీసు బందోబస్తు నడుమ మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష సాగింది. సమయానికి రానివారిని అనుమతించకపోవడంతో పలువురు పరీక్ష రాయలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షకు 45 వేల మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 96% మంది హాజరైనట్లు (మిగతా 2లో)

నలుమూలలకూ జలాశయాల ఫలాలు

ఏడు ప్రాధాన్య ప్రాజెక్టులకు రూ.11,496 కోట్లు అవసరం

- పోలవరానికే రూ.5,108 కోట్లు.. ఆ మేరకు కేంద్రం భరోసా
- రూ.6,388 కోట్లు రాష్ట్రం భరిస్తే కీలక ప్రాజెక్టుల సాకారం

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో త్వరగా పూర్తయ్యే సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులను సమకూర్చి, అన్ని ప్రాంతాల్లోనూ వాటి ఫలితాలను రాబట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు కీలక ప్రాజెక్టులకు ఎన్ని నిధులు ఖర్చు చేస్తే త్వరగా ఫలితాలు అందుతాయో లెక్కలేసి, వాటి సాకారం దిశగా ప్రణాళిక రూపొందిస్తోంది. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో పోలవరం, వెలిగొండ తొలిదశ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడం సహా మరో ఐదు ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.11,496.32 కోట్లు అవసరమని జలవనరులశాఖ అంచనా కట్టింది. వరికపూడిశెల ఎత్తిపోతలను ప్రభుత్వం ప్రాధాన్య క్రమంలో ఎంచుకున్నప్పటికీ, ఇంకా అనేక అనుమతులు రావాల్సి ఉన్నందున దానికయ్యే వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. పోలవరం తొలిదశకు ఇంకా రూ.5,108 కోట్లు అవసరం. కేంద్రం అడ్వాన్సుగా ఇచ్చిన నిధులు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నాయి. కొత్త బడ్జెట్‌లోనూ సరిపడా నిధులు కేటాయించారు. ఈ ప్రాజెక్టుకు అయ్యే వ్యయ భారం రాష్ట్ర ప్రభుత్వంపై పడదు. ఈ నేపథ్యంలో రూ.6,388.32 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తే.. మరో ఆరు ప్రాజెక్టులు సాకారం కానున్నాయి. కొన్ని ప్రాజెక్టులు తొలిదశ ఫలితాలూ అందివ్వనున్నాయి.



వెలిగొండ హెడ్ రెగ్యులేటర్

- పోలవరం ప్రాజెక్టు తొలిదశలో +41.15 మీటర్ల ఎత్తున నీళ్లు నిల్వ చేసేందుకు ఇంకా రూ.5,108 కోట్లు అవసరమని అంచనావేశారు. ఇప్పటికే కేంద్రం ఇచ్చిన అడ్వాన్సు రూ.1,973 కోట్లు రాష్ట్రం వద్ద అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్రం రూ.3,835 కోట్లు కేటాయించింది. అందువల్ల ఈ ప్రాజెక్టు నిధులకు కొరత లేదు.
- వెలిగొండ తొలిదశలో రెండు కరవు జిల్లాలకు లక్ష ఎకరాలకు పైగా నీళ్లు ఇవ్వనున్నారు. సొరంగాలు, కాలువల తవ్వకం, వాటిపై కట్టడాల వంటి పనులు జరుగుతున్నాయి. ఇందుకు రూ.979.11 కోట్లు అవసరం. పునరావాసంలో భాగంగా 7,225 కుటుంబాలను తరలించాల్సి ఉంటుంది. భూసేకరణ, పునరావాసానికి రూ.1,062 కోట్లు అవసరం కాగా ఎప్పటికప్పుడు బిల్లులు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది.
- హంద్రీ-నీవా సుజల స్రవంతి రెండు దశల్లో కాలువ వెడల్పు, లైనింగ్ పనులు చేస్తూ రాయలసీమ జిల్లాలకు నీళ్లందించేలా ప్రవాహ సామర్థ్యం పెంచుతున్నారు. (మిగతా 2లో)

ప్రాధాన్య ప్రాజెక్టులకు కావాల్సిన నిధులు.. (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	సివిల్ పనులకు	భూసేకరణ, పునరావాసం
1. పోలవరం తొలిదశ	1,800.00	3,308.00
2. వెలిగొండ తొలిదశ	979.11	1,062.87
3. హంద్రీ-నీవా సుజల స్రవంతి	1,014.27	–
4. చింతలపూడి ఎత్తిపోతల	1,890.00	152.00
5. తారకరామ తీర్థ సాగరం	489.00	270.46
6. మహేంద్రతనయ రిజర్వాయర్	342.93	40.64
7. హిరమండలం ఎత్తిపోతల	147.04	–

సెలవుల్లో సరదాగా!



వస్తూ వస్తూ మీకోసం చాలా కబుర్లు తీసుకొచ్చా..
మీకు బుడగల మెషీన్ ఇంట్లోనే చేయడం ఎలాగో తెలియాలా..
అమ్మ మీద కోప్పడకుండా ఉండటం ప్రాక్టీస్ చేయాలా..
మన కాలనీని శుభ్రంగా ఉంచుకోవడం, ఇసుకతో బోలెడు బొమ్మలేయడం..
ప్రకృతితో పరిశీలనాశక్తిని పెంచుకోవడం, పాత టీషర్టులను కొత్తగా మలచడం..
ఇలా ఎన్నో కొత్త విషయాలే కాదు!
చిక్కు ప్రశ్నలు, చకచకా అనే వాక్యాలు.. ఇలా భలే భలే గమ్మత్తులు లోపలి పేజీల్లో దాచాను.
మరి ఇంకెందుకు ఆలస్యం.. వెంటనే చదివేయండి!

మీ డింబు

ఆధార్ కార్డు మార్పులపై వార్తలు నిరాధారం 10లో

ఇదీ సంగతి!



జాగ్రత్త! ఫోన్ స్విచాఫ్ వస్తే కంగారుపడకు. గెలిచి రిసార్ట్‌లో ఉన్నానని అర్థం.. నా కోసం వెతకకు.. బై!

వాతావరణమెలా ఉన్నా స్పష్టంగా చిత్రాలు

విజయవంతమైన ‘దృష్టి’ ఉపగ్రహ ప్రయోగం

దిల్లీ: బెంగళూరుకు చెందిన అంతరిక్ష స్టార్టప్ గెలాక్స్‌ఐ రూపొందించిన ‘దృష్టి’ ఉపగ్రహాన్ని ఆదివారం కాలిఫోర్నియా నుంచి స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్ 9 రాకెట్‌తో విజయవంతంగా ప్రయోగించారు. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి ఆప్టోసార్ శాటిలైట్. అంటే దీనిలో ఒకే ప్లాట్‌ఫామ్‌లో ఎలక్ట్రో-ఆప్టికల్, సింథటిక్ ఎపెర్చర్ రాడార్ సెన్సర్లు ఉంటాయి. దీని ప్రత్యేకతేంటంటే.. సాధారణంగా కెమెరాలు పగలే ఫొటోలు తీయగలవు. ఇందులోని రాడార్ సెన్సర్లు వర్షం పడుతున్నా, మేఘాలు అడ్డుగా ఉన్నా, చీకటిలోనైనా స్పష్టమైన చిత్రాలను తీస్తాయి. వ్యవసాయం, విపత్తు నిర్వహణ, రక్షణ, సముద్ర గస్తీ తదితర అంశాల్లో ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ఐదేళ్ల స్వదేశీ పరిశోధనల ఫలితంగా ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. భారతదేశంలో ఓ ప్రైవేటు సంస్థ నిర్మించిన అతి పెద్ద ఉపగ్రహమిదే. 2030 నాటికి ఇలాంటి 10 ఉపగ్రహాలను రోదసిలోకి పంపి ఓ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేయాలని గెలాక్స్‌ఐ లక్ష్యంగా పెట్టుకుంది. ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించిన గెలాక్స్‌ఐ వ్యవస్థాపకులకు, మొత్తం బృందానికి అభినందనలు తెలిపారు. భారత అంతరిక్షయానంలో ఇదో ముఖ్యమైన మైలురాయి అని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.



దృష్టి ఉపగ్రహాన్ని నింగిలోకి మోసుకెళుతున్న ఫాల్కన్ రాకెట్

ఉన్న మందులే రాయండి!

- ప్రభుత్వ ఆసుపత్రులకు మౌఖిక ఆదేశాలు
- ఒకే నెలలో కోట్లలో మాత్రల కేటాయింపుపై విచారణకు కమిటీ



ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రులను కొన్నాళ్లుగా మందుల కొరత వేధిస్తోంది. మొత్తం 712 రకాల మందుల్లో 176 రకాలు ఆసుపత్రులకు అందట్లేదు. సెంట్రల్ డ్రగ్‌స్టోర్ల లోని బఫర్ నిల్వలు సైతం తగ్గాయి. లోకల్ పర్చేజ్ కింద సర్దుబాటు సవ్యంగా సాగడం లేదు. ఈ ప్రభావం పేద రోగులపై పడుతోంది. దీంతో మందుల నిల్వలు సమకూరేవరకు అందుబాటులో ఉన్నవాటినే ప్రిస్క్రిప్షన్‌లో రాయాలని ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్యారోగ్య శాఖ అధికారులు మౌఖిక ఆదేశాలు జారీచేశారు.

కొరత అధిగమించడానికి రూ.106 కోట్లు సర్దుబాటు: ప్రభుత్వం ఏటా రూ.800 కోట్ల బడ్జెట్‌ను ఏపీఎంఎస్ఐడీసీలోని డ్రగ్స్ విభాగానికి కేటాయిస్తే.. అందులో మందులకు రూ.600 కోట్లు, సర్జికల్స్‌కు రూ.200 కోట్లు వెచ్చిస్తున్నారు. 2025-26లో కేటాయించిన బడ్జెట్ చాలకపోవడంతో బోధనాసుపత్రులతోపాటు ఇతర వైద్యశాలల్లోనూ మందుల కొరత తలెత్తింది. దీన్ని అధిగమించడానికి వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం), జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమం (ఎన్‌వీబీడీసీపీ), అంటువ్యాధుల నియంత్రణ కార్యక్రమం (ఎపిడెమిక్ ప్రోగ్రామ్స్) కింద కేటాయించి ఖర్చుచేయకుండా మిగిలిన రూ.106 కోట్లను అవసరమైనచోట వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిధులు కొరత ఉన్నచోట మందుల సరఫరాకు వినియోగిస్తున్నారు. గత నెలలో రూ.30 కోట్ల మందులు తెప్పిస్తే.. తాజాగా రూ.71.12 కోట్ల విలువైన 380 రకాల మందులను ఔషధ నియంత్రణ విభాగం కొనుగోలు చేసింది. ఇవి ఈ నెలలో ఆసుపత్రులకు చేరే వీలుంది. 2026- 27 బడ్జెట్ నుంచి ముందస్తు సర్దుబాటు చర్యలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

అన్ని కోట్ల మాత్రలు ఎక్కడికెళ్తున్నాయ్..?

మార్చిలో పాంటాప్రజోల్ మాత్రలు 10.62 కోట్లు, టైప్-2 మధుమేహానికి వాడే మెట్‌ఫార్మిన్ 10.58 కోట్లు, నొప్పులకు వాడే డైక్లోఫెనాక్ మాత్రలు 8.94 కోట్లు సెంట్రల్ డ్రగ్‌స్టోర్ల నుంచి ఆసుపత్రులకు కేటాయించడంపై ఉన్నతాధికారుల సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. అత్యధికంగా వినియోగంలో ఉన్న మొదటి ఐదు రకాల మందులపై స్పష్టత కోసం డేటా ఆధారిత విశ్లేషణకు ప్రభుత్వం ఐదుగురు అధికారులను నియమించింది. (మిగతా 2లో)



ఇంట్లోనే బబుల్ మెషీన్

మనకు బుడగలు ఊదడం అంటే భలే సరదా! మరి ఇంట్లో ఉండే వస్తువులతోనే సొంతంగా 'బబుల్ మెషీన్' తయారు చేసుకుందామా?

ఎలా చేయాలంటే..

❖ ఒక ప్లాస్టిక్ బాటిల్‌ను తీసుకొని, దాని మూత వైపు భాగాన్ని ఒక కప్పు ఆకారంలోకి వచ్చేలా కట్ చేయండి.

❖ ఇప్పుడు ఆ బాటిల్ వెడల్పునకు తగ్గట్టుగా కార్డ్‌బోర్డ్ ముక్కను గుండ్రంగా కత్తిరించండి. దానికి అక్కడక్కడా చిన్న చిన్న రంధ్రాలు చేయండి.

❖ రంగురంగుల స్ట్రాలను తీసుకొని, వాటిని చిన్న చిన్న ముక్కలుగా ఒకే సైజులో కట్ చేసి, కార్డ్‌బోర్డ్‌కు చేసిన రంధ్రాల్లో దూర్చి అంటించండి. దీన్ని బాటిల్‌కు అతికించండి.

❖ ఒక గిన్నెలో నీళ్లు తీసుకొని, అందులో కొంచెం డిష్ సోప్ లేదా షాంపూ కలపండి. ఇప్పుడు ఆ స్ట్రాలు ఉన్న వైపును బబుల్ వాటర్‌లో ముంచి.. బాటిల్ మూతవైపు నుంచి గట్టిగా ఊదండి. అంతే.. బోలెడు బబుల్స్ మీ సొంతం.

సెలవుల్లో సరదాగా!



పెట్‌తో స్నేహం

మీకు ఇంట్లో ఉండే పప్పీ అంటే బోలెడు ఇష్టమని నాకు తెలుసు. ఎంచక్కా దానితో ఆడుకుంటూ ఉంటారు. కానీ తనకు కావాల్సినవి, పనులన్నీ మాత్రం అమ్మానాన్నలే చూస్తుంటారు. ఇప్పుడు ఎటూ స్కూల్ లేదు కదా! మరి పెట్ కేర్‌లో వారికి మనం సాయం చేద్దామా..

➤ మీ పెట్‌ను దగ్గర్లో వాకింగ్‌కు తీసుకెళ్లండి. జాగ్రత్తగా తిరిగి రండి.

➤ టైమ్‌కి ఆహారం పెట్టడం, నీళ్లు ఇవ్వడం వంటివి చేయండి.

➤ అదెప్పుడు నిద్రపోతుందో, ఎప్పుడు ఆడుకోవాలి అనుకుంటుందో గమనించండి.

➤ ముద్దు చేయడం, ఆడించడం వంటివి చేయండి.

దీనివల్ల మీకు జంతువులతో మెలగడమే కాదు, వాటి పట్ల బాధ్యత తీసుకోవడం కూడా తెలుస్తుంది. అమ్మానాన్నలకు సాయంగానూ ఉంటుంది. అయితే ఇవన్నీ వారి అనుమతితోనే చేయాలి సుమా! వద్దన్నప్పుడు చేస్తానని మారాం చేయకూడదు.

తండ్రి ప్రేమా.. తక్కువేం కాదు

(మొదటి పేజీ తరువాయి)

● పిల్లలు లేని పురుషుల కంటే తండ్రులవుతున్న వారిలో టెస్టోస్టిరాన్ తక్కువగా ఉంటున్నట్లు అమెరికాలోని నోట్రడామ్ వర్సిటీ అధ్యయనం తేల్చింది. దీనివల్ల పురుషులు.. ప్రసవానంతరం తల్లి, శిశువుతో ఎక్కువగా మమేకమవుతారని అధ్యయనం చెబుతోంది.

● అదే సమయంలో వారిలో ఆక్సిటోసిన్ స్థాయి విపరీతంగా పెరుగుతోంది. ప్రేమ హార్మోన్‌గా పిలిచే ఆక్సిటోసిన్ వల్ల పురుషుల్లో తల్లి, బిడ్డలపై మమకారం, వారితో బాంధవ్యం పెరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగిన అధ్యయనాల్లో ఆరు నెలల నుంచి రెండేళ్లలోపు వయసున్న పిల్లల తండ్రుల్లో ఆక్సిటోసిన్ స్థాయిలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి.

● అప్పుడే పుట్టిన బిడ్డను ఆప్యాయంగా చూసుకునే, చేతుల్లోకి తీసుకునే సమయంలో ఆ తండ్రుల్లో ఈ ప్రేమ హార్మోన్ వెల్లువలా ఉత్పత్తవుతోందని అధ్యయనం చెబుతోంది. ఆ తర్వాత కూడా పిల్లలతో ఎక్కువగా ప్రేమగా గడిపే తండ్రులు, వారితో ఆడిపాడి, చర్చించే తండ్రుల్లో ఆక్సిటోసిన్ గణనీయంగా ఉంటోందని తేలింది.

● ప్రోలాక్టిన్ అనే రసాయనం బాలింత తల్లుల్లో చనుబాల ఉత్పత్తికి కారణమవుతుంది. చిత్రమైన విషయమేంటంటే కాబోయే తండ్రులు, పుట్టబోయే బిడ్డ కోసం ఎదురుచూస్తున్న పురుషుల్లో కూడా ఈ హార్మోన్ స్థాయిలు ఎక్కువగా ఉన్నాయి.

నాన్నగా... నేనేంటి?

డాడ్‌బ్రెయిన్ పుస్తక రచయిత సాక్సబే బృందం.. మొదటిసారి తండ్రులవుతున్న పురుషుల మెదళ్లను స్కాన్ చేసి పరిశీలించింది. ఆ సమయంలో వారి మెదళ్లలో నాడీ సంబంధిత మార్పులు చోటు చేసుకుంటున్నాయని, కొత్త అనుభవాలకు సర్దుబాటు జరుగుతోందని గుర్తించారు. ఆ సమయంలో వాళ్లు భార్యపై అమితమైన అనురాగం చూపుతారు. పుట్టబోయే బిడ్డకోసం ఏదైనా చేయాలనే తపన వారిలో ఉంటుంది.

● కొందరు పిల్లలు పుట్టడానికి ముందే భాగస్వామితో బర్త్ వర్క్‌షాప్‌లకు, తల్లి పాల ప్రాధాన్యంపై సెషన్లకు, ఆసుపత్రులు నిర్వహించే ప్రసవ పూర్వ కోర్సులకు హాజరవుతున్నారు.

● గర్భధారణ, శిశువుల పెంపకానికి సంబంధించిన పుస్తకాలు చదువుతున్నారు. వెబ్‌సైట్లను సెర్చ్ చేస్తున్నారు.

● పాలు పట్టడం, నిద్రపుచ్చడం, డైపర్‌లు మార్చడం వంటి ప్రాథమిక విషయాల గురించి తెలుసుకుంటున్నారు.

● భార్యకు ప్రసవానంతర డిప్రెషన్ సంకేతాల గురించి తెలుసుకుంటున్నారు. ఆ సమయంలో ఆమెకు మద్దతుగా నిలిచేందుకు సిద్ధమవుతున్నారు.

● ఎలాంటి తండ్రిగా ఉండాలో ఆలోచిస్తున్నారు. వారికి ఎలాంటి విలువలను అందించాలో తెలుసుకుంటున్నారు.

● తమ వారసత్వ సమాచారాన్ని, కుటుంబ చరిత్రను శోధించి పిల్లలకు తెలియజేయడానికి వీలుగా సిద్ధం చేసుకుంటున్నారు.

– ఈనాడు ప్రత్యేక విభాగం

జేఈఈ మెయిన్స్ టాపర్‌లకు చంద్రబాబు అభినందన

నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులనూ అభినందించిన సీఎం



జేఈఈ మెయిన్స్‌లో టాపర్‌గా నిలిచిన భవితేష్‌రెడ్డిని అభినందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు శరణి, సింధూర, రవితేజ, పునీత్

ఈనాడు, అమరావతి: జేఈఈ మెయిన్స్‌లో తెలుగు రాష్ట్రాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం రాత్రి అభినందించారు. నారాయణ విద్యాసంస్థల్లో చదివి 100 పర్సంటైల్ సాధించిన మహిత్ ఆంధ్రప్రదేశ్‌లో, సాయి రిత్విక్‌రెడ్డి, మహేశ్వరి, భవితేష్‌రెడ్డిలు తెలంగాణలో టాపర్లుగా నిలిచారు. వీరితోపాటు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు కె.పునీత్, గంటా రవితేజ, పి.సింధూర, శరణిలు ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. జేఈఈలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న నారాయణ విద్యాసంస్థ ప్రతినిధులనూ ఈ సందర్భంగా చంద్రబాబు అభినందించారు.

పారిశ్రామిక విద్యుత్తు సమస్యల పరిష్కారం వేగవంతం

● ఎస్పీడీసీఎల్ పరిధిలో ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్స్

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలోని పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ లోతేటి ఆదివారం కొత్త విధానాన్ని ప్రకటించారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో పారిశ్రామిక విద్యుత్తు వినియోగదారులు వీడియో కాన్ఫరెన్స్(వీసీ) ద్వారా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చేలా అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో ప్రతి నెలా మొదటి బుధవారం ఎస్ఈ కార్యాలయాల్లో, మూడో బుధవారం తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహిస్తున్న పారిశ్రామిక వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను రద్దుచేస్తున్నట్లు ప్రకటించారు.

● విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, వ్యవస్థలో లోటుపాట్లు, ఓల్టేజ్ మార్పులు, బిల్లింగ్‌తో పాటు భద్రతా అంశాల సమస్యలను పారిశ్రామిక వినియోగదారులు ఉన్నతాధికారులతో చర్చించి, పరిష్కరించుకునేందుకు వీలు కల్పించారు. వీసీలో పాల్గొనదలచిన పారిశ్రామిక వినియోగదారులు ప్రతినెలా మొదటి బుధవారానికి 7 రోజుల ముందు నుంచి మొదటి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు 89777 79471 ఫోన్ నంబరుకు కాల్ చేసి వివరాలు నమోదుచేయాలి. ఈ వీసీ లింకు, సమయం సమాచారం మంగళవారం సాయంత్రంలోగా వినియోగదారులకు పంపుతారు. లింక్ ద్వారా పారిశ్రామికవేత్తలు, నిర్వాహకులు వీసీలో పాల్గొనవచ్చు.

ఎంవోయూల వారోత్సవం!

(మొదటి పేజీ తరువాయి)

అనుసరించాల్సిన విధానాలు ఏంటనేదానిపై చర్చించనుంది. తర్వాత ఎంవోయూలు కుదుర్చుకున్న వివిధ కంపెనీల ప్రతినిధులతో అధికారులు సమావేశం కానున్నారు.

● రాష్ట్రప్రభుత్వం ఎస్ఐపీబీల ద్వారా 211 సంస్థలకు అనుమతులు ఇచ్చింది. వాటిద్వారా రూ.8.75 లక్షల కోట్ల పెట్టుబడులు.. 8.35 లక్షల మందికి ఉపాధి లభించనున్నట్లు కంపెనీలు ఇచ్చిన ప్రతిపాదనల్లో పేర్కొన్నాయి. వాటిలో 58 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసేందుకు కార్యాచరణను రూపొందించారు.







విజయనగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో నీట్ రాయడానికి వచ్చిన అభ్యర్థి జడను తనిఖీ చేసి, ముడి వేస్తున్న మహిళా పోలీసు ● విజయవాడలో ఓ పరీక్ష కేంద్రం వద్ద ఎండకు తాళలేక అమ్మ కొంగుతో ఇలా.. ● విజయవాడలోని మారిస్ స్టెల్లా పరీక్ష కేంద్రం లోపలకు వెళ్లిన తమ చిన్నారులను గోడపై నుంచి చూస్తూ జాగ్రత్తలు చెబుతున్న తండ్రులు

గతేడాదితో పోలిస్తే సులువుగానే 'నీట్'

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తెలిపారు.

● రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖపట్నం, విజయవాడ, మంగళగిరి, మచిలీపట్నం, గూడూరు, ఏలూరు, తాడేపల్లిగూడెం, భీమవరం, గుంటూరు, తెనాలి, ఒంగోలు, చీరాల, చిత్తూరు, అనంతపురం, గుత్తి, నంద్యాల, కర్నూలు, ప్రొద్దుటూరు, కడప, నెల్లూరు, తిరుపతిలో ఈ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 నుంచే కేంద్రాల వద్ద తాకిడి కనిపించింది. చాలాచోట్ల మండు టెండల్లో నిరీక్షించాల్సి వచ్చింది.

● 'నీట్ ప్రశ్నావళి గతేడాది కన్నా సులువుగా ఉంది. బయాలజీ, కెమిస్ట్రీలో ప్రశ్నలు సులభంగా, ఫిజిక్స్ కొంచెం కష్టంగా ఉన్నాయి. ఓపెన్ కేటగిరిలో గతేడాది కటాఫ్ మార్కులు 487 ఉండగా, ఈ సంవత్సరం పెరిగే అవకాశం ఉంది' అని నారాయణ విద్యాసంస్థల డీజీఎం జాగర్లమూడి రవిశంకర్ తెలిపారు.

● 'వృక్ష, జంతుశాస్త్రాల ప్రశ్నలన్నీ ఎన్సీఈఆర్టీ పుస్తకం నుంచే వచ్చాయి. రసాయనశాస్త్రంలో 2-3 ప్రశ్నలు, భౌతికశాస్త్రంలో కొన్ని ప్రాబ్లమ్స్ క్లిష్టంగా ఉన్నాయి' అని శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ ఛైర్మన్ వెనిగళ్ల నరేంద్రబాబు వివరించారు.

● 'వృక్ష, జంతుశాస్త్రాల ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నా ఎక్కువ సమయం తీసుకునేలా, ఎక్కువ ప్రశ్నలు జత చేసేలా ఉన్నాయి. రసాయనశాస్త్రంతోపాటు ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీ ప్రశ్నలు మధ్యస్థంగా, కెమిస్ట్రీలో ఇన్ ఆర్గానిక్‌వి సులభంగా ఉన్నాయి. భౌతికశాస్త్రంలో ప్రశ్నలు మధ్యస్థంగా ఉన్నాయి. ఎక్కువ ప్రశ్నలు జతపరిచేలా, సమస్య ఆధారితంగా ఉన్నాయి' అని శారదా విద్యాసంస్థల జీఎం జి.వి.రావు పేర్కొన్నారు.

551 నగరాల్లో నీట్-యూజీ

దిల్లీ: వైద్య విద్యాసంస్థల్లో ప్రవేశాలకోసం ఉద్దేశించిన 'జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష' (నీట్-అండర్ గ్రాడ్యుయేషన్.. యూజీ)ను దేశంలో 551 నగరాల్లో, ప్రపంచవ్యాప్తంగా 14 దేశాల్లో ఆదివారం నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. 'జాతీయ పరీక్షల సంస్థ' (ఎన్టీఏ) ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు తీసుకున్న చర్యలు, వివిధ కేంద్రాలతో సమన్వయం గురించి సమీక్షించారు. దాదాపు 23 లక్షల మంది అభ్యర్థులు ఈసారి నీట్ యూజీకి నమోదయ్యారని అధికారులు తెలిపారు.

83 ఏళ్ల వయసులో..



నక్కా జయసింగరాజు

మామూలుగా అయితే ఆ వయసులో అందరూ కృష్ణా రామా అనుకుంటూ ఇంట్లో కూర్చుంటారు. కానీ ఆయన మాత్రం అలా అనుకోలేదు. 83 ఏళ్ల వయసులో నీట్ రాశారు!! తాను డాక్టర్ అవ్వాలని, ప్రజలకు సేవచేయాలని ఆయన చెప్పారు. విశాఖలోని ఎన్ఏడీ కేంద్రీయ విద్యాలయంలో పరీక్ష రాసిన ఆయన.. ఆ తర్వాత మాట్లాడారు. 'నా పేరు నక్కా జయసింగరాజు. మాది పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు. ఆంధ్రా యూనివర్సిటీలో ఎకనమిక్స్ ప్రొఫెసర్‌గా, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, మాజీ రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీల వద్ద గ్రామీణాభివృద్ధి సలహాదారుగా పనిచేసి రిటైర్ అయ్యా. చిన్నప్పటి నుంచి వైద్యరంగంపై ఆసక్తి ఉంది. అప్పట్లో మెడిసిన్ చేయాలనుకున్నా సాధ్యం కాలేదు. దీంతో ఉద్యోగవిరమణ చేశాక ఆ ప్రయత్నం మొదలుపెట్టా. ఇప్పటికి ఐదుసార్లు నీట్ రాశా. గత ఏడాది రాసినప్పుడు శ్రీకాకుళంలో సీటు వచ్చినా వెళ్లలేకపోయాను. ఈసారి నీట్‌లో మంచి ర్యాంకు వస్తుందని ఆశిస్తున్నా. అది నిజమైతే నా కలను నెరవేర్చుకుంటా' అని వివరించారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం (ఎన్ఏడీ కూడలి)

డోలీ రహిత ఏజెన్సీ లక్ష్యానికి భారీగా అవరోధాలు

- అకాల వర్షాలు, అటవీశాఖ అనుమతుల్లో జాప్యం
- కంకర కొరతతో నిలిచిన రహదారుల పనులు

ఈనాడు-అమరావతి: ఏజెన్సీ గ్రామాలను డోలీ రహితంగా అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన రహదారుల పనులకు అకాలవర్షాలు, అటవీశాఖ అనుమతుల్లో జాప్యం, కంకర కొరత వంటివి అవరోధంగా నిలుస్తున్నాయి. ఇప్పటికే పనులు పూర్తిచేయాల్సి ఉన్నా.. అనేకచోట్ల ఇంకా 'కొనసాగు'తూనే ఉన్నాయి. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డోలీలపై కిలోమీటర్ల దూరంలోని మైదాన ప్రాంతాలకు మోసుకొచ్చి ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నారు. ప్రత్యేకించి గర్భిణులు, వృద్ధులకు వైద్యం సవాల్‌గా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణ రహదారులు(పీఆర్ఆర్), గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా ఆయా జిల్లాల్లో రూ.50 కోట్లతో తొమ్మిది రహదారుల పనులు చేపట్టడానికి గతేడాది అనుమతి మంజూరుచేసింది. ఎత్తయిన కొండలపై నుంచి గిరిజనులు మైదాన ప్రాంతాలకు వేగంగా చేరుకునేలా రోడ్లు డిజైన్ చేశారు.

భారీ వర్షాలతో పనులు మళ్లీ మొదటికి

గత కొద్ది రోజులుగా ఏజెన్సీలో కురుస్తున్న వర్షాలతో.. వేసిన రహదారులు సైతం కొట్టుకుపోతున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో బాగుజోలు నుంచి సిరివర వరకు 9 కిలోమీటర్ల రోడ్డు పనిలో 6.6 కిలోమీటర్ల మేర పనులు చేపట్టారు. ఇందులో 1.2 కి.మీ. రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయింది. పాచిపెంట మండలంలో రిట్టపాడు నుంచి గొట్టూరుకు రూ.4 కోట్లతో 4 కిలోమీటర్ల రోడ్డుకు టెండర్ల ప్రక్రియ పూర్తయినా అటవీశాఖ అనుమతుల్లో జాప్యంతో పనులు మొదలుకాలేదు. పార్వతీపురం మన్యంలో పాములగిసాడ నుంచి మంత్రజోలు వరకు రూ.3.6 కోట్లతో 3.6 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు కూడా అటవీశాఖ అభ్యంతరంతో నిలిచిపోయాయి. ఆ శాఖ అనుమతి తీసుకోకుండా హైడ్రాలిక్ ఎస్కలేటర్ బ్లాస్టింగ్ చేయడం వివాదమైంది. పనులు నిలిపివేయించడంతో పాటు అటవీశాఖ అధికారులు రూ.5 లక్షల అపరాధ రుసుము విధించారు.



పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు

క్వారీల మూతతో ఇక్కట్లు

అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అనుమతుల్లేవని పలు క్వారీలను అధికారులు మూసివేయించారు. దీంతో రహదారుల పనులకు అవసరమైన కంకర కొరత ఏర్పడింది. మైదాన ప్రాంతాల నుంచి తెప్పించాలంటే ఖర్చు ఎక్కువవుతుంది. దీంతో అల్లూరి జిల్లాలో రోడ్ల పనులు నిలిచిపోయాయి. పనుల్లో పురోగతి లోపించడంతో రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం చీఫ్ ఇంజినీర్ కె.విజయకుమారి క్షేత్రస్థాయిలో పర్యటించి.. సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు.

నేడే ఓట్ల లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)

తయారీదారులు చెప్పారు. ముందుగా తెల్లని రసగుల్లాలు సిద్ధం చేస్తున్నామని, ఏ పార్టీ నెగ్గితే ఆ పార్టీకి తగ్గ రంగులో వాటిని ముంచి ఇస్తామని వివరించారు. కేరళలో కొన్నిచోట్ల అభ్యర్థులు వేలమందికి బిర్యానీ తయారు చేయించడంలో తలమునకలయ్యారు. కొచ్చిలో వేడుకలకు భాజపా సన్నద్ధమవుతోంది. పార్టీ నేతలు వందల లడ్డూలను ఆర్డర్ చేశారు.

బెంగాల్‌లో కట్టుదిట్టంగా ఏర్పాట్లు

ఒక స్థానంలో రీపోలింగ్ జరగాల్సి ఉండటంతో పశ్చిమ బెంగాల్‌లో మిగిలిన 293 అసెంబ్లీ స్థానాల్లో ఓట్ల లెక్కింపునకు 77 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికీ ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో 10 కేంద్రాలను తగ్గించడంతోపాటు అనూహ్య రీతిలో భద్రతా బలగాలను మోహరించారు. ఈవీఎంలను తారుమారు చేస్తారంటూ తృణమూల్ అగ్రనేతలు అనుమానాలు వ్యక్తంచేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఎన్నికల సంఘం 165 మంది అదనపు లెక్కింపు పర్యవేక్షకుల్ని, 77 మంది పోలీసు పర్యవేక్షకుల్ని నియమించింది. ఆదివారం భవానీపుర్ స్థానంలో ఓట్ల లెక్కింపు కేంద్రంవద్ద భాజపా, తృణమూల్ శ్రేణులు ఘర్షణపడ్డాయి. భాజపా జెండా ఉన్న రెండుకార్లు ఆ ప్రాంగణంలోకి వెళ్లాయని తృణమూల్ కార్యకర్తలు ఆరోపించారు. అధికారులు ఆ కార్లను తనిఖీచేసి, వాటిలో అభ్యంతరకరమైనవేవీ లేవని తేల్చారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో భాజపా నేత నివాసంపై కాల్పులు జరిపారనే అనుమానంతో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అస్సాంలో హ్యాట్రిక్‌పై కమలనాథుల ఆశలు

ఈసారీ అస్సాంలో విజయం సాధించి హ్యాట్రిక్ కొడతామని కమలనాథులు ఆశలు పెట్టుకున్నారు. 126 స్థానాల్లో లెక్కింపునకు 35 జిల్లాల పరిధిలో 40 కేంద్రాలు ఏర్పాటుచేశారు.

కేరళలో అంచనాలు ఆసక్తికరం

ప్రస్తుతం దేశంలో వామపక్ష కూటమి చేతిలో ఉన్న ఏకైక రాష్ట్రమైన కేరళ ఈసారి 'హస్త'గతం అవుతుందని, ఎల్‌డీఎఫ్ బదులు యూడీఎఫ్‌కి అధికారం దక్కుతుందని అత్యధిక ఎగ్జిట్‌పోల్స్ అంచనా వేశాయి. ఇదే నిజమైతే కమ్యూనిస్టులకు 1960 తర్వాత ఒక్క రాష్ట్రంలోనూ అధికారం లేని పరిస్థితి తొలిసారి ఏర్పడనుంది. ఈ రాష్ట్రంలో కాలుమోపడంపై భాజపాలోనూ ఆశలున్నాయి. భాజపా నేత పి.సి.జార్జి (పూంజర్ స్థానం) తన విజయంపై ఎవరికైనా సందేహం ఉంటే రూ.కోటి పందెం వేసేందుకు ముందుకు రావాలని సవాల్ విసిరారు. సర్వీసు ఓటర్ల పోస్టల్ బ్యాలెట్లను చేర్చడంతో కేరళలో పోలింగ్ 79.70 శాతానికి చేరిందని ప్రధాన ఎన్నికల అధికారి రతన్ కేల్కర్ వెల్లడించారు.



బీర్‌భూమ్ జిల్లా సూరిలో మిఠాయిల తయారీలో కార్మికులు

తమిళనాట రసవత్తరం

వరసగా రెండోసారి తామే అధికారంలోకి వస్తామని ఎగ్జిట్‌పోల్స్ చెప్పడంతో తమిళనాడులో డీఎంకే శిబిరంలో ఉత్సాహం ఉరకలెత్తుతోంది. నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ కొలువుదీరడం ఖాయమని కొన్ని సర్వేలు చెప్పడంతో తమిళ ఓటర్ల తీర్పు ఆసక్తికరంగా మారింది. 62 చోట్ల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మూడంచెల భద్రతతో జరిగే లెక్కింపు ప్రక్రియలో 1.25 లక్షల మంది పాల్గొంటున్నారు. నియోజకవర్గానికి ఒక పరిశీలకుడి చొప్పున ఈసీ నియమించింది. పుదుచ్చేరిలో ఆరుచోట్ల లెక్కింపు జరగనుంది.

● గోవా, కర్ణాటక, నాగాలాండ్, గుజరాత్, మహారాష్ట్రల్లో ఉప ఎన్నికలు జరిగిన 8 స్థానాల్లోనూ ఓట్ల లెక్కింపు సోమవారమే చేపట్టనున్నారు.

నలుమూలలకూ జలాశయాల ఫలాలు

(మొదటి పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.2,123 కోట్లు ఖర్చుచేశారు. ప్రధాన కాలువ, నీవా బ్రాంచి కాలువలో మిగిలిన పనులకు రూ.888.21 కోట్ల వ్యయ అంచనాతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కల్యాణీ డ్యాంకు నీళ్లిచ్చేలా రూ.126.06 కోట్లతో పనులు చేపట్టారు.

● చింతలపూడి ఎత్తిపోతలకు ఉన్న అడ్డంకులు తొలగిపోతున్నాయి. పర్యావరణ అనుమతులు సాధించే ప్రయత్నాలు చేస్తున్నారు.

● ఉత్తరాంధ్రలో తారకరామతీర్థ సాగరం ప్రాజెక్టు పూర్తిచేసి మూడు మండలాల్లోని 49 గ్రామాల ప్రజలకు తాగు, సాగునీటి వసతి కల్పించేందుకు పనులు చేస్తున్నారు. మహేంద్రతనయ రిజర్వాయర్ నిర్మించి 24,600 ఎకరాలకు ప్రయోజనం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. హిరమండలం ఎత్తిపోతల పూర్తిచేస్తే 2,10,000 ఎకరాల ఆయకట్టు స్థిరీకరించవచ్చు.

ఉన్న మందులే రాయండి!

(మొదటి పేజీ తరువాయి)

నెక్స్ట్ జెన్, డాక్టర్ కేర్ డేటాతో రోగుల రికార్డులు సరిపోల్చి నివేదిక ఇవ్వాలని వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఆదేశించారు.

● విశాఖ కేజీహెచ్, ఇతర ఆసుపత్రుల్లో కొందరు వైద్యులు అవసరాలకు మించి రోగులకు మందులు (ఒకే ప్రిస్క్రిప్షన్‌పై వందకు పైగా మాత్రలు) రాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా సమీక్షలో కొన్ని ఉదాహరణలూ ప్రస్తావనకు వచ్చాయి. దీంతో నిజంగా ఇవి రోగులకే చేరుతున్నాయా..? పక్కదారి పడుతున్నాయా..? అనే సందేహాల నివృత్తికి వైద్యులు రాసే ప్రిస్క్రిప్షన్‌పై ఆడిటింగ్ నిర్వహించాలని నిర్ణయించారు. డీఎంఈ అధ్యక్షతన స్టాండర్డ్ ట్రీట్మెంట్ గైడ్‌లైన్స్ సిద్ధం చేసి అన్ని ఆసుపత్రులకు పంపనున్నారు.

● లోకల్ పర్చేజింగ్‌లో ఆసుపత్రుల సూపరింటెండెంట్ల ద్వారా జరిపే మందుల కొనుగోలులో లోపాలున్నాయి. దీంతో ప్రతి కొనుగోలు సమాచారం ఈ- ఔషధి పోర్టల్‌లో నమోదు చేయాలని వైద్యారోగ్య శాఖ ఆదేశించింది.

ఏకసభ్య కమిషన్ నివేదికను బహిరంగపరచాలి: సీపీఎం

ఈనాడు, అమరావతి: కల్తీ నెయ్యిపై రాష్ట్రప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ నివేదికను వెంటనే బహిరంగపరచాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఏర్పడిన అపోహలు తొలగిపోతాయని పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

4-5-2026 సోమవారం

శ్రీ పరాభవ నామ సంవత్సరం; ఉత్తరాయణం; వసంత రుతువు, వైశాఖ మాసం, బహుళ పక్షం

తదియ: రా. 2-50 తదుపరి చవితి

అనూరాధ: ఉ. 8-04 తదుపరి జ్యేష్ఠ

వర్జ్యం: మ. 2-16 నుంచి 4-03 వరకు

అమృత ఘడియలు: రా. 12-55 నుంచి 2-42 వరకు

దుర్ముహూర్తం: మ. 12-21 నుంచి 1-12 వరకు తిరిగి 2-53 నుంచి 3-44 వరకు

రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు

సూర్యోదయం: ఉ.5.37; సూర్యాస్తమయం: సా.6.16

ఎండాకాలం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
అనంతపురం	43.2	27.7
నెల్లూరు	43.1	30.6
కర్నూలు	43.1	29.3
కడప	42.6	28.2
తిరుపతి	42.4	29.8
ఒంగోలు	41.7	30.0
గుంటూరు	39.0	30.0
రాజమహేంద్రవరం	39.0	29.0
విజయవాడ	37.0	29.0
శ్రీకాకుళం	35.0	25.0
తాడేపల్లిగూడెం	33.0	27.0
విశాఖపట్నం	32.8	28.8

కుండీ మనదే.. మొక్కా మనదే!



మన ఇంటి బాల్కనీలోనో లేదా టెర్రస్‌లోనో ఒక చిన్న 'గ్రీన్ జోన్' తయారు చేద్దాం రండి! అయితే అందరిలా రొటీన్‌గా కాకుండా మనం కొత్తగా ఆలోచిద్దాం. మార్కెట్లో దొరికే కుండీలు కాకుండా.. మనమే సొంతంగా తయారు చేసుకుని, వాటిలో మొక్కలు పెంచుదాం.

ఇక ఇంట్లోకి ఎందుకూ పనికిరావు అనుకునే వస్తువులే ఇక్కడ హీరోలు. ఖాళీ కొబ్బరి చిప్పలు, పాత ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల వంటివి ఉంటే చాలు, వాటికి కలర్స్ వేసి కుండీలను అందంగా తయారు చేసుకోవచ్చు. ఇంకా ఇలాంటివి మనకేం పనికొస్తాయో మీరు కూడా ఆలోచించండి.

సెలవుల్లో సరదాగా!



« వాటర్ బాటిల్‌ను మధ్యలోకి కట్ చేసి దానిపై మీకు నచ్చిన కార్టూన్ బొమ్మలు, సీతాకోక చిలుకలు వేస్తే అది ఒక అందమైన ఫ్లవర్‌వేజ్‌లా మారిపోతుంది.

« కొబ్బరి చిప్పను శుభ్రం చేసి దానికి కళ్లు, ముక్కు గీస్తే ఒక చిన్న స్మైలీ కుండీ రెడీ.

« పగిలిపోయిన లేదా పాత కాఫీ మగ్గులపై అందమైన పూలు వేశారంటే చక్కటి కుండీ సిద్ధం.



ఇప్పుడు ఆ కుండీల్లో కొంచెం మట్టి నింపి, మన వంటింట్లో దొరికే మెంతులు, ధనియాలు చల్లండి. లేదంటే ఒక చిన్న మనీ ప్లాంట్ కొమ్మను నాటండి. రోజూ కొంచెం నీళ్లు పోస్తూ ఉంటే.. రెండు, మూడు రోజుల్లోనే చిన్న చిన్నగా మొలకెత్తుతాయి, ఆ పచ్చటి ఆకులను చూస్తుంటే ఎంత హాయిగా ఉంటుందో!

చకచకా అనండి!

1. ఎర్ర కార్లలో నల్ల కార్లు.. నల్ల కార్లకి ఎర్ర డోర్లు
2. కప్పులో పప్పులు.. పక్కనే కప్పలు
3. బస్తాలో బత్తాయిలు బస్తాలకేమో బొత్తాలు
4. పిల్లికి పులికి పెళ్లి, బల్లికి పిల్లికి పెళ్లి



గొడ్డలి పార్టీ పాలనలో రాష్ట్రానికి పెట్టుబడులు రాలేదు

- క్రెడిట్ చోరీ నినాదంతో ప్రజలను మభ్యపెడుతోంది
- మంత్రులు పార్థసారథి, రాంప్రసాద్‌రెడ్డి ధ్వజం



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి. పక్కన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో గత ఐదేళ్లలో గొడ్డలి పార్టీ పాలనలో పెట్టుబడులు రాలేదని మంత్రులు పార్థసారథి, రాంప్రసాద్‌రెడ్డి విమర్శించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆదివారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న అనంతరం వారు విలేకర్లతో మాట్లాడారు. 'బాధ్యతగా ఉండాల్సిన వైకాపా విధ్వంసాలు సృష్టించడానికి యత్నిస్తోంది. ఆ పార్టీ ఇటీవల క్రెడిట్ చోరీ నినాదంతో ముందుకు సాగుతోంది. వారి పాలనలో జరగని అరాచకాలు లేవు. తిరుమలలో కల్తీ నెయ్యి తెచ్చారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్‌ల పనితీరు చూసి పెద్ద కంపెనీలు క్యూ కడుతున్నాయి. ఈ సమయంలో మతాన్ని అడ్డుపెట్టుకుని హిందువులు ఎక్కువగా ఉన్నచోట చర్చి పేరిట వివాదాలు తెచ్చి రాజకీయం చేయాలని చూడటం హేయమైన చర్య.

2028 నాటికి కడప స్టీల్‌ప్లాంట్ పూర్తి: సీమ అభివృద్ధిపై మాట్లాడే వైకాపా.. తన హయాంలో కడప స్టీల్ ప్లాంట్‌ను టెంకాయ కొట్టి వదిలేసింది. కూటమి రాగానే పనులు వేగవంతం చేశాం. 2028 నాటికి పూర్తి చేసి ప్రారంభిస్తాం. ప్రైవేట్ రంగంతో కలిపి యువతకు 9లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు తీసుకున్నాం' అని వారు పేర్కొన్నారు.

వైకాపా ముమ్మాటికీ గొడ్డలి పార్టీనే

గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ధ్వజం

ఈనాడు, అమరావతి: 'వైకాపా అనేది రాజకీయ పార్టీ కాదు. అది సైకోల ముఠా' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ధ్వజమెత్తారు. అది ముమ్మాటికీ గొడ్డలిపార్టీనే అని విరుచుకుపడ్డారు. కుటుంబసభ్యులనూ రోడ్డుమీదకు ఈడ్చిన జగన్‌ది కిల్లింగ్ మైండ్‌సెట్ అని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'జగన్‌రెడ్డి అధికారదాహం ఏ స్థాయిలో ఉంటుందో చెప్పడానికి వివేకా హత్యే అతిపెద్ద నిదర్శనం. రాజకీయంగా అడ్డువస్తున్నారని బాబాయ్‌ని చంపించిన చరిత్ర జగన్‌ది. ఈ విషయాన్ని ఆయన సొంత చెల్లెలు వైఎస్ షర్మిలే చెబుతున్నారు. కడపలో సొంతపార్టీ నేత పెద్ద దస్తగిరిని చంపించింది ఆ పార్టీ నేతలే. ఇలాంటి చరిత్ర ఉన్న పార్టీని గొడ్డలిపార్టీ అనకుండా మరేమంటారు? వైకాపా హయాంలో ప్రతిపక్షాలను వేధించడమే కాదు.. తన వెంట ఉన్న నాయకులు, అధికారుల్ని కూడా జగన్ చిత్రహింసలు పెట్టారు' అని నసీర్ అహ్మద్ మండిపడ్డారు.

బధిరులకు అండగా తితిదే విద్యాసంస్థలు

1వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: ఎస్వీ బధిరోన్నత పాఠశాల, ఎస్వీ బధిరుల జూనియర్ కళాశాలలో సాధారణ విద్యతో పాటు వృత్తి నైపుణ్యాలు నేర్పిస్తూ బధిరులకు తితిదే అండగా నిలుస్తోంది. తిరుపతిలో పాఠశాలతో పాటు జూనియర్ కళాశాలను నిర్వహిస్తుండగా, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, తెలంగాణలోని వరంగల్‌లో ఒక్కో పాఠశాలను నిర్వహిస్తోంది. వీటిలో 1వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. అందుకు జూన్ 1 వరకు గడువు ఇచ్చింది. ఒకటో తరగతిలో 15 మంది చొప్పున మూడు కేంద్రాల్లో 45 మందికి ప్రవేశాలు కల్పిస్తారు. ఇంటర్‌కు రెండు గ్రూపు(హెచ్ఈసీ, సీఈసీ)ల్లో 44 చొప్పున 88 సీట్లు భర్తీ చేస్తారు. తిరుపతి ఎస్వీ బధిరుల జూనియర్ కళాశాల నుంచి నేరుగా లేదా www.tirumala.org నుంచి దరఖాస్తులు పొంది ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్, ఎస్వీడీఎఫ్, అలిపిరి, తిరుపతి 517501 చిరునామాకు వాటిని పూర్తిచేసి పంపాలి.

ప్రత్యేక వసతులు: తితిదే ఏటా బధిర విద్యార్థుల కోసం రూ.3.50 కోట్లు ఖర్చుచేస్తోంది. ఇక్కడ నాణ్యమైన విద్య, వసతి, భోజనం, సంకేత భాష ఆధారిత బోధనతో పాటు వృత్తి నైపుణ్యాలు పెంచేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఈనాడు

రారెత్తిస్తున్న వడగాలులు!

చండ్రనిప్పులు చెరుగుతున్న సూర్యుడి మహోగ్రరూపం ధాటికి తెలుగు రాష్ట్రాలు విలవిల్లాడుతున్నాయి. రోళ్లు పగిలే రోహిణి కార్తె రాకముందే మండిపోతున్న ఎండలు ఎన్నో ప్రాణాలను నిలువునా తోడేస్తున్నాయి. మొన్న శనివారం తెలంగాణలోని పన్నెండు జిల్లాల్లో 45 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిజామాబాద్, నల్గొండ, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లో భానుడి ప్రతాపం భీకరంగా ఉంది. ఏపీలోని అనంతపురం, కర్నూలు, కడప, నెల్లూరు వంటి చోట్ల విపరీతమైన వేడిమి, ఉక్కపోతలతో జనం అల్లాడిపోతున్నారు. నిప్పుల కొలిమిని తలపిస్తున్న వాతావరణంలో చాలాచోట్ల వడదెబ్బ మరణాలు నమోదవుతున్నాయి. పర్యావరణ మార్పులకు తోడు కట్టుతప్పుతున్న కాలుష్యం మూలంగా కొన్నేళ్లుగా మార్చి నుంచే వడగాలులు రారెత్తిస్తున్నాయి. కాంక్రీటు కీకారణ్యాలుగా తయారైన నగరాల్లో మరింత భీతావహ పరిస్థితులు నెలకొంటున్నాయి. తెలంగాణలో కోటిన్నర మందికి పైగా వడగాడ్పుల గుప్పిట చిక్కే ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏపీలోనూ ఎండలు బెంబేలెత్తిస్తున్న నేపథ్యంలో యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ప్రజారోగ్య భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి.

నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ నివేదిక ప్రకారం 2024లో దేశవ్యాప్తంగా వెలుగు చూసిన వడదెబ్బ కేసుల్లో సగానికి పైగా ఏపీలోనే నమోదయ్యాయి. కేంద్రం లెక్కల మేరకు ఏపీతో పోలిస్తే తెలంగాణలో వడదెబ్బ మరణాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఆరుబయట ఎక్కువ సమయం గడిపేవారు.. ప్రధానంగా వృద్ధులకు ఉష్ణప్రకోపం ప్రాణాంతకమవుతోంది. కాబట్టి అందరూ తగినంతగా నీరు, మజ్జిగ, నిమ్మరసం వంటివి తాగుతుండాలి. ఆహార విహారాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ఇంకాస్త జాగరూకతతో మెలగాలి. వీటన్నింటిపై అధికారులు గ్రామస్థాయి వరకు విస్తృతంగా అవగాహన కల్పించాలి. దాంతోపాటు అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వడదెబ్బ బాధితులకోసం ప్రత్యేక పడకలు, ఔషధాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. మిట్టమధ్యాహ్నం ఎర్రటి ఎండల్లో పనులకు భవన నిర్మాణ కార్మికులు, ఇతర శ్రామికులను దూరంగా ఉంచాలన్న ఆదేశాలను సంబంధిత సంస్థలు, యజమానులు కచ్చితంగా అమలు చేసేలా చూడాలి. వడగాడ్పుల తీవ్రతను ముందుగానే అంచనా వేస్తూ ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి. తీవ్ర వేడి వాతావరణంలో జలవనరుల్లో బ్యాక్టీరియా వేగంగా వృద్ధిచెంది డయేరియా కోరచాచే ప్రమాదముంది. దాన్ని తప్పించడానికి నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తూ తాగునీటి సరఫరాలను లోపరహితం చేయాలి.

వడగాడ్పుల విజృంభణను నిభాయించి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకంటూ రాష్ట్రాలు ఉష్ణ కార్యాచరణ ప్రణాళికలను ప్రకటిస్తున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితులను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని, ఆయా శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే ఆ ప్రణాళికల ద్వారా మెరుగైన ఫలితాలు సిద్ధిస్తాయి. వేడిగాలుల ముప్పు అంతకంతకూ అధికమవుతున్న క్రమంలో వాటిని జాతీయ విపత్తుల జాబితాలో చేర్చాలని 16వ ఆర్థిక సంఘం ఇటీవల సిఫార్సు చేసింది. అది కార్యరూపం దాలిస్తే తక్షణ సహాయ, ఉపశమన కార్యక్రమాల కోసం కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధులు అందివస్తాయి. అయితే, తాత్కాలిక చర్యలతోనే వడగాడ్పులపై పోరాటం విజయవంతం కాదన్నది వాస్తవం. వాటి నుంచి ఉపశమనం లభించాలంటే భవనాల నిర్మాణంలోనూ మార్పులు రావాలి. వేడిమిని గ్రహించని సామగ్రి వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి. పట్టణ ప్రణాళికలను పకడ్బందీగా అమలు చేయాలి. శిలాజ ఇంధనాల వాడకాన్ని వీలైనంతగా తగ్గించడంతోపాటు పచ్చదనం పెంపునకు ప్రాధాన్యమివ్వాలి.

నైపుణ్యాలను సంపాదించుకోవాలే తప్ప ఎవరూ పూర్తిగా నేర్పించలేరు. కెమెరా ఇవ్వగలం కానీ, దాన్ని ఉపయోగించే దృష్టిని తేలేం. సృజనకు తెలివి సరిపోదు, హృదయం కావాలి.

– రఘురాయ్, ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్



ప్రగతికి సృజనాత్మకతే పెట్టుబడి

ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగంలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 'ఆరెంజ్ ఎకానమీ' అనే పదాన్ని ప్రయోగించారు. అప్పటి నుంచి దానిపై సర్వత్రా ఆసక్తి పెరిగింది. ఆరెంజ్ ఎకానమీ అంటే సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ. సంస్కృతి, సృజనాత్మకతల మేటి సమ్మేళనం. చలనచిత్రం, సంగీతం, గేమింగ్, డిజైన్, ఫ్యాషన్, ప్రచురణ, ప్రదర్శన కళలు, డిజిటల్ కంటెంట్ వ్యవస్థ వంటి వాటన్నింటినీ కలిపి సృజనాత్మక, సాంస్కృతిక పరిశ్రమలుగా పరిగణిస్తారు. ప్రాచీన భారతీయ సాంస్కృతిక వారసత్వం, దేశదేశాల్లో ప్రవాస భారతీయుల రాణింపును ఆర్థిక, సామాజిక అవకాశంగా మలచుకోవడం ఆరెంజ్ ఎకానమీలో కీలకం.

సృజనాత్మకత, సంస్కృతి, మేధోసంపత్తి ఆధారంగా జరిగే ఆర్థిక కార్యకలాపాలను నిర్వచించడానికి ఆరెంజ్ ఎకానమీ అనే పదాన్ని మొట్టమొదట 2013లో కొలంబియాలో వాడారు. ఆలోచనల ద్వారా విలువను సృష్టించడమే ఆరెంజ్ ఎకానమీ ప్రత్యేకత. లాటిన్ అమెరికా అభివృద్ధి నమూనాగా ప్రారంభమైన ఈ పదబంధం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా యువత కేంద్రంగా సాగే సుస్థిర అభివృద్ధిపై ఆసక్తి ఉన్న దేశాలను ఆకర్షిస్తోంది. ఉపాధి, వాణిజ్యం, నూతన ఆవిష్కరణలను అందించగల సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తోందని ఐరాస వాణిజ్య అభివృద్ధి సంస్థ నివేదిక పేర్కొంది. సృజనాత్మక మార్కెట్‌లో గణనీయమైన వాటాను దక్కించుకోవడానికి ఇండియా నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలు, మేధో హక్కుల సృష్టికి దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టాలి. సృజనాత్మక, సాంస్కృతిక ఉత్పత్తులకు మార్కెట్‌ను విస్తరించుకోవాలి. వికసిత భారత్ సాధనలో ఆరెంజ్ ఎకానమీ కీలక పాత్ర పోషించగలదు. ఇది ఆర్థిక వృద్ధిని సాంస్కృతిక విశ్వాసంతో, ఉపాధిని వ్యవస్థాపకతతో, అంతర్జాతీయ పోటీతత్వాన్ని నాగరికతాపరమైన సాఫ్ట్‌పవర్‌తో మిళితం చేస్తుంది.




దేశానికి ప్రయోజనాలెన్నో..!

జనాభాపరంగా యువత ఎక్కువగా ఉన్న భారత్ వంటి దేశానికి ఆరెంజ్ ఎకానమీ అమిత ప్రయోజనాలను కల్పిస్తుంది. డిజిటల్ కంటెంట్, క్రియేటర్ ఎకానమీ, చిన్న స్టూడియోల వంటి విభాగాలు తక్కువ పెట్టుబడితో, ఎక్కువ సిబ్బందితో వేగంగా అభివృద్ధి చెందుతాయి. సంప్రదాయ కార్పొరేట్ వృత్తి ఉద్యోగాలను కాకుండా, సృజనాత్మక నైపుణ్యాలను, శ్రమను జీవనోపాధిగా మార్చుకోవాలనుకునే యువతకు ఆరెంజ్ ఆర్థిక వ్యవస్థ చక్కని అవకాశాలు కల్పిస్తుంది. సంస్కృతి (సినిమా, ఆహారం, యోగా), విలువలు (ప్రజాస్వామ్యం, మానవ హక్కులు) వంటివాటితో మార్కెట్‌ను విస్తరించుకోవడమే సాఫ్ట్ పవర్. సినిమాలు, సంగీతం, గేమింగ్, డిజైన్ సేవలు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా మన దేశానికి, సాంస్కృతిక ఉత్పత్తులకు ప్రాచుర్యం పెంచుతాయి. ఈ సాఫ్ట్‌పవర్ పర్యాటకం, విద్య, సేవల ఎగుమతుల వృద్ధికీ దోహదం చేస్తుంది. సృజనాత్మక పరిశ్రమలను పూర్తిగా యాంత్రీకరణ చేయడం తేలికేమీ కాదు కాబట్టి యువతకు ఉపాధి అవకాశాలకు ఢోకా ఉండదు. ఈ పరిశ్రమలు తయారీ, సేవా రంగాల వృద్ధికి అదనపు బలాన్ని ఇస్తాయి. జీడీపీ వృద్ధికి మరో ఇంజిన్‌గా పనిచేస్తాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం ఏవీజీసీ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్) పరిశ్రమ అభివృద్ధిలో, సృజనాత్మక విద్యలో పెట్టుబడులు పెడుతున్నట్లు పేర్కొంది. ఇది నైపుణ్య ఆధారిత ఆరెంజ్ ఎకానమీకి ఊతమిస్తుంది. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఏవీజీసీ వ్యవస్థను మెరుగు పరచడానికి, దేశవ్యాప్తంగా నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రణాళికలను వివరించింది. సంస్కృతి, వారసత్వం, టూరిజాలను పర్యాటక మంత్రిత్వ శాఖ ఒకే ఛత్రం కిందకు తీసుకొచ్చింది. వారసత్వ పునరుద్ధరణ, పర్యావరణ టూరిజం నుంచి భారత్‌లో అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశాల నిర్వహణ వరకు అనేక ప్రణాళికలు భారతీయ ఆరెంజ్ ఎకానమీకి దన్నుకాగలవు. సంస్కృతి పర్యాటకాన్ని ప్రోత్సహిస్తుంది, పర్యాటకం స్థానిక హస్తకళలు, ప్రదర్శనలకు మార్కెట్‌ను పెంచుతుంది.


అందించాల్సిన సాయమిది...

భారతదేశం కేవలం ప్రపంచానికి తక్కువ ఖర్చుతో కూడిన కార్మికులను అందించే సృజనాత్మక కర్మాగారంగా మారుతుందా లేదా మేధోసంపత్తిని సృష్టించే 'క్రియేటివ్ హెడ్‌క్వార్టర్స్'గా ఎదుగుతుందా అనేది సరైన విధానాల రూపకల్పన, అమలుపైనే ఆధారపడి ఉంటుంది. మేధోహక్కులు(ఐపీఆర్) మన దగ్గర లేకపోతే కేవలం ప్రతిభను మాత్రమే ఎగుమతి చేసే ప్రమాదం ఉంది. అందుకే ప్రోత్సాహకాలు, ఫైనాన్స్, నిబంధనలు కేవలం నైపుణ్య శిక్షణకే కాకుండా ఐపీఆర్ సృష్టికి, వాణిజ్యీకరణకు ప్రాధాన్యమివ్వాలి. చిన్న సృజనాత్మక సంస్థలకు, స్టూడియోలకు తగిన రుణాలు, ఆర్థికసాయం అందకపోవడం; క్రియేటర్ల ఆదాయం, ప్లాట్‌ఫామ్ చెల్లింపులు, రాయల్టీలపై పన్ను నిబంధనలలో స్పష్టత లేకపోవడం వంటి సమస్యలను పరిహరించాలి. వేగవంతమైన ఐపీఆర్ రిజిస్ట్రేషన్లు, తక్కువ ఖర్చులు, టెక్నాలజీ ఆధారిత ఐపీఆర్ మార్కెట్లు అవసరం. మెట్రో నగరాల వెలుపల స్టూడియోలు, పోస్ట్-ప్రొడక్షన్ వంటి మౌలిక సదుపాయాల కొరతను తీర్చాలి. బడ్జెట్ కేటాయింపులతో సరిపెట్టకుండా, ఉపాధి, ఎగుమతులుగా మార్చడానికి విధానపరమైన చర్యలు అవసరం. చిన్న గ్రాంట్లు, తక్కువ వడ్డీకి రుణాలు అందించే ఆర్థిక ఉత్పత్తులను రూపొందించాలి. వీటిని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోనూ అందించడం ద్వారా సృజనాత్మక ఉద్యోగాలను వికేంద్రీకరించాలి.

చిన్న క్రియేటర్లకు రాయితీపై కాపీరైట్, డిజైన్ రిజిస్ట్రేషన్ అందించడం అవసరం. సాంస్కృతిక దౌత్యం, పర్యాటక కార్యక్రమాల ద్వారా విదేశీ మార్కెట్లను అందుకోవడమూ ముఖ్యమే. ఇతర దేశాలతో కో-ప్రొడక్షన్ ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా భారతీయ క్రియేటర్లకు పెట్టుబడులు, పంపిణీ భాగస్వాములను అందించాలి. సృజనాత్మక శిక్షణతోపాటు వ్యాపార నైపుణ్యాలు (కాంట్రాక్టులు, మార్కెటింగ్, రాయల్టీలు) నేర్పే విద్యా కార్యక్రమాలను విస్తరించాలి. ఉద్యోగాలు, ఎగుమతులు, ఐపీఆర్ రిజిస్ట్రేషన్లను ట్రాక్ చేయడానికి జాతీయ స్థాయి డ్యాష్‌బోర్డ్‌ను నిర్మించాలి. భారతదేశం ఇప్పుడు కీలక మలుపులో ఉంది. మన ప్రతిభ, స్థానిక మార్కెట్ సిద్ధంగా ఉన్నాయి, ప్రపంచానికి సృజనాత్మక సేవల అవసరం ఉంది. ప్రస్తుత అవకాశాల్ని దీర్ఘకాలిక వృద్ధిగా మార్చడానికి ప్రభుత్వం సంస్కృతిని కేవలం సాఫ్ట్‌పవర్ వ్యూహంగా మాత్రమే కాకుండా, పారిశ్రామిక విధానంగా పరిగణించాల్సిన అవసరం ఉంది.



ప్రొఫెసర్ వి.శ్రీనివాస్ సుబ్బారావు
మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి,
నల్సార్ లా యూనివర్సిటీ



ప్రతీకారం... ఇలా కూడా!

పోటీ, పగ, ప్రతీకారాలతో జీవితాలను నాశనం చేసుకునేవారిని చూస్తుంటాం. కానీ తనలోని ప్రతీకార జ్వాలను దారిమళ్లించి మానవాళికి సరికొత్త ఆవిష్కరణను అందించిన ఒక వ్యక్తి స్ఫూర్తిగాథ ఇది. ఒక సాదాసీదా వ్యాపారి ప్రపంచ టెలికమ్యూనికేషన్ రంగం గతినే మార్చివేసిన తీరు అనుసరణీయం.

అది 1880వ దశకం. అల్మన్ బ్రౌన్ స్ట్రోగర్ అమెరికాలోని కన్సాస్ నగరంలో అంతిమ సంస్కారాలు నిర్వహించే వ్యాపారం చేసేవారు. శవపేటిక సమకూర్చడం దగ్గర నుంచి చివరి వరకు అన్ని పనులు ఆయనే చూసుకునేవారు. వ్యాపారం బాగానే సాగుతోందనుకుంటుండగా ఒక్కసారిగా తనకు క్లయింట్స్ నుంచి ఫోన్ కాల్స్ రావడం ఆగిపోయింది. మొత్తం నగరంలో ఆ పని చేస్తున్నది ఇద్దరే కాబట్టి కొంతమంది అయినా తనని సంప్రదించక తప్పదు కదా అని ఆలోచనలో పడ్డారు స్ట్రోగర్.

టెలీకమ్యూనికేషన్ వ్యవస్థ ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందలేదు అప్పటికి. ఎక్స్ఛేంజ్‌లో ఆపరేటర్ కలిపితేనే ఎవరితోనైనా ఫోన్ మాట్లాడటం వీలయ్యేది. ఇదే స్ట్రోగర్ వ్యాపారానికి ఆటంకమైంది. అకస్మాత్తుగా క్లయింట్ల నుంచి ఫోన్లు ఎందుకు ఆగిపోయాయా అని ఆలోచించి, చివరికి అసలు కారణాన్ని స్వయంగా కనిపెట్టేశారు. ఆ నగరంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో పనిచేస్తున్న ఉద్యోగి తన ప్రత్యర్థి వ్యాపారి భార్య. తనకు వచ్చే ఫోన్ కాల్స్ అన్నింటిని ఆవిడ తన భర్తకు మళ్లిస్తోందని గుర్తించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. సమస్య ఎక్కడుందో తెలిసింది. ఇప్పుడేం చేయాలి.. తన వ్యాపారానికి నష్టం కలిగిస్తున్న వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. కానీ ఎలా.. ఇక్కడే ఒక అద్భుతం జరిగింది. ఆయన అందరిలా ఆలోచించలేదు. తన పగను మరోరకంగా తీర్చుకోవాలని భావించారు. తనలాంటి మిగతా వారికీ అది ఉపయోగపడాలనుకున్నారు. అలా టెలీకమ్యూనికేషన్ రంగంలో ఓనమాలు కూడా తెలియని స్ట్రోగర్ దాని గతినే మార్చేశారు. మనుషుల ప్రమేయం లేని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ రూపకల్పనకు ఉపక్రమించారు. సాంకేతిక పరిజ్ఞానం అంతగా లేకపోయినా స్ట్రోగర్ సంకల్పం ముందు ఆ లోపం నిలబడలేదు. తన బృందం సహకారంతో మూడేళ్లు కష్టపడి ఆయన అనుకున్నది సాధించారు. ఆటోమేటిక్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ పరికరం రూపొందించారు. 1891లో తన ఆవిష్కరణకు పేటెంట్ తీసుకున్నారు. 1892లో ప్రపంచంలోనే మొట్టమొదటి ఆటోమేటిక్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఇండియానాలో ఏర్పాటైంది. ఆపరేటర్ అవసరం లేకుండానే నేరుగా ఎవరికైనా ఫోన్ చేసుకునే సదుపాయం లభించింది. ప్రజలంతా ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన రూపొందించిన పరికరాన్ని ఇప్పటికీ 'స్ట్రోగర్ స్విచ్' అనే పిలుస్తారు. అనంతర కాలంలో అది కొత్త సాంకేతికతకు దారులు సుగమం చేసింది.

స్ట్రోగర్ లాంటి అనుభవం ఏ రంగంలోనైనా ఎవరికైనా ఎదురవ్వచ్చు. సమస్య పరిష్కారానికి సానుకూల ధోరణితో ఆలోచించగలిగితే మానసికంగా ప్రశాంతత కోల్పోకుండా ఉండవచ్చు. సమాజానికి సరికొత్త ఆవిష్కరణలూ లభిస్తాయి. ఏమంటారు?

– బాలస్వామి నరసింగ

మానవత్వం

మనిషి పుట్టుకతో కులమతాలను ఎంచుకోలేడు కానీ, తోటి మనిషి కష్టంలో ఉన్నప్పుడు స్పందించే గుణాన్ని మాత్రం తప్పక ఎంచుకోగలడు. అది మన సంస్కారం మీద ఆధారపడి ఉంటుంది. రక్తం రంగు ఒకటే, ప్రాణం విలువ ఒకటే అయినప్పుడు మనుషుల మధ్య కులమతాల అడ్డుగోడలెందుకు? విభేదాలను సృష్టించే శక్తులకన్నా ప్రేమను పంచే మనసులే ఈ ప్రపంచానికి అవసరం. మానవత్వం అనే అనంతమైన ఆకాశం కింద అందరం స్వేచ్ఛగా, ప్రేమతో బతకడమే నిజమైన నాగరికత.

భారతీయ సంస్కృతి ఎప్పుడూ విశ్వజనీనతకే ప్రాధాన్యమిచ్చింది. మన ప్రాచీన గ్రంథాలు మనుషుల మధ్య విభజనను కాక ఏకత్వాన్ని బోధించాయి. మహోపనిషత్తులో 'అయం నిజః పరోవేతి గణనా లఘుచేతసామ్‌ ఉదారచరితానాం తు వసుధైక కుటుంబకమ్' అన్న రుషి వాక్కులు అందరికీ శిరోధార్యమైనవి. వీడు నావాడు, వాడు పరాయివాడు అని ఆలోచించడం అల్పబుద్ధిగలవారి లక్షణం. విశాల హృదయం ఉన్నవారికి ఈ ప్రపంచమంతా ఒకే కుటుంబం. రుగ్వేదంలోని సంజ్ఞాన సూక్తం బోధించినట్టుగా 'సమానో మంత్రః సమితిః సమానీ'- మన ఆలోచనలూ, మన లక్ష్యం, మన హృదయ స్పందన ఒకటే కావాలి. ఇక్కడ ఎక్కడా విడివిడి వర్గాల ప్రస్తావన లేదు, కేవలం మానవ సమూహం అనే భావనే ఉంది.



అంతర్యామి

మానవత్వం కన్నా ఏదీ గొప్పది కాదు అన్నది కేవలం ఒక మాట మాత్రమే కాదు, అదొక గొప్ప జీవన సూత్రం. నిస్వార్థం, సమానత్వం, సహానుభూతి మిళితమైనదే మానవత్వం. ఎదుటివారికి సాయపడటం, ప్రతిఫలాన్ని ఆశించక పోవడం, హోదాను బట్టి కాక వ్యక్తిత్వాన్ని బట్టి గౌరవించడం, వారి బాధను మన బాధగా భావించి స్పందించడం లాంటివన్నీ మానవత్వపు చిహ్నాలే. వాటిని సంపాదించే ప్రయత్నం చేయాలి. సంపద, అధికారం ఎప్పుడైనా పోవచ్చు. కానీ మనం ఒక వ్యక్తిపట్ల చూపించిన ప్రేమ, ఆదరణ ఎప్పటికీ వారి గుండెల్లో నిలిచిపోతాయి. అది మనకు ప్రశాంతతనిచ్చి విద్వేషం వల్ల కలిగే అశాంతిని తొలగిస్తుంది.

అద్వైత వేదాంతం ప్రకారం, ప్రతి ప్రాణిలో ఉండే ఆత్మ ఒక్కటే. శరీరం, కులం, మతం అనేవి కేవలం బాహ్యమైన పొరలు మాత్రమే. లోపలి చైతన్యం అందరిలోనూ సమానమేనని శంకరాచార్యులు మనీషా పంచకంలో వివరించారు. మానవత్వమనేది మనిషి సహజ లక్షణం. మనిషికి మతం అవసరమే కానీ, తోటి మనిషిని ప్రేమించలేనప్పుడు ఆ మతానికి అర్థం లేదని స్వామి వివేకానంద స్పష్టంగా చెప్పారు. ఆకలితో ఉన్నవాడికి మతం కన్నా అన్నం ముఖ్యమైనట్టు, మనిషికి కులం కన్నా మానవత్వమే ఉన్నతమైనదవుతుంది. మతం మనిషిని దైవం వైపు నడిపించే మార్గం కావాలి కానీ, మనుషుల్ని విడదీసే సాధనం కాకూడదు. మానవ సేవయే మాధవ సేవ అన్న నినాదాన్ని నిజం చేయడమే మానవత్వం కలిగిన మనుషుల కర్తవ్యం.

– వాడపల్లి పూర్ణ కామేశ్వరి

పర్యావరణ సమతుల్యతకు...

పర్యావరణ సమతుల్యతకు, జీవ వైవిధ్య పరిరక్షణకు వన్యప్రాణి సంరక్షణ అత్యావశ్యకం. పర్యాటక అభివృద్ధి పరంగానూ ఇది ఎంతో అక్కరకొస్తుంది. ముఖ్యంగా విభిన్న జీవజాతులను సంరక్షించగలిగితే- ఆవరణ వ్యవస్థలు పర్యావరణ మార్పులను తట్టుకుని నిలిచేందుకు అవకాశం దక్కుతుంది. దీన్ని గుర్తించిన కేంద్రం వన్యప్రాణి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో గడిచిన పదకొండేళ్లలో సాధించిన ప్రగతి...



దేశవ్యాప్తంగా వన్యప్రాణి రక్షిత ప్రాంతాలు	
2014	745
2025	1134
ఎలిఫెంట్ రిజర్వులు	
2014	26
2025	33
టైగర్ రిజర్వులు	
2014	46
2025	58

(ఆధారం: కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ గణాంకాలు)

సాహితీ సాంస్కృతిక రాయబారి

లక్ష్మణయ్యర్ రామస్వామి (ఎల్.ఆర్.స్వామి) కేరళలోని త్రిస్సూర్‌లో 1944 అక్టోబరు 16న జన్మించారు. రాజమ్మాళ్, లక్ష్మణయ్యర్ ఆయన తల్లిదండ్రులు. సంప్రదాయ తమిళ కుటుంబం. పూర్వీకులు వేద పండితులు. పాఠశాల దశలోనే స్వామి రామాయణ, భారత, భాగవత గ్రంథాలు, ఖురాన్, బైబిల్‌ను చదివారు. ప్రసిద్ధ మలయాళ పత్రిక 'మాతృభూమి'లో తొలి కవిత రాశారు. ఆ పత్రిక నిర్వహించిన నాటక రచన పోటీలో మొదటి బహుమతి గెల్చుకున్నారు. రసాయన శాస్త్రంలో ఎమ్మెస్సీ, ఎంబీఏ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌లో డిప్లొమా చేసిన ఆయన 1967లో విశాఖపట్నంలో కోరమాండల్ ఫర్టిలైజర్స్‌లో ఉద్యోగంలో ప్రవేశించారు. కొంతకాలం తరవాత ఆంధ్రా పెట్రోకెమికల్స్‌లో చేరి మేనేజర్‌గా ఉద్యోగ విరమణ పొందారు.

పుట్టింది కేరళలో. మాతృభాష ఏమో తమిళం. కానీ, ఉద్యోగ నిమిత్తం విశాఖకు వచ్చిన ఎల్.ఆర్.స్వామి తెలుగు నేర్చుకుని కథలు రాశారు. మలయాళం, తమిళం, తెలుగు రచనల అనువాదంలోనూ ప్రసిద్ధి పొందారు. సాహిత్యానికి ఎనలేని సేవలందించిన ఆయన ఇటీవల కీర్తిశేషులయ్యారు.



అలుపెరగని అనువాదకుడు

తెలుగు రాకపోవడం, విశాఖలో మలయాళీ పత్రికలు దొరక్కపోవడంతో సాహిత్యాభిలాషి అయిన ఎల్.ఆర్.స్వామి మొదట్లో నిరుత్సాహానికి గురయ్యారు. తన సహోద్యోగులైన రచయితలతో కలిసి సాహితీ సభలకు వెళ్తూ క్రమంగా పట్టుదలతో తెలుగు నేర్చుకున్నారు. వేరే ప్రాంతంలో స్థిరపడ్డవారు నిత్య వ్యవహారం కోసం అక్కడి భాషను నేర్చుకుని మాట్లాడటం సహజం. కానీ, ఎల్.ఆర్.స్వామి ఏకంగా కథలు రాసే స్థాయిలో తెలుగు భాషపై పట్టు సాధించారు. అలా విశాఖ సాహితీ సంస్థ ఉగాది కవి సమ్మేళనంలో తెలుగు కవిత చదివి వినిపించారు. 1988లో ఉగాది కథల పోటీలో బహుమతి పొందారు. తెలుగులో స్వామి 200 వరకు కథలు రాశారు. 'కథాస్వామ్యం, గోదావరి స్టేషన్, సామెత కథలు మినీకథలు, కథాకాశం, లోగుట్టు పెరుమాళ్లకెరుక' వారి కథా సంపుటాలు.

అనువాదం ఒక కళ, ఒక శాస్త్రం. ప్రాచీన కాలం నుంచి సాహిత్యంలో అది కనిపిస్తుంది. ఆధునికంగా సాంస్కృతిక వినిమయంగా ఆ ప్రక్రియ అవసరం పెరిగింది. బహుళ భాషలకు నిలయమైన భారతదేశంలో అనువాదకులు సాంస్కృతిక రాయబారులు. ఎల్.ఆర్.స్వామి ఈ మార్గంలో విశిష్టమైన పాత్ర పోషించారు. మలయాళ, తమిళ కథల్ని, కవిత్వాన్ని తెలుగులోకి తెచ్చారు. మలయాళ జానపద గేయాలనూ తెలుగువారికి పరిచయం చేశారు. 'కథా కేరళం, కొండ దొరసాని, మనసు విప్పి, మడి నారు, కథా దౌత్యం' మొదలైనవి స్వామి మలయాళ కథానువాదాలు. 'పాండవపురం, సూఫీ పరంజ' ఆయన తెలుగు చేసిన మలయాళ నవలలు. ఆర్.నటరాజన్ తమిళ కథలను 'ఆటవిక రాజ్యం' పేరుతో మన భాషలోకి అనువదించారు. ప్రాచీన తమిళ సంగం వాఙ్మయాన్నీ తెలుగు నేలకు అందించారు.

సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత

ఎల్.ఆర్.స్వామి అనువదించిన కథలన్నీ సాహిత్య అకాడమీ, సరస్వతీ సమ్మాన్ పురస్కారాలు పొందిన రచయితలవే. దివాకర్ల వేంకటావధాని ఆంధ్ర వాఙ్మయ చరిత్రను మలయాళీలకు అందించారు. సాహిత్య అకాడమీ కోసం శ్రీశ్రీ, చక్రపాణిల మోనోగ్రాఫ్‌లనూ మలయాళంలోకి తీసుకెళ్లారు. సినీనటుడు బ్రహ్మానందం ఆత్మకథనూ మలయాళీలకు చేరువ చేశారు. తెలుగు కవిత్వాన్ని, కథల్ని ఆ భాషలోకి అనువాదం చేశారు. ఎన్.గోపి, శిఖామణి, శివారెడ్డిల కవిత్వాన్ని; గురజాడ, చాసో, కాళీపట్నం, కేతు విశ్వనాథరెడ్డి మొదలైన వారి కథలను మలయాళంలోకి అనువదించారు. స్వామి కథలు హిందీలోకీ అనువాదమయ్యాయి. విస్తృత అనువాద యజ్ఞంద్వారా కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారాన్ని ఆయన అందుకున్నారు. దాంతోపాటు తమిళనాడు ప్రభుత్వ పురస్కారం, తమిళనాడులోని నల్లి- దిసై ఎట్టుమ్ అనువాద పురస్కారం, కవి సంధ్య పురస్కారం మొదలైనవి ఆయనను వరించాయి. గీతం విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్, డి.లిట్‌తో సత్కరించింది. ఎల్.ఆర్.స్వామి రచనలపై ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఇద్దరు పరిశోధన చేసి పిహెచ్‌డీ, ఎమ్.ఫిల్ పట్టాలు పొందారు. ఆయన సుదీర్ఘకాలం విశాఖలో సహృదయ సాహితి, మొజాయిక్ సాహిత్య సంస్థల అధ్యక్షుడిగా కొన్ని వందల సభల్ని నిర్వహించారు. భౌతికంగా అస్తమించినా స్వామి అక్షరాలు సజీవంగా పాఠకులకు సాహితీ సుమగంధం పంచుతూనే ఉంటాయి.

– డాక్టర్ దామెర వేంకట సూర్యారావు

ఎవరు దొంగ?

హాయ్! బుజ్జీ!!

సుబ్బయ్య ఇంట్లో మంగయ్య పని చేస్తున్నాడు. అతనికి కాస్త మతిమరుపు.. దాంతో అప్పుడప్పుడు కొన్ని పనులు మర్చిపోయేవాడు. సుబ్బయ్యేమో పిసినారి. పనిచేసే వారికి కూలి ఇవ్వడానికి కూడా ఇష్టపడడు. ఒకరోజు మంగయ్యను పిలిచి.. 'మన కుక్క కనిపించట్లేదు. నువ్వే బయటికి తీసుకెళ్లావు కదా!' అన్నాడు. దాంతో.. 'కుక్కని ఎక్కడో వదిలేసి వచ్చినట్లున్నాను' అని బాధపడ్డాడు మంగయ్య. దాన్ని ఆసరా చేసుకుని ఆ నెల జీతంలో కోత పెట్టాడు సుబ్బయ్య. మరుసటి నెలలో.. 'ఆవు కనిపించట్లేదు' అన్నాడు. మంగయ్య ఏమీ మాట్లాడలేదు. అప్పుడు కూడా తక్కువ జీతమే ఇచ్చాడు. ఆ తరవాత గుర్రం కనిపించట్లేదని, మరో నెలలో కోడి కనిపించట్లేదని.. ఇలా ప్రతి నెలా ఏదో ఒక వంకతో మంగయ్యకు జీతం తగ్గించసాగాడు సుబ్బయ్య. దాంతో దిగులు పడిన మంగయ్య తనకు తెలిసిన ఒక మాస్టారు దగ్గరికి వెళ్లి జరిగిన విషయమంతా చెప్పాడు. అదంతా విన్న మాస్టారు.. 'మతిమరుపు నీకు ఉండేమో కానీ, కనిపించకుండాపోయిన ఆ జంతువులకు లేదు కదా!' అన్నాడు మాస్టారు. 'అవునండీ!' జవాబిచ్చాడు



మంగయ్య. 'సాధారణంగా ఏ పెంపుడు జంతువైనా ఎంత తిరిగినా చివరికి అది రోజూ ఉండే చోటుకు చేరుకుంటుంది. ఎవరైనా ఎత్తుకుపోతే మాత్రం చెప్పలేం' అన్నాడు మాస్టారు. దాంతో మంగయ్య ఆలోచనలో పడ్డాడు. వెంటనే యజమాని దగ్గరికి వెళ్లి.. 'అయ్యా! ఎవరో కావాలనే మన కుక్క, ఆవు, గుర్రం, కోళ్లను దొంగిలించారు. మనం వెంటనే రచ్చబండ దగ్గర ఫిర్యాదు చేద్దాం' అంటూ తొందరపెట్టాడు. అప్పుడు సుబ్బయ్యకు ఏం చేయాలో అర్థంకాలేదు. రచ్చబండ దగ్గరికి వెళ్తే తన పరువే పోతుందని.. 'నన్ను క్షమించు మంగయ్యా నీకు జీతం ఎక్కువ ఇవ్వడం ఇష్టం లేక నేనే మన పెంపుడు జంతువులను మా తమ్ముడి ఇంట్లో పెట్టాను' అని చెప్పాడు. అలాగే ఇన్నిరోజులు తనకు ఇవ్వని జీతాన్ని కూడా ఇచ్చేశాడు.

– కె.వి.వి. ప్రసాద్



నేడు పీజీఆర్ఎస్ అర్జీల స్వీకరణ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పీజీఆర్ఎస్ అర్జీల స్థితిని 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను వినియోగించుకోవాలని కోరారు. దరఖాస్తులను పీజీఆర్ఎస్‌తో పాటు మీకోసం వెబ్‌సైట్ ద్వారా సమర్పించవచ్చన్నారు. సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌తో పాటు రెవెన్యూ క్లినిక్‌లను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

అమరావతిలో ఆహ్లాదం

ప్రభుత్వ హయాంలో ముందుచూపుతో నాటిన మొక్కలు నేడు వృక్షాలుగా మారి చల్లదనాన్ని ఇస్తున్నాయి. - ఈనాడు, అమరావతి

అమరావతిలో ఎక్కడ చూసినా పచ్చదనం కనువిందు చేస్తోంది. రహదారులకు ఇరువైపులా చెట్లు, రంగుల పూల మొక్కలతో ఆహ్లాద వాతావరణం ఉండేలా నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. రాజధానిలో పూర్తవుతున్న నిర్మాణాల వద్ద కూడా పచ్చని లాన్స్ వేస్తున్నారు. హైకోర్టు వద్ద గత తెదేపా



సచివాలయానికి వెళ్లే దారిలో మొక్కలకు నీరు పెడుతూ..



హైకోర్టు వద్ద రహదారికి ఇరువైపులా చెట్లు..



ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్వార్టర్స్ వద్ద..

అడగరని.. ఆపరని..

- 'బిల్ టూ బిల్'తో లైసెన్సు లేకుండానే మిర్చి కొనుగోళ్లు
- అక్రమ వసూళ్లకు అనుమతిస్తున్న యంత్రాంగం

ఈనాడు-అమరావతి

గుంటూరు మిర్చియార్డులో అనుమతులు లేకుండా రూ.కోట్ల విలువైన వ్యాపారం చేస్తున్నారు. ఇలా వ్యాపారం చేసేవారు రైతులకు సొమ్ము ఎగ్గొడితే వారి నుంచి వసూలుచేసే అవకాశం లేకుండా పోతోంది. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా..మామూళ్ల మాటున యంత్రాంగం పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు సహకరించే వేమెన్లు, సూపర్‌వైజర్లు, యార్డు యంత్రాంగానికి కాసుల వర్షం కురుస్తోంది. బిల్ టూ బిల్ విధానానికి సహకరించినందుకు బస్తాకు రూ. 8 నుంచి రూ.10 చొప్పున వసూలుచేసి తలా కొంత పంచుకుంటున్నారు.



మిర్చియార్డులో క్రయవిక్రయాలు

బిల్ టూ బిల్ అంటే....

మిర్చియార్డులో రైతులు, ఎగుమతి వ్యాపారులకు మధ్యవర్తిత్వం చేసి కొనుగోళ్లు జరగడానికి దిగుమతి వ్యాపారులు(కమీషన్ ఏజెంట్లు) పనిచేస్తారు. రైతులకు కొనుగోలు చేసిన రోజే సొమ్ము చెల్లించడం వీరి బాధ్యత. కమీషన్ ఏజెంటుగా కొనసాగాలంటే నిర్దేశిత మొత్తాన్ని మార్కెట్‌యార్డుకు జమచేసి హామీ పత్రాలు ఇచ్చి మార్కెట్‌యార్డు నుంచి లైసెన్సు పొందుతారు. యార్డులో లైసెన్సు పొందిన వారికి దుకాణాలు కేటాయించి వ్యాపార లావాదేవీలు జరిగేలా యార్డు యంత్రాంగం చూస్తోంది. అలా కాకుండా లైసెన్సులు లేకుండా లైసెన్సు ఉన్నవారి పేరుతో వ్యాపారం చేసి ఆసంస్థ పేరుతోనే బిల్లులు ఇచ్చే విధానాన్ని బిల్ టూ బిల్ అంటారు. దుకాణాలు ఖాళీ లేకపోవడంతో కొత్తగా లైసెన్సులు కొన్నేళ్లుగా మంజూరు చేయడం లేదు. ఇటీవలే 43 లైసెన్సులు ఇచ్చినా ఇంకా వారు వ్యాపారంలోకి రాలేదు. దీంతో లైసెన్సులు లేనివారు ఇప్పటికే లైసెన్సు ఉన్న వ్యాపారుల సంస్థ పేరుతో లావాదేవీలు నిర్వహిస్తున్నారు. లైసెన్సు ఉన్న కమీషన్ ఏజెంట్ బిల్లులను అక్రమంగా వ్యాపారం చేసే వ్యక్తి వాడుకుంటున్నారు. ఇందుకు ప్రతిఫలంగా వందకు రూ.1.5 శాతం సొమ్ము బిల్లులు ఇచ్చిన వ్యాపారికి చెల్లిస్తారు. ఇలా యార్డులో వందమంది అక్రమంగా క్రయవిక్రయాలు చేస్తున్నారు. రైతులు సరకు విలువలో 2 శాతం కమీషన్ వసూలు చేయాలి. అయితే ఇలా అక్రమ వ్యాపారం చేసేవారు రైతుల నుంచి 3 నుంచి 4 శాతం వరకు సొమ్ము కమీషన్‌గా వసూలు చేస్తున్నారు. ఇందులోనే ఒకటిన్నర శాతం బిల్లులు ఇచ్చిన కమీషన్ ఏజెంట్‌కు ఇస్తారు. బిల్ టూ బిల్ వల్ల రైతులపై అదనపు భారం పడుతోంది.

యూనియన్ నేత కీలకపాత్ర

మిర్చియార్డులో బిల్ టూ బిల్ విధానంలో సుమారు 30 శాతం సరకు క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. ఈవిధానంలో వ్యాపారం చేసేవారు రైతులకు సొమ్ము ఎగ్గొట్టిన వారిపై నిర్మాణాత్మక చర్యలు తీసుకునే వెసులుబాటు లేదు. గతేడాది రైతులు, వ్యాపారులకు సొమ్ము ఎగ్గొట్టిన వ్యాపారి ఒకరు బిల్ టూ బిల్ విధానంలో రూ.కోట్లలో లావాదేవీలు చేస్తున్నారు. బాధితులకు మాత్రం ఇప్పటికీ రూపాయి ఇవ్వకపోవడం గమనార్హం. ఈవిధానంలో వ్యాపారం చేసే వారి నుంచి సొమ్ము వసూలు చేయడానికి ఓ యూనియన్ నేత కీలక పాత్ర పోషిస్తున్నారు. వ్యాపారుల నుంచి వసూలు చేసిన సొమ్ము అధికారులకు అప్పజెప్పడంలో అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. బిల్ టూ బిల్ చేసే వ్యాపారులకు ఇచ్చే బిల్లులు ప్రత్యేకంగా ఉంటాయి. రైతుల నుంచి ముక్కుపిండి అధిక కమీషన్ వసూలు చేసే వ్యవహారానికి అడ్డుకట్ట వేస్తారా? మిన్నకుండిపోతారా? వేచిచూడాల్సిందే.

ఇంతులు మెరవాలని.. కాంతులు నిండాలని..

తాడికొండలో ప్రయోగాత్మకంగా వన్ స్టాప్ ఫెసిలిటీ కేంద్రం ఏర్పాటు

మేడికొండూరు, తాడికొండ, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళల అభ్యున్నతికి అనేక ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా వన్ స్టాప్ ఫెసిలిటీ (ఓఎస్ఎఫ్) కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. పొదుపు సంఘంలో సభ్యురాలు చేస్తున్న వ్యాపారం అభివృద్ధి చేసుకోవడానికి, కొత్తగా వ్యాపారం ప్రారంభించుకునేందుకు ఈ కేంద్రం ఆలంబనగా నిలుస్తుంది. ఇందుకుగాను కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎమ్)తో కలిసి రాష్ట్రం పని చేస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో తొలుత జిల్లాకి ఒకటి చొప్పున వన్ స్టాప్ ఫెసిలిటీ కేంద్రాన్ని నెలకొల్పుతున్నారు.



తాడికొండలో ఏర్పాటు చేసిన కేంద్రం

వ్యాపారాభివృద్ధికి ఇతోధిక తోడ్పాటు

గుంటూరు జిల్లాకు సంబంధించి తాడికొండలో ప్రయోగాత్మకంగా ఓఎస్ఎఫ్ కేంద్రం ఇప్పటికే ప్రారంభించారు. తాడికొండ, తుళ్లూరు మండలాల పరిధిలో సదరు కేంద్రం కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ఈ కేంద్రం వ్యవస్థాపకుల గుర్తింపు, వ్యాపార విశ్లేషణ, వ్యవస్థాపకుల ఎంపిక, వ్యాపార ప్రణాళిక అమలు, చేయూత అందించడం, ఆర్థిక సాయం చేయడం, వ్యాపారాభివృద్ధి, పర్యవేక్షణ వంటి 8 అంశాలు దృష్టిలో పెట్టుకుని పనిచేస్తుంది. ఉత్పత్తులు మార్కెట్లోకి తీసుకెళ్లి వ్యాపారం ఎలా పెంచుకోవాలో డ్వాక్రా మహిళలకు వివరించడం, కొత్తగా వ్యాపారం ప్రారంభించాలని అనుకుంటే వాళ్లకి బ్యాంకు రుణాలు ఇప్పించడం, సాంకేతిక పరిజ్ఞానంతో వ్యాపారంలో మెలకువలు నేర్పించడం తదితర అంశాలపై కేంద్రం పనిచేస్తుంది. దీంతో పొదుపు సంఘం సభ్యులు వ్యాపారంలో రాణిస్తారు. ఫలితంగా ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని ప్రభుత్వం ఆలోచన. ఈ కేంద్రంలో పనిచేసేందుకు 14 మంది డ్వాక్రా మహిళలను ఎంపిక చేసి వారికి ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చారు.

వీరిలో తాడికొండలో 8 మంది, తుళ్లూరులో ఆరుగురు పనిచేయనున్నారు. వీరికి ఒక్కొక్కరికీ నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల దాకా గౌరవ వేతనం అందుతుంది.

300 మందిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని లక్ష్యం

డీఆర్‌డీఏ ఏపీఎం రావూరి సాంబశివరావు మాట్లాడుతూ తాడికొండ, తుళ్లూరు మండలాల పరిధిలో మొత్తంగా 2900 డ్వాక్రా గ్రూపులు ఉండగా..వాటిల్లో 29 వేల మంది పొదుపు సంఘం సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ మండలాల పరిధిలో సుమారు 300 మంది డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించిందని వెల్లడించారు. ఆ దిశగా ఓఎస్ఎఫ్ కేంద్రం పనిచేస్తోంది. జిల్లా డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, సెర్ప్ సీఈవో వాకాటి కరుణ పర్యవేక్షణలో పనులు జరుగుతున్నాయని తెలిపారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకోండి

గుంటూరు నేరవార్తలు: వేసవి సెలవుల్లో పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారి ఇళ్లల్లో దొంగతనాలు జరగకుండా ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు వినియోగించుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. ఆదివారం ఎస్పీ తన కార్యాలయంలో మాట్లాడుతూ వేసవిలో దొంగతనాలు జరగకుండా రాత్రి వేళల్లో పోలీసు పెట్రోలింగ్ పెంచడంతోపాటు సున్నితమైన ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టామన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏర్పాటు చేసిన ఇళ్లపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. పోలీసు కంట్రోల్ రూం, డయల్ 112 వ్యవస్థలను బలోపేతం చేశామన్నారు. హాట్‌స్పాట్ ప్రాంతాల్లో డ్రోన్లతో నిఘా, మొబైల్ పోలీసు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నగదు, బంగారం ఇతర విలువైన వస్తువులు ఇళ్లల్లో ఉంచుకోకుండా..బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నచ్చిన ఆట.. నేర్చుకుందాం రండి

జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే

పాఠశాలలు.. కళాశాలలకు విద్యా సంవత్సరం ముగుస్తున్న వేళ.. వేసవి క్రీడా శిక్షణలకు వేదిక సిద్ధమైంది. ఇప్పటివరకు పుస్తకాలతో కుస్తీపట్టి అలసిపోయిన పిల్లలకు వేసవి సెలవులు సాంత్వన కలిగిస్తున్నాయి. ఇదే సమయంలో వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో తర్ఫీదు పొందేందుకు అవకాశం ఏర్పడింది. ఈ నేపథ్యంలో వేసవి క్రీడా శిబిరాల నిర్వహణకు శాప్ ఆధ్వర్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ బ్రహ్మానంద రెడ్డి స్టేడియంలో ఏర్పాట్లు చేసింది. మే 31వ తేదీ వరకు 22 క్రీడాంశాల్లో తర్ఫీదు ఇవ్వనున్నారు.

డీఎస్ఏ మైదానంలో 12 అంశాల్లో..

గుంటూరు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) మైదానంతో పాటు క్రీడా వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, మైదానాలు, ఇతర చోట్ల వేసవి శిబిరాలున్నాయి.

- డీఎస్ఏలో 12 క్రీడాంశాల్లో వీటిని నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాక్సింగ్, ఫెన్సింగ్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, కబడ్డీ, స్కేటింగ్, టెన్నిస్, తైక్వాండో, ఉషు, వాలీబాల్, ఖోఖో తదితర శిబిరాలు ఏర్పాటు చేశారు. మిగిలిన క్రీడలకు గుంటూరు అర్బన్, రూరల్ మండలాల్లో ఏర్పాటయ్యాయి.



జిమ్నాస్టిక్స్‌లో తర్ఫీదు పొందుతున్న క్రీడాకారులు

53 క్రీడా శిబిరాల ఏర్పాటు..

గుంటూరు జిల్లాలో మొత్తం అన్ని క్రీడల్లో కలిపి 53 క్రీడా శిబిరాలు ఏర్పాటు చేశారు. వాటిలో అర్బన్ ప్రాంతాల్లో 31, రూరల్‌లో 22 శిబిరాలు నిర్వహిస్తున్నారు.

- 8 ఏళ్ల నుంచి 16 ఏళ్ల లోపు బాలబాలికలు పాల్గొనడానికి అర్హులు. రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారు.

జిల్లాలో ఎక్కడంటే..

- పెదకాకాని, వెనిగండ్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో అథ్లెటిక్స్, ఖోఖో, వాలీబాల్
- తాడికొండ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్
- ప్రత్తిపాడు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫుట్‌బాల్, సైక్లింగ్, ఉప్పలపాడులో జడ్పీహెచ్ఎస్‌లో సైక్లింగ్
- టీజేపీఎస్, హిందూ హైస్కూల్, నెక్స్ట్‌జెన్ కళాశాలలో అథ్లెటిక్స్
- పచ్చలతాడిపర్రు డాన్ బాస్కో పాఠశాల, పొన్నూరు సెయింట్ థామస్ పాఠశాలల్లో ఫెన్సింగ్,
- పొన్నూరు డీఎస్ఏ సెంటర్‌లో, దుగ్గిరాల మండలం రేవేంద్రపాడులోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో వెయిట్‌లిఫ్టింగ్
- తెనాలి డీఎస్ఏ సెంటర్, పెదరావూరు జడ్పీహెచ్ఎస్, చేబ్రోలు దుగ్గిరాల జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో హ్యాండ్‌బాల్
- కొల్లిపర మండలంలోని మున్నంగి, చేబ్రోలు మండలంలోని వేజండ్ల, తాడేపల్లి, గుంటూరు రూరల్ వెంగళాయపాలెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో వాలీబాల్.

పనులు చేస్తాం.. ఆగండి చెప్తాం..

జీఎంసీలో గుత్తేదార్ల ఒత్తిడి.. ససేమిరా అంటున్న అధికారులు

ఈనాడు, అమరావతి

ఓ వైపు పనులు చేస్తామంటూ గుత్తేదారులు... మరోవైపు ససేమిరా అంటున్న నగరపాలక సంస్థ అధికారులు.. వెరసి జీఎంసీలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రస్తుతం రూ.600 కోట్ల విలువైన పనులకు లైన్ క్లియర్ అయిన నేపథ్యంలో ఇంకా కొన్ని పట్టాలెక్కలేదు. బిల్లులు సరిగా రాకపోవడం.. ఒకే గుత్తేదారు అధిక సంఖ్యలో పనులు చేజిక్కించుకోవడం.. ఇలా అనేక కారణాలున్నాయి. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు జీఎంసీ అధికారులు నిర్ణీత గడువులో ప్రారంభంకానివాటిని రద్దు చేస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారు. మరోవైపు టెండర్ లెస్‌ల మాయాజాలంలో కీలకంగా వ్యవహరించిన కొంతమంది గుత్తేదారులు.. పనులు చేస్తామని ముందుకొస్తున్నా అధికారులు ససేమిరా అంటున్నారు.



గుంటూరు నగరంలో సీసీ డ్రెయిన్ నిర్మాణం

బ్లాక్ లిస్టులోకి సిఫార్సు

జీఎంసీలో దాదాపు తొమ్మిదేళ్లపాటు కొంతమంది గుత్తేదారులు కంప్యూటర్ ఆపరేటర్ల అండతో టెండర్ లెస్‌ల్లో మాయాజాలానికి పాల్పడిన విషయం విదితమే. దీనిని సీరియస్‌గా తీసుకున్న ఉన్నతాధికారులు 153 ఫైళ్లకు సంబంధించి 69 మంది గుత్తేదారులను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలంటూ ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేయించాలని కూడా సూచించారు.

గుత్తేదారుల ఒత్తిళ్లు

బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న గుత్తేదారుల్లో కొంతమంది ప్రస్తుతం జీఎంసీ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే దక్కించుకున్న పనులకు అగ్రిమెంట్ చేయాలని, ఒప్పందం కుదిరిన పనులపరంగా క్షేత్రస్థాయిలో చేయడానికి అనుమతులివ్వాలని పట్టుబడుతున్నారు. గతంలో చేసిన పనుల బిల్లులు నిలిపేశారని, దీంతో ఇబ్బంది పడుతున్నామంటూ వాదన వినిపిస్తున్నారు. ఇదే విషయాన్ని రాజకీయ నేతల దృష్టికి తీసుకెళ్లగా మద్దతుగా నిలిచేందుకు వారు ముందుకు రాలేదు. ఇటు అధికారులు కూడా పట్టుదలగా ఉన్నారు. జీఎంసీ ఖజానాకు అడ్డగోలుగా గండికొట్టిన అక్రమార్కులపై చర్యలు తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనన్న వాదన వినిపిస్తోంది. బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న గుత్తేదారులు దక్కించుకున్న పనులను రద్దు చేసేందుకు అధికారులు నిర్ణయం తీసుకుంటున్న నేపథ్యంలో జీఎంసీలో ఉత్కంఠ నెలకొంది.

నీట్‌కు 98.6 శాతం హాజరు

గుంటూరు విద్య, ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : జాతీయస్థాయి వైద్య విద్య సంస్థల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్ యూజీ పరీక్ష ఆదివారం జిల్లాలో సజావుగా జరిగింది. జిల్లాలోని గుంటూరు, తెనాలి, మంగళగిరి, నాగార్జున విశ్వవిద్యాలయంలోని మొత్తం 24 కేంద్రాల్లో పరీక్ష జరిగింది. పరీక్షకు మొత్తం 8417 మంది అభ్యర్థులకు గాను 8299 మంది హాజరయ్యారు. ఈమేరకు 98.6 శాతం నమోదైనట్లు నీట్ సమన్వయకర్త, ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ గోపీకృష్ణ తెలిపారు. అభ్యర్థులను తనిఖీ చేసి, అడ్మిట్ కార్డు పరిశీలించిన తర్వాత పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

ఏర్పాట్లలో విఫలం.. నగరంలోని కొన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. స్తంభాలగరువు మహాలక్ష్మి పుల్లయ్య నగరపాలక హైస్కూల్‌లో పరీక్ష గది నంబర్లు నోటీసు బోర్డులో తప్పుగా వేయడంతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. విద్యార్థుల బయోమెట్రిక్ హాజరు తీసుకోవడంలో జాప్యం చేశారు. పరీక్ష గదుల్లో కనీసం శుభ్రత పాటించక పోవడంతో విద్యార్థులు దుమ్ముతో నిండి ఉన్న టేబుల్స్ పైనే పరీక్ష రాయాల్సి వచ్చింది.

పోలీసుల వైఫల్యంతో ఏఎన్‌యూ వద్ద నిలిచిన ట్రాఫిక్.. పోలీసుల వైఫల్యంతో ఏఎన్‌యూలోని నీట్ పరీక్ష కేంద్రం వద్ద జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాహనాలతో తరలిరావడంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కాజ టోల్‌గేట్ వద్ద కి.మీ. మేర వాహనాలు బారులుతీరాయి. సర్వీస్ రోడ్డులో సైతం వాహనాలు నిలిచిపోవడంతో సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్‌ను నియంత్రించలేక పోలీసులు చేతులెత్తేశారు. విద్యార్థులను లోపలికి అనుమతించిన తర్వాత ట్రాఫిక్ కొంతమేర అదుపులోకి వచ్చింది.



గుంటూరు ఏసీ కళాశాల కేంద్రం వద్ద విద్యార్థులు



ఏఎన్‌యూ వద్ద సర్వీస్ రోడ్డులో నిలిచిన వాహనాలు

సమయానికి రాక.. పరీక్ష రాయలేక

ఏఎన్‌యూ: మధ్యాహ్నం 1.30 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు నిబంధనల్లో పేర్కొన్నారు. తాడేపల్లికి చెందిన జెస్సీ అనే విద్యార్థిని మధ్యాహ్నం 1.41 నిమిషాలకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రధాన గేటు వద్దకు చేరుకున్నా..అప్పటికే అధికారులు గేట్లు మూసేశారు. దీంతో విద్యార్థిని కన్నీరుమున్నీరైంది. అధికారులు నిబంధనలు వర్తించవని తేల్చి చెప్పారు. ఏడాది సమయం వృథా అవుతుందని లోపలికి పంపించేందుకు సాయం చేయాలని విద్యార్థిని తండ్రి సుమారు 10 నిమిషాల మేర అక్కడే విధుల్లో ఉన్న పోలీసులను ప్రాధేయపడినా..తాము ఏమి చేయలేమని వారు స్పష్టం చేయగా జెస్సీ నిరాశతో వెనుదిరిగింది. అంతకు ముందు మధ్యాహ్నం 1.30 నిమిషాలకు చేరుకున్న విజయవాడకు చెందిన విద్యార్థిని ప్రణీతను మొదట నిరాకరించారు. చుట్టూ ఉన్న ప్రజలు పంపించాలని గట్టిగా కేకలు వేయడంతో క్షణాల సమయం ఉందని పోలీసులు....ఆ విద్యార్థినిని లోపలికి అనుమతించారు.



లోపలికి పంపాలని అధికారి చేయి పట్టుకొని ప్రాధేయపడుతున్న విద్యార్థిని తండ్రి

'స్మార్ట్' సేవలకు సన్నద్ధం

రాజధాని అమరావతిలో డిజిటల్ డోర్ నంబర్ల ఏర్పాటు

తుళ్లూరు, న్యూస్‌టుడే: ప్రజా రాజధాని అమరావతిలో పౌర సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు సీఆర్డీఏ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ డిజిటల్ డోర్ నంబరు ప్లేట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. క్యూఆర్ కోడ్‌తో పాటు రాష్ట్రం, జిల్లా, గ్రామం, వీధి, డోర్ నంబరు తదితర వివరాలు ఇందులో ఉన్నాయి.



ఓ ఇంటికి అమర్చిన డిజిటల్ డోర్ నంబరు ప్లేటు

వేగవంతమైన సేవలు.. డిజిటల్ విధానంలో ఏర్పాటు చేసిన ఈ నంబరును గూగుల్ మ్యాప్‌తో అనుసంధానిస్తారు. తద్వారా అత్యవసర సహాయం (అంబులెన్సు, ఫైర్ ఇంజిన్‌లు) అందించటానికి, నాణ్యమైన పౌర సేవలకు అవకాశం ఉంటుంది.

★ ఆస్తి పన్ను, విద్యుత్తు, తాగు నీటి బిల్లులు, ఇతర పురపాలక సేవలను క్యూఆర్ కోడ్ ద్వారా అనుసంధానం చేస్తారు. దీని ద్వారా ప్రజలు తాము పొందాల్సిన, కట్టాల్సిన బిల్లులను సులభంగా తెలుసుకోవటానికి అవకాశం ఉంటుంది. అన్ని సేవలు బ్లాక్ చైన్ సెక్యూరిటీతో అనుసంధానం చేయటం ద్వారా వాట్సప్ ద్వారా బిల్లులు చెల్లించటం, సేవలు పొందటానికి అవకాశం ఉంటుంది. నేరుగా సర్టిఫికెట్‌లను డౌన్‌లోడ్ చేసుకొనే అవకాశం ఉంటుంది.

★ డిజిటల్ డోర్ నంబర్‌లను వేగవంతం చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీని కోసం మండల, గ్రామ స్థాయిలో బ్లాకులు, యూనిట్‌లుగా ప్రాంతాలను కేటాయించటం జరిగింది. డిజిటల్ డోర్ నంబరులు కేటాయించిన తర్వాత తప్పులను సరిచేసుకొనే వెసులుబాటు కల్పించనున్నారు. ఈ ప్రక్రియ రాజధాని పరిధిలో వేగంగా సాగుతుందని, ప్రతి ఇంటి డేటాను డిజిటలైజేషన్ చేయటం వల్ల పారదర్శక పాలన సాధ్యమవుతుందని సీఆర్డీఏ అధికారులు చెబుతున్నారు.



ఈదురు గాలికి విరిగిన స్తంభాలు

గాలి.. వడగళ్ల వాన

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో విపరీతమైన గాలి, వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. సుమారు అరగంట పాటు కురిసిన గాలివాన ధాటికి పెదనందిపాడు సమీపంలో ఎనిమిది విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. దీంతో మండల వ్యాప్తంగా విద్యుత్తు సరఫరా సుమారు మూడు గంటలపాటు నిలిచింది. అక్కడక్కడ కల్లాల్లో ఆరబోసిన మిర్చిని కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. పట్టాలు కప్పి సంరక్షించుకున్నారు. ప్రత్యామ్నాయంగా పొన్నూరు నుంచి విద్యుత్తు సరఫరా ఏర్పాటు చేసినట్లు ఏఈ మురళీకృష్ణ తెలిపారు. కూలిన స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయిస్తామని ఆయన చెప్పారు.

23 రుణాలు.. రూ.6 కోట్లు

- నకిలీ సంస్థలను సృష్టించి భారీగా వ్యాపార రుణాలు
- వెలుగులోకి ప్రధాన నిందితుడు మోహన్ ఆర్థిక మోసాలు

ఈనాడు, అమరావతి

తెలిసిన వ్యక్తిని ఓ దుకాణం ముందు నిలబెట్టి ఫొటో తీయడం.. అతని ఆధార్, పాన్‌కార్డులు తీసుకుని నకిలీ జీఎస్టీ పత్రాలు సృష్టించడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. వీటితో ఆర్థిక సంస్థల నుంచి భారీగా రుణాలు పొందడం.. ఆనక వాయిదాలు చెల్లించకుండా ఎగ్గొట్టడం అలవాటే. విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు శనివారం అరెస్టు చేసిన మురాలోని కీలక నిందితుడైన మోహన్ పూర్వ చరిత్ర ఇది. తవ్వే కొద్దీ అతని ఆర్థిక మోసాలు ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి.

వాటాలేసి పంచుకున్నారు.. 2023లో విజయవాడలోని నియో గ్రోత్ ఫైనాన్స్‌కు చెందిన ఓ ఉద్యోగితో మోహన్ కుమ్మక్కు అయ్యాడు. ఇద్దరూ కూడబలుక్కుని.. నకిలీ సంస్థలను ఏర్పాటు చేసి, వాటి జీఎస్టీ పత్రాలతో వీలైనన్ని రుణాలు తీసుకోవాలని ప్రణాళిక రచించారు. ఇందులో భాగంగా.. తన దుస్తుల దుకాణంలో పనిచేసే వారిని, ఇతరుల పేరుతో సంస్థలను సృష్టించాడు. ఏదొక షాపు ఎంచుకుని.. దాని ఎదుట వారిని నిలబెట్టి ఫొటోలు తీసేవాడు. తర్వాత వారి కేవైసీ పత్రాలను తీసుకుని జీఎస్టీ సర్టిఫికెట్ నకిలీది తయారు చేసేవాడు. వీటి ఆధారంగా బ్యాంకుల్లో ఓడీ (ఓవర్ డ్రాఫ్ట్) ఎకౌంట్, కరెంట్ ఎకౌంట్లు తెరిచేవాడు. ఆ తర్వాత ఆర్థిక సంస్థల నుంచి పెద్ద మొత్తంలో వ్యాపార రుణాలు తీసుకున్నాడు. నియోగ్రోత్ నుంచి 12 రుణాలు.. రూ. 2.94 కోట్లు, మరికొన్ని ఆర్థిక సంస్థల నుంచి మొత్తం 23 రుణాలు తీసుకున్నాడు. ఇలా మొత్తం రూ.6కోట్లు పొందాడు. ఈ సొమ్ములో నియోగ్రోత్ కంపెనీ ఉద్యోగి కలిసి వాటాలు వేసుకుని రుణ సొమ్మును పంచుకున్నారు. ఈ మోసంపై నగరంలోని కృష్ణలంక స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆర్థిక మోసం కావడంతో తర్వాత సీఐడీకి బదిలీ అయింది.

సరైన విచారణ లేకుండానే ఖాతాలు, రుణాలు.. సైబర్ క్రైమ్ స్టేషన్‌లో నమోదైన రూ.60లక్షల మోసం కేసులో బ్యాంకులు, ఆర్థిక సంస్థల సిబ్బంది పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బ్యాంకు ఖాతాలు, రుణాల మంజూరుకు సంబంధించి సిబ్బందికి లక్ష్యాలు ఉండడం, వాటిని చేరుకునేందుకు క్షేత్రస్థాయిలో సరిగా విచారణ చేయకుండానే మంజూరు చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ సంస్థలు, బ్యాంకులకు సంబంధించిన కొందరు సిబ్బందికి నోటీసులు ఇవ్వనున్నారు. మరణించిన చందనబాబుకు చెందిన ఆధార్‌ను మార్చి పవన్‌కుమార్ (ఏ3) ఫొటో పెట్టి నకిలీ ఆధార్ సృష్టించినా పసిగట్టకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడి సంతకాన్ని ఏ3 చేసినా పట్టించుకోలేదు.

ఏకకాల పరిష్కారం కోసం యత్నాలు? ఈ కేసులో ముగ్గురు నిందితులు మోహన్ (ఏ1), శ్రీనివాసరావు (ఏ2), పవన్‌కుమార్ (ఏ3)లు రూ.60 లక్షల మేర వ్యాపార రుణాలు తీసుకుని వాయిదాలు పాక్షికంగానే చెల్లించారు. ఈ వ్యవహారంలో ఇంటి దొంగల సహకారం ఉండొచ్చన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆయా ఆర్థిక సంస్థల ఉద్యోగులతో మాట్లాడుకుని.. వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద సర్దుబాటు చేసుకునేందుకు ప్రయత్నాలు చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులను కస్టడీకి తీసుకుని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

మురుగు కూపం.. ప్రజలకు శాపం



కొజ టోల్‌ప్లాజా సమీపంలో జాతీయ రహదారి పక్కనే మురుగు కూపం జనానికి శాపంగా మారింది. సమీపంలోని హోటళ్లు, భవన సముదాయాల్లో మురుగునీరంతా ఇక్కడ చేరి కుంటలా తయారైంది. నెలల తరబడి ఇలా మురుగు పేరుకుపోవడంతో భరించలేని దుర్గంధం వస్తూ వాహనదారులు తీవ్ర అసౌకర్యంగా మారింది. సంబంధిత అధికారులు చొరవ చూపి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈనాడు అమరావతి

రూ.లక్షలు పోసి.. నిర్లక్ష్యంగా వదిలేసి..



కంకరగుంట వంతెన వద్ద ఏర్పాటు చేసిన ఈ టాయ్‌లెట్ దుస్థితి

నగరంలో సామాన్యుల అవసరాలు తీర్చే ఈ-టాయ్‌లెట్‌లు శిథిలమైపోతున్నాయి. 2017లో రూ.లక్షలు వెచ్చించి గుంటూరులోని అన్ని కూడళ్లలో వీటిని ఏర్పాటు చేశారు. గత వైకాపా పాలనలో వీటి నిర్వహణను గాలికొదిలేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైనా నగరపాలక అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకొస్తే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది.

- ఈనాడు అమరావతి

బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

నగరపాలకసంస్థ(గుంటూరు): జీఎంసీ పరిధిలో జరుగుతున్న మురుగునీటి కాల్వల పూడికతీత పనుల్లో బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు ఉంటాయని కమిషనర్ మయూర్ అశోక్ హెచ్చరించారు. ఆదివారం 'ఈనాడు'లో 'మురుగుపాలైన బాల్యం' శీర్షికతో ప్రచురితమైన చిత్ర వార్తకు జీఎంసీ అధికారులు స్పందించారు. సంజీవయ్యనగర్ రైల్వే గేటు నుంచి నెహ్రూనగర్ వైపు జరుగుతున్న పనులు పరిశీలించారు. పూడికతీత పనుల దక్కించుకున్న గుత్తేదారు సేవా సంఘం వారు బాలలతో పూడికతీత పనులు చేయిస్తున్నట్లు గుర్తించారు. టెండరు నిబంధనల మేరకే పనులు జరగాలని, ఏఈ, డీఈఈ, ఈఈ స్థాయి అధికారులు పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలు అందించాలని సూచించారు. పూడికతీత పనుల యంత్ర పరికరాలు, సామగ్రిని ఎక్కువగా వినియోగించాలని, మురుగు నీటిలో కార్మికులు దిగి పనులు చేయడాన్ని నివారించాలని సూచించారు. ఈ విషయమై గుత్తేదారుకు నోటీసు ఇచ్చినట్లు ఎస్‌ఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

'అమరావతి అభివృద్ధిని అడ్డుకుంటున్న వైకాపా'



మాట్లాడుతున్న తెదేపా జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న, పక్కన నాయకులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి అభివృద్ధిని అడ్డుకుంటే వైకాపా నాయకులకు పుట్టగతులు ఉండవని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా జాతీయ ఉపాధ్యక్షుడు బుద్దా వెంకన్న పేర్కొన్నారు. విజయవాడ మల్లికార్జునపేటలోని కార్యాలయంలో ఆదివారం విజయవాడ పశ్చిమ నియోజకవర్గ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ హయాంలో అమరావతి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతుంటే వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అసత్యాలు ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. పాలనలో జగన్‌కు గుర్తు రాని మావిగన్.. రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతుంటే ఇప్పుడు కొత్త నాటకాలకు తెర తీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయసాయిరెడ్డి డిజిటల్ మీడియా ప్రారంభించి చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మడం లేదని చెప్పారు. మాజీ మంత్రులు సజ్జల రామకృష్ణారెడ్డి, విడుదల రజనీ, జోగి రమేష్ వంటి వారు అధికారంలో ఉన్నప్పుడు ఇష్టం వచ్చినట్లు చేసి ఇప్పుడు ఆధారాలు లేకుండా పోయారని విమర్శించారు. వైకాపా హయాంలో అనేక పరిశ్రమలు రాష్ట్రం వదిలి వెళ్లాయని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం సమన్వయ నాయకత్వంలో గూగుల్ డేటా సెంటరు తెచ్చిన విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కామా దేవరాజు, అమానుల్లా ఖాన్, ఉమ్మడి వెంకటేశ్వరరావు, శివశర్మ, చినసుబ్బయ్య, పీతాని పద్మ, తుపాకుల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కందుల డబ్బులు ఎప్పుడొస్తాయో...?

రైతులకు తప్పని ఎదురుచూపులు

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-మాచవరం

బహిరంగమార్కెట్లో కందుల ధరలు పతనం కావడంతో ప్రభుత్వం కనీస మద్దతు ధరకు రైతుల నుంచి సేకరిస్తోంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటా ధర రూ.8 వేలకు కొనుగోలు చేశారు. పల్నాడు జిల్లాలో కందులు విస్తారంగా పండటంతో అత్యధికంగా సేకరించారు. పల్నాడు జిల్లాలో 85 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. జిల్లావ్యాప్తంగా 22,500 టన్నులు సేకరించాలని లక్ష్యం విధించగా, ఇప్పటివరకు 10,500 టన్నులు సేకరించారు. ఇందుకు రూ.64 కోట్ల సొమ్ము రైతులకు చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు రూ.14 కోట్లు మాత్రమే రైతుల ఖాతాలకు జమైంది. ఇంకా రూ.50 కోట్ల సొమ్ము రైతులకు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం ద్వారా కనీస మద్దతు ధర పొందడంతోపాటు సొమ్ము వెంటనే బ్యాంకు ఖాతాలకు జమవుతుందని రైతులు ఆశించారు. అయితే 35 రోజులు గడిచినా సొమ్ము జమకాకపోవడం, స్థానిక మార్క్‌ఫెడ్ అధికారులను సంప్రదించినా కచ్చితంగా సొమ్ము ఎప్పుడు జమవుతుందో చెప్పలేని పరిస్థితి ఉండటంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జిల్లాలో 250 టన్నుల కందులు దిగుబడులు రాగా.. ఇప్పటివరకు 25 టన్నులు కొనుగోలు చేశారు. బాపట్ల జిల్లాలో 257 టన్నులు కొనుగోలు చేయాలని లక్ష్యం విధించారు. ఇక్కడ 80 మంది రైతులు కందులు అమ్మడానికి నమోదు చేసుకున్నారు. సోమవారంతో కందుల కొనుగోలు గడువు ముగియనుంది.

ధరలు లేక రైతుల దిగాలు

రబీ సీజన్‌లో విస్తారంగా సాగుచేసిన మొక్కజొన్న, శనగ, కందులు, జొన్న పంటలకు బహిరంగమార్కెట్‌లో ధరలు పతనం కావడంతో రైతులు అమ్ముకోలేక అవస్థలు పడుతున్నారు. శనగలు, కందులు ప్రభుత్వం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. కందులు కొనుగోలు చేసినా సొమ్ములు జమకావడంలో జాప్యం జరుగుతోంది. మరోవైపు జొన్న, మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో ధర లేకపోవడం, ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. పెద్దరైతులు కొన్నాళ్లు శీతలగిడ్డంగుల్లో నిల్వచేసుకుంటున్నారు. సన్న, చిన్నకారు రైతులు ఆర్థిక అవసరాల కోసం బహిరంగమార్కెట్‌లో తక్కువ ధరకే విక్రయిస్తున్నారు.

ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు..

మూడు ఎకరాల్లో కంది పంట సాగుచేశాను. 21 క్వింటాళ్లు దిగుబడి వచ్చింది. మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో మార్చి 28న కందులు విక్రయించాను. రూ.1.68 లక్షల డబ్బులు రావాలి. దాదాపు 35 రోజులు అవుతున్నా..ఇంతవరకు నగదు జమ కాలేదు. సిబ్బందికి ఫోన్ చేస్తే, స్పందించడం లేదు. ఎవరినీ అడగాలో అర్థం కావడం లేదు.

- వడ్లమూడి వెంకటేశ్వర్లు, మాచవరం



ఎన్నికైన సంఘ కార్యవర్గ సభ్యులు

ఉమ్మడి జిల్లా పీఆర్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం కార్యవర్గ ఎన్నిక

జిల్లాపరిషత్తు(గుంటూరు), కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఏపీ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా జి.రత్నకుమార్ ఎన్నికయ్యారు. జడ్పీ ప్రాంగణంలోని సంఘ భవనంలో జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఎన్నికల అధికారిగా రొంపిచర్ల మండల పరిషత్తు కార్యాలయం పరిపాలన అధికారి డి.శరత్‌బాబు, పరిశీలకుడు ప్రత్తిపాడు మండలం డిప్యూటీ తహసీల్దార్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఉద్యోగులు జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వివరాలివీ.. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బి.ఆర్.అంబేడ్కర్, అసోసియేట్ అధ్యక్షురాలిగా కోటమ్మ, ఉపాధ్యక్షులుగా జక్కా మహేష్, ఎస్.వి.ఆర్.చైతన్య, పి.శ్రీనివాసరావు, శరత్, సంయుక్త కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాసరావు, సీహెచ్.ఆనంద్, ఎం.సందీప్, కోశాధికారిగా ఎస్.కె.మహబూబ్ సుభాని, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బి.నాగార్జున, వి.నాగేశ్వరరావు, సునీల్ జోషి, మహిళా ప్రతినిధిగా హైమావతి, కార్యవర్గ సభ్యులుగా రాజేశ్వరి, మల్లేశ్వరరావు, కె.జగన్మోహన్‌రావు, ఎన్నికయ్యారు. అధ్యక్షుడు రత్నకుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఉద్యోగులు పూలమాలలు వేసి సన్మానించారు.

రాజధానిలో పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించండి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : రాజధానిలోని ఆర్ 5 జోన్‌లో ఇళ్ల స్థలాలు రద్దయిన పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఆదివారం బ్రాడీపేటలోని కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సీఆర్‌డీఏ పరిధిలో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని 50 వేల మంది పేదలకు 900 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలిపారు. వాటిని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసింది. వారికి వేరే ప్రాంతంలో ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించలేదన్నారు. రాజధానిలోని 29 గ్రామాలతోపాటు సీఆర్‌డీఏ పరిధిలోని 56 మండలాల్లో పేదలకు ఇళ్ల స్థలాల విషయాన్ని పట్టించుకోలేదన్నారు. రాజధానికి మొదట 54 వేల ఎకరాలు సమీకరించారని, రెండో దశలో 20 వేల ఎకరాలు సమీకరించనున్నారు. మూడో దశలోనూ భూమి సమీకరణకు ప్రణాళిక సిద్ధం చేశారని చెప్పారు. ఇంత పెద్ద ఎత్తున రైతుల నుంచి భూమిని సమీకరించి కార్పొరేట్ కంపెనీలకు కేటాయిస్తున్నారని, పేదలను విస్మరిస్తున్నారన్నారు. 189 కిలోమీటర్ల పొడవైన ఔటర్ రింగు రోడ్డు పేరుతోనూ భూమి తీసుకోనున్నారని తెలిపారు. మొదటి దశలో సేకరించిన భూములను అభివృద్ధి చేయాలని, రెండో దశ భూ సమీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి నేతాజీ మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో పేదల ఇళ్ల స్థలాల సమస్యపై మే, జూన్ నెలల్లో ఆందోళనలు చేసి..అప్పటికీ స్పందించకపోతే జూన్‌లో మంత్రి లోకేశ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని చెప్పారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, ఈమని అప్పారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాబూరావు, పక్కన నేతాజీ, పాశం రామారావు, అప్పారావు

భిన్న వాతావరణంతో ఉక్కిరిబిక్కిరి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గుంటూరు నగరంతో పాటు జిల్లాలో ఆదివారం భిన్న వాతావరణంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం ఉదయం నుంచి ప్రజలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం సమయంలో ఆకాశంలో మబ్బులు పట్టి ఒక్కసారిగా తేమ వాతావరణం ఏర్పడింది. ఈదురు గాలులు, తేలికపాటి చినుకులు పడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అంతలోనే మళ్లీ ఎండ రావడంతో ఇబ్బందులు తప్పలేదు. సాయంత్రం నుంచి వాతావరణం చల్లగా మారి తేలికపాటి చినుకులు పడ్డాయి. చల్లని వాతావరణాన్ని ప్రజలు ఆస్వాదించారు.

నువ్వూ వెళ్లిపోతే నాకు దిక్కెవరమ్మా..!



తల్లికి అంత్యక్రియలు చేస్తున్న కుమార్తె పూజిత

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆడపిల్లకు సోదరుడంటే ధైర్యం.. అమ్మ అంటే ఆప్యాయత.. ఆరు నెలల వ్యవధిలో ఇద్దరినీ కోల్పోతే.. ఆ ఆడబిడ్డ పడే బాధ మాటల్లో వర్ణించలేం. ఆ దుఃఖాన్ని దిగమింగుతూ అంతిమసంస్కారాలు కూడా ఆమే చేయాల్సిన వస్తే.. ఎంత హృదయవిదారకమో కదా.. తెనాలి మండలం సంగంజాగర్లమూడిలో సరిగ్గా ఇదే జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సంగం జాగర్లమూడి గ్రామానికి చెందిన కుర్రా శివనాగాంజలి(50)కి ఇద్దరు పిల్లలు పూజిత, నాగగణేష్(24) ఉన్నారు. భర్తతో మనస్పర్థలు రావడంతో కూలి పనులు చేసుకుంటూ బిడ్డలను పెంచి పెద్ద చేసిందామె. కుమార్తెకు వివాహం జరిపించగా కుమారుడు ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఆరు నెలల క్రితం అనుకోని ప్రమాదంలో నాగగణేష్ మరణించగా.. ఆ శోకం నుంచి కోలుకోక ముందే రోడ్డు ప్రమాదంలో తల్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. ఆదివారం శవపంచనామా అనంతరం తల్లి మృతదేహాన్ని సంగంజాగర్లమూడికి తీసుకొచ్చారు. తోడుండాల్సిన తమ్ముడు వదిలేసి వెళ్లిపోయాడు.. నువ్వు కూడా వెళ్లిపోతే ఇంక నాకు దిక్కెవరమ్మా.. అంటూ కుమార్తె గుండెలు పగిలేలా రోదించడం చూపరులను కలిచివేసింది. తండ్రి దూరంగా ఉండటం.. సోదరుడు మృతి చెందడంతో కుమార్తె పూజితే తల్లికి అంతిమసంస్కారాలు చేసింది.

ఉత్తమ ప్రిన్సిపల్ వెంకటమ్మ



జిల్లాపరిషత్తు (గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ సొసైటీ గురుకులాల్లో పని చేస్తున్న వారిలో ప్రతి నెలా ఒకరిని ఉత్తమ ప్రిన్సిపల్ పురస్కారానికి ఎంపిక చేస్తోంది. 2026, ఏప్రిల్‌కి ఉమ్మడి గుంటూరు జిల్లా వినుకొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులం ప్రిన్సిపల్ బి.వెంకటమ్మ ఎంపికయ్యారు. పదో తరగతి, ఇంటర్ వార్షిక పరీక్షల్లో విద్యార్థులు 84 శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఇద్దరు విద్యార్థినులు జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనేలా ప్రిన్సిపల్ వెంకటమ్మ ప్రోత్సహించారు. దీంతో ఆమెను ఏప్రిల్ నెలకు ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. గురుకులం విద్యార్థినులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూతో పాటు అదనంగా ప్రత్యేకంగా ఆహార పదార్థాలు సిద్ధం చేయించి పెట్టించడంతో ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్రంలోని ప్రిన్సిపల్స్‌కి ఉన్నతాధికారులు జూమ్ సమావేశాల్లో సూచించిన సందర్భాలు ఉన్నాయి. 33 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వెంకటమ్మ ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. దివ్యాంగురాలైన ఆమె సమర్థంగా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల అభినందనలు అందుకున్నారు.

కారంపూడి దోపిడీ దొంగల అరెస్టు

566 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణారావు, పక్కన డీఎస్పీ మహేశ్వరరావు, సీఐ శరత్‌బాబు

గురజాల, న్యూస్‌టుడే: కారంపూడిలో బంగారు నగలను దోచుకుపోయిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారినుంచి 566 గ్రాముల బంగారం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను ఎస్పీ కృష్ణారావు గురజాల డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం విలేకరులకు వెల్లడించారు. ఆ వివరాలిలా.. వినుకొండకు చెందిన యక్కల శ్రీనివాసరావు హోల్‌సేల్‌గా బంగారు నగలను జిల్లాలోని వివిధ ప్రాంతాల్లోని దుకాణాలకు విక్రయిస్తుంటారు. ఇతని వద్ద నగలు కాజేయాలని కారంపూడిలోని ఓ బంగారు నగల దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్న నరసరావుపేట మండలం పమిడిపాడుకు చెందిన గోసుల సాంబయ్య గుంటూరులోని గుజ్జనగుండ్లకు చెందిన గోగుల పవన్‌తో కలిసి పథకం వేశారు. వీరికి గుంటూరుకు చెందిన కాండ్రగుంట శశికుమార్, కాండ్రగుంట సాయికిరణ్, అన్నం నిఖిల్‌మహేష్, నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన బండారు అజిత్‌లు సహకరించారు. గత నెల 27న యక్కల శ్రీనివాసరావు కారంపూడికి నగలు తీసుకొస్తుండగా పథకం ప్రకారం గోగుల పవన్, అతని స్నేహితులు ద్విచక్ర వాహనాలపై వచ్చి దాడి చేసి నగల బ్యాగును తీసుకుని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కారంపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. కారంపూడి సీఐ శరత్‌బాబు, నరసరావుపేట పట్టణ ఎస్సై వంశీ, స్పెషల్ బ్రాంచి ఎస్సై షఫీ, ఎస్సై వాసు నేతృత్వంలో ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేసి దర్యాప్తు మొదలు పెట్టారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దొంగల్ని గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బంగారు నగల విలువ రూ.60 లక్షలు ఉంటుందని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, కారంపూడి సీఐ శరత్‌బాబు పాల్గొన్నారు.

గడ్డివాములు, లారీ దగ్ధం

గొట్టిపాడు(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: గొట్టిపాడులో పశుపోషకుడు గరికపాటి లక్ష్మయ్యకు చెందిన మూడు గడ్డి వాములు, లారీ ఆదివారం దగ్ధం అయ్యాయి. బాధితుడి వివరాల మేరకు.. మధ్యాహ్నం సుమారు 3.30 గంటల సమయంలో భారీ సుడిగాలులు వీచాయి. ఆ సమయంలో కోటేశ్వరరావు అనే రైతు వచ్చి వామి దగ్గర పొగ వస్తుందని చెప్పాడు. వెళ్లి చూసే సరికి నిమిషాల వ్యవధిలోనే లారీ, వాములకు మంటలు వ్యాపించాయి. మంట ఎలా వచ్చిందో తెలియడం లేదు. పోటీలకు ఎడ్లను తీసుకెళ్లే లారీ, ఒక గడ్డి వామి, 30 ఎకరాల్లోని జొన్నచొప్ప దగ్ధం అయ్యాయి. రూ.20 లక్షలు నష్టం వచ్చినట్లు బాధితుడు చెబుతున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపుచేశారు. ప్రత్తిపాడు ఎస్సై ఎన్.నరహరి ఘటనా స్థలిని పరిశీలించారు.

16, 17 తేదీల్లో భాజపా శిక్షణ సమావేశాలు



మాట్లాడుతున్న జగన్నాథశాస్త్రి

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ప్రశిక్షణ సమావేశాలకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలని, పార్టీ సిద్ధాంతాలను తెలుసుకుని కార్యకర్తలకు తెలియజేయాలని ప్రశిక్షణ కార్యక్రమ జిల్లా సంధానకర్త రాంపల్లి జగన్నాథశాస్త్రి అన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో జరగనున్న జిల్లా ప్రశిక్షణ, రాబోయే రోజుల్లో జరిగే కార్యక్రమాలపై ఆదివారం భాజపా జిల్లా కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో జగన్నాథశాస్త్రి మాట్లాడుతూ ప్రశిక్షణలో పలు విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. భాజపా జిల్లా అధ్యక్షులు తిరపతిరావు మాట్లాడుతూ నంబూరులోని వీవీఐటీ కళాశాలలో జిల్లా స్థాయి ప్రశిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. మన ఊరు-మనజెండా కార్యక్రమం ద్వారా అని గ్రామాలు, వార్డుల్లో భాజపా జెండా ఎగరవేయాలన్నారు. సర్ ద్వారా జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లలో బీఎల్ఏ 2లను ఏర్పాటు చేసుకుని బీఎల్‌వో ద్వారా ఓటర్లను కలిసి వారు ఎక్కడ ఉంటున్నారు, ఎన్ని సంవత్సరాలుగా ఇక్కడ నివాసం ఉంటున్నారు, ఏ రాష్ట్రం నుంచి వచ్చారనే విషయాలు సేకరించాలన్నారు. పార్టీ నేతలు జూపూడి రంగరాజు, కొత్తూరి వెంకటసుబ్బారావు, చంద్రశేఖర్, యశ్వంత్, దర్శనపు శ్రీనివాస్, జగ్గారావు, పాలపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

గుత్తేదారుల సమస్యల పరిష్కారానికి కృషి



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘ కార్యవర్గ సభ్యులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుత్తేదారుల సమస్యల్ని పరిష్కరించేందుకు కృషి చేస్తామని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుంటూరు అధ్యక్షుడు గుంటుపల్లి వెంకట్రావు పేర్కొన్నారు. గుంటూరు క్లబ్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా గుంటుపల్లి వెంకట్రావు, కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా శ్రీధర్ ప్రమాణ స్వీకారం చేశారు. బీఏఐ వైస్ ఛైర్మన్ రామకోటయ్య, మాజీ వైస్‌ఛైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర మాజీ ఛైర్మన్ నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఛైర్మన్ శేషగిరిరావు, రాష్ట్ర సమన్వయకర్త శివకుమార్, జయరామ్, కె.వెంకట్రావు నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బీఏఐ సభ్యులు, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 150, చికెన్ విత్‌స్కిన్ - 218, చికెన్ స్కిన్‌లెస్ - 248.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్ : బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -123 రిటైల్ ధర 150 చికెన్ విత్ స్కిన్ - 218 చికెన్ స్కిన్‌లెస్ - 248.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 270 చికెన్ స్కిన్‌లెస్ - 280.

తెనాలి

• తెనాలి • పొన్నూరు

అంబేడ్కర్ కళాశాలలో ఉచిత సినీ నట శిక్షణ తరగతులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణంలోని అంబేడ్కర్ కళాశాలలో ఈనెల 15 నుంచి మూడు రోజుల పాటు సినీ నట శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(మా) ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ వ్యవస్థాపకులు దిలీప్‌రాజా తెలిపారు. ఆదివారం పట్టణంలోని 'మా' ఆఫీసులో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఉచిత భోజన వసతి ఉందని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పొన్నూరు పట్టణ పరిధిలోని సాంబశివనగర్‌లో సిమెంటు రహదారి నిర్మించలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- డి.వీరయ్య, సాంబశివనగర్** ✔ నిధులు రాగానే రహదారి నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హసీనా, సహాయ ఇంజినీర్** ? పొన్నూరు పట్టణ పరిధిలోని 11వ వార్డులో మురుగు నీటి కాలువలో వ్యర్థాలు పేరుకున్నాయి. **- కె.సుజాత, 11వ వార్డు** ✔ వ్యర్థాలను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి**

స్పందన: ✦ 'మేమున్నాం...మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని పాత పొన్నూరులో పాడైపోయిన వీధి దీపానికి మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

ఘనంగా అన్నమయ్య సంగీతోత్సవం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: సంకీర్తన సాంస్కృతిక సంస్థ తెనాలి ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి సంగీతోత్సవం ఆదివారం పట్టణ కొత్తపేటలోని ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాయకులు అన్నమాచార్యుల సంకీర్తనలను గానం చేశారు. ఆంజనేయశాస్త్రి, వెంకట రామకృష్ణ, పెరవలి వంశీకృష్ణ, నల్లపాటి వెంకటేశ్వరరావు వాయిద్యా సహకారం అందించారు. గాయనీ గాయకులు డాక్టర్ కె.పురుషోత్తమ రావు, పరుచూరి సుబ్బారావు, లక్ష్మీ నరసింహారావు, కొండపి వసుంధర, నన్నపనేని విజయలక్ష్మి, ఉప్పులూరి శారద, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

నూతన యాగశాల

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి మండల గ్రామం పెదరావూరు అభయాస్తా సుబ్రహ్మణ్య స్వామి, విద్యాగణపతి, బాలాంబికా సమేత సర్వహితేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని యాగశాలను చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆదివారం ప్రారంభించారు. గ్రామ ప్రముఖులు, పెద్దలు, భక్తులు, కిక్కూరి శ్రీనివాసరెడ్డి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం ఆధ్వర్యంలో డీజిల్, పెట్రోల్ కొరత వస్తే ప్రత్యామ్నాయం ఏమిటి అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు ఆదివారం పట్టణంలో నిర్వహించారు. గెలిచిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ గవర్నర్ ఈదర పూర్ణచంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కలెక్టర్ అభినందన



సుమియాకు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ సాయికాంత్ వర్మ


చేబ్రోలు, న్యూస్‌టుడే: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి మండలంలోనే ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వేజెండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు షేక్ సుమియా, అక్షయలను ఆదివారం గుంటూరులోని శంకర్ విలాస్ హాలులో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ సాయికాంత్ వర్మ, జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాషా అభినందించారని ఎంఈవో ఏడుకొండలు తెలిపారు.

ఆహ్లాదం.. అందనంత దూరం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే



యడ్లలింగయ్య రైల్వే ట్రాక్ సమీపంలోని బహిరంగ స్థలంలో విరిగిన పరికరాలు



ఉడా కాలనీ లోని అంగన్‌వాడీ కేంద్రం ప్రాంగణంలో..

గత తెదేపా ప్రభుత్వ హయాంలో పట్టణంలోని బహిరంగ స్థలాల్లో వ్యాయామ పరికరాలు, ఆట పరికరాలు బిగించారు. అయితే గత ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో పలు పరికరాలు దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. కాలక్రమంలో ఇవి తుప్పు పట్టి ప్రమాదకరంగా మారాయి. తుప్పు పట్టినవి తొలగించి కొత్తవి బిగించాలని స్థానికులు కోరుతున్నారు.

◆ ఉడా కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని విశాలమైన స్థలం వద్ద గోడ నిర్మించి గేటు పెట్టించారు. ఇందులో బహిరంగ వ్యాయామ పరికరాలు, పిల్లల కోసం ఊయల, జారుడు బల్ల వంటి అనేక రకాల ఆట పరికరాలు బిగించారు. వాటిని స్థానికులు చక్కగా వినియోగించుకున్నారు. వీటికి గ్రీజు పెట్టించి సాధనకు ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు అనేక సంవత్సరాల నుంచి కోరుతున్నా పట్టించుకోవడం లేదు. పిల్లల ఆటల పరికరాలు విరిగి పోయాయి. వానలకు తడుస్తూ తుప్పు పట్టి ప్రమాదకరంగా ఉన్నాయి. దశాబ్దం నుంచి పాలకులు, కమిషనర్లు మారుతున్నారు. కానీ వాటికి మరమ్మతులు లేదా కొత్తవి బిగించలేదు. ◆ ఈ విషయాలను మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు దృష్టికి తీసుకెళ్లగా.. బహిరంగ స్థలాల్లో దెబ్బతిన్న వ్యాయామ పరికరాలు, ఆట పరికరాలను వినియోగంలోకి తేవాలని ఇంజినీర్లకు సూచించారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే



పడక వద్ద గాలి పంకా పెట్టుకున్న వృద్ధుడు

రోజు రోజుకు పెరుగుతున్న వేసవి తీవ్రతను తట్టుకోలేక రోగులు నానా అవస్థలు పడుతున్నారు. ఉక్కపోత భరించలేక ఒంటిపై చొక్కాలు తొలగించి ఉపశమనం పొందుతున్నారు. మరి కొందరు ఇంటి నుంచి ఫ్యాన్లు తెచ్చుకుంటున్నారు. రోగుల బాధలు తప్పించే ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరుతున్నారు. ◆ తెనాలి జిల్లా ఆసుపత్రిలో నెలకు 30 వేల మంది రోగులు వస్తున్నారు. సుమారు 4 వేల మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి పాత భవనంలోని సాధారణ, ఆర్థోపెడిక్, కంటి వార్డుల్లో ఫ్యాన్లు సక్రమంగా తిరగడం లేదు. దీంతో తగినంత గాలి రాక ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నామని రోగులు వాపోతున్నారు. వృద్ధులు అనారోగ్య సమస్యలతో ఆసుపత్రుల్లో చేరి చికిత్స తీసుకుంటున్నారు. దీంతో వార్డులు రోగులతో నిండిపోయాయి. సాధారణ వార్డుల్లోని రోగులు కూడా ఇవే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రిలోని 300 పడకల్లో 100 మాతాశిశు సంరక్షణకు కేటాయించారు. మిగిలినవి పాత భవనంలో చికిత్స పొందుతున్న రోగులకు కేటాయించారు. ◆ దీనిపై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సమన్వయకర్త బి.వి. రంగారావు మాట్లాడుతూ.. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని రోగులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ పరిధి చినరావూరులోని అక్షర మహిమ వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు దృష్టి లోపం ఉన్న పలువురికి కంటి పరీక్షలు చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆసుపత్రిలో చికిత్స చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ముతవల్లి సయ్యద్ అల్తాఫ్, బిస్మిల్లా, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఎముకల, కీళ్ల మార్పిడికి అత్యాధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని విజయవాడకు చెందిన డాక్టర్ చలసాని ప్రశాంత్ పేర్కొన్నారు. ఆదివారం ఐతానగర్ కాలనీలోని ఎన్జీఆర్ సామాజిక భవనంలో నిర్వహించిన తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎముకల పటుత్వ పరీక్షలు ఉచితంగా చేశారు. పలు సందేహాలను నివృత్తి చేశారు.

బాలుడికి దాతల చేయూత

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: 'పసివాడి ప్రాణం.. ఊపిరి కోసం పోరాటం' శీర్షికన ఏప్రిల్ 30న 'ఈనాడు'లో ఇచ్చిన కథనానికి స్పందన లభించింది. గుంటూరు రామిరెడ్డినగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగులు తేజశ్రీ వర్ధన్, అన్నపూర్ణ దంపతుల కుమారుడు తమ్మిరెడ్డి ప్రద్యుమ్న గుంటూరు పెదకాకాని రోడ్డులోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో తీవ్రమైన శ్వాసకోశ సమస్య, ఇన్ఫెక్షన్ వ్యాధితో, ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నాడు. బాలుడి వైద్య ఖర్చులకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని ప్రచురితమైన కథనానికి తెనాలికి చెందిన హెల్పింగ్ సోల్జర్స్, శరణ్య ఫౌండేషన్ ప్రతినిధులు స్పందించారు. హెల్పింగ్ సోల్జర్స్ ఫౌండర్ షేక్ ఇనాయతుల్లా (ఇన్ను ఆర్ట్స్), శరణ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెజి అధ్యక్షులుగా జాస్తి మోహనరావు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేద్దాం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: హిందువులందరూ ఐక్యంగా ఉండి హిందూ ధర్మ రక్షణ కోసం కృషి చేయాలని శరణాగతి గోష్ఠి తెనాలి నిర్వాహకులు నరేంద్ర రామానుజ దాస స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం నాజర్‌పేట శరణాగతి గోష్ఠి ఆశ్రమంలో నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ తెనాలి మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళలు ప్రతి వారం భజనలు చేయాలన్నారు. జిల్లా ధర్మ ప్రచారక్ బంజరు హేమశంకర్‌రావు, మండల కన్వీనర్ దీపాల మహేష్, తెనాలి నగర కన్వీనర్ కూనపురెడ్డి బైరాగి, గోలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నరేంద్ర రామానుజ దాస స్వామి

ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రతిష్ఠ

చేబ్రోలు, న్యూస్‌టుడే : స్థానిక వాటర్ ట్యాంకు వద్ద ఉన్న నిత్యానందాశ్రమ సంఘం, చేబ్రోలు ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు, ధ్వజ సర్పస్థ, జీవ శంకరాయ్యలు, నగరేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. మాజీ ఎమ్మెల్యే ముద్దాల గిరి, తాళ్లపాలెం శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.



అలంకరణలో అమ్మవారు

వేళాంగిణి మాత మహోత్సవాలు ప్రారంభం

అబ్బినేనిగుంటపాలెం (పెదనందిపాడు), న్యూస్‌టుడే: అబ్బినేనిగుంటపాలెంలోని వేళాంగిణిమాత మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా విచారణ గురువులు వేళాంగిణి రెడ్డి, నవీన్‌తేజ, మర్రెడ్డి, బాలసురేష్‌రెడ్డిలు దివ్యపూజా బలి నిర్వహించారు. విశ్వాసులు ప్రార్థనలు చేసి క్రీస్తు గీతాలను ఆలపించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం మాత విగ్రహాన్ని (స్వరూపాన్ని) తేరుపై ఉంచి విచారణ గురువులు, విశ్వాసులు ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



తేరు ఊరేగింపులో విశ్వాసులు

హైందవులంతా సంఘటితం కావాలి

చేబ్రోలు, న్యూస్‌టుడే : దేశంలోని హైందవులంతా సంఘటితం కావాల్సిన అవసరం ఉందని తాళ్లాయపాలెం శివస్వామి పిలుపునిచ్చారు. చేబ్రోలులోని ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆలయాల్లో పని చేసే పూజారులు, అర్చకులు, ఆలయ నిర్వాహకులు, ధార్మిక సంస్థల్లో పనిచేసే వారు ఐక్యంగా ఉంటే ఎటువంటి అరాచక శక్తులు మన సంస్కృతి, సాంప్రదాయాలను ఏమి చేయలేవన్నారు.

8న చిత్రలేఖన పోటీలు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వరల్డ్ పీస్, యూనిటీ డ్రగ్స్ అంశాలపై చిత్రలేఖన పోటీలను ఈనెల 8న బస్టాండ్ వద్ద ఉన్న కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ ఆఫ్ వైకుంఠపురం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

చలివేంద్రాల ప్రారంభం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలి ఆర్టీసీ డిపో పరిధిలోని సుల్తానాబాద్, అంగలకుదురులో ఆదివారం నుంచి చలివేంద్రాలు ప్రారంభించినట్లు డీఎం రాజశేఖర్ తెలిపారు.

వైభవంగా భావనారాయణ స్వామి తెప్పోత్సవం



పొన్నూరు, న్యూస్‌టుడే : స్థానిక శ్రీసుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి కోనేరులో భావన్నారాయణ స్వామి ఉత్సవమూర్తులకు తెప్పోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న అర్చకులు

సర్కార్ బడి పిల్లలు సత్తా చాటారు

రెండు పాఠశాలల్లో నూరు శాతం ఫలితాలు

న్యూస్‌టుడే, కొల్లిపర

నిరుపేద కుటుంబాలు.. సన్నచిన్నకారు రైతుల పిల్లలు.. ప్రభుత్వ బడిలో చదువుకున్నారు. 10వ తరగతి ఫలితాల్లో తమ సత్తా చూపారు. ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠ పెంచారు. జిల్లా అధికారుల నుంచి ప్రశంసా పత్రాలను, జ్ఞాపికలు అందుకున్నారు. ✦ కొల్లిపర మండలం మున్నంగి, వల్లభాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. మున్నంగి పాఠశాల నుంచి 44 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 44 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 16 మంది విద్యార్థులు 500 మార్కులపైనే సాధించారు. గణితం, సైన్స్‌లో వందకు వంద మార్కులు సాధించారు.

✦ వల్లభాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 19 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 19 మంది ఉత్తీర్ణులయ్యారు. ఆరుగురు విద్యార్థులు 500పైనే సాధించారు. పాఠశాలలకు 100 శాతం ఫలితాలు తెచ్చారు. ఈ సందర్భంగా మున్నంగి ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, వల్లభాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణను గ్రామస్థులు కొనియాడారు. గణితంలో, సైన్స్‌లో 100కి 100 మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వంతెన శిథిలం.. ప్రయాణం ప్రమాదం



పొన్నూరు పట్టణ పరిధిలోని నిడుబ్రోలు రక్షిత తాగునీటి పథకానికి వెళ్లే మార్గంలో సాగునీటి కాలువపై ఏర్పాటు చేసిన వంతెన శిథిలావస్థకు చేరింది. శ్లాబు సైతం పెచ్చులుగా రాలి కిందపడుతోంది. సైడు వాల్స్ సైతం దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

వేసవి శిక్షణలో చిన్నారుల ఆటలు

తెనాలి (కొత్తపేట),న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తపేట మహిళా బాలల గ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులకు అధిక సంఖ్యలో చిన్నారులు హాజరవుతున్నారు. వారితో ఆదివారం చెస్ ఆడించారు. తొలుత స్పోకెన్ హిందీ, ఇంగ్లిష్‌కు సంబంధించిన అంశాలను చిన్నారులకు బోధించారు. కార్యక్రమంలో కడియాల సుజాత, రచయిత ఆళ్ల నాగేశ్వరరావు, బోధకులు తదితరులు పాల్గొన్నారు.



చెస్ ఆడుతున్న చిన్నారులు

కళాకారులకు పురస్కారాలు





పురస్కారం అందుకుంటున్న రంగస్థల నటి జ్యోతిరాణి, నటుడు వెంకట్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం కొలకలూరులో కొలంకపురి నాటక కళాపరిషత్, సాయి ఆర్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సహకారంతో నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. నటుడు డాక్టర్ గోవాడ వెంకట్‌కు సవ్యసాచి పురస్కారం, ప్రముఖ రంగస్థల నటి జ్యోతిరాణికి జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. గోపరాజు రమణ, విజయ్ పర్యవేక్షించారు. కళా వేదికలో కె.సాంబశివరావు, సురేష్‌బాబు, కాంతారావు, శ్రీనివాసరావు, మునలయ్య, సూర్యనారాయణ, సుబ్బారావు, పెద్ద సంఖ్యలో కళాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. ప్రజాధనం వృథా

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో తెనాలి పురపాలక సంఘానికి కొత్త డంపర్ బిన్లు మంజూరు చేశారు. వీటిని చెత్త లభ్యత ఎక్కువగా ఉన్న వార్డుల్లో ఉంచేందుకు వినియోగించనున్నారు. వీటి ఒక్కో దాని విలువ రూ. 31,500. సుమారు రూ.5లక్షల పైన విలువైన 16 డంపర్ బిన్లు సరఫరా అయ్యాయి. ఒక్కోదానిలో సుమారు ఒక టన్ను చెత్త వరకు వేయొచ్చు. గతంలో రూ.లక్షల్లో కొన్న డంపర్ బిన్లు నిర్వహణ లోపంతో స్వల్ప కాలానికి చక్రాలు ఊడడంతో మూలన పడేశారు. మరి కొన్ని వాటి ఆనవాళ్లు కూడా లేకుండా పడేసి ఉన్నాయి. వాటిలో నిర్దేశించిన పరిమాణం కన్నా ఎక్కువ చెత్త వేస్తున్నారు. నైపుణ్యత లేని కార్మికులు వాటిని ఇష్టానుసారం వాడడంతో అవి కాస్త త్వరగా దెబ్బతింటున్నాయి. వీటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాల్సిన పురపాలిక అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)

హామీ నెరవేరింది.. నేతన్నలకు భారం తగ్గింది



నేత నేస్తున్న కార్మికుడు

చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తు పథకం అమలు చేయడంతో నేతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి చేనేతలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ కార్మికులకు నెలకు 500 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా అందజేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో హామీని నిలబెట్టుకోవడంతో నేత కార్మికులు ఆనంద పడుతున్నారు. చేబ్రోలు మండలంలోని కొత్తరెడ్డిపాలెంలో గతంలో నాలుగు వందల మంది వరకు నేత కార్మికులు మగ్గం నేసే వారు. మగ్గం పనిలో ఆదాయం తగ్గడం, కుటుంబ ఖర్చులు పెరిగిపోవడంతో పాటు విద్యుత్తు బిల్లులు భారం కావడంతో నేత పనిని వదిలి కొంత మంది కూలీ పనులకు వెళ్తున్నారు. కొందరు మాత్రం వృత్తిని వదల్లేక అదే పనిలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఉచిత విద్యుత్తు పథకం కిందకు వచ్చే లబ్ధిదారుల జాబితాను జౌళి, చేనేత శాఖ ప్రభుత్వానికి అందజేసింది. దీంతో మే నెలలో ఆ కుటుంబాల వారికి విద్యుత్తు బిల్లు సున్న రావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే,చేబ్రోలు

80 మంది నేత కార్మికులు గుర్తింపు

చేబ్రోలు మండలంలో 80 మంది నేత కార్మికుల వివరాలను జౌళి, చేనేత శాఖ ప్రభుత్వానికి అందజేసింది. మే నెలలో 65 కుటుంబాలకు ఉచిత విద్యుత్తు పథకం వర్తించింది. మరో 15 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. వచ్చే నెల నుంచి వారికి కూడా ఈ పథకం వర్తించే అవకాశం ఉంటుంది.

- బి.శ్రీనివాసరావు, ఏఈ, విద్యుత్తు శాఖ, చేబ్రోలు

విద్యార్థినికి గాయాలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా రాయదుర్గానికి చెందిన యువతి తెనాలిలోని వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్నారు. ఈ క్రమంలో తెనాలి సుల్తానాబాద్ వద్ద ఆదివారం రాత్రి రోడ్డు దాటుతున్న విద్యార్థినిని ఆటో ఢీ కొట్టడంతో గాయపడ్డారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న తెనాలి గ్రామీణ సర్కిల్ సీఐ షేక్ నాయబ్‌రసూల్ తన వాహనంలో విద్యార్థినిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



బాధితురాలి వద్ద సీఐ నాయబ్ రసూల్

రైలు నుంచి జారి ప్రయాణికుడి మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి రైల్వే స్టేషన్ శివారులో ఆదివారం రాత్రి రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని సుమారు 35 సంవత్సరాల వ్యక్తి మృతి చెందారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్లపై నుంచి ఒకరు..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: వెంకటగిరి ప్రాంతానికి చెందిన భక్తవృత్సలం (42) కొన్ని నెలల కిందట తెనాలిలోని తన సోదరి ఇంటికి వచ్చాడు. మద్యానికి బానిసగా మారిన అతను ఇంట్లో గొడవ చేస్తుండడంతో సోదరి మందలించారు. దీంతో పట్టణంలోని లాడ్జిలో మంచం అద్దెకు తీసుకుని ఉంటూ, ఇక్కడే క్యాటరింగ్ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం తాగి మెట్లు దిగుతూ జారి పడ్డారు. దీంతో తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తాడేపల్లి, న్యూస్‌టుడే: సీతానగరం వద్ద ప్రకాశం బ్యారేజీ ఎగువ భాగాన కృష్ణానదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. మృతుడికి 35 ఏళ్ల ఉండవచ్చని భావిస్తున్నారు. అతడికి సంబంధించిన ఎలాంటి ఆధారాలు లభ్యంకాలేదు. వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సజావుగా ముగిసిన నీట్



ఏఎన్‌యూ గేటు వద్ద వేచి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆదివారం నిర్వహించిన నీట్ యూజీ ప్రశాంతంగా ముగిసింది. యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన అయిదు కేంద్రాల్లో మొత్తం 2,972 మంది విద్యార్థులకు గాను 98.6 శాతం హాజరయ్యారని సమన్వయకర్త డాక్టర్ గోపికృష్ణ తెలిపారు. ఒక్క నిమిషం నిబంధనను అధికారులు పక్కాగా అమలు చేశారు. ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య గంగాధర్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ లింగరాజు, సహాయ ప్రిన్సిపల్ చంద్రమౌళి తదితరులు విధుల్లో పాల్గొన్నారు. ఆయా కేంద్రాల వద్దకు వెళ్లేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లోపలికి వచ్చిన తర్వాత విద్యార్థులు ఇబ్బందులు పడకుండా బస్సులు, ఎలక్ట్రిక్ వాహనాలు పెట్టారు. విద్యార్థులకు సహాయం చేసేందుకు ఎన్‌సీసీని రంగంలోకి దించారు. ఎండ ఎక్కువగా ఉండడంతో విశ్వవిద్యాలయం బయట ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు మజ్జిగ, తాగునీరు సరఫరా చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఏఎన్‌యూ ప్రధాన ద్వారం వద్ద టెంట్‌లు వేశారు.

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ చెంచుపేటలోని నీట్ కేంద్రం కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. విద్యార్థులు చివరి నిమిషంలో పరీక్ష కేంద్రానికి చేరుకోవడానికి ఉరుకులు పరుగులు పెట్టారు. త్రీటౌన్ సీఐ సాంబశివరావు ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.



తెనాలి(కొత్తపేట): కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

ఆత్మీయ వేడుక



2007-08 బ్యాచ్ విద్యార్థుల బృంద చిత్రం

ఈమని(దుగ్గిరాల), న్యూస్‌టుడే: ఈమని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 18 ఏళ్ల తర్వాత కలిసిన వీరంతా నాటి మధుర స్మృతుల్ని గుర్తుచేసుకున్నారు. అప్పటి హెచ్ఎం పి.జి.దయామణి, ఉపాధ్యాయులను సత్కరించారు. 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. అశోక్, రాజ, వంశీ, లక్ష్మీ తిరుపతమ్మ, అనూష, లావణ్య, గీతాశ్రీ, నాగరాణి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోలేరమ్మ, అద్దంకమ్మల తిరునాళ్ల ప్రారంభం

వింజనంపాడు (వట్టిచెరుకూరు): వింజనంపాడు పోలేరమ్మ, అద్దంకమ్మల తిరునాళ్ల పావనం ప్రదర్శనతో ఆదివారం ప్రారంభమైంది. మూడు రోజులు జరిగే ఈ తిరునాళ్లలో 4న అమ్మవార్లకు భక్తుల కుంకుమ బళ్ల పూజలు, 5న సిడిమాను ఊరేగింపు సంప్రదాయంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

నేరప్రవృత్తి వీడండి

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని నల్లపాడు సీఐ భాస్కర్ అన్నారు స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ.. నేరప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం

పెదనందిపాడు, న్యూస్‌టుడే: విద్యార్థులు పుస్తకపఠనం ద్వారా మేధా సంపత్తిని పెంపొందించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ జి. మోహనరావు అన్నారు. స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందినప్పటికీ గ్రంథాలయాలకు ప్రాధాన్యం ఉందని, ఇది ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. విద్యార్థులు నీతి కథలు, నీతిపద్యాలలో తర్ఫీదు పొందాలని గ్రంథాలయ నిర్వాహకుడు శివనాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠకులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

మన కాలనీ శుభ్రంగా!



ఫ్రెండ్స్.. మీ కాలనీలో, వీధుల్లో, రోజూ నడిచే చోట్ల మీకు చెత్త కనిపించే ఉంటుంది. ఈ సెలవుల్లో ఆ దారులను శుభ్రం చేద్దామా? దీని ద్వారా మనం ఓ మంచి పని చేశామని సంతోషంగా ఫీలవ్వడమే కాదు.. చుట్టుపక్కల పరిసరాలను జాగ్రత్తగా ఎలా కాపాడుకోవాలో అందరికీ చూపించిన వాళ్లమవుతాం.

- దీనికోసం మీ ఫ్రెండ్స్ అందరూ కలిసి ఒక టీమ్‌గా ఏర్పడాలి.
- చేతికి గ్లౌజ్ లేదా ప్లాస్టిక్ కవర్ కట్టుకోండి.
- ఒక పెద్ద బ్యాగ్ లేదా ఖాళీ సంచి తీసుకోండి.
- వీధిలో లేదా పార్కులో పడి ఉన్న ప్లాస్టిక్ చెత్తను (కవర్లు, చిప్స్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు) ఏరి సంచిలో వేయండి.
- ఆ సంచిని మున్సిపల్ చెత్తకుండీలో వేస్తే మీ మిషన్ సక్సెస్ అయినట్లే.

సెలవుల్లో సరదాగా!

జాగ్రత్తలు..

- చేతులకు గ్లౌజ్ లేకుండా అస్సలు చెత్తను తాకవద్దు. ప్లాస్టిక్ కవర్ల కింద పురుగులు లేదా పదునైన వస్తువులు ఉండొచ్చు.
- డ్రైనేజీకి దగ్గరగా ఉన్నవి, తడిగా ఉన్న, కుళ్లిపోయిన వస్తువుల జోలికి వెళ్లొద్దు.
- మీరు వీధిలోకి వెళ్లినప్పుడు కచ్చితంగా పెద్దవారిని తోడు తీసుకెళ్లండి. రోడ్డు మీద వెళ్లే వాహనాల పట్ల జాగ్రత్తగా ఉండండి.

ఇసుకతో బొమ్మలేద్దాం

ఇసుకలో ఆడుకోవడం, దాంతో కోటలు, గూళ్లు కట్టడం భలే ఫన్ ఇస్తుంది. మరి అదే ఇసుకతో బొమ్మలు వేస్తే ఎలా ఉంటుంది? దీన్నే 'సాండ్ ఆర్ట్' అంటారు.

▼ ఇందుకోసం ఒక తెల్ల కాగితం లేదా కార్డ్ బోర్డ్ తీసుకొని, దాని మీద మీకు నచ్చిన బొమ్మ గీయండి. అది ఒక అందమైన పువ్వు, సీతాకోకచిలుక లేదా మీ పేరు, ఇలా ఏదైనా కావొచ్చు. ▼ ఇప్పుడు మీరు గీసిన బొమ్మ లోపల లేదా గీతల మీద నెమ్మదిగా గ్లూ పూయండి. అది ఆరిపోకముందే దానిపై ఇసుకను చల్లండి. ▼ కాసేపు ఆరాక కాగితాన్ని మెల్లగా పక్కకు వంచండి. గ్లూ ఉన్న చోట ఇసుక అతుక్కుని, మిగతాది కిందకి ఒలికిపోయి, బొమ్మ చక్కగా కనిపిస్తుంది.



రంగులూ వేయొచ్చు..

ఒకవేళ మీకు రంగులతో కావాలంటే.. ఇసుకలో కాస్త కుంకుమ, పసుపు లేదా చాక్‌పీస్ పొడి కలిపితే రంగురంగుల ఇసుక రెడీ అయిపోతుంది. దీనితో మీ బొమ్మలు ఇంకా కలర్‌ఫుల్‌గా మెరుస్తాయి తెలుసా!

● ఇసుకతో ఆడుతున్నప్పుడు కళ్లలో పడకుండా జాగ్రత్తగా ఉండాలి. ఆట పూర్తయ్యాక చేతులను శుభ్రంగా కడుక్కోవడం మర్చిపోవద్దేం!

5 ప్రాంతాల్లో.. రూ. 41 కోట్లు దోచేశారు

జగనన్న కాలనీల పేరిట చేపట్టిన 'ఆప్షన్-3' ఇళ్ల నిర్మాణాల్లో దోపిడీ

- కుంభకోణానికి పాల్పడ్డ రాక్రీట్ సంస్థ
- ఇది వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డి బంధువులది
- విజిలెన్స్ విచారణలో వెలుగుచూసిన అక్రమాలు
- రాష్ట్రవ్యాప్తంగా 9 కేసులు నమోదు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో జగనన్న కాలనీల పేరిట చేపట్టిన 'ఆప్షన్-3' ఇళ్ల నిర్మాణాల్లో కేవలం 5 ప్రాంతాల్లోని లేఔట్లలోనే రూ.41.23 కోట్లు దోచుకున్నట్లు నిగ్గు తేలింది. మిగతా ప్రాంతాల లేఔట్లలో జరిగిన దోపిడీ.. తదుపరి దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది. వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బంధువులు, అనుచరవర్గానికి చెందిన 'రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్'.. ఏపీ గృహనిర్మాణ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఏ ఒక్క లేఔట్‌లోనూ ఇళ్ల నిర్మాణం పూర్తిచేయకుండానే భారీ కుంభకోణానికి పాల్పడినట్లు వెల్లడైంది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం విచారణలో వెలుగుచూసిన అక్రమాల ఆధారంగా.. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో రాక్రీట్ సంస్థ, దాని డైరెక్టర్లు, ప్రతినిధులపై 9 కేసులు నమోదయ్యాయి. మోసం, నేరపూరిత విశ్వాస ఘాతుకం, ఫోర్జరీ, ఫోర్జరీ డాక్యుమెంట్ల వినియోగం, నేరపూరిత కుట్ర, ప్రజాధనం దుర్వినియోగం తదితర అభియోగాల కింద ఈ కేసులు పెట్టారు. 'ఒప్పందం మేరకు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుండానే రాక్రీట్ సంస్థ.. బిల్లులు విడుదల చేయించుకుంది. ఫ్యాబ్రికేటెడ్ డాక్యుమెంట్లు, రికార్డులు సమర్పించి దోచుకుంది' అని ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్నారు. ఎన్టీఆర్ కమిషనరేట్ పరిధిలోని నున్న, విశాఖపట్నం కమిషనరేట్‌లోని దువ్వాడ, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం గ్రామీణం, అనకాపల్లి జిల్లా సబ్బవరం, గుంటూరులోని నల్లపాడు, మేడికొండూరు, ఏలూరు గ్రామీణం, అనంతపురం గ్రామీణం, పులివెందుల పోలీసుస్టేషన్ల పరిధిలో ఈ కేసులు నమోదయ్యాయి. వీటన్నింటిని రాష్ట్రస్థాయిలో ప్రత్యేక విభాగానికి అప్పగించి దర్యాప్తు చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది. దర్యాప్తు పూర్తయితే రాక్రీట్ సంస్థ దోచుకున్న మొత్తం ఎంతో తేలుతుంది. జగన్ హయాంలో.. రాష్ట్రవ్యాప్తంగా రూ.1,100 కోట్ల విలువైన 63వేల ఇళ్ల నిర్మాణ బాధ్యతలను నామినేషన్ పద్ధతిలో రాక్రీట్ సంస్థకు అప్పగించేశారు. అత్యంత నాసిరకంగా నిర్మాణ పనులు చేపడుతున్నా అప్పట్లో పట్టించుకోలేదు. రాప్తాడు నాటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి నేరుగా జోక్యం చేసుకుని బిల్లులు మంజూరు చేయించుకునేవారన్న ఆరోపణలు ఉన్నాయి.



ఈ లేఔట్లలో జరిగిన అక్రమాలకు సంబంధించే 9 కేసులు నమోదయ్యాయి..

	లేఔట్ పేరు	ఒప్పందం ఎన్ని ఇళ్లకు...	దోచుకున్న సొత్తు (రూ.కోట్లలో)
1.	జగనన్న కాలనీ, వికాస్ కాలేజీ రోడ్డు, నున్న, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా	1,180	2.01
2.	నడుపూరు లేఔట్స్, గాజువాక నియోజకవర్గం, విశాఖపట్నం	3,401	దర్యాప్తులో తేల్చాలి
3.	కోటిపి లేఔట్, హిందూపురం అర్బన్, శ్రీసత్యసాయి జిల్లా	2,953	2.61
4.	ఏటుకూరు, గుంటూరు రూరల్ మండలం, గుంటూరు జిల్లా	947	1.71
5.	చోదిమెళ్ల, కొమడవోలు, పోణంగి మెయిన్ లేఔట్లు, ఏలూరు జిల్లా	6,525	దర్యాప్తులో తేల్చాలి
6.	అనంతపురం అర్బన్, రాప్తాడు, ఆత్మకూరు మండలాల లేఔట్లు అనంతపురం జిల్లా	7,629	24.25
7.	పులివెందుల మెగా లే ఔట్, పులివెందుల, వైఎస్సార్ కడప జిల్లా	4,912	దర్యాప్తులో తేల్చాలి
8.	పైడివాడ అగ్రహారం, గంగవరం, నంగినారపాడు లేఔట్లు, అనకాపల్లి జిల్లా	7,979	దర్యాప్తులో తేల్చాలి.
9.	పేరేచర్ల లేఔట్, మేడికొండూరు మండలం, గుంటూరు జిల్లా	4,504	10.65
	మొత్తం	40,030	రూ.41.23 కోట్లు

6 నెలల్లో పూర్తిచేస్తామని చెప్పి..

■ విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గం పరిధిలోని నడుపూరు లేఔట్స్‌లో 3,401 ఇళ్ల నిర్మాణాన్ని 6 నెలల్లోగా పూర్తిచేసి అప్పగించేలా రాక్రీట్.. గృహనిర్మాణ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఒక్క ఇల్లైనా నిర్మించలేకపోయింది. 1,197 ఇళ్లను పునాదుల స్థాయిలో, 1,970 ఇళ్లను ప్లింత్ బీమ్ స్థాయిలో వదిలేసింది. గృహనిర్మాణ సంస్థ అధికారులు ఫోన్‌లు చేసినా, నోటీసులిచ్చినా లెక్కచేయలేదు. పైగా లబ్ధిదారులకు చెందిన బిల్లుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేసి దోచుకుంది.

■ ఎన్టీఆర్ జిల్లా నున్న వికాస్ కాలేజీ రోడ్డు, రామవరప్పాడు లేఔట్లలో 1,180 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టి.. ఒక్కటీ పూర్తిచేయలేదు. పనులు జరిగినట్లు చూపి బిల్లులు చేసుకున్నారు.

■ నాటి ముఖ్యమంత్రి జగన్ సొంత నియోజకవర్గమైన పులివెందులలో మెగా లేఔట్ పేరిట 4,912 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టు తీసుకున్న రాక్రీట్ సంస్థ.. మధ్యలో వదిలేసింది. ఒప్పందం ప్రకారం ఇళ్లు పూర్తిచేయలేదు. నిబంధనలనూ ఉల్లంఘించింది. ఇక్కడ ఏ స్థాయిలో దోపిడీ జరిగిందో దర్యాప్తులో తేలాల్సి ఉంది.

■ అనంతపురం అర్బన్, రాప్తాడు, ఆత్మకూరు మండలాల పరిధిలో 7,648 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టు తీసుకుని.. పూర్తి చేయలేదు. అదనపు బిల్లులు క్లెయిమ్ చేసి దోచుకున్నారు. అత్యంత నాసిరకం సామగ్రిని వాడి ప్రభుత్వాన్ని మోసగించారు. ఈ మూడు మండలాల పరిధిలోని లేఔట్లలో రూ.24.25 కోట్లు దోచేశారు.

■ శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని కోటిపి లేఔట్‌లో 2,953 ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. నిధులు, మెటీరియల్‌ను గృహనిర్మాణ సంస్థ అందించినప్పటికీ పూర్తి చేయకుండా వదిలేశారు. ఇక్కడ పాల్పడిన అక్రమాలపై 74 మంది లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు.

■ అనకాపల్లి జిల్లా పైడివాడ అగ్రహారం, గంగవరం లేఔట్, నంగినారపాడు లేఔట్‌కు సంబంధించి 7,979 ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకుని ఒక్కటీ పూర్తి చేయలేదు. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పేరేచర్ల శివారులోని లేఔట్‌లో 4,504 ఇళ్ల నిర్మాణానికి సంబంధించి రూ.10.65 కోట్లు దోచుకున్నారు. గుంటూరు శివారులోని ఏటుకూరు, గుంటూరు గ్రామీణ మండలంలో 947 ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం చేసుకుని.. కట్టకుండా మధ్యలోనే వదిలేశారు. స్టీల్, సిమెంట్, ఇసుక వంటివి సరిగ్గా వాడలేదు. లబ్ధిదారులను మోసగించారు.

■ ఏలూరు రూరల్ పరిధిలోని చోదిమెళ్ల, కొమడవోలు, పోణంగి మెయిన్ లేఔట్‌లలో 6,525 ఇళ్ల నిర్మాణానికి ఒప్పందం కుదుర్చుకుని ఒక్కటంటే ఒక్కటీ పూర్తిచేయలేదు. అయినా బిల్లులు చేసుకున్నారు.

'నోబెల్' నామినేషన్ల జాబితాలో 'ప్యాడ్ మ్యాన్' మురుగానందం పేరు



అరుణాచలం మురుగానందం

చెన్నై (ట్రిప్లికేన్), న్యూస్‌టుడే: రుతుస్రావం సమయంలో మహిళల పరిశుభ్రత కోసం తక్కువ ధరకు శానిటరీ న్యాప్‌కిన్లు అందించే యంత్రాన్ని కనుగొన్న అరుణాచలం మురుగానందం పేరు.. ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయింది. నోబెల్ కమిటీ.. 2026 శాంతి బహుమతి కోసం 79 సంస్థలతో పాటు 287 మంది నుంచి వ్యక్తిగత నామినేషన్లను స్వీకరించింది. వాటిని పరిశీలించి అక్టోబరు 9న పురస్కారాన్ని ప్రకటించనుంది. ఆ నామినేషన్ల జాబితాలో తన పేరు ఉన్నట్లు మురుగానందం స్వయంగా ప్రకటించారు. 'నేను కానీ నా కుటుంబసభ్యులు కానీ నోబెల్ కోసం నామినేషన్ వేయలేదు. పుదుచ్చేరిలోని అరవింద్ కంటి ఆసుపత్రికి చెందిన ఓ డీన్‌తో పాటు అక్కడ పని చేస్తున్న అమెరికన్ వైద్యబృందాల సభ్యులు నా పేరును నామినేట్ చేశారు. ఇది నాకెంతో గర్వకారణం' అని మురుగానందం చెప్పారు. '40 ఏళ్లుగా శానిటరీ న్యాప్‌కిన్ల తయారీలో ఉన్నాను. దేశవ్యాప్తంగా మహిళల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు నిర్వహించాను. అతితక్కువ ఖర్చుతో కూడిన తయారీ సాంకేతికతను, యంత్రాల్ని 40కి పైగా దేశాలకు అందించాను' అని వివరించారు.

నాలుగు సినిమాలు..: కోయంబత్తూర్‌కు చెందిన మురుగానందం జీవితచరిత్రను 'ప్యాడ్ మ్యాన్' పేరుతో బాలీవుడ్‌లో సినిమాగా తెరకెక్కించింది. ఇందులో మురుగానందం పాత్రను ప్రముఖ నటుడు అక్షయ్‌కుమార్ పోషించారు. మహిళల ఇబ్బందులకు మురుగానందం చూపిన పరిష్కారాలు నేపథ్యంగా 2013-18 మధ్య 4 సినిమాలు వచ్చాయి. ఆయనకు కేంద్ర ప్రభుత్వం 2016లో పద్మశ్రీ అవార్డును ప్రదానం చేసింది.

మ్యాజిక్ డ్రెయిన్లతో పల్లెల్లో పారిశుద్ధ్య విప్లవం

- వినూత్న కార్యక్రమాలతో రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి
- 'ఎక్స్' వేదికగా బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు



ఈనాడు, అమరావతి: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి వినూత్నంగా చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్లు ఎంతో దోహదం చేస్తున్నాయని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పల్లెల్లో పారిశుద్ధ్య విప్లవం తీసుకొచ్చారని ప్రశంసించారు. ఈ మేరకు ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆమె వీడియో విడుదల చేశారు. 'ఏపీలో గ్రామీణాభివృద్ధికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకుని అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. వీటిలో మ్యాజిక్ డ్రెయిన్ ఎంతో ముఖ్యమైంది. ఇప్పటివరకు గ్రామాల్లో మురుగు పారుదల వ్యవస్థ సరిగా లేనందున, ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై మురుగు నిలిచిపోవడంతో పాటు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో మ్యాజిక్ డ్రెయిన్లతో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించారు. వృథా జలాలను శుద్ధిచేసి భూగర్భంలో ఇంకింపజేస్తున్నారు. ప్రధాని మోదీ సహకారంతో సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దార్శనికత్వంతో గ్రామీణాభివృద్ధిలో రాష్ట్రం ఇంకా ప్రగతి సాధించాలని కోరుకుంటున్నాను' అని పీవీ సింధు పేర్కొన్నారు.

పన్ను సలహాదారు.. ఆపన్నుల ప్రాణదాత



రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అంబులెన్సు సకాలంలో రాక ప్రాణాలు కోల్పోయే అభాగ్యులు ఎంతో మంది ఉంటారు. రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ సందీప్ గుప్తా 22 ఏళ్ల క్రితం అటువంటి ఓ దుర్ఘటనను దగ్గరగా చూశారు. కళ్ల ముందే ప్రాణం పోవడం చూసి చలించిపోయిన ఆయన.. క్షతగాత్రులను ఆదుకోవాలని నాడే సంకల్పం చేసుకున్నారు. గత రెండు దశాబ్దాలుగా సొంత ఎస్‌యూవీ కారును అంబులెన్సుగా మార్చి.. తాను ప్రయాణిస్తున్న దారిలో ఎవరైనా ప్రమాదానికి గురైతే వెంటనే వారిని ఆసుపత్రికి తరలిస్తున్నారు. కారులో ప్రథమ చికిత్స సామగ్రి, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచారు. అధికారుల అనుమతితో సమకూర్చుకున్న సైరన్, 'అంబులెన్సు' బోర్డును అప్పటికప్పుడు కారుకు అమర్చుతారు. అలా ఇప్పటివరకూ 120 మందికి పైగా క్షతగాత్రులను ఆసుపత్రులకు తీసుకెళ్లారు. ఇందులో కనీసం 35 మంది సకాల వైద్యంతో బతికి బయటపడ్డారు. బాధితులను ఆసుపత్రిలో చేర్చాక తన చిరునామా ఉన్న కార్డును సందీప్ వారివద్ద వదిలేసి వెళతారు. ఆ కార్డుపై 'వీలైతే మీరూ మరొకరికి ఇలా సాయం చేయండి' అనే విజ్ఞప్తి ఉంటుంది. – జైపుర్

నెల రోజుల్లో రికార్డు స్థాయిలో.. రూ.948 కోట్ల ఆస్తి పన్ను వసూళ్లు

ఈనాడు, అమరావతి: కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27) ప్రారంభంలోనే పట్టణ స్థానిక సంస్థలు రికార్డు స్థాయిలో ఆస్తిపన్ను వసూలు చేశాయి. ఏప్రిల్ 1 నుంచి 30వ తేదీ నాటికి నెల రోజుల్లో రూ.948.15 కోట్ల వసూళ్లతో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 22.91% వృద్ధిని నమోదుచేశాయి. ఈ విషయాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 123 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఈ ఏడాది ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యం రూ.2,683.50 కోట్లుగా నిర్ణయించారు. ఏప్రిల్ 1 నుంచి 30 లోపు చెల్లించిన వారికి 5% రాయితీ ప్రకటించడంతో ప్రజలు పెద్దసంఖ్యలో వినియోగించుకున్నారు. నగరపాలక సంస్థల్లో కాకినాడ 43.28% వసూళ్లతో ముందంజలో నిలిచింది. మంగళగిరి-తాడేపల్లి 41.21%, గుంటూరు 40.79%, రాజమహేంద్రవరం 40.41%, కర్నూలు 39.59% వసూలు చేశాయి. విజయవాడ 39.21%, విశాఖపట్నం 33.24% వసూళ్లు సాధించాయని ముఖ్యకార్యదర్శి వివరించారు. పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో అద్దంకి 51.56% మేర వసూళ్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆత్మకూరు, ఉయ్యూరు, వినుకొండ, కొవ్వూరు, పొన్నూరు, చీరాల, పిడుగురాళ్ల, తాడిగడప, గిద్దలూరు తదితర పట్టణాల్లోనూ ఆస్తి పన్ను వసూళ్లు మెరుగయ్యాయి. పురమిత్ర, మన మిత్ర యాప్‌లు, ఆన్‌లైన్ చెల్లింపులు, పుర, నగరపాలక సంస్థల్లో ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు ద్వారా కూడా రాష్ట్రవ్యాప్తంగా వసూళ్లు బాగా పెరిగాయని సురేశ్‌కుమార్ పేర్కొన్నారు.

ఏపీసీఆర్‌డీఏ కార్యాలయంలో కలెక్టర్ల సదస్సు

7, 8 తేదీల్లో నిర్వహించనున్న ప్రభుత్వం

ఈనాడు–అమరావతి: జిల్లా కలెక్టర్ల సదస్సు ఈ నెల 7, 8 తేదీల్లో జరగనుంది. అమరావతిలోని ఏపీసీఆర్‌డీఏ కార్యాలయంలో సదస్సు నిర్వహించనున్నట్లు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ కలెక్టర్లకు తెలియజేశారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కలెక్టర్ల సదస్సులను సచివాలయంలోని ఐదో బ్లాక్‌లో నిర్వహిస్తున్నారు. కొత్తగా నిర్మించిన సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ దఫా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

మీ అలవాట్లే వారికి ఆదర్శం



పిల్లలు మీరు చెప్పే మాటల కంటే మీ చేతలను చూసే ఎక్కువగా నేర్చుకుంటారు. ఆరోగ్యం పట్ల మీరు చూపే శ్రద్ధ, అందుకోసం చేసే వ్యాయామాలను వారు గమనిస్తారు. ఎటువంటి ఆహార పదార్థాలను తింటున్నారో కూడా చూస్తారు. మీ అలవాట్లే వారికి ఆదర్శం.

– హానెస్ లెబెన్, ఇన్‌ఫ్లుయెన్సర్

చేతికొచ్చి మూణ్నెల్లు.. ఇళ్లలోనే బేళ్లు

ప్రకాశం జిల్లా టంగుటూరు వేలం కేంద్రం పరిధిలో 12 క్లస్టర్లు. ఒక్కో క్లస్టర్‌లో రెండు, మూడు గ్రామాలున్నాయి. ప్రతి రౌండ్‌లో మొత్తం గ్రామాల్లో పొగాకులో కొంత కొనుగోలు చేయాలి. అలా ఏడెనిమిది రౌండ్లు నిర్వహించాలి. ఇప్పటికి తొలి రౌండ్‌లో రెండు క్లస్టర్లలోని రైతులకే 2 బేళ్ల చొప్పున అమ్ముకునే అవకాశం కల్పించారు. మిగిలిన 10 క్లస్టర్లలోని గ్రామాలకు అవకాశం దక్కేదెప్పుడు? ఇలా రౌండ్లు పూర్తయ్యేదెప్పుడు..?

ప్రకాశం జిల్లాలోని ఒంగోలు-2 వేలం కేంద్రం పరిధిలో 45 గ్రామాలున్నాయి. ఇప్పటికి 13 గ్రామాల్లోని రైతులకే తొలివిడతలో రెండు బేళ్ల చొప్పున విక్రయించే అవకాశం ఇచ్చారు. మిగిలిన 32 గ్రామాల రైతుల పొగాకు బేళ్లు ఇళ్ల నుంచే కదల్లేదు. వీరందరి నుంచి తొలి రౌండ్‌లో రెండు బేళ్ల చొప్పున కొనుగోలు చేశాక.. మళ్లీ అన్ని గ్రామాలకు రౌండ్ల వారీ అవకాశం ఇస్తారు. చాలా గ్రామాల్లో తొలి రౌండ్ కొనుగోళ్లే మొదలు కాకపోవడంతో సరకు మొత్తం విక్రయించేదెప్పుడని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పొగాకు కొనుగోళ్లు చేపట్టక రైతుల ఆవేదన

- మార్చి 25న వేలం ప్రారంభించినా.. కొన్ని గ్రామాల నుంచే కొనుగోళ్లు
- తగ్గిన ధరలతో రైతుల్లో ఆందోళన
- ఎంపీల చెవికెక్కని రైతు కష్టాలు



ఈనాడు, ఒంగోలు, అమరావతి: పొగాకు చేతికొచ్చి మూడు నెలలవుతున్నా.. ఇప్పటికీ కొనుగోళ్లు ఊపందుకోలేదు. వందల గ్రామాల్లోని రైతులు జనవరి చివరి నాటికే క్యూరింగ్ పూర్తి చేసి బేళ్లు సిద్ధం చేసినా. . వేలం కేంద్రాలకు బేళ్లు తేవాలని బోర్డు నుంచి పిలుపు రాలేదు. జనవరి చివరి వారంలోనే వేలం ప్రారంభించి వంద రోజుల్లో కొనుగోళ్లు పూర్తి చేయాల్సిన పొగాకు బోర్డు.. ఇప్పటికీ జాప్యం చేస్తోంది. మార్చి 25న కొనుగోళ్లు ప్రారంభించినా రోజు విడిచి రోజే కేంద్రాలు నిర్వహిస్తోంది. కర్ణాటకలో కొనుగోళ్లు పూర్తి కాలేదని, అక్కడి నుంచి వ్యాపారులు రాలేదని సాకులు చెబుతోంది. వేలం కేంద్రాల పరిధిలోని ఒంగోలు, నెల్లూరు, ఏలూరు ఎంపీలకు రైతుల గోడు పట్టడం లేదు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయించాలనే ఆలోచన కొరవడింది. రైతుల ఇబ్బందుల్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదు. ధరలు తగ్గుతున్నా బోర్డు, వ్యాపారులతో చర్చించే యత్నం చేయడం లేదు. దీంతో రైతులు బేళ్లను శీతల గిడ్డంగులకు తరలిస్తున్నారు.

కర్ణాటకలో పూర్తయ్యేదాకా ఎదురుచూడాలా?

కర్ణాటకలో పొగాకు కొనుగోళ్లు పూర్తయ్యే వరకూ ఏపీ రైతులు ఎదురుచూడాల్సిందే. అక్కడ 140 రోజులుగా కొనుగోళ్లు చేస్తున్నారు. మే చివరి వరకూ కొనుగోళ్లు చేపట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు వ్యాపారులు ఏపీకి వచ్చే స్థితి లేదు. ఐటీసీ, జీపీ సహా కొన్ని చిన్న సంస్థలు ఏపీలో కొనుగోళ్లు ప్రారంభించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులను చూపి ధరల్ని తగ్గిస్తున్నాయి. వ్యాపారులు ఎక్కువ మంది వస్తే పోటీ ఏర్పడి ధర పెరిగే అవకాశం ఉంటుందని తెలిసినా బోర్డు చర్యలు తీసుకోవడం లేదు.

పెరుగుతున్న తిరస్కరణల శాతం

రాష్ట్రంలో 142 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి అనుమతివ్వగా అదనంగా మరో 87 మి.కిలోలు వస్తుందని అంచనా. ఇందులో ఇప్పటి వరకు కేవలం 16 మిలియన్ కిలోలే కొనుగోలు చేశారు. ధర కిలోకు సగటున రూ.249.87 మాత్రమే లభించింది. బ్రైట్ రకానికి కనీసం రూ.320 లభిస్తే గిట్టుబాటు అవుతుంది. దీనికీ సగటున రూ.240 మాత్రమే దక్కుతోంది. పైగా తిరస్కరణ శాతమూ పెరుగుతోంది. ఈ నెల 18న కొయ్యలగూడెం కేంద్రంలో 44%, గోపాలపురంలో 43% బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి.

పెరుగుతున్న ఖర్చులు

ఒకప్పుడు జనవరిలోనే పొగాకు కొనుగోళ్లు ప్రారంభించి జూన్, ఆగస్టు నాటికి పూర్తి చేసేవారు. కొన్నేళ్లుగా మార్చిలో వేలం ప్రారంభించి డిసెంబరు వరకు కొనసాగిస్తున్నారు. దీంతో నిల్వ చేయాల్సి వస్తోంది. పెరిగిన ఉష్ణోగ్రతల్లో షెడ్లలో నిల్వ చేస్తే నాణ్యత, తూకం తగ్గుతుందని రైతులు బేళ్లని శీతల గిడ్డంగులకు తరలిస్తున్నారు. రెండేళ్ల కిందట బేలు అద్దె ఒక సీజన్‌కు (సుమారు 6 నెలలు) రూ.500 ఉండేది. గతేడాది నుంచి రూ.1,000 చేశారు. రవాణా ఖర్చులు అదనంగా పెట్టాల్సి రావడంతో రైతులపై భారంపడుతోంది.

800 ఏఈఈ, ఏఈల ఖాళీలు వెంటనే భర్తీ చేయాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం తీర్మానం
- సంఘం కొత్త అధ్యక్షుడిగా ఆర్.శ్రీనివాసరావు ఎన్నిక



ప్రమాణం చేస్తున్న పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం కొత్త కార్యవర్గం

ఈనాడు, అమరావతి: పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో 800 సహాయ కార్యనిర్వాహక ఇంజినీర్ల (ఏఈఈ), సహాయ ఇంజినీర్ల (ఏఈ) ఖాళీలను వెంటనే భర్తీచేయాలని, 2,200 మంది ఇంజినీరింగ్ అసిస్టెంట్లను కొత్తగా కేటాయించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం కోరింది. క్షేత్రస్థాయిలో ఇంజినీర్లపైనా పని ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తాడేపల్లిలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేసింది. ఈ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా సభ్యులు ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఆర్.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, కోశాధికారిగా డి.సురేంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక కార్యదర్శితో పాటు ఉపాధ్యక్షులు, కార్యదర్శులను కూడా ఎన్నుకున్నారు. పదవీ విరమణ చేసిన ప్రస్తుత ఏపీ పంచాయతీరాజ్ ఇంజినీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.సంగీతరావును ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ఎం.మాలకొండయ్య, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ వి.శ్రీనివాసరావు, రాష్ట్ర సమాచార కమిషనర్ రవిబాబు, ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.



ఏం ఎండలు బ్రదరూ..!

హుస్సేన్ సాగర్‌లో ఓ తాబేలు ఆదివారం చిన్న బండపైకి చేరింది. ఓ నీటి కాకి అటుగా వచ్చి ఆ బండపై వాలింది. ఏం మిత్రమా ఇక్కడికి వచ్చావంటూ తాబేలుతో మాట కలిపింది. భానుడి భగభగలకు నీరు వేడెక్కాయి. కాసేపు సేదదీరుదామని బండపైకి వచ్చా. ఇక్కడా కాలుతోంది.. వెళ్తొస్తా అంటూ తిరిగి నీళ్లలోకి పయనమైందా కూర్మం. నా పరిస్థితీ అదే అంటూ.. ఎగిరిపోయింది నీటి కాకి. (ఎండల నేపథ్యంలో వాటి మధ్య మాటలు కలిస్తే ఇలా ఉంటుందేమో..) – ఈనాడు, హైదరాబాద్

సినీ గేయరచయిత చంద్రబోస్ సోదరుడి మృతి

అనారోగ్యంతో కలికిరిలో రోడ్డుపై పడిపోయిన వైనం



మృతిచెందిన రాజేందర్

కలికిరి గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ గేయరచయిత చంద్రబోస్ సోదరుడు కనుకుంట్ల రాజేందర్ (59) అనారోగ్యంతో అన్నమయ్య జిల్లా కలికిరిలో మృతిచెందారు. కలికిరి సీఐ అనిల్‌కుమార్ వివరాల మేరకు.. రాజేందర్ బెంగళూరు, మదనపల్లె తదితర ప్రాంతాల్లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో రెండ్రోజుల కిందట కలికిరికి చెందిన పాత స్నేహితుడి కోసం వచ్చి ఆయన ఇంట్లో ఉంటున్నారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు రాజేందర్ తీవ్ర అస్వస్థతకు గురై స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఈసీజీ పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కలికిరి క్రాస్‌రోడ్డులోని హోటల్‌లో టిఫిన్ చేసి రోడ్డుపైకి వచ్చారు. కొద్దిసేపటికి రోడ్డుపై అందరూ చూస్తుండగానే కింద పడిపోయారు. ఆ సమయంలో తలకు రాయి తగిలి గాయమైంది. ఆయన మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. వివరాలు సేకరించిన తర్వాత కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్నం చెన్నై నుంచి కలికిరికి వచ్చిన బంధువులకు మృతదేహాన్ని అప్పగించడంతో వారు వెంటనే హైదరాబాద్‌కు బయలుదేరారు. అయితే, మార్గంమధ్యలో రాజేందర్ చేతిపై బొబ్బలు (చర్మం ఊడిపోయి) ఉన్నాయంటూ బంధువులు అనుమానం వ్యక్తం చేసి ఫొటోలను కుటుంబసభ్యులకు పంపారు. అప్పటికే కర్నూలు వరకు వెళ్లిన వారు.. ఓ దశలో మళ్లీ కలికిరికి వెనక్కు రావాలని భావించారు. ఈ లోపు కుటుంబసభ్యులు కలికిరి సీఐను ఫోన్‌లో సంప్రదించగా.. మృతదేహం సుమారు గంటపాటు కిందపడి ఉండటం, రాజేందర్‌కు మధుమేహం ఉండటంతో చేతిపై చర్మం ఊడిపోయిందని ఆయన చెప్పారు. దాంతో మృతదేహాన్ని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. తెలంగాణలోని వరంగల్ జిల్లా పరకాలకు చెందిన రాజేందర్.. హైదరాబాద్‌లో ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగంలో చేరి మియాపూర్‌లో స్థిరపడ్డారు. ఆయన భార్య మియాపూర్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా, ఘటనపై కుటుంబసభ్యులు కలికిరిలో ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని పోలీసులు తెలిపారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఇన్‌స్టా పోస్టు... ఆంత్రప్రెన్యూర్‌ని చేసింది!


శ్రేయ

ఉద్యోగమైనా, వ్యాపారమైనా... నెట్‌వర్కింగ్ తప్పనిసరి. కానీ అదేమైనా సులువా? కోల్డ్ మెయిల్స్, లింక్డిన్‌లో రిక్వెస్ట్ పెట్టడం... ఇలా ఎన్నో చేయాలి. అయినా స్పందన వస్తుందా అంటే సందేహమే. ఉద్యోగార్థులకు మెంటార్లు, వ్యాపార ఆలోచన ఉన్నవాళ్లకి పెట్టుబడిదారులు, కలిసి పనిచేసేవారు... ఇలా వెతుక్కోవడం సులువు చేస్తే బాగుంటుంది కదా! ఇలాగే ఆలోచించారు **శ్రేయా నాయర్**. ఫలితమే జెడ్‌స్పాన్. ఆమెని వసుంధర పలకరించగా...

ఇది జెన్‌జీ యుగం. చదువుకుంటున్నప్పుడే వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాలి అనుకుంటోందీ తరం. భవిష్యత్‌కి నిచ్చెనలు వేసుకుంటోంది. అంత వేగంగా ఆలోచిస్తున్నవాళ్లకి తగ్గట్టుగా నెట్‌వర్క్ మాత్రం దొరకట్లేదు. ఈ ఆలోచన నన్నెప్పుడూ తొలిచేది. మాది హైదరాబాద్. నాన్న వ్యాపారం చేసేవారు. దీంతో దేశంలో చాలా ప్రాంతాలు తిరిగా. అమ్మ రిటైర్డ్ టీచర్. ఏడో తరగతి నుంచి హైదరాబాద్‌లోనే చదివా. మాస్‌కమ్యూనికేషన్ అండ్ జర్నలిజంలో డిగ్రీ, పీజీ పూర్తిచేశా. ఈక్రమంలో బెస్ట్ థీసిస్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అవార్డులతోపాటు షార్ట్‌ఫిల్మ్ పోటీలోనూ విజేతనయ్యా. నా చదువు నాకు వ్యక్తులను అర్థం చేసుకోవడం, విషయాన్ని ప్రభావవంతంగా చెప్పడం వంటి ఎన్నో అంశాల్ని పరిచయం చేసింది. ముఖ్యంగా నాన్న మరణం నా దృష్టికోణాన్ని మార్చింది. టెక్ మహీంద్రా, ద గ్రోత్ కోచ్ వంటి సంస్థలతోపాటు ఓ అంతర్జాతీయ పాఠశాలలో ఇన్‌స్ట్రక్షనల్ డిజైనర్, కంటెంట్ స్ట్రాటజిస్ట్, లర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రొఫెషనల్‌గా పనిచేశా.

అది ఆకర్షించింది

నా పని అనుభవాలన్నీ సంక్లిష్టమైన ఆలోచనలను సులువు చేయడం, సోషల్‌మీడియా కంటెంట్ నిర్వహణ, సంస్థలు, వినియోగదారుల మధ్య ఆన్‌లైన్‌పరంగా వస్తున్న గ్యాప్‌ని గుర్తించడం వంటివాటికి సంబంధించినవే. టెక్ నేపథ్యం కాకపోవడంతో సులువుగా ఆన్‌లైన్ వినియోగదారులకు చేరువయ్యే ఇతర మార్గాల గురించి ఆలోచించేదాన్ని. ఈ క్రమంలోనే ఓ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ నన్ను ఆకర్షించింది. 'డేటింగ్ యాప్‌లు, సోషల్‌మీడియా... జనాలతో కనెక్ట్ అవ్వడానికి ఇన్ని వేదికలున్నాయి. ప్రొఫెషనల్స్‌కి సాయపడేలా మాత్రం ఇలాంటి ప్లాట్‌ఫామ్‌లు ఎందుకు లేవు' అని రాశారొకడ. నిజమే... డేటింగ్ యాప్‌ల్లో భాగస్వాములను స్వైప్‌తో సులువుగా ఎంపిక చేసుకుంటున్నారు. ఇలాంటి సౌకర్యం ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్‌లో ఎందుకు లేదు? విద్యార్థులు, స్టార్టప్ ఆలోచన ఉన్నవాళ్లు... కో-ఫౌండర్లు, మెంటార్లు, నిపుణుల కోసం నెలలకొద్దీ ఎందుకు ఎదురుచూడాలి అనిపించింది. సులువుగా కనెక్ట్ అయ్యేలా ఒక ప్లాట్‌ఫామ్ అవసరమని అర్థమైంది. ఆ ఆలోచన నుంచి పుట్టిందే 'జెడ్‌స్పాన్'. జెన్‌జీకి కొత్త అవకాశాలు ఏర్పరిచే సాధనమనే అర్థమొచ్చేలా ఈ పేరుని ఎంచుకున్నా.

ఎదురు చూడక్కర్లేదు

ఆలోచనని సంస్థగా తీసుకురావడానికి చాలానే కష్టమైంది. పరిమిత వనరులు, బోలెడు సవాళ్లు. అయినా పట్టుదలగా ప్రయత్నించా. తొమ్మిది నెలలు కష్టపడి, గత ఏడాది యాప్‌ని అందుబాటులోకి తెచ్చాం. డేటింగ్ యాప్ తరహాలోనే సరళంగా ఉండేలా దీన్ని తీర్చిదిద్దాం. రంగం, అనుభవం ఆధారంగా వ్యక్తి ప్రొఫైల్ చూసి స్వైప్ చేయడమే. చాట్ విండోలో ఒకరినొకరు పరిచయం చేసుకుని, ఆలోచనలు పంచుకోవచ్చు. కనెక్షన్ రిక్వెస్ట్‌లు, మెసేజ్‌లకోసం ఎదురుచూడాల్సిన పని ఉండదు. ప్రారంభించిన కొన్నిరోజుల్లోనే ఇతర దేశాల నుంచీ వినియోగదారులను ఆకర్షించింది. ప్రస్తుతం సేవలను ఉచితంగానే అందిస్తున్నాం. నా వరకూ మా ద్వారా ఎవరు తమ వ్యాపార కల నెరవేర్చుకున్నా అది విజయమే. అలాగని నేనేదో సాధించేశా అనుకోను. ఇంకా సవాళ్లున్నాయి. పొరపాట్లను సరిదిద్దుకుంటూ... నిత్యం నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నా. మన కలలు, చేయాలనుకున్న పని మీద నమ్మకం ఉంటే చాలు. ఏదైనా ప్రారంభించడానికి ఇదే తగిన సమయమంటూ ఉండదు. ముందు తొలి అడుగు వేయండి. ఎలాంటి సవాళ్లు ఎదురైనా ధైర్యంగా నిల్చోండి. వ్యక్తిగతంగా, వృత్తిగతంగా ఎదగడానికి భయపడొద్దు... అమ్మాయిలకు నా సలహా ఇది. నా వరకూ జెడ్‌స్పాన్‌ని గ్లోబల్ యాప్‌గా తీర్చిదిద్దాలని కోరిక.

ఆ బంధాన్ని అంగీకరించలేకపోతున్నా..!

నాకు ఈమధ్యనే పెళ్లి సంబంధం కుదిరింది. మాటల మధ్యలో ఆయనకి గతంలో ప్రేమ వ్యవహారం ఉన్నట్లు చెప్పారు. ఇంట్లో ఒప్పుకోరని వెనకడుగు వేశారట. అక్కడి వరకే అయితే ఫర్వాలేదు కానీ, కొన్ని రోజుల తర్వాత ఫిజికల్ రిలేషన్ కూడా ఉన్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని నేను అంగీకరించలేకపోతున్నా. నా బాధను చూడలేక తను కూడా బాధపడుతున్నారు. గతాన్ని వదిలేయ్... మనం జీవితాన్ని కొత్తగా మొదలుపెడదామని ఒప్పించడానికి ప్రయత్నిస్తున్నారు. కానీ నేను మాత్రం అక్కడే ఆగిపోయా. అలా అని ఇంట్లోనూ ఈ విషయం చెప్పలేను. ఏం చేయను? **- ఓ సోదరి**

డియర్ వసుంధర


డా. మండాది గౌరీదేవి, మానసిక నిపుణురాలు

ప్రస్తుత రోజుల్లో ఇలాంటి సంబంధాలు చాలా ఎక్కువవుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. తెలిసో తెలియకో చాలామంది ఇలాంటి బంధాల్ని కొనసాగిస్తున్నారు. బ్రేకప్, కుటుంబ ఒత్తిడి, దీర్ఘకాలంలో ఇద్దరికీ పొసగకపోవడం వంటి కారణాలతో విడిపోతున్నారు. అయితే, ఈ విషయాలన్నీ రహస్యంగా ఉంచి పెళ్లి చేసుకుంటున్నారు. పెళ్లయిన తర్వాత తెలిసినా ఏమీ చేయలేరనే ధైర్యం వాళ్లది. కానీ, మీరు చెప్పినదానిబట్టి చూస్తే ఇతను అలాంటి వ్యక్తి కాదని అర్థమవుతోంది. కాబోయే భార్యతో పెళ్లికి ముందే నిజాయతీగా అన్ని విషయాలూ పంచుకున్నాడు. దాపరికాలు ఉండకూడదని జరిగినవన్నీ చెప్పాడు. అందరూ అలా ఉండరు. పైగా, ఇది కాకపోయినా తర్వాత వచ్చే అబ్బాయి ఇలాంటి వాటికి దూరంగా ఉన్నాడా అన్నది చెప్పలేం. కాబట్టి, ఉద్యోగం, ప్రవర్తన, కుటుంబ వ్యవహారం, బాధ్యత... వంటి అన్ని కోణాల్లో ఒక్కసారి ఆలోచించి చూడండి. అలా అని మీ మనసు చంపుకొని పెళ్లికి సిద్ధం అవ్వమనీ నేను చెప్పను. ఎందుకంటే... ఈ బాధ మీలో ఉంటే ఎప్పటికీ ఆనందంగా ఉండలేరు. ఆ ప్రభావం దాంపత్య జీవితంపైనా పడుతుంది. మీ నిర్ణయమేదైనా మనస్ఫూర్తిగా అన్ని కోణాల్లో ఆలోచించండి. కావాల్సినంత సమయం తీసుకోండి. అప్పటికీ మీవల్ల కాదు అనిపిస్తే... ఇంట్లో వాళ్లకి విషయం చెప్పి వెనకడుగు వేయండి.

చీరకట్టుతోనే మారథాన్ గెలిచి..!

ఈటీవీ భారత్

ట్రౌజర్లు, టీ షర్ట్స్, టాంక్ టాప్స్, షార్ట్స్... స్పోర్ట్స్ వేర్ అనగానే గుర్తొచ్చే వస్త్రధారణ ఇదే కదా. కానీ చీర కట్టి మాంచెస్టర్ మారథాన్‌లో పాల్గొన్నారు **మధుస్మితా జెనా**. మునుపటి రికార్డులన్నీ బద్దలు కొడుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డుల్లో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారీమె...




కటక్‌లోని కుసుపూర్‌కు చెందినవారు మధుస్మిత. నాన్న నిరేంద్ర మోహన్, అమ్మ విద్యుత్ జెనా. మధు చిన్నప్పుడే ఉద్యోగరీత్యా యూకేకు వలస వెళ్లారు. మాంచెస్టర్‌లో స్థిరపడ్డారు. 'యూకేలో ఉన్నా మా రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాల గురించి అమ్మ ఎప్పుడూ చెబుతుండేది. అక్కడి పండుగలు జరుపుకొనేవాళ్లం కూడా. అలా ఒడిశా కట్టూ బొట్టూ నా జీవితంలో భాగం అయ్యాయి. భారత్ వచ్చిన ప్రతిసారి చీర కట్టుకునేదాన్ని. ఆ అలవాటే ఇష్టపడిన రంగంలో ఇంత గుర్తింపు తెచ్చిపెడుతుందని నేను ఎప్పుడూ ఊహించలేదు' అంటారు మధు. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసుకుని స్థానిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారీమె. భువనేశ్వర్‌కు చెందిన అబ్బాయినే పెళ్లిచేసుకున్నారు. 'బాబు పుట్టిన మూడు నెలల తర్వాత పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ బారిన పడుతున్నా అనిపించింది. దాన్నుంచి ఉపశమనం కోసం పరుగుని నా జీవితంలో భాగం చేసుకున్నా. రోజుకు ఐదు కి.మీ. తెలియకుండానే పరుగెత్తేదాన్ని. అప్పుడే ప్రశాంతంగా అనిపించేది. దాంతో తెలియకుండానే ఇటుగా ఇష్టం పెరిగింది' అనే మధు అనతి కాలంలోనే రన్నింగ్‌లోని మెలకువల్ని అందిపుచ్చుకున్నారు. స్థానిక పోటీల్లోనూ పాల్గొనడం మొదలుపెట్టారు.

అలా భాగమైంది...

'2023 ఏప్రిల్‌లో మేముండే ప్రాంతంలో ఒక పెద్ద మారథాన్ జరిగింది. వినూత్నంగా ఉంటుందని చీర కట్టుకుని వెళ్లా. చుట్టూ ఉన్న వాళ్లతోటి క్రీడాకారులూ చాలా ఆశ్చర్యంగా చూశారు. కొందరైతే 'ఈమె పందెంలో పాల్గొంటుందా. అవసరమా ఈ దుస్తులతో' అంటూ హేళన చేశారు కూడా. అందర్నీ ఆశ్చర్యపరుస్తూ ఆ మారథాన్ గెలిచా. దాంతో అంతర్జాతీయ పత్రికల్లో మీడియాలో విషయం కాస్తా వైరల్ అయ్యింది. అప్పుడే కుతూహలంతో చీరకట్టులో మారథాన్ గెలిచి గిన్నిస్ రికార్డు సొంతం చేసుకున్న మహిళల గురించి తెలుసుకోవడం మొదలుపెట్టాను. ఈక్రమంలోనే 2018 బెర్లిన్ మారథాన్‌లో క్రాంతి సాల్వి చీరకట్టులో పాల్గొని 3 గంటల 57 నిమిషాల 7 సెకన్లలో రేస్‌ని పూర్తిచేశారని తెలుసుకున్నా. నేనూ ప్రయత్నించాలనుకున్నా. అప్పట్నుంచీ ఏ పోటీ జరిగినా చీరతోనే పాల్గొనేదాన్ని. అలా ఈ ఏడాది ఏప్రిల్ 20న మాంచెస్టర్ మారథాన్‌లో మా ప్రాంతీయ సంప్రదాయమైన ఇక్కత్ చీరతో పోటీల్లోకి దిగాను. సౌకర్యం కోసం చీరను ట్రౌజర్‌లా మడిచి కట్టుకున్నా. క్రాంతి కంటే పన్నెండు నిమిషాల ముందే రేస్‌ని పూర్తిచేసి గిన్నిస్ రికార్డుని సొంతం చేసుకున్నా' అనే మధు దీని ద్వారా వచ్చిన మొత్తాన్ని పిల్లలకు విద్యా వసతులు కల్పించేందుకు విరాళంగా ఇచ్చారు. దాంతో ఈమె ప్రయాణం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

పురుగుల్ని రానివ్వని ఆముదం!

పప్పు దినుసుల్ని ఏడాది పొడవునా పాడవకుండా, పురుగు పట్టకుండా నిల్వ చేసుకోవడం మన భారతీయ ఇళ్లలో ఒక సంప్రదాయం. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే తేమ వల్ల బూజు పట్టడం లేదా ముక్క పురుగు వచ్చే ముప్పు ఉంది. అలాకాకుండా ఉండేందుకే ఈ చిట్కాలు...



ఎండ అవసరం... పప్పులను నిల్వ చేసే ముందు కనీసం 2 నుంచి 3 రోజులు ఎండలో ఆరబెట్టాలి. దీని వల్ల పప్పులో ఉన్న తేమ శాతం తగ్గి, పురుగు పట్టే అవకాశం 90% వరకు తగ్గుతుంది.

నూనె రాయండి... కందిపప్పు, మినపప్పు... లాంటి పప్పు దినుసులకు కొద్దిగా వంట నూనె (ముఖ్యంగా ఆముదం) రాసి నిల్వ చేయడం గ్రామీణ ప్రాంతాల్లో బాగా ప్రాచుర్యం పొందిన పద్ధతి. ఆముదం పప్పుల పైన రక్షణ పొరలా ఏర్పడి పురుగులను చేరనివ్వదు.

ఆకులు- వెల్లుల్లి రెబ్బలూ... పప్పు డబ్బాల్లో 4-5 ఎండు మిరపకాయలు వేయడం వల్ల వాటి ఘాటుకు పురుగులు రావు. బిర్యానీ ఆకులు లేదా లవంగాలు వేయండి. ఈ వాసన పురుగులకు పడదు. బాగా ఎండిన వేపాకులను పప్పుల మధ్యలో ఉంచితే బ్యాక్టీరియా దరిచేరదు. లేదంటే పప్పు డబ్బాలో పొట్టు తీయని కొన్ని వెల్లుల్లి రెబ్బలను వేసి ఉంచండి. అవి ఎండిపోయినప్పుడు పాతవి తీసేసి కొత్తవి వేస్తూ ఉండాలి. ఇది పురుగుల్ని అడ్డుకోవడంలో ప్రభావవంతంగా పనిచేస్తుంది.

తడి లేకుండా... పప్పులను ఎల్లప్పుడూ గాలి చేరని గాజు సీసాల్లో లేదా నాణ్యమైన ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వ చేయాలి. తేమ తగిలే చోట లేదా నేల మీద నేరుగా డబ్బాలను ఉంచకూడదు. కొంచెం ఎత్తులో, పొడిగా ఉన్న ప్రదేశంలో ఉంచాలి.

కొద్దిగా వేయించండి... కందిపప్పు, పెసరపప్పు వంటి వాటిని నిల్వ చేసే ముందు కాస్త వేయించి చల్లారాక డబ్బాల్లో పోసుకుంటే రుచి పెరగడమే కాకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. అంతేకాదు, పప్పులను తీసేటప్పుడు ఎప్పుడూ తడి చేతులు పెట్టకూడదు. తడి తగిలితే త్వరగా బూజు పడతాయి. 3 నెలలకు ఒకసారి డబ్బా తెరిచి చూసి, ఎండలో పెడితే సరి. ఏడాదంతా తాజాగా ఉంటాయి.

మట్టికి బలమిద్దాం..!



ఇంట్లో పెంచుకునే మొక్కలు ఆరోగ్యంగా, పచ్చగా ఉండాలంటే కుండీలోని మట్టి సారవంతంగా ఉండటం చాలా ముఖ్యం. బయట దొరికే రసాయనిక ఎరువుల వినియోగం కంటే మన వంటింట్లో లభించే వస్తువులతోనే మట్టిని ఎంతో సారవంతంగా మార్చుకోవచ్చు. అదెలాగంటే...

మనం టీ పెట్టుకున్నాక పారేసే టీ పొడి మొక్కలకు అద్భుతమైన నత్రజని వనరు. వాడిన టీ పొడిని శుభ్రంగా కడిగి ఎండబెట్టి మట్టిలో కలపాలి. ఇది మట్టిని గుల్లగా ఉంచి, మొక్క వేర్లు బాగా కుదురుకోవడానికి ఉపయోగపడుతుంది.

- మొక్కల ఎదుగుదలకు కాల్షియం చాలా అవసరం. ముఖ్యంగా టొమాటో, మిర్చి వంటి మొక్కలకు ఇది వరం. దీనికోసం కోడిగుడ్డు పెంకులను ఎండబెట్టి, మిక్సీలో వేసి మెత్తని పొడిలా చేయాలి. ఈ పొడిని నెలకు ఒకసారి కుండీ మట్టిలో చల్లితే మొక్క కాండం బలంగా మారుతుంది.
- చాలామంది బియ్యం కడిగిన నీళ్లను సింక్‌లో పారబోస్తుంటారు. కానీ ఇందులో మొక్కలకు కావలసిన ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ప్రతి రోజూ బియ్యం, పప్పులు కడిగిన నీటిని ఒక గిన్నెలో పోసి, సాయంత్రం వేళ మొక్కలకు పోయండి. ఇది మట్టిలోని సూక్ష్మజీవులను వృద్ధి చేస్తుంది.
- పొటాషియం లోపిస్తే మొక్కలు పూలు పూయవు. అరటి తొక్కల్లో పొటాషియం సమృద్ధిగా ఉంటుంది. అరటి తొక్కలను చిన్న ముక్కలుగా కోసి నేరుగా మట్టిలో పాతిపెట్టవచ్చు. లేదా తొక్కలను 3 రోజులు నీటిలో నానబెట్టి, ఆ నీటిని మొక్కలకు పోయవచ్చు. దీని వల్ల బాగా పూస్తాయి.
- వంటగదిలో మిగిలిపోయే కూరగాయల తొక్కలు, పండ్ల తొక్కలను పారేయకుండా 'బిన్'లో వేసి ఎరువుగా మార్చవచ్చు. ఒక పాత కుండీలో కొంచెం మట్టి, దానిపై కూరగాయల తొక్కలు, మళ్లీ మట్టి.. ఇలా పొరలు పొరలుగా వేసి నెలకు ఒకసారి కలిపితే అద్భుతమైన నల్ల బంగారం (ఎరువు) తయారవుతుంది. వీటితో పాటు నెలకు రెండుసార్లు మట్టిని పైకి కిందకి కదిలించాలి. దీనివల్ల వేర్లకు గాలి అందుతుంది.
- మట్టిలో నాచు పట్టకుండా ఉండాలంటే రోజుకు కనీసం 3-4 గంటల ఎండ తగిలేలా చూడాలి. కుండీ అడుగున రంధ్రం సరిగ్గా ఉందో లేదో చూసుకోవాలి. నీరు నిల్వ ఉంటే వేర్లు కుళ్లిపోయి మట్టి పాడవుతుంది.

ఇప్పుడూ చదివిస్తారా?

సెలవుల్లో ఇలా!



స్కూలు, చదువు పేరిట శారీరకంగా, మానసికంగా అలసిపోయిన పిల్లలకు సెలవులు కొంత ఊరట. కానీ అచ్చంగా పుస్తకాలకు దూరంగా ఉంచితే తిరిగి స్కూళ్లు మొదలయ్యాక ఇబ్బంది పడతారు అంటారు కొందరు. దేన్నీ కాదనలేం. అయితే ఓ పని మాత్రం చేయొచ్చు. పిల్లల్లో లెక్కలంటే తికమక పడటం, సైన్స్ అంటే బెంబేలెత్తడం, మ్యాప్ గుర్తించడంలో ఇబ్బందులు... ఇలాంటివి మనం గమనిస్తూనే ఉంటాం. మార్కులు తక్కువ వచ్చాయనీ కోప్పడుతుంటాం. వాటిని నేర్పించడానికి వేసవి సెలవుల్ని ఉపయోగించుకోవచ్చు. మీ పిల్లలు ఏ సబ్జెక్టు విషయంలో ఇబ్బంది పడుతున్నారో ఆ అంశాల్ని నేర్పించండి. అలాగని రాబోయే తరగతి పుస్తకాలు ముందు పెట్టి రుద్దొద్దు. గతంలోనివే పునశ్చరణ చేయిస్తాం. పాఠాలు, పరీక్షలు, పోటీల ఒత్తిడి ఉండదు. ప్రశాంతంగానూ ఉంటారు కాబట్టి, మామూలుగా కంటే చురుగ్గా నేర్చుకోగలుగుతారు. దీంతో వాళ్ల ఆత్మవిశ్వాసమూ పెరుగుతుంది. తరవాతి తరగతులకు మరింత ఉత్సాహంగా వెళతారు. అయితే అది మరీ సీరియస్‌గా సాగొద్దు. కోప్పడటం, గంటలకొద్దీ చదివించడం లాంటివీ ఉండొద్దు. సరదాగా సాగాలి. ఒక ఆటలా, పజిల్‌లా వాళ్లు ఆస్వాదించేలా సాగాలి. అంటే మీరూ ఓపికగా నేర్పించాలి. అప్పుడే వాళ్లు ఇష్టంగా నేర్చుకుంటారు. అలా ప్రయత్నిస్తారా మరి?

బలమైన భుజాలకు...

రక్ష

చేసే విధానం: కాళ్ల మధ్య కాస్త దూరం ఉంచి నిల్చోండి. ఆపై రెండు చేతుల్ని పక్కకి చాచి... ఫొటోలో చూపిన విధంగా భుజాలవైపు చేతుల్ని మడతపెట్టి జాయింట్‌ల దగ్గర పట్టుకోవాలి. అక్కణ్నుంచి ముందు వైపు మోచేతుల్ని తీసుకొచ్చి కలుపుతూ, వెనక్కి తెస్తూ ఉండాలి. అదే స్థితిలో ఉంటూ మోచేతుల్ని రొటేట్ చేయాలి. ఒక్కొక్కటి 20 సార్లు చేయాలి. ఇవి పంచ్ పవర్ పెరగడానికి ఉపయోగపడతాయి. అలాగే పంచ్ ఇస్తున్నప్పుడు, ల్యాండ్ అవుతున్నప్పుడు షోల్డర్ డిస్‌లొకేట్ అయ్యే ప్రమాదం ఉంది. అలా కాకుండా ఉండటం కోసం సాయపడతాయి. వీటిని ఏదైనా వ్యాయామానికి ముందు వేగంగా చేయాలి. వ్యాయామం తర్వాత నెమ్మదిగా మరోసారి చేస్తే కండరాలు విశ్రాంతి పొందుతాయి. సాధారణంగా అమ్మాయిల చేతుల్లో బలం తక్కువ. కాబట్టి వాటిని దృఢంగా చేసుకోవడానికి ఇవి సాయపడతాయి.



జాగ్రత్తలు: గాయం అయినప్పుడు వెంటనే చేయకూడదు. శిక్షణలో కండరాలు వేగంగా పని చేయడానికి, తర్వాత కోలుకోవడానికి పోషకాహారం తప్పనిసరి.

- ప్రతిభ తక్కడపల్లి, మార్షల్ ఆర్ట్స్ నిపుణురాలు

రాచరికపు కళలు మళ్లీ వస్తున్నాయ్..!

సామాన్యుల మొదలు, సంపన్నుల వరకూ అందరికీ ఇల్లు ఓ కలల సౌధమే కదా! అందుకే ఇంట్లో ప్రతీది ప్రత్యేకంగా ఉండాలనుకుంటారు. దానికి తగ్గట్టుగానే తమ కలల లోగిలిని కళాత్మకంగా తీర్చిదిద్దుకోవడంపై మనసు పెడుతున్నారు. ఈక్రమంలోనే ఇంటీరియర్‌లో అనేక రకాలు... కళాత్మక చిత్రాలు, కళాఖండాలు మార్కెట్‌లో దర్శనం ఇస్తున్నాయి. అలా వచ్చినవే 'క్రిస్టల్ ఎంబోస్డ్ వాల్ పెయింటింగ్స్' ఇంట్లో అడుగుపెట్టగానే గుడిలో అడుగుపెట్టామా అన్నట్లు... మనసును పరవశింపజేసి మరోలోకంలోకి తీసుకెళ్లే ప్రకృతి సౌందర్యాలతో ఇవి కనువిందు చేస్తున్నాయి. రాజుల కాలంలో కోట గోడల మీద, దేవాలయాల్లో రకరకాల చిత్రకళలు మనం చూసే ఉంటాం కదా! అవి సమతలంగా ఉండకుండా కొంచెం ఉబ్బెత్తుగా కనిపించేలా తీర్చిదిద్దేవారు. ఆ కళనే 'రిలీఫ్ ఆర్ట్'అని పిలిచేవారు. తంజావూరు, మైసూర్ పెయింటింగ్స్ వేసేటప్పుడు ఈ పద్ధతినే అనుసరించేవారట. గీసిన చిత్రాల మీద సున్నం లేదా జిగురుతో ఉబ్బెత్తుగా కనిపించేలా చేసి, వాటిపై బంగారంతో చేసిన రేకులు అతికించేవారట. సరిగ్గా అదే పద్ధతిని ఇప్పుడు ఎంబోస్డ్ పెయింటింగ్‌లోనూ వాడుతున్నారు తయారీదారులు. దీనిలో మొదట డిజిటల్ బేస్ కోసం చిత్రాన్ని గీస్తారు. ఆపై క్రిస్టల్ పౌడర్‌నీ, క్రిస్టల్స్‌నీ, రాళ్లనీ అద్దుతారు. తర్వాత దానిపై రెజిన్ మెటీరియల్‌ని పోస్తారు. దీన్ని యూవీ లైట్లు ఉపయోగించి ఆరబెడతారు. దీనికి వాడే సింథటిక్ ఫ్రేమ్ తేమను లోనికి రానివ్వకుండా అడ్డుకుంటుంది. కాబట్టి ఒకవేళ గోడకు తేమ ఉన్నా ఫొటో ఫ్రేమ్ పాడవుతుందనే భయం ఉండదు. దుమ్ము పడినా తడి బట్టతో సులభంగా తుడిచేయొచ్చు. వీటికి ఉపయోగించే వైబ్రెంట్ కలర్స్ తక్కువ వెలుతురులో కూడా అద్దంలా మెరుస్తూ కనిపిస్తాయి. దాంతో ఇంటికి ప్రత్యేక అందం, ఆకర్షణా తెచ్చేస్తున్నాయీ పెయింటింగ్స్ మీకూ నచ్చాయా?




పనులు అప్పగించండి!

వేసవి సెలవుల్లో కుటుంబసమేతంగా ప్రయాణాలు చేయడానికి మక్కువ చూపించే వాళ్లు ఎక్కువే. స్నేహితులు, బంధువులతో సొంతూరుకో, దైవదర్శనాలకో, చల్లటి ప్రదేశాలకో వెళ్లాలని ప్రణాళికలు వేసుకుంటుంటారు. ఎంత సరదాగా ఉంటుందా ప్రయాణం. పని ఒత్తిడి నుంచి దూరంగా, ప్రకృతికి దగ్గరగా, అలనాటి జ్ఞాపకాల్ని నెమరువేసుకుంటూ, పాత అలవాట్లు, అభిరుచుల్ని తలచుకుంటూ ఆ ప్రయాణం ఇచ్చే అనుభూతిని మాటల్లో వర్ణించలేం కదూ! కానీ ఎప్పుడైనా ఆలోచించారా? ఈ సరదా సమయంలోనూ స్త్రీలు పనికే పరిమితం అవుతారని. ప్రయాణంలో కావాల్సిన సామాన్ల నుంచీ పిల్లల అవసరాలు, పెద్దల మందులు, తిండి, కాలక్షేపానికి కావాల్సిన వస్తువులు అన్నీ బాధ్యతలూ ఆమెవే. రైలు, బస్సు ఆగినప్పుడల్లా ఆమె పిల్లల డైపర్లు మారుస్తూ, కాలకృత్యాలు చూస్తూ హడావుడి పడుతుంటే... ఆయన మాత్రం ఏం పట్టనట్లు, అది ఆడవాళ్ల పనన్నట్లు కూర్చొని ఉంటాడు. ఆమెను తీసుకెళ్తుంది వెకేషన్‌కా... అదనపు పనులు చేయించుకోవడానికా? ఇప్పటికైనా ఆలోచించండి. 'ఆమె కూడా మనిషే. ఆమెకీ కొన్ని ఆశలు ఉంటాయి. మీలానే ప్రయాణంలో సంతోషంగా ఉండాలనుకుంటున్నది అవతలి వాళ్లకి ఎలానూ గుర్తుండదు. కనీసం మనకైనా ఆ స్పృహ ఉండాలి కదా. అందుకే పనుల్నీ బాధ్యతల్నీ పంచుకుంటే ఏ సమస్యా ఉండదు'. అన్ని పనులూ మీ మీదే వేసుకోకుండా... కొన్ని పిల్లలకూ, భర్తకూ అప్పగించండి. అప్పుడే మీకూ కాస్త ఉపశమనం కలుగుతుంది. గమనించుకుంటారుగా మరి!



సెలవుల్లో సరదాగా!

కోపం వద్దేం..



అమ్మ తిట్టినప్పుడో, మనకు నచ్చిన ఆట వస్తువు దొరకనప్పుడో, స్నేహితులతో గొడవైనప్పుడో చిరు కోపం రావడం సహజమే. కానీ ఆ కోపం మనల్నే కాకుండా, మన చుట్టూ ఉన్న వారిని కూడా ఇబ్బంది పెడుతుంది. మరి కోపం అనే ఆ బుజ్జి భూతాన్ని ఎలా కంట్రోల్ చేయాలో నేర్చుకుందామా!



ఏం చేద్దామంటే..

- కోపం రాగానే ఏదో ఒకటి అనేయాలనిపిస్తుంది. కానీ ఒక నిమిషంపాటు నోరు విప్పకుండా మౌనంగా ఉండండి. ఆ ఒక్క నిమిషం మీకు ప్రశాంతతను ఇస్తుంది.
- మనసులో 10 నుంచి 1 వరకు అంకెలు లెక్కపెట్టండి. ఒకటి వచ్చేసరికి మీ కోపం చల్లబడి, ఏది తప్పో, ఏది ఒప్పో ఆలోచించగలుగుతారు.
- కోపంగా ఉన్నప్పుడు ఒక గ్లాసు చల్లటి నీళ్లు నెమ్మదిగా తాగండి. అది మీ మెదడును చల్లబరిచి, చిరాకును తగ్గిస్తుంది.
- గట్టిగా లోపలికి గాలి పీల్చి, బెలూన్ ఊదినట్లుగా నెమ్మదిగా వదలండి. ఇలా ఐదుసార్లు చేస్తే మనసుకు హాయిగా అనిపిస్తుంది.

చూశారా కోపాన్ని తగ్గించుకోవడానికి ఎన్ని మార్గాలు ఉన్నాయో! ఇక మీదట ఎప్పుడు కోపం వచ్చినా ఏడవకుండా, అరవకుండా.. ఇలా మిమ్మల్ని మీరే కంట్రోల్ చేసుకోండి. ఇది పెద్దయ్యాక కూడా బోలెడు ఉపయోగపడుతుంది!

పాతదే.. కొత్తగా

మన దగ్గర ఉన్న ఓ పాత వైట్ టీషర్ట్‌ను కొత్త డిజైనర్ వేర్‌గా మార్చేద్దాం. ఇదొక ఈజీ అండ్ కలర్‌ఫుల్ యాక్టివిటీ. దీనికోసం పాత వైట్ కాటన్ టీ-షర్టు, ఫ్యాబ్రిక్ రంగులు, రబ్బరు బ్యాండ్లు, ప్లాస్టిక్ కవర్/గ్లౌజులు (చేతికి రంగులు అంటకుండా) కావాలి. ఇంట్లో ఉంటే అమ్మని అడిగి తీసుకోండి.

- ➤ టీ-షర్టును నీళ్లలో తడిపి, పిండేసి, మడతలు వచ్చేలా దగ్గరకు చేయండి.
- ➤ దానికి రబ్బరు బ్యాండ్లను ఒక పద్ధతి ప్రకారం పెట్టండి.
- ➤ ఇప్పుడు ఒక్కో గ్యాప్‌లో ఒక్కో కలర్ వేయండి. రెయిన్‌బో లా భలేగా కనిపిస్తుంది.
- ➤ దీన్ని ఒక రోజంతా ఎండలో వదిలేయాలి.
- ➤ ఆరిన తర్వాత రబ్బర్ బ్యాండ్లు తీస్తే.. మన కొత్త డిజైనర్ టీ షర్ట్ రెడీ



ఆ రహస్యాలు... ఏమిటీ!

చాయ్ చమక్కులు తెలియనిది ఎవరికి! వేడివేడి చుక్క నాలుకకు తగిలితేనే గానీ తెల్లారని టీ జీవులు మనలో ఎందరో... వహ్వా అన్నా... వారెవ్వా అన్నా టీ రుచి, నాణ్యత, ఫ్లేవర్ వివిధ అంశాలపై ఆధారపడి ఉంటాయి. వీటిని దక్షిణ కొరియాకు చెందిన మెటాబోలోమిక్స్ నిపుణులు యంగ్-షిక్ హాంగ్ బృందం కొన్ని పరిశోధనలు చేసి నిగ్గు తేల్చింది. అవేంటో తెలుసా?



ఇన్ని రంగులు రుచులు ఎందుకో తెలుసా..!

ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన పానీయం టీనే. ఒక్కో చోట ఒక్కో రుచి, నాణ్యత, ఫ్లేవర్, రంగుతో టీని తయారుచేయడం ఎలా సాధ్యం అనేది ఆసక్తికరం. ప్రపంచంలోని ప్రముఖ బ్రాండ్ల టీ పొడులు ఎక్కువగా 'కమీలియా సెనెన్సిస్' అనే ఒకే జాతి తేయాకు మొక్క నుంచి తయారవుతాయి. ఈ పొడులతో నలుపు, పసుపు, తెలుపు.. ఇలా పలు రంగుల్లో, ఫ్లేవర్లలో టీని తయారుచేయడానికి కొన్ని శాస్త్రీయ కారణాలున్నాయి.

- ప్రతి తేయాకు మొక్కలోని అణు స్వరూపం అది పెరిగే నేల, ఆకులను ఎండబెట్టే తీరు, వేడిచేసే విధానంపై ఆధారపడి ఉంటుంది. కమీలియా సెనెన్సిస్ ఆకుల్లో కూడా విభిన్న రకాల అణువులు ఉంటాయి. ఇవి పానీయం సువాసన, రుచి, స్వభావాన్ని నిర్ణయిస్తాయి.
- తేయాకు పంటను ఎడబెట్టడం, మొక్కల్ని నీడలో పెంచడం, కొత్త మొగ్గలు, పాత ఆకుల్ని కోయడం.. ఇలా వివిధ దశల్లో పంట నాణ్యతను, ప్రమాణాలను రైతులు పెంచుతారు. ప్రాసెసింగ్‌లో మరిన్ని పద్ధతుల్ని అవలంబిస్తారు. చుట్టడం, రుబ్బడం లేదా సూక్ష్మజీవులతో ఆకులను పులియబెట్టడం.. ద్వారా తేయాకు మరింత రుచికరంగా తయారయ్యేలా చేస్తారు.
- ఎండ, నీడ కూడా టీ రుచిని ప్రభావితం చేస్తాయి. ఉదాహరణకు, మాచా తేయాకును కోతకు ముందు వారాల తరబడి నీడలో ఉంచిన ఆకుల నుంచి ఉత్పత్తి చేస్తారు. దీనివల్ల చేదు కేటెచిన్‌ల స్థాయి తక్కువగా ఉండి, క్లోరోఫిల్, థియానైన్ ఎక్కువగా ఉంటాయి. థియానైన్, గ్లూటామిక్ ఆమ్లం టీ రుచిపై ప్రభావాన్ని చూపుతాయి.
- తేయాకును గ్రీన్ టీగా, ఘాటైన బ్లాక్ టీగా లేదా ఇతర రకాలుగా మార్చొచ్చు. టీ ఆకుల్ని ఎండబెట్టడం, లేదా వాడిపోయేలా చేయడం ఇందులో మొదటి దశ. ఈ ప్రక్రియలో క్లోరోఫిల్‌ను తగ్గించడం, కెఫీన్‌ను పెంచడం కీలకం. ఈ ప్రక్రియే సువాసనగల అణువుల ఉత్పత్తికి దారితీస్తుంది.
- తేయాకులోని అణువులు ఆక్సిజన్‌తో చర్య జరపకుండా ఆకుల్ని వేగంగా వేడి చేయడం ద్వారా గ్రీన్ టీని తయారుచేస్తారు. దీనికి విరుద్ధంగా.. ఆకులను చుట్టడం లేదా నలపడం ద్వారా బ్లాక్ టీ తయారవుతుంది.
- వాతావరణం నుంచి ప్రాసెసింగ్ దాకా వివిధ కారకాలు టీని ఎలా ప్రభావితం చేస్తాయో పూర్తిగా అర్థం చేసుకోవడానికి దక్షిణ కొరియా శాస్త్రవేత్తలు మెటాబోలోమిక్స్ వైపు దృష్టిసారించారు. ఆ రంగంలో నిపుణుడు యంగ్-షిక్ హాంగ్, అతని సహచరులు చైనా, జపాన్, దక్షిణ కొరియా నుంచి సేకరించిన 281 గ్రీన్ టీ నమూనాలలో మెటబొలైట్‌లను కొలిచారు. ప్రతి దేశం నుంచి వచ్చిన టీల ప్రొఫైల్‌లు భిన్నంగా ఉన్నాయని ఆ బృందం కనుగొంది.
- చైనీస్ టీ కంటే కొరియన్ టీలో కెఫీన్, చక్కెరలు ఎక్కువగా ఉన్నాయి. కొరియన్ నమూనాల్లో టీ రుచికి ముఖ్యమైన అమైనో ఆమ్లమైన థియానైన్ తక్కువగా ఉంది. తూర్పు హిమాలయాల్లో సముద్ర మట్టానికి 7,000 అడుగుల ఎత్తు వరకు పండించే సున్నితమైన డార్జిలింగ్ వంటి తేయాకుల్లో చేదు పెద్దగా లేకుండా పూల, పండ్ల సువాసనలు ఉంటాయి.
- టీలో చేదుగా ఉండే కాటెచిన్‌లు యాంటీ ఆక్సిడెంట్లు అని ఇప్పటికే తెలుసు. ఒత్తిడి, ఆందోళనను థియోనైన్ తగ్గిస్తుందని చెబుతారు. థియానైన్, కెఫీన్, కాటెచిన్ సమ్మేళనాలు మన ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి దోహదపడతాయని దక్షిణ కొరియాకు చెందిన మెటాబోలోమిక్స్ నిపుణుడు యంగ్-షిక్ హాంగ్ అంటున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం



సంద్రం లోతుల్లో 'గిన్నిస్' అందాలో..!

అండమాన్ నికోబార్ దీవులు ఆదివారం మరో గిన్నిస్ రికార్డును సాధించాయి. స్థానిక స్వరాజ్ ద్వీప్ తీరంలో నీటి అడుగున అత్యంత పొడవైన మానవ పిరమిడ్ నిర్మాణంతో ఇది సాధ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. లెఫ్టినెంట్ గవర్నర్ డి.కె.జోషితోపాటు మొత్తం 14 మంది ఇందులో పాల్గొని.. 3 నిమిషాలసేపు నీటిలో ఉండి 22.3 మీటర్ల ఎత్తుతో మానవ పిరమిడ్‌ను ప్రదర్శించారు. - శ్రీ విజయపురం

ఒళ్లంత.. తుళ్లింత!



సీలేరు కాంప్లెక్స్‌లోని ఐదు జలవిద్యుత్కేంద్రాలకు జోలాపుట్ జలాశయం నుంచి నీరు విడుదల చేస్తుంటారు. రెండు భారీ పైపుల నుంచి ఈ నీరు వేగంగా వస్తుంటే చూడటానికి పాల సముద్రం ఉప్పొంగుతున్నట్లు కనిపించింది. ఎల్ఎఫ్ నుంచి ఆర్ఎఫ్‌కు వెళ్లే వారిపై ఈ తుంపర్లు పడి వింత అనుభూతిని కలిగిస్తున్నాయి. - న్యూస్‌టుడే, ముంచంగిపుట్టు గ్రామీణం

ఉడతా ఉడతా ఊచ్ కరుస్తోందోచ్!



రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో ఉన్న మోహన్‌లాల్ సుఖాడియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాలలో ఓ ఉడుత గత నెలలో 18 మందికి పైగా విద్యార్థులు, సిబ్బందిపై దాడి చేసింది. ఆ ఉడుతను పట్టుకునేందుకు ప్రత్నిస్తున్నప్పటికీ అది తరచూ తప్పించుకోవడంతో కళాశాలలో భయాందోళనలు నెలకొన్నాయి. తరగతుల్లో, కళాశాల ఆవరణలో ఉడుత ఊహించని విధంగా దాడి చేస్తోందని పలువురు విద్యార్థులు తెలిపారు. తీవ్రమైన వేడి, ఆకలి, ఒత్తిడి జంతువుల ప్రవర్తనను మార్చగలవని పీపుల్ ఫర్ యానిమల్స్ అధ్యక్షుడు సత్యజిత్ రాయ్ వెల్లడించారు. - ఈటీవీ భారత్

మానవ సంబంధాలే విలువైనవి



మీ కుటుంబం, మీ స్నేహితులు, మీరు అభిమానించే వ్యక్తులతో మీరు గడిపే క్షణాలు, ఆ జ్ఞాపకాలు అమూల్యమైనవి. అటువంటి నిజమైన అనుబంధాలకే మీరు ప్రాధాన్యతనివ్వాలి తప్ప భౌతిక వస్తువులపై కాదు.
- నిక్ డి ఫాబియో, బుక్‌పబ్లిషర్

నాలుగింటిపై దృష్టి పెట్టండి

పిల్లల్లో టైప్-1 మధుమేహాన్ని గుర్తించండి: కేంద్రం



ఈనాడు, దిల్లీ: పిల్లల్లో టైప్-1 మధుమేహ లక్షణాలను త్వరగా గుర్తించేందుకు నాలుగు 'టీ'లపై దృష్టి సారించాలని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ సూచించింది. అందులో 1. టాయిలెట్ (తరచూ మూత్రానికి వెళ్లడం), 2. థర్స్టీ (అధిక దాహం), 3. టయర్డ్ (అలసిపోవడం), 4. థిన్నర్ (అకస్మాత్తుగా బరువు కోల్పోవడం) లక్షణాలను గమనిస్తూ ఉండాలని పేర్కొంది. తల్లిదండ్రులు, టీచర్లు పిల్లల్లో ఈ లక్షణాలను గమనిస్తే టైప్-1 మధుమేహాన్ని త్వరగా గుర్తించేందుకు అవకాశం ఉంటుందని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ తెలిపింది. దానికి వైద్యం అందించకుండా అలాగే వదిలేస్తే ప్రాణాంతక ముప్పు ఉంటుందని హెచ్చరించింది. కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా చిన్నారుల్లో మధుమేహ నిర్వహణ కోసం జాతీయ మార్గదర్శకాలను జారీ చేసింది. ఇందులో మధుమేహాన్ని గుర్తించడం, చికిత్స, దాని నియంత్రణకు సంబంధించి నిర్మాణాత్మక విధానాన్ని వెల్లడించింది. తొలిసారి బాల్య మధుమేహ సమస్యను జాతీయ వైద్య, ఆరోగ్య వ్యవస్థతో అనుసంధానం చేసింది. పిల్లల్లో ఇన్సులిన్ తయారీ నిలిచిపోయినప్పుడు టైప్-1 మధుమేహ సమస్య తలెత్తుతుంది. వారిలో మధుమేహాన్ని నియంత్రించకపోతే అది కిడ్నీ వైఫల్యం, చూపు కోల్పోవడం, హృదయ సంబంధ సమస్యలకు దారి తీస్తుంది.

పాఠశాల, ఆరోగ్య కేంద్రాల స్థాయిలో..: పుట్టిన బిడ్డ నుంచి 18 ఏళ్ల వరకు అన్ని వయసుల చిన్నారుల సార్వత్రిక స్క్రీనింగ్‌పై ఈ ఫ్రేమ్‌వర్క్ దృష్టి సారించనుంది. పాఠశాలలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో తొలుత చిన్నారుల్లో మధుమేహ సమస్యను గుర్తిస్తారు. అక్కడ ఎవరికైనా మధుమేహ లక్షణాలు కనిపిస్తే రక్త గ్లూకోజ్ పరీక్షలు నిర్వహిస్తారు. అందులో మధుమేహం ఉన్నట్లు తేలిన వారిని జిల్లా ఆసుపత్రులకు పంపి తదుపరి పరీక్షలు, వైద్యం అందిస్తారు. మధుమేహం ఉన్నట్లు గుర్తించిన చిన్నారులకు ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్సకు సంబంధించిన పూర్తి ప్యాకేజీని ఉచితంగా అందిస్తారు.

స.హ.చట్టం కింద జీతం వివరాలు కోరలేరు



దిల్లీ హైకోర్టు స్పష్టీకరణ

దిల్లీ: జీవిత భాగస్వామి జీతం వివరాలను సమాచార హక్కు చట్టం కింద కోరడం కుదరదని దిల్లీ హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రజా ప్రయోజనాలతో ముడిపడినదైతే తప్పిస్తే వ్యక్తిగత సమాచారానికి స.హ.చట్టంలోని 8(1)(జె) సెక్షన్ కింద మినహాయింపు ఉందని, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం.. వ్యక్తుల ఆదాయపు పన్ను రిటర్నుల వివరాలూ దానిలోకే వస్తాయని జస్టిస్ పురుషేంద్ర కుమార్ కౌరవ్ ధర్మాసనం తెలిపింది. విడిపోయిన భార్య 2007-08 ఆర్థిక సంవత్సరంలో తన సంపాదన తెలుసుకునేందుకు ఆదాయపు పన్నుశాఖకు దాఖలు చేసిన స.హ.చట్ట దరఖాస్తుపై కేంద్ర సమాచార కమిషనర్ (సీఐసీ) 2021లో ఇచ్చిన ఆదేశాలను భర్త హైకోర్టులో సవాలు చేశారు. ఈ ఆదేశాలు చట్ట ప్రకారం చెల్లవని ధర్మాసనం స్పష్టం చేసింది. మనోవర్తి కోసం భార్య కోరుతున్న వివరాలు కచ్చితంగా వ్యక్తిగతమైనవేనని అభిప్రాయపడింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత కోసం స.హ.చట్టాన్ని చేశారని, ప్రజా ప్రయోజనం లేని వ్యక్తిగత సమాచారాన్ని ఇచ్చేందుకు ఇది అనుమతించడం లేదని విశ్లేషించింది. భరణం కోసం ఇతర చట్టపరమైన మార్గాలను చూసుకోవాలని తెలిపింది. ఆదాయం, ఆస్తులు, అప్పులపై ఇరుపక్షాలూ ప్రమాణపత్రాలు దాఖలు చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

మూడంచెల ప్రణాళిక

- యుద్ధం ముగింపునకు 14 పాయింట్లతో అమెరికాకు సమర్పించిన ఇరాన్
- దిగ్బంధనం ఎత్తివేయడం, హర్మూజ్‌ను తెరవడం తొలి దశలోనే..
- తాను అంగీకరించలేనివి అడుగుతున్నారని ట్రంప్ వ్యాఖ్య

దుబాయ్: పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు దిశగా దౌత్య ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా అమెరికాకు పాకిస్థాన్‌ద్వారా ఇరాన్ ఓ నూతన ప్రణాళికను సమర్పించింది. ఇది సజావుగా అమలైతే 30 రోజుల్లో యుద్ధం ముగుస్తుంది. 14 పాయింట్ల ఈ ప్రణాళికలో మొత్తం మూడంచెలు ఉంటాయి. తొలి అంచెలో- హర్మూజ్ జలసంధిని క్రమంగా తెరుస్తారు. ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని అమెరికా ఎత్తివేస్తుంది. అదే సమయంలో సముద్రంలో మందుపాతరల తొలగింపు ప్రక్రియ టెహ్రాన్ నేతృత్వంలో జరుగుతుంది. రెండో అంచెలో- నిర్దిష్ట కాల పరిమితి తర్వాత యురేనియం శుద్ధిని (3.6% వరకే) ఇరాన్ తిరిగి ప్రారంభిస్తుంది. అది తమ గడ్డపై అణు మౌలిక వసతుల ధ్వంసానికి అంగీకరించదు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేయకూడదు. టెహ్రాన్ దాడులకు దిగకూడదు. జప్తు చేసిన టెహ్రాన్ ఆస్తులను విడుదల చేయాలి. చివరిదైన మూడో అంచెలో- పొరుగున ఉన్న అరబ్ దేశాలతో టెహ్రాన్ వ్యూహాత్మక చర్చలు జరుపుతుంది.



భారత్‌కు వస్తూ.. హర్మూజ్‌ను దాటిన ఎల్‌పీజీ ట్యాంకర్

భారత్‌కు 46,313 టన్నుల ద్రవీకృత పెట్రోలియం వాయువును (ఎల్‌పీజీ) మోసుకొస్తున్న ఓ ట్యాంకర్ శనివారం హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. మార్షల్ ఐలాండ్స్ పతాకంతో ఉన్న ఈ ట్యాంకర్ పేరు 'ఎంటీ సర్వ్ శక్తి'. ఇది ఈ నెల 13న విశాఖపట్నం తీరానికి చేరుకోనుంది.

పశ్చిమాసియా ప్రాంతీయ భద్రతకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడంపై దృష్టి పెడతారు. భవిష్యత్తులో మళ్లీ దాడులకు దిగబోమని ఇరాన్‌కు అమెరికా హామీ ఇవ్వడం వంటి అంశాలూ కొత్త ప్రణాళికలో ఉన్నాయి. వాషింగ్టన్ ప్రతిపాదించిన 9 పాయింట్ల ప్రణాళికకు ప్రతిగా టెహ్రాన్ దీన్ని రూపొందించింది.

భారీ ట్యాంకర్‌పై దాడి

హర్మూజ్ సమీపంలో ఓ భారీ ట్యాంకర్‌పై ఆదివారం చిన్న బోట్లు దాడి చేశాయని బ్రిటన్ సైన్యానికి చెందిన యునైటెడ్ కింగ్డమ్ మారిటైం ట్రేడ్ ఆపరేషన్స్ సెంటర్ తెలిపింది. సిరిక్ (ఇరాన్) తీరంలో ఈ ఘటన చోటుచేసుకుందని వెల్లడించింది. అయితే ట్యాంకర్‌లోని సిబ్బంది అంతా సురక్షితంగానే ఉన్నారని పేర్కొంది. దాడి ఎవరు చేశారనేది తెలియరాలేదు.

వేరే నౌకలు వెళ్లొచ్చు: ఇరాన్

హర్మూజ్‌పై తమ నియంత్రణ కొనసాగుతోందని ఇరాన్ అధికారులు పునరుద్ఘాటించారు. అమెరికా, ఇజ్రాయెల్‌లకు చెందినవి మినహా ఇతర దేశాల నౌకలు తమకు టోల్ చెల్లించి.. ఈ జలసంధిలో ప్రయాణించొచ్చని పేర్కొన్నారు.

- ■ హర్మూజ్‌లో టోల్ వసూళ్లతో ఇరాన్ ఇప్పటి వరకూ 13 లక్షల డాలర్ల కంటే తక్కువే సంపాదించిందని, చమురు ద్వారా దానికి వచ్చే రోజువారీ ఆదాయంతో పోలిస్తే అది చాలా తక్కువని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ ఎద్దేవా చేశారు.
- ■ ఇరాన్ కరెన్సీ విలువ మరింత పతనమైంది. మారకపు విలువ ఒక డాలరుకు 18.40 లక్షల రియాళ్లుగా ఆదివారం నమోదైంది.

ఇరాన్ ఇంకా మూల్యం చెల్లించుకోలేదు: ట్రంప్



ఇరాన్ తాజా ప్రణాళికపై ఇప్పటికీ తాను సంతృప్తిగా లేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. తాను అంగీకరించలేనివి ఆ దేశ నేతలు అడుగుతుండటమే అందుకు కారణమని చెప్పారు. '47 ఏళ్లుగా మానవాళికి, ప్రపంచానికి కలుగజేసిన నష్టానికి సరిపడా మూల్యాన్ని ఇంకా ఇరాన్ చెల్లించుకోలేదు' అని వ్యాఖ్యానించారు. అయితే ఇరాన్‌పై భారీస్థాయి దాడులు చేపట్టకుండా ఉండేందుకే తాను మొగ్గుచూపుతానని విలేకర్లతో మాట్లాడుతూ తెలిపారు.

దిల్లీలో అగ్ని ప్రమాదం.. 9 మంది మృతి

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం తెల్లవారుజామున వివేక్ విహార్ ప్రాంతంలో ఉన్న నాలుగంతస్తుల భవనంలో మంటలు వ్యాపించడంతో ఓ చిన్నారి సహా రెండు కుటుంబాలకు చెందిన 9 మంది మరణించారు. గాయాలపాలైన ఇద్దరిని సమీప ఆసుపత్రికి తరలించారు. 15 మందిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. భవనంలో అత్యవసర ద్వారం లేకపోవడం, టెర్రస్‌పైకి వెళ్లే మార్గం మూసివేసి ఉండటంతో తప్పించుకునే దారి లేక మృతుల సంఖ్య పెరిగినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.



అగ్నికీలలు ఎగసిపడటంతో భవనం వెలుపల కాలిపోయిన ఏసీ

ఆధార్ కార్డు మార్పులపై వార్తలు నిరాధారం

ఈనాడు, దిల్లీ: ఆధార్ కార్డులో ఇకపై పేర్లు, చిరునామా లేకుండా కేవలం ఫొటో, క్యూఆర్ కోడ్ మాత్రమే ఉంటాయంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీశాఖ ఖండించింది. ఈ వార్తలు నిరాధారమని, ప్రజలు నమ్మొద్దని సూచించింది. అలాంటి కార్డు తీసుకొచ్చే ప్రతిపాదనేదీ లేదని ఆదివారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది.

మహిళకు చేసిన శస్త్ర చికిత్సను

వీడియో తీయడంపై ఎన్‌సీడబ్ల్యూ ఆగ్రహం

కఠిన చర్యలకు ఆదేశం

దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశాంబీలో ఒక మహిళా రోగి ప్రైవేటు భాగానికి శస్త్ర చికిత్స చేసినప్పుడు దాన్ని అనధికారికంగా వీడియో తీసి వ్యాప్తి చేయడాన్ని జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) తీవ్రంగా పరిగణించింది. దీనికి సంబంధించిన వార్తల్ని తనంతతానుగా పరిగణనలో తీసుకుంది. ప్రభుత్వ అధీనంలోని వైద్య కళాశాలలో జరిగిన ఘటనకు కారకులను గుర్తించి వెంటనే కేసు నమోదు చేయాలని డీజీపీని ఎన్‌సీడబ్ల్యూ ఛైర్‌పర్సన్ విజయా రహాట్కర్ ఆదేశించారు. మహిళ ముఖం వీడియోలో కనిపించిందని, దానిని సామాజిక మాధ్యమాల నుంచి తొలగింపజేసి, ఆసుపత్రి వైఫల్యంపై సమగ్ర విచారణ జరిగేలా చూడాలని సూచించారు. వారంలోగా తమకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వైద్యపరమైన నైతిక విలువల్ని, గౌరవాన్ని, గోప్యతకున్న ప్రాథమిక హక్కును ఉల్లంఘించడం తీవ్రంగా కలచివేసిందని రహాట్కర్ వ్యాఖ్యానించారు. వైద్య వ్యవస్థలపై ప్రజా విశ్వాసాన్ని సడలింపజేసి, బాధితురాలికి తీవ్ర మనోవేదన కలిగించే ఇలాంటి పరిణామాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. జాతీయ వైద్య కమిషన్ దీనిపై తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.

రీల్స్ కోసం వాటర్ ట్యాంకుపైకి మైనర్లు

హెలికాప్టర్‌తో వచ్చి రక్షించిన వాయుసేన



సిద్ధార్థ్ నగర్(యూపీ): రీల్స్ మోజులో పాత నీళ్ల ట్యాంకుపైకి ఎక్కి ఓ మైనర్ బాలుడు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు ప్రాణాల మీదకు తెచ్చుకున్నారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని సిద్ధార్థ్ నగర్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. శనివారం మధ్యాహ్నం ఐదుగురు మైనర్ బాలురు రీల్స్ చేసేందుకు పాత వాటర్ ట్యాంకుపైకి ఎక్కారు. ఈ క్రమంలో ట్యాంకు నిచ్చెన విరిగిపోవడంతో.. ముగ్గురు కిందపడిపోయారు. వారిలో ఒకరు ప్రాణాలు కోల్పోగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. మిగిలిన ఇద్దరు ట్యాంకుపైనే చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు జిల్లా యంత్రాంగం ప్రయత్నించింది. వర్షం, రాత్రి వేళ కావడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. దీంతో బాధితులు 16 గంటలపాటు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో రాష్ట్ర అధికారుల అభ్యర్థన మేరకు ఆదివారం తెల్లవారుజామున సెంట్రల్ ఎయిర్ కమాండ్‌కు చెందిన ఐఏఎఫ్ హెలికాప్టర్ రంగంలోకి దిగింది. దాదాపు 15 నిమిషాలు కష్టపడి ట్యాంకుపై చిక్కుకుపోయిన వారిని కిందకు దించింది.

ద్వారక వద్ద సముద్రం అడుగున ప్రాచీన 'కోట'.. రోమన్ నాణేలు!



ఈటీవీ భారత్: గుజరాత్‌లోని దేవభూమి ద్వారకవద్ద భారత పురావస్తుశాఖకు (ఏఎస్ఐ) చెందిన 'అండర్ వాటర్ ఆర్కియాలజీ వింగ్' చేపట్టిన సముద్ర తవ్వకాల్లో ప్రాచీన నాగరికత అవశేషాలు బయటపడ్డాయి. ద్వారక పౌరాణిక వైభవాన్ని, ప్రపంచస్థాయి ప్రాముఖ్యతను ఈ పరిశోధన ఫలితాలు మరోసారి ధ్రువీకరిస్తున్నాయి. ఏఎస్ఐ డైరెక్టర్ జనరల్ ఆలోక్ త్రిపాఠి ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. అరేబియా సముద్రంతోపాటు బెట్ ద్వారక దీవి ప్రాంతాల్లో ఏఎస్ఐ బృందాలు విస్తృత పరిశోధనలు నిర్వహించాయి. తీరం వెంబడి ప్రాచీన అవశేషాలు లభించిన ప్రదేశాల్లో 20 కందకాలు తవ్వారు. దీంతో ఓ పెద్ద నిర్మాణ సముదాయం బయటపడింది. ఇది పురాతన కోట లేదా వాణిజ్య సముదాయాన్ని పోలి ఉంది. ఆ రోజుల్లో ద్వారకకు ఉన్న అంతర్జాతీయ వాణిజ్య ఆనవాళ్లు బయటపడటం ఈ తవ్వకాలకు సంబంధించిన మరో విశేషం. రోమన్ నాణేలు, పాత్రలు, రోమన్ భాషలో చెక్కిన రాళ్లు ఈ తవ్వకాల్లో వెలుపడ్డాయి. రోమన్ వంటి సుదూర సామ్రాజ్యంతో ద్వారకకు నేరుగా వాణిజ్య సంబంధాలు ఉండేవన్న విషయాన్ని ఇవి చాటుతున్నాయి. తవ్వకాలు ఇంకా కొనసాగుతున్నాయని, తమ ఆవిష్కరణలు ఈ ప్రాంత చరిత్రకు మరో కొత్త అధ్యాయాన్ని జోడిస్తాయని ఆలోక్ త్రిపాఠి తెలిపారు.

కైలాశ్ మానసరోవర్ యాత్ర మార్గంపై నేపాల్ అభ్యంతరం

కాఠ్‌మాండూ: లిపులేఖ్ పాస్ ద్వారా కైలాశ్ మానసరోవర్ యాత్రను నిర్వహించాలన్న భారత ప్రణాళికలపై నేపాల్ అభ్యంతరం వ్యక్తం చేసింది. లిపులేఖ్ తమ భూభాగమని పేర్కొంది. తమను సంప్రదించకుండా ఆ మార్గంలో యాత్రకు ప్రణాళికలు రూపొందించడమేంటని ప్రశ్నించింది. నేపాల్ విదేశాంగ శాఖ ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపానీ తమ భూభాగాలేనని అందులో పేర్కొంది. లిపులేఖ్ ద్వారా యాత్ర ప్రణాళికలను రూపొందించినందుకు చైనాకూ తమ అభ్యంతరం తెలియజేశామంది. మరోవైపు- నేపాల్ అభ్యంతరాన్ని భారత్ తిరస్కరించింది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ గుండా కైలాశ్ మానసరోవర్ యాత్ర దశాబ్దాలుగా సాగుతోందని గుర్తుచేసింది. భూభాగాల విషయంలో ఏకపక్షంగా ప్రకటనలు చేయడం ఎంతమాత్రమూ అంగీకార యోగ్యం కాదంటూ హితవు పలికింది.

తడోబా అభయారణ్యంలో 42 పులులు, 13 చిరుతలు

బల్లార్ష, న్యూస్‌టుడే: మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలోని తడోబా అభయారణ్యంలో 5,765 వన్యప్రాణులు ఉన్నట్లు అభయారణ్యం ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభునాథ్ శుక్లా ఆదివారం వెల్లడించారు. ఈ అభయారణ్యంలో ఏటా బుద్ధపౌర్ణమికి వన్యప్రాణుల గణన చేపడుతుంటారు. ఇందులో భాగంగా ఈ నెల 1న రాత్రి తడోబాలోని కోర్, బఫర్ జోన్‌లలో 168 మంచెలు ఏర్పాటు చేసి లెక్కించారు. ఇందులో 42 పెద్దపులులు, 13 చిరుతలు, 1745 జింకలతో పాటు ఇతర జంతువులు ఉన్నట్లు తేలింది.

ప్రభుత్వ బడి.. సరికొత్త ఒరవడి

- పదో తరగతిలో సాధించిన అద్భుత ఫలితాలతో ప్రజల్లోకి
- కార్పొరేట్‌కు దీటుగా ప్రచారం
- మొదటిసారి ప్రకటనలు
- ప్లకార్డులపై మార్కులు రాసి.. విద్యార్థులతో ర్యాలీలు
- తల్లిదండ్రులు, టీచర్ల వాట్సప్ గ్రూపుల్లో వీడియోలు



విశాఖలో పదో తరగతి విద్యార్థుల విజయోత్సవ ర్యాలీ

ఈనాడు, అమరావతి: 'పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రభంజనం. ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. 595కు పైగా మార్కులు సాధించిన వారు 13 మంది! 590కి పైగా మార్కులు సాధించినవారు 200 మంది. ప్రతిభావంతులైన టీచర్లతో.. అత్యాధునిక సౌకర్యాలతో.. అత్యుత్తమ ప్రమాణాలతో మన ప్రభుత్వ పాఠశాలలున్నాయి. మీ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించండి.. వారి భవిష్యత్తుకు బంగారుబాట వేయండి' క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు చేస్తున్న ప్రచారం ఇది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఈసారి ప్రచారం చేపట్టారు. ఇప్పటిదాకా సదుపాయాలు, సౌకర్యాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేసిన ఉపాధ్యాయులు.. ఇప్పుడు పదోతరగతిలో వచ్చిన మార్కులను సగర్వంగా చెబుతూ పిల్లల్ని చేర్పించాలని అభ్యర్థిస్తున్నారు. మార్కుల ప్రచారంతో పాటు మాక్ అసెంబ్లీ, పీటీఎంలు, విద్యార్థి సమగ్రాభివృద్ధిని సూచించే ప్రోగ్రెస్ కార్డుల్లాంటి ప్రత్యేకతలు ఇప్పుడు ఆకర్షణగా నిలుస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత పెరిగింది.

ప్లకార్డులతో ప్రదర్శనలు...

పదోతరగతి పరీక్షల్లో సాధించిన మార్కులను ప్లకార్డులపై రాసి, వాటిని విద్యార్థులకు ఇచ్చి... ర్యాలీలుగా సాగుతూ ప్రభుత్వ బడుల గొప్పతనాన్ని అందరికీ చాటిచెబుతున్నారు. విశాఖపట్నంలోని నడుపూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదివినవారిలో 65 మంది 500కు పైగా మార్కులు తెచ్చుకున్నారు. ఇక్కడ మార్కుల ప్లకార్డులతో ఆరు వాహనాల్లో ర్యాలీ నిర్వహించారు. రాయలసీమలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు.. విద్యార్థుల మార్కులతో వీడియోలు రూపొందించి ప్రచారం చేస్తున్నారు. పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించినవారి చిత్రాలు, వివరాలతో ప్రభుత్వం పత్రికల్లో ప్రకటనలు ఇచ్చింది.

విదేశాలకు ఉపాధ్యాయులు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించినవారిని విద్యపై అధ్యయనానికి ప్రభుత్వం విదేశాలకు పంపిస్తోంది. ఇప్పటికే 37 మందిని సింగపూర్ పంపించింది. సెకండరీ విద్యలో సింగపూర్ ముందంజలో ఉండటంతో ఉపాధ్యాయులు అధ్యయనం చేసి, రాష్ట్రానికి వచ్చాక ఆ అనుభవాలను సహచరులకు వివరిస్తారు. ఆ విశేషాలను వీడియోలుగా రూపొందించి, గ్రూపుల్లో షేర్ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. రాష్ట్రస్థాయి అవార్డులు సాధించినవారిలో ఈ 37 మంది మినహా మిగతావారిని జూన్, జులై నెలల్లో ఫిన్లాండ్‌కు పంపించనున్నారు. అక్కడ ప్రాథమిక విద్యలో సంస్కరణలను ఉపాధ్యాయులు తెలుసుకుంటారు. ఆ విధానాలను మన దగ్గర అమలుచేసేందుకు చర్యలు తీసుకుంటారు. ఈ పర్యటనల గురించీ.. ప్రవేశాల సమయంలో ఉపాధ్యాయులు ప్రచారం చేస్తున్నారు.

ఖలిస్థానీ తీవ్రవాదులతో జాతీయ భద్రతకు ముప్పు: కెనడా

ఒట్టావా: ఖలిస్థానీ తీవ్రవాదులను జాతీయ భద్రతా ముప్పుగా కెనడా నిఘా సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ బృందం దేశంలో తన హింసాత్మక తీవ్రవాద భావజాలాన్ని ప్రచారం చేసేందుకు వివిధ సంస్థలను వాడుకుంటోందని 2025 పబ్లిక్ నివేదికలో కెనడియన్ సెక్యూరిటీ ఇంటలిజెన్స్ సర్వీస్ పేర్కొంది. దీని ప్రకారం.. కెనడా కేంద్రంగా పని చేస్తున్న ఖలిస్థానీ తీవ్రవాద సంస్థ (సీబీకేఈ) హింసాత్మక కార్యకలాపాలు జాతీయ భద్రతా ముప్పును కలిగిస్తున్నాయి. కొన్ని సీబీకేఈలు కెనడా ప్రజల నుంచి నిధులు సేకరించి వాటిని హింసాత్మక కార్యకలాపాలవైపు మళ్లిస్తున్నాయి. అయితే ఖలిస్థానీ రాష్ట్ర ఏర్పాటు కోసం అహింసాత్మకంగా పోరాడటాన్ని తీవ్రవాదంగా పరిగణించరని, కొంతమంది కెనడియన్లు దీనికి మద్దతుగా చట్టబద్ధమైన, శాంతియుత ప్రచారంలో పాల్గొంటారని నివేదికలో తెలిపింది. ముఖ్యంగా భారత్‌లో హింసను ప్రోత్సహించేందుకు నిధులు సేకరించడానికి లేదా ప్రణాళికను రచించడానికి కెనడాను స్థావరంగా వినియోగించుకునే వారినే తీవ్రవాదులుగా గుర్తిస్తామని పేర్కొంది. కొన్ని ఖలిస్థానీ గ్రూపులు భారత్‌లో ఓ సార్వభౌమ రాజ్యాన్ని ఏర్పాటు చేయాలని డిమాండు చేయడంతోపాటు కొన్ని వేర్పాటువాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నందున దిల్లీ ఇదివరకే వాటిని ఉగ్రవాద సంస్థలుగా ప్రకటించింది.

వార్తా సంస్థలను ప్రభుత్వం భయపెడుతోంది: ఖర్గే

దిల్లీ: స్వతంత్రంగా పని చేసే జర్నలిస్టులను ప్రభుత్వం శిక్షిస్తోందని, ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే వారిని బహుమతులతో ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మీడియాలో ఒక విభాగం కేవలం ప్రభుత్వ గొంతును వినిపించే సాధనంగా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుంచి వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్‌లో భారత్ స్థానం నిరంతరం పడిపోతూ వస్తోందని, ప్రస్తుతం మన దేశం 157వ స్థానానికి చేరుకుందని ఆయన గుర్తు చేశారు. వార్తా సంస్థలను భయపెట్టడానికి ప్రభుత్వం పరువు నష్టం దావాలు, జాతీయ భద్రతా చట్టాలు, ఇతర కఠినమైన క్రిమినల్ చట్టాలను ఆయుధాలుగా వాడుకుంటోందని ఖర్గే ఆరోపించారు. ఇప్పటికే ప్రధాన మీడియాను తన అదుపులో ఉంచుకున్న ప్రభుత్వం, ఇప్పుడు సామాజిక మాధ్యమాలను కూడా తన గుప్పిట్లోకి తీసుకోవడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. పత్రికా స్వేచ్ఛ అనేది ప్రజాస్వామ్యానికి చాలా ముఖ్యమని, ప్రశ్నించే గొంతులను నొక్కేయడం వల్ల ప్రజాస్వామ్య విలువలకే ముప్పు వాటిల్లుతుందని ఖర్గే హెచ్చరించారు.

బుజ్జాయిలూ... ఇది మంచి.. అది చెడు!

- చిట్టి బుర్రల్లో గట్టి వికాసం
- సామాజిక అంశాలపై.. కిశోర బాలబాలికలకు అవగాహన
- వేసవి సెలవుల్లో ప్రత్యేక తరగతులు

ఒంగోలు గ్రామీణ మండలానికి చెందిన ఓ బాలిక తొమ్మిదో తరగతి పూర్తిచేసింది. తల్లిదండ్రులు పెళ్లి తలపెట్టారు. బాలిక వెంటనే ఈ విషయాన్ని అధికారులకు ఫోన్ చేసి చెప్పింది. వారు వచ్చి పెద్దలకు నచ్చజెప్పి పెళ్లిని ఆపారు. ఇప్పుడా బాలిక చక్కగా చదువుకుంటోంది. సమస్యలు ఎదురైతే ఎలా ఎదుర్కోవాలనే విషయమై గత ఏడాది నిర్వహించిన కిశోర వికాసం తరగతులకు ఆ బాలిక హాజరైంది. అక్కడ చెప్పిన అంశాలతో సమాజంపై అవగాహన పెంచుకుని... తనకు ఎదురైన ముప్పు నుంచి తప్పించుకుంది.



ఈనాడు, ఒంగోలు: సాధారణంగా 11-18 ఏళ్ల మధ్య యువ కిశోరాలకు లోకం పోకడ గురించి పూర్తిగా తెలియదు. ఏది మంచో.. ఏది చెడో.. చెప్పేవారు లేక కొంత మంది కష్టాల్లో కూరుకుపోతున్నారు. మత్తు పదార్థాలు, ఆన్‌లైన్ జూదాలకు అలవాటు పడి, వ్యామోహాలకు లోనై జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. పిల్లలను వేసవిసెలవుల్లో ఒకచోటకు చేర్చి... వారు సామాజికంగా ఎదిగేందుకు అవసరమైన వికాసాన్ని అందించే ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం అంగన్‌వాడీ కేంద్రాల పరిధుల వారీగా బాలబాలికలను గుర్తించారు. వారికి కొన్నిచోట్ల మే 2 నుంచి తరగతులు మొదలయ్యాయి. ఇవి జూన్ 11 వరకు ఉంటాయి. ఈ శిబిరాల్లో కిశోర బాలబాలికలకు రోజూ ఉదయం 2 గంటల పాటు తరగతులు నిర్వహిస్తారు. ఏడు అంశాలపై ఈ తరగతులు ఉంటాయి.

- బృంద చర్చలు, ఆటపాటలు, నలుగురిలో మాట్లాడటం.. వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. భావోద్వేగాలను అర్థం చేసుకోవడం, కోపాన్ని నియంత్రించుకోవడం.. తదితరాలు తరగతుల్లో భాగంగా ఉంటాయి. శారీరక ఎదుగుదలకు ఆటలు, యోగా, వ్యాయామం ఎంత అవసరమో వివరిస్తారు. బ్యాంకు ఖాతాలు, పొదుపు, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ చాటింగ్‌లో వ్యక్తిగత గోప్యతల గురించి చెబుతారు. బాలబాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారు. ఇష్టంలేని అంశాలను ఎలా తెలియజెప్పాలి.. వేధింపులు ఎదురైతే ఎలా ప్రతిస్పందించాలి. వంటివి నేర్పుతారు. తల్లిదండ్రులను, పంచాయతీ సిబ్బందిని చివరిరోజు సమావేశంలో భాగస్వాములను చేస్తున్నారు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయిస్తున్నారు.

ఇవీ ఏడు థీమ్‌లు...

- కౌమార దశ: ఎదిగే క్రమంలో వచ్చే మార్పులు, సమస్యలు.
- ఆరోగ్యం: యవ్వన దశలో ప్రవేశించడం, రుతుస్రావం, హెచ్ఐవీ వంటి వ్యాధుల సంక్రమణ, చిన్న వయసులో గర్భధారణతో సమస్యలు.
- పోషణ: పోషకాహారం, రక్తహీనత, పిల్లల్లో ఊబకాయం.
- రక్షణ: వేధింపులు, మత్తు పదార్థాల వినియోగం, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాలు.. అనర్థాలపై అవగాహన.
- విద్య, సాధికారత: విద్య ఆవశ్యకత, జీవితంలో ఉన్నత స్థితికి ఎదిగేందుకు ఉన్న అవకాశాల వివరణ.
- లింగ సమానత్వం: అమ్మాయిలకన్నా అబ్బాయిలే మిన్న.. వంటి అపోహల తొలగింపు.
- శుభ్రత: చేతుల శుభ్రతతో పాటు.. మరుగుదొడ్లను మెరుగ్గా ఎలా వినియోగించాలనే దానిపై జాగ్రత్తలు చెబుతారు.

పేలిన బ్యాటరీ బొమ్మ.. తెగిన బాలుడి వేళ్లు


చికిత్స పొందుతున్న శివతేజ

నర్సాపూర్, శివ్వంపేట, న్యూస్‌టుడే: బాలుడు బొమ్మతో ఆడుకుంటుండగా అందులోని బ్యాటరీ పేలడంతో వేళ్లు తెగిపడిన ఘటన తెలంగాణలో మెదక్ జిల్లా శివ్వంపేటలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేటకు చెందిన మమత, సత్తయ్య దంపతుల కుమారుడు శివతేజ నాలుగో తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న ఓ కిరాణా దుకాణంలో రూ.25కు 9వోల్టుల బ్యాటరీ కొనుగోలు చేసి, తన వద్ద ఉన్న ఓ బొమ్మలో వేసి ఆడుకుంటూ ఉన్నాడు. అది అకస్మాత్తుగా పేలి.. అతడి ఎడమ చేతి మూడు వేళ్లు తెగిపోయాయి. కుటుంబీకులు బాలుడిని శివ్వంపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కొంపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

పెంచిన హజ్ విమాన ప్రయాణ ఛార్జీలను వెనక్కి తీసుకోవాలి: కాంగ్రెస్

దిల్లీ: హజ్ యాత్ర విమాన ప్రయాణ ఛార్జీలను ఒక్కో యాత్రికుడికి రూ.10,000 పెంచుతూ హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీ చేసిన ఉత్తర్వును ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ డిమాండు చేసింది. మోదీ హయాంలో హజ్ యాత్ర ఖర్చులు సామాన్య కుటుంబాలకు అందనంత స్థాయికి పెరిగిపోయాయని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిపై కేంద్రం వివరణ ఇచ్చింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా విమాన ఇంధన ధరలు పెరగడంతో విమానయాన సంస్థలు ఒక్కో ప్రయాణికుడిపై సుమారు 400 డాలర్ల (దాదాపు రూ.38,000) అదనపు భారాన్ని భరించాలని కోరాయని. . కానీ తాము చర్చలు జరిపి, ఆ భారాన్ని కేవలం 100 డాలర్లకు (సుమారు రూ.10,000) పరిమితం చేశామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వివరించారు. వాస్తవాలను అర్థం చేసుకోకుండా మంత్రిత్వశాఖను నిందించవద్దని ఆయన తెలిపారు.

గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుపై పార్లమెంటరీ ఫోరంలో చర్చించాలి

గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుతో పర్యావరణానికి, గిరిజనుల హక్కులకు ప్రమాదం ఉందని, దీనిపై పార్లమెంటరీ ఫోరమ్‌లో చర్చించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ గత వారం చేసిన గ్రేట్ నికోబార్ ద్వీప పర్యటనతో మోదీ ప్రభుత్వం ఉలిక్కిపడిందని, నష్ట నివారణ చర్యలు చేపట్టే పనిలో ఉందని పేర్కొంది. 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు ద్వీపంలోని 1.82% భూమిని మాత్రమే వినియోగిస్తున్నామని ప్రభుత్వం చెప్పడం తప్పుదోవ పట్టించడమే. గ్రేట్ నికోబార్ పర్యావరణ వ్యవస్థను, జీవ వైవిధ్యాన్ని ఈ లెక్కలు విస్మరిస్తున్నాయి' అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు.

నిశ్చితార్థంతోనే.. ప్రేమజంట నిశ్శబ్దాంతం

- గల్ఫ్‌లో ప్రియుడు.. ఊర్లో ప్రియురాలు ఆత్మహత్య


సాయికుమార్ శ్రుతి

మల్లాపూర్, న్యూస్‌టుడే: వారి ప్రేమను అంగీకరించిన పెద్దలు నిశ్చితార్థం చేశారు. అయితే తనకు ఇల్లు లేదని, బాగా సంపాదించిన తర్వాత పెళ్లి చేసుకుందామని చెప్పిన ప్రియుడు గల్ఫ్ వెళ్లాడు. అక్కడ ఆర్థిక ఇబ్బందులతో వెళ్లిన ఆరు నెలలకే ఆత్మహత్య చేసుకోగా.. ఈ విషయం తెలిసి ప్రియురాలూ బలవన్మరణానికి పాల్పడడంతో తెలంగాణలోని జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని రెండు గ్రామాల్లో విషాదం నెలకొంది. బాధిత కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం.. పాతదాంరాజుపల్లికి చెందిన మక్కల సాయికుమార్(22), సిరిపూర్ గ్రామానికి చెందిన ఒల్లె శ్రుతి(20) ప్రేమించుకున్నారు. పెద్దలు కూడా వారి వివాహానికి అంగీకరించి ఏడు నెలల కిందట నిశ్చితార్థం చేశారు. సాయికుమార్ తన కుటుంబానికి రేకులషెడ్డు మాత్రమే ఉందని, ఇల్లు కట్టుకున్నాకే పెళ్లి చేసుకుంటానని చెప్పి బహ్రెయిన్ వెళ్లాడు. అక్కడ కూలి పనులు చేసుకుంటున్న క్రమంలో ఆర్థిక ఇబ్బందులు, పని ఒత్తిడి కారణంగా ఈ నెల 1న ఆత్మహత్యకు పాల్పడినట్లు శనివారం రాత్రి కుటుంబసభ్యులకు సమాచారం అందింది. విషయం తెలిసిన శ్రుతి తీవ్ర మనస్తాపానికి గురైంది. అదే రోజు అందరూ నిద్రించిన తర్వాత ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని తానూ బలవన్మరణానికి పాల్పడింది.

ఆడేద్దాం ఆట.. అవకాశాలకి ఆదరువుగా!

- యువత కోసం తెలంగాణ ప్రభుత్వం 'యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్'
- మే 18–23 వరకు మండల, జిల్లాస్థాయి కార్యక్రమాలు

ఈనాడు, హైదరాబాద్: కుర్రకారులో క్రీడలపై ఆసక్తి, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక బాధ్యత, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ నెల 18 నుంచి 23 వరకు 'యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్' కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టనుంది. జిల్లా యువజన, క్రీడల శాఖ (డీవైఎస్‌వో) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మండల, జిల్లా స్థాయిలో నిర్వహించే ఆరు రోజుల ప్రణాళికపై సర్కారు అన్ని జిల్లాల కలెక్టర్లకు సమాచారం అందించింది. ఇందులో యువతను అత్యధికంగా భాగస్వాములను చేయాలని సంకల్పించింది.

✦ మొదటి రోజు (18న) జిల్లా, మండల స్థాయుల్లో "ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ" పేరుతో మారథాన్, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలుంటాయి. వ్యాయామాన్ని యువత జీవనశైలిలో భాగం చేసేలా చైతన్యం తీసుకురావడం దీని ఉద్దేశం. 5కే, 10కే రన్ చేపట్టనున్నారు.

✦ రెండో రోజు (19న) నియోజకవర్గాలవారీగా కెరీర్, నైపుణ్యాభివృద్ధిపై కార్యక్రమాలు ఉంటాయి. వివిధ రకాల నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో కెరీర్‌ను ఏవిధంగా ఉన్నతంగా మలచుకోవచ్చో అవగాహన కల్పిస్తారు.

✦ మూడో రోజు (20న) జిల్లాస్థాయిలో యువతకు నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పిస్తారు. భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాలను (విజన్)ను ఏర్పాటు చేసుకోవడం, ఇతరులను లక్ష్యం వైపు నడిపించడంలో యువత పాత్రపై వేదికలను ఏర్పాటు చేస్తారు.

✦ నాలుగో రోజు (21న) జిల్లా స్థాయిలో 'స్పోర్ట్స్ డే' ఉంటుంది. యువత క్రీడా మైదానాల వైపు మళ్లేవిధంగా భాగస్వాములను చేస్తారు.

✦ ఐదో రోజు (22న) మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో స్వచ్ఛ తెలంగాణ కోసం యువతను సంసిద్ధం చేస్తారు. శ్రమదానం ద్వారా స్వచ్ఛ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

✦ ఆరో రోజు (23న) జిల్లాస్థాయిలో ఉద్యోగ సాధన కార్యక్రమాలు చేపడతారు. అర్హులైన యువతకు మార్గదర్శనం చేస్తారు. అవసరమైతే కార్పొరేట్ పరిశ్రమలతో అనుసంధానం చేసి, ఉపాధి లభించే విధంగా చర్యలు చేపడతారు.

కృత్రిమ అవయవాల దానం మానవతకు ప్రతీక

తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా


కృత్రిమ అవయవం అమర్చిన అనంతరం దివ్యాంగుడితో మాట్లాడుతున్న గవర్నర్

హైదరాబాద్, న్యూస్‌టుడే: సంవత్సరాలుగా ఆగిపోయిన అడుగులు మళ్లీ ముందుకు పడటానికి, చేతులు కోల్పోయినవారు సొంతంగా తమ పనులు చేసుకోవడానికి కృత్రిమ అవయవాలు అందించిన శిబిరం మానవతకు ప్రతీక అని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కృత్రిమ అవయవాల అమరిక శిబిరాన్ని గవర్నర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరుణ, సామూహిక కృషి కలిసి అద్భుత ఫలితాలు సాధిస్తాయని ఈ శిబిరం నిరూపిస్తోందని అన్నారు. నారాయణ సేవా సంస్థాన్ చేస్తున్న సేవలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు ప్రశాంత్ అగర్వాల్ నాయకత్వాన్ని ప్రశంసించారు. అనంతరం ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. ఇది సేవ మాత్రమే కాదని, జీవితాలను మార్చే ఉద్యమమని పేర్కొన్నారు. సంస్థ ట్రస్టీ, డైరెక్టర్ దేవేంద్ర చౌబిసా మాట్లాడుతూ.. ఫిబ్రవరి 1న నిర్వహించిన ఎంపిక శిబిరంలో వెయ్యి మందికి పైగా దివ్యాంగులు పేర్లు నమోదు చేసుకున్నారని, అందులో 745 మందికి శిబిరంలో కృత్రిమ అవయవాలను ఉచితంగా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణలో వడదెబ్బతో ఒకరి మృతి

భీంపూర్, న్యూస్‌టుడే: తెలంగాణలో ఎండల తీవ్రత కారణంగా వడదెబ్బతో ఆదివారం ఒకరు మృతిచెందారు. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలంలోని వడ్‌గాం పంచాయతీ కార్మికుడు సలాం మాణిక్‌రావు (55) రెండు రోజులుగా ఎండ ప్రభావంతో అస్వస్థతకు గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శనివారం ఉపాధి కూలీలకు తాగు నీటిని తీసుకెళ్లి పంచాయతీకి చేరుకున్న అతడు స్పృహతప్పి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు.

వర్షాలతో ఉత్తరాదిలో తగ్గిన ఉష్ణోగ్రతలు

దిల్లీ: పలు ఉత్తరాది రాష్ట్రాల్లో ఆదివారం కురిసిన వర్షాల కారణంగా ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గి మండుటెండల నుంచి ప్రజలకు ఉపశమనం లభించింది. దేశ రాజధాని దిల్లీలో కనిష్ఠ ఉష్ణోగ్రత 24.6 డిగ్రీలుగా నమోదైందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. ఉత్తరాఖండ్‌లోని పలు జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన కురిసింది. హిమాచల్‌ప్రదేశ్‌లోనూ మోస్తారు వర్షాలు కురిశాయి.




అల్పాహారం మానేస్తే..

ఉదయం అల్పాహారం మానేస్తే అది ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ అవుతుంది. దీంతో కొన్ని ప్రయోజనాలున్నాయి.
◆ రాత్రి భోజనం తర్వాత మళ్లీ ఏమి తినకపోవడం వల్ల ఇన్సులిన్ స్థాయిలు తగ్గుతాయి. శక్తికోసం శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగిస్తుంది. ఇది బరువు తగ్గేందుకు ఉపకరిస్తుంది. ◆ మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గుతుంది. ◆ కణాల్లో పాడైన ప్రొటీన్లు, వ్యర్థాలను బయటకు పంపే ప్రక్రియ ప్రేరేపితమవుతుంది.
◆ గ్రోత్ హార్మోన్ స్థాయిలు పెరిగి కొవ్వు కరిగేందుకు, కండర నిర్మాణానికి ఉపకరిస్తుంది.
– రిషీకుమార్ నికమ్, వైద్యుడు

ప్రమాదాలపై హెచ్చరించినా మేల్కోలేదు..

- ఔటర్‌పై భారీవాహనాల పార్కింగ్‌పై రవాణాశాఖ ఆందోళన
- సర్వీస్ రోడ్ల వెంబడి వ్యర్థాల పారబోతపైనా..
- మార్చి 26నే హెచ్ఎండీఏకు లేఖ


ఓఆర్ఆర్‌పై పెద్దఅంబర్‌పేట-ఘట్‌కేసర్ మధ్య ఆపిన లారీలు

ఈనాడు, హైదరాబాద్: జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేల్లో వాహనదారుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సుప్రీంకోర్టు ఆదేశించినా, రవాణా శాఖ లేఖలు రాసినా ఆయా విభాగాలు స్పందించకపోతుండడంతో ప్రమాదాలకు అడ్డుకట్ట పడడంలేదు. శుక్రవారం శంషాబాద్ సమీపంలో బాహ్య వలయ రహదారి (ఓఆర్ఆర్)పై నిలిపి ఉన్న లారీని కారు ఢీకొట్టిన ఘోర ప్రమాదంలో రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురు మృతి ఘటన నేపథ్యంలో.. ఈ అంశాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. పలు ఉల్లంఘనల కారణంగా ఓఆర్ఆర్‌పై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని రాష్ట్ర రవాణాశాఖ రెండు నెలల క్రితమే హెచ్ఎండీఏను హెచ్చరించింది. దీనిపై హెచ్ఎండీఏ కమిషనర్‌కు మార్చి 26న రాసిన లేఖలో పలు కీలక సమస్యలను ప్రస్తావించిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది.

"ఓఆర్ఆర్, సర్వీస్ రోడ్లపై ట్రక్కులు, లారీలు అక్రమంగా పార్కింగ్ చేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రహదారి వెడల్పు తగ్గి ప్రమాదాల ముప్పు పెరుగుతోంది" అని ఆ లేఖలో రవాణాశాఖ హెచ్చరించింది. ఆ లేఖ ప్రతులను హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్లకు సైతం పంపించింది. తమ కమిషనరేట్ల పరిధిలోని ఓఆర్ఆర్ ప్రధాన, సర్వీస్ రోడ్లపై భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌పై కఠిన చర్యలు చేపట్టాలని సూచించింది. హెచ్ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్‌కారిడార్ లిమిటెడ్ నియమించిన పెట్రోలింగ్ బృందాల పనితీరును ఆడిట్ చేయాలని, అమలు స్థాయిని సమీక్షించాలని కోరింది.

దిద్దుబాటు చర్యలు ఏవీ?

రవాణాశాఖ హెచ్ఎండీఏకు లేఖ రాసి 45 రోజులు దాటినా.. సమస్య తీవ్రత తెలిసినా సంబంధిత అధికారులు దిద్దుబాటు చర్యలు పూర్తిస్థాయిలో తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. మరోవైపు నగరంలో నిర్మాణాల కూల్చివేత వ్యర్థాల్ని తీసుకెళ్లి ఔటర్ సర్వీస్ రోడ్ల వెంబడి పోయడం వల్ల ఆ రోడ్డులో ప్రయాణించే వాహనదారులకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని రవాణాశాఖ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సమస్యల పరిష్కారానికి ప్రొఫెషనల్ పెట్రోలింగ్ బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని, అక్రమ పార్కింగ్‌ను కట్టడి చేయాలని కోరింది. వీటికితోడు అండర్‌పాస్‌ల దగ్గర సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయకపోవడం, సీసీటీవీ పర్యవేక్షణ లేకపోవడం వంటి పలు సమస్యలు ఉన్నాయి.

టోల్ రూ.వందల్లో.. భద్రత ఎక్కడ?

జాతీయ రహదారులు, ఔటర్‌రింగ్‌రోడ్డు వంటి ఎక్స్‌ప్రెస్‌వేల్లో ప్రయాణానికి వాహనదారులు వందల రూపాయల టోల్ చెల్లిస్తున్నారు. అయినా సురక్షిత ప్రయాణం గగనమవుతోంది. అధిక వేగం, అక్రమ పార్కింగ్, బ్లాక్‌స్పాట్లు వంటి సమస్యలు అనేకం ఈ రోడ్లలో ఎదురవుతూనే ఉన్నాయి.

ప్రయాణం జీవన హక్కులో భాగమే

రహదారులపై సురక్షిత ప్రయాణం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద జీవన హక్కులో భాగమని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టంచేసింది. దేశంలో కేవలం 2 శాతమే ఉన్న జాతీయ రహదారుల్లో.. మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 30 శాతం జరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేసి, ఏ జాతీయ రహదారి ప్రమాదాల మార్గంగా మారవద్దని స్పష్టంచేసింది. అక్రమ పార్కింగ్, బ్లాక్‌స్పాట్లు వంటి నివారించగల ప్రమాదాలతో ఒక్కరి ప్రాణం కోల్పోయినా అది వైఫల్యమే అవుతుందంటూ ఏప్రిల్ 13న ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది. క్షేత్రస్థాయిలో మాత్రం అటు ఔటర్‌లో, ఇటు జాతీయ రహదారుల్లో అనేకచోట్ల ప్రమాదకర పరిస్థితులు అలానే ఉన్నాయి.

యశోదాదేవి 'ఆనంద' పరవశం!

- తనయుడిని పోలీస్ బాస్‌గా చూసి మురిసిపోయిన తల్లి
- ఆమె చిరకాల వాంఛ నెరవేరిందని 'ఎక్స్'లో డీజీపీ వెల్లడి


తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న డీజీపీ ఆనంద్

ఈనాడు, హైదరాబాద్: తనయుడు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తే ఏ తల్లి మనసైనా ఉప్పొంగిపోతుంది. 92 ఏళ్ల యశోదాదేవి ఇప్పుడు అదే పారవశ్యంలో ఉన్నారు. ఆమె కుమారుడు చామరాజ వెంకట ఆనంద్ తెలంగాణ డీజీపీగా నియమితులైన విషయం తెలిసి ఆమె సంబరపడిపోయారు. ఈ ఉద్విగ్న క్షణాలను నూతన డీజీపీ సీవీ ఆనంద్ ఆదివారం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కుంట్లూరుకు చెందిన యశోదాదేవి పాఠశాలకు వెళ్లలేకపోయినా తన తనయులకు ఆంగ్ల విద్య ప్రాముఖ్యాన్ని ఆనాడే ఊహించారు. పిల్లల చదువు కోసం 1959లో హైదరాబాద్‌కు మకాం మార్చి, ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో చేర్పించారు. ఆమె ప్రోత్సాహంతో క్రికెట్, చదువులో దూసుకెళ్లిన సీవీ ఆనంద్ 1990లో తొలి ప్రయత్నంలోనే ఐపీఎస్ సాధించారు. 2021లోనే డీజీపీ హోదా పొందినా.. తెలంగాణ పోలీస్‌శాఖకు హెచ్‌వోపీఎఫ్‌గా నియమితులయ్యేందుకు ఐదేళ్లు వేచి చూశారు. తాజాగా ఈ నెల 1న డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన తన తల్లిని కలిశారు. 'అమ్మ ఆశీర్వాదం తీసుకున్నాను. ఆమె నవంబరు - జనవరి నెలల్లో తీవ్ర అనారోగ్యంతో ఉన్నారు. ఇప్పుడూ మంచానికే పరిమితమైనప్పటికీ బాగానే కోలుకున్నారు. తన కుమారుడు ఈ రాష్ట్రానికి డీజీపీ కావాలన్న ప్రగాఢమైన కోరికే ఆమెను నిలబెట్టిందని నాకు అనిపించింది. అమ్మను కలవగానే ఇద్దరం ఎంతో సంతోషించాం' అని సీవీ ఆనంద్ తన ఆనందాన్ని పంచుకున్నారు.

ప్రకృతిలో వేటాడేద్దాం



రోజూ ఒకేరకం ఆటలాడి బోర్ కొడుతుందా? అయితే ఈసారి కొంచెం కొత్తగా, థ్రిల్లింగ్‌గా ఉండే యాక్టివిటీ చేద్దామా? అదే.. 'నేచర్ స్కావెంజింగ్ హంట్'. పలకడానికి కష్టంగా ఉన్నా.. ఆడేందుకు చాలా ఈజీగా ఉంటుంది. మన పెరట్లోనో, ఇంటి బయటో, దగ్గర్లోని పార్కులోనో ఉన్న ప్రత్యేకమైన వస్తువులను మనం కనిపెట్టడమే ఇది. స్కూల్‌కు వెళ్లేటప్పుడు 'సాక్స్ డబ్బా ఎక్కడుంది?', 'టై కనిపించట్లేదు', 'ఐడీ కార్డు లేదు' అంటూ అమ్మను ఇబ్బంది పెడుతుంటాం కదా! ఈసారి అలా జరగకుండా ఈ వేట మన పరిశీలనాశక్తిని పెంచుతుంది. వస్తువులను వేగంగా గుర్తించడం నేర్పుతుంది. దీన్ని స్నేహితులతో కలిసి చేస్తే చాలా సరదాగా ఉంటుంది. ఒక గంట టైం పెట్టుకోండి. ఎవరు ఎన్ని వస్తువులు తెచ్చారో లెక్కించండి. ఎక్కువ తెచ్చిన వారే గెలిచినట్లు.

సెలవుల్లో సరదాగా!



➡ వెతకాల్సిన వస్తువులేంటంటే.. ఎండుటాకులు, పెద్ద - చిన్న ఆకులు, గుండ్రంగా లేదా వింతగా ఉన్న రాళ్లు, అందమైన పువ్వులు, గింజలు.. ఇలా ఏవైనా కావొచ్చు. అయితే ఇందుకోసం చెట్లను పాడుచేయకూడదు. కింద పడి ఉన్నవే ఏరుకోవాలి. ముళ్లపొదల్లోకి వెళ్లొద్దు! ఎండలేని సమయంలోనే ఈ యాక్టివిటీ చేయాలి.

చెప్పుకోండి చూద్దాం



ప్ర: చిన్నప్పుడు పొడవుగా ఉంటాను. వయసు పెరిగే కొద్దీ పొట్టిగా మారతాను. ఎవరు నేను?

ప్ర: గది మొత్తం పరచుకున్నా, కొంచెం కూడా చోటు ఆక్రమించను. నేనెవరు?

ప్ర: నా నిండా రంధ్రాలే. కానీ నీరు నిలపగలను. ఎవరినో చెప్పగలరా?

ప్రతి ఇంటికీ ప్రాపర్టీ కార్డు!

- 'నక్ష' ప్రాజెక్టును తిరిగి గాడిలో పెట్టేందుకు యత్నం

ఈనాడు, అమరావతి: పట్టణాలు, నగరాల్లో ప్రజల ఇళ్లు, ఇతర ఆస్తులు, భూములకు ప్రాపర్టీ కార్డులు జారీ చేసే నక్ష ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. ఎంపిక చేసిన పుర, నగరపాలక సంస్థల్లో పెండింగ్ పనులను పూర్తి చేయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వైకాపా ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను పక్కన పెట్టడంతో గతేడాది ఫిబ్రవరిలో గడువు ముగిసింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి, ప్రాజెక్టును తిరిగి గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. గ్రామాల్లో స్వామిత్వ తరహాలో పట్టణాల్లోనూ ప్రజల ఆస్తులను డ్రోన్లు, జీఐఎస్ టెక్నాలజీ ఆధారంగా సర్వే చేసి, ప్రాపర్టీ కార్డులు జారీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 2024లో జాతీయ భౌగోళిక ప్రాదేశిక విజ్ఞాన ఆధారిత భూ సర్వే (నక్ష) ప్రాజెక్టుని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 152 నగరాలు, పట్టణాల్లో తొలిదశలో అమలు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రంలో ఒంగోలు, అనంతపురం, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, కాకినాడ, తిరుపతి, ఏలూరు, మంగళగిరి-తాడేపల్లి, కుప్పం పుర, నగరపాలక సంస్థలను అప్పట్లో ఎంపిక చేశారు.



ఇలా ప్రారంభించి.. అలా వదిలేశారు

ఎంపిక చేసిన నగరాలు, పట్టణాల్లో గత ప్రభుత్వంలో డ్రోన్ సర్వే పూర్తి చేశాక కీలకమైన క్షేత్రస్థాయి పరిశీలన, రికార్డుల క్రోడీకరణ, మ్యాపింగ్ వంటివి చేయలేదు. దేశంలో పలు రాష్ట్రాలు పట్టణ ప్రజలకు ప్రాపర్టీ కార్డులు జారీ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో 2027 మార్చిలోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

కార్డులతో లాభం ఇలా..

- ప్రజలకు అందించే ప్రాపర్టీ కార్డుల్లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆస్తుల వివరాలు తెలుస్తాయి.
- యాజమాన్యం, ఇళ్లు, భవనాలు, భూములు, స్థలాలు, విస్తీర్ణం వివరాలు కార్డులో నిక్షిప్తమై ఉంటాయి.
- ఆస్తుల క్రయవిక్రయాలపై రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ సులువవుతుంది.
- ఈ కార్డుల ఆధారంగా బ్యాంకులు రుణాలివ్వనున్నాయి.
- సర్వే ద్వారా పట్టణ సమగ్రాభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందించొచ్చు.

కొత్త బీసీ గురుకులాలకు ఆర్థికశాఖ కొర్రీలు

- రాయలసీమ, ఉత్తరాంధ్రలో సీట్లకు భారీ డిమాండ్

ఈనాడు, అమరావతి: దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించనట్లు ఉంది కొత్త బీసీ గురుకులాల మంజూరు పరిస్థితి. 2026-27 విద్యా సంవత్సరం నుంచి 10 బీసీ గురుకులాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు పచ్చజెండా ఊపారు. అందుకు బీసీ సంక్షేమశాఖ అధికారులూ ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ ఆర్థిక సమస్యల్ని చూపి ఆర్థికశాఖ కొర్రీలు వేస్తోంది. నాలుగింటికే అనుమతిస్తామని చెబుతోంది. పోనీ వాటికి వందల కోట్లు ఖర్చవుతుందా అంటే.. అదీ కాదు. ఇప్పటికిప్పుడు భారీగా నిధులివ్వాల్సిన అవసరమూ లేదు. అయినా కొర్రీలు వేస్తూనే ఉన్నారు.

* గురుకులాల్లో విద్యార్థులకు చక్కటి వసతి, మెరుగైన విద్య, నిపుణులైన ఉపాధ్యాయులతో మంచి బోధన ఉంటాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున గురుకులం ఉండాలనేది కూటమి ప్రభుత్వం ఆలోచన. ప్రస్తుతం 86 నియోజకవర్గాల పరిధిలోనే గురుకులాలు ఉన్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా మిగతా చోట్ల విడతల వారీగా ప్రారంభించేలా బీసీ సంక్షేమశాఖ అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకునే ముఖ్యమంత్రి ఈ ఏడాది 10 బీసీ గురుకులాలకు ఆమోదముద్ర వేశారు. కానీ ఆర్థికశాఖ అధికారులు మాత్రం మోకాలడ్డుతున్నారు.

ఒక్కో గురుకులానికి ఏటా రూ.2.65 కోట్ల ఖర్చు

కొత్తగా గురుకులం ఏర్పాటుకయ్యే ఖర్చు నామమాత్రమే. మొదట అద్దె భవనాల్లోనే ఏర్పాటుచేస్తారు. అలా చూసినా అద్దె, జీత భత్యాలు, విద్యార్థులకు భోజనం, వసతి అన్నీ కలిపి ఏడాదికి రూ.2.65 కోట్లే ఖర్చవుతుందని బీసీ సంక్షేమశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆ ప్రకారం పది గురుకులాలకు రూ.26.50 కోట్లే. బీసీ వసతిగృహాల్లో 10-30 మంది విద్యార్థులుండే ప్రాంతాలను ప్రాతిపదికగా తీసుకుని కొత్త గురుకులాలు ఏర్పాటుచేస్తారు. అక్కడి విద్యార్థులందరినీ గురుకులాల్లో చేర్పిస్తారు. ఆ మేరకు బీసీ వసతిగృహాల నిర్వహణ వ్యయం తగ్గుతుంది. దాదాపుగా 60 బీసీ వసతిగృహాలకు ఏడాదికయ్యే ఖర్చు రూ.13 కోట్లుగా లెక్కించారు. ఆ మొత్తాన్ని తీసేస్తే ఇక 10 గురుకులాలకు ఏడాదికి రూ.13 కోట్లే ఖర్చవుతుంది.

- రాష్ట్రవ్యాప్తంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో బీసీ గురుకులాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. రాయలసీమ పరిధిలో ఒక్కో సీటుకు 15 మంది, ఉత్తరాంధ్రలో ఒక్కో సీటుకు ఐదుగురు పోటీ పడుతున్నారు. కోస్తాంధ్రలో అంత డిమాండ్ లేదు.

వెదురు సాగుతో ఎదిగేలా..!

- 35 వేల మంది డ్వాక్రా మహిళల జీవనోపాధికి ప్రభుత్వం నిర్ణయం
- సాగుకు నరేగా అనుసంధానం

ఈనాడు, అమరావతి: డ్వాక్రా సంఘాల్లోని చిన్న, సన్నకారు మహిళా రైతులకు అండగా నిలిచేలా ప్రభుత్వం మరో ముందడుగేసింది. వీరికి జీవనోపాధి కల్పనలో భాగంగా మైదాన ప్రాంతాల్లో వెదురుసాగును ప్రోత్సహించనుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో గత ఏడాది 3వేల మంది మహిళా రైతులతో ప్రభుత్వం వెదురుసాగు చేపట్టింది. ఈ ఏడాది దాన్ని మరో 35 వేల మందికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత ఏడాది సాగుచేసిన జిల్లాలతోపాటు మరో 10 జిల్లాల్లో ఈ ఏడాది సాగును విస్తరించనున్నారు. మొత్తంగా 87 మండలాల పరిధిలో సాగును చేపట్టనున్నారు. నాలుగో ఏడాది నుంచి రైతులకు ఆదాయం వస్తుంది. నాలుగో ఏడాది రూ.30-50వేలు, ఆ తర్వాత రూ.70వేల నుంచి రూ.లక్ష వరకు ఇలా 40 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది. రైతుల కోసం మారేడుమిల్లిలో ప్రభుత్వం రూ.50 లక్షలతో ప్రాసెసింగ్ ప్లాంటును ఏర్పాటుచేసింది.



త్రిపుర నుంచి మొక్కలు

వెదురు సాగు లాభదాయకంగా ఉండేందుకు త్రిపుర నుంచి కొత్త రకం వెదురు మొక్కలు తీసుకొస్తున్నారు. బాంబుసా బాంబుసా, బాంబుసా టుల్డా, బాంబుసా న్యూటన్స్ మొక్కలు ఇక్కడి వాతావరణానికి తట్టుకుని పెరిగేవిగా అధికారులు గుర్తించారు. ఒక్కో మొక్క ధర రూ.5-6 వరకు ఉండనుంది. ఆహారపంటల ఉత్పత్తిపై ప్రభావం పడకుండా 37 సెంట్ల పరిధిలోనే వీటి సాగుకు ప్రభుత్వ సహకారం అందనుంది. ఒక్కో రైతుకు 60 మొక్కల్ని ఇస్తారు. వెదురుసాగును ఉపాధి హామీ పథకానికి అనుసంధానిస్తారు. ఈ పథకం కింద రైతులకు రెండేళ్లలో రూ.37,410 మేర లబ్ధి చేకూరనుంది.

భవిష్యత్తులో డ్వాక్రా మహిళలతో నర్సరీలు

భవిష్యత్తులో త్రిపుర నుంచి ఇక్కడి వెదురు మొక్కల్ని తీసుకురాకుండా ఇక్కడే డ్వాక్రా మహిళలతో నర్సరీలు ఏర్పాటుచేసి వాటిని ఉత్పత్తి చేయనున్నారు. సాగులో రైతులకు అవసరమైన మెలకువలు నేర్పేందుకు, నిరంతర పర్యవేక్షణకుగాను ఇండస్ట్రీ ఫౌండేషన్‌తో ఇప్పటికే ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది.

రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు

విశాఖపట్నం (ఏయూ ప్రాంగణం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరులో ఆదివారం ఈ ఏడాదిలోనే ఇప్పటివరకు అత్యధికంగా 46.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు పేర్కొన్నారు. కొప్పెరపాడులో 46.1 డిగ్రీలు రికార్డయినట్లు చెప్పారు. 16 జిల్లాల పరిధిలోని 286 మండలాల్లో 41 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. మరోవైపు దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మీదుగా ద్రోణి విస్తరించి ఉందన్నారు. దీని ప్రభావంతో సోమవారం అనకాపల్లి, కాకినాడ, డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు.. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖపట్నం, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 72.7 మి.మీ, కాట్రేనికోనలో 57.7 మి.మీ, కాకినాడ జిల్లా పెద్దాపురంలో 50.2 మి.మీ, పిఠాపురంలో 45.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు చెప్పారు.

పాస్టర్ ఆనంద్ ఎస్సీ సర్టిఫికెట్ రద్దుకు జేసీ కమిటీ సిఫార్సు

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల జిల్లా పిట్టలవానిపాలేనికి చెందిన పాస్టర్ చింతాడ ఆనంద్ ఎస్సీ సర్టిఫికెట్ రద్దుచేయాలని సిఫార్సు చేస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు జేసీ భావన నేతృత్వంలోని జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ నివేదిక అందజేసింది. ఆనంద్ క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయని, సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఆయన ఎస్సీ సర్టిఫికెట్ కలిగి ఉండటానికి అర్హుడు కాదని కలెక్టర్‌కు జేసీ కమిటీ నివేదిక సమర్పించింది. దీని ఆధారంగా మీ ఎస్సీ సర్టిఫికెట్‌ను ఎందుకు రద్దు చేయకూడదో 15 రోజుల్లోగా రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ పాస్టర్ ఆనంద్‌కు కలెక్టర్ ఆదివారం నోటీసు జారీచేశారు. కలెక్టరేట్లో ఈ నెల 19న తుది విచారణ నిర్వహించనున్నారు. తర్వాత ఆయన ఎస్సీ సర్టిఫికెట్ రద్దుపై రాజ్యాంగ నిబంధనలు, ఆధారాలను బట్టి కలెక్టర్ తుది నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీచేస్తారు. క్రైస్తవమతంలోకి మారిన పాస్టర్ ఆనంద్ ఎస్సీ సర్టిఫికెట్ రద్దు చేయాలని కోరుతూ పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలేనికి చెందిన అక్కల రామిరెడ్డి జిల్లా యంత్రాంగానికి ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. హైకోర్టులోనూ పిటిషన్ వేశారు. ఫిర్యాదుపై స్పందించిన జేసీ కమిటీ ఇద్దరికీ నోటీసులు జారీచేసి గత నెల 16న తొలి దశ విచారణ నిర్వహించింది. ఆనంద్ విచారణకు గైర్హాజరయ్యారు. ఈ నెల ఒకటిన మరోసారి విచారణ నిర్వహించగా.. కమిటీ వద్దకు రామిరెడ్డి, ఆనంద్ హాజరై తమ వాదనలు వినిపించి పత్రాలు అందజేశారు.



30 నిమిషాలతో వారంపై నియంత్రణ

ప్రతి ఆదివారం 30 నిమిషాలు కేటాయించి తదుపరి వారం రోజుల ప్రణాళిక ఎలా ఉండాలో నిర్ణయించుకోవాలి. తద్వారా ఆ వారం రోజులపై మీకు నియంత్రణ వస్తుంది. ఆ ప్రణాళికలో మీ కుటుంబం, మీ ఉద్యోగ విధులకు మొదట ప్రాధాన్యం ఇవ్వండి. తర్వాతే మిగిలినవాటిని చేర్చండి.

– రోడ్ జోన్స్, మాజీ క్రీడాకారుడు

అకాల వర్షం.. ఈదురు గాలుల బీభత్సం

- తడిసిన ధాన్యం.. ఉద్యాన పంటలకు నష్టం
- పిడుగుపాటుకు గురై వేర్వేరుచోట్ల ఇద్దరి మృతి





శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కందులవారిపాలెం హరిజనవాడలో పైకప్పు లేచిపోయిన ఇల్లు ★ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడులో ధాన్యం రాశుల వద్ద నిలిచిన వర్షపునీరు

కలిగిరి, సామర్లకోట, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కురిసిన అకాలవర్షం, ఈదురు గాలులకు రైతులు నష్టపోయారు. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలిగిరి మండలంలో ఈదురుగాలుల తీవ్రతకు ఉద్యాన తోటలు దెబ్బతిన్నాయి. కోతదశలో ఉన్న మామిడికాయలు రాలిపోయాయి. నిమ్మ, మామిడి, సపోటా తోటలకు నష్టం వాటిల్లింది. కుమ్మరకొండూరులో నోటి రవీంద్రమ్మ, కందులవారిపాలెం హరిజనవాడలో దారా మాలకొండయ్యకు చెందిన ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. 29 విద్యుత్తు స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు కూలినట్లు ట్రాన్స్‌కో సిబ్బంది ప్రాథమికంగా గుర్తించారు. జలదంకి మండలం చామదాలలో పిడుగుపడి బ్రాహ్మణక్రాక ఎస్సీ కాలనీకి చెందిన గొర్రెలకాపరి ఆత్మకూరి పెంచలయ్య (42) మృతి చెందారు. మరోవైపు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రహదారుల పక్కన, కళ్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం భీమేశ్వరాలయం సమీపంలో జి.రాగంపేటకు చెందిన కౌలు రైతు పెన్నాడ అర్జునరావు (63) పిడుగుపాటుకు గురై మృతిచెందారు.

మల్కాన్‌గిరిలో గంజాయి నూనె తయారీ కేంద్రం గుట్టురట్టు

- రూ.100 కోట్ల విలువ చేసే మత్తుపదార్థాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు, ఇతర ముడి మత్తుపదార్థాలతో పోలీసులు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లా చిత్రకొండ పోలీసుస్టేషన్ పరిధి ఎస్సార్ కూడలి సమీపంలో పోలీసులు గంజాయి నూనె మొబైల్ తయారీ కేంద్రం గుట్టు రట్టుచేసి, రూ.100 కోట్ల విలువ చేసే ముడిపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. చిత్రకొండ ఎస్డీపీవో ప్రదోష్ ప్రధాన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఎస్సార్ కూడలి వద్ద పోలీసులు ఓ వాహనంలో సుమారు 800 లీటర్ల రసాయన మత్తు పదార్థాలను గుర్తించారు. దీంతోపాటు గంజాయి ఆయిల్ వెలికితీతకు వినియోగించే మొబైల్ యూనిట్ పరికరాలను కనుగొన్నారు. కొద్ది రోజులుగా గంజాయి నూనె, ఇతర మత్తుపదార్థాలను ముఠా సభ్యులు స్మగ్లింగ్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. పట్టుబడ్డ వాహనం ఏపీ రిజిస్ట్రేషన్ నంబరుతో ఉంది. 50 కిలోల గంజాయితోపాటు 2 లీటర్ల గంజాయి నూనె, 800 లీటర్ల రసాయన మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.100 కోట్లు ఉంటుందని ప్రధాన్ వెల్లడించారు.

ఏకసభ్య కమిషన్ ఏకపక్షంగా రిపోర్ట్ ఇచ్చింది: భూమన

తిరుపతి(మంగళం), న్యూస్‌టుడే: 'దినేష్‌కుమార్ అనే విశ్రాంత ఐఏఎస్ అధికారికి తితిదే ఛైర్మన్ పదవి ఎరగా వేసి ఏకసభ్య కమిషన్ వేశారు. చివరకు అది ఏకపక్ష కమిషన్‌గా మారి చంద్రబాబు పక్షాన ఏకపక్ష రిపోర్టు ఇచ్చింది' అని తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. ఆదివారం తిరుపతిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'కల్తీ నెయ్యి వ్యవహారంలో రాజకీయ నాయకుల ప్రమేయం లేదని సుప్రీంకోర్టు నియమించిన సిట్ రిపోర్టు ఇచ్చింది. కానీ ఆ నివేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సంతృప్తి చెందకుండా లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని ఆరోపణలు చేస్తూనే వచ్చారు' అని భూమన మండిపడ్డారు.

నగల దుకాణంలో కాల్పుల కలకలం

- కరీంనగర్ నడిబొడ్డున ఐదుగురు దుండగుల దుశ్చర్య
- నలుగురు సిబ్బందిపై కాల్పులు
- కిలోకుపైగా ఆభరణాలతో పరారీ





తుపాకులు చూపించి సిబ్బందిని బెదిరిస్తున్న దుండగులు(సీసీ టీవీ ఫుటేజీ) ★ ఛాతీలో బుల్లెట్ దిగడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న కమలాసన్

ఈనాడు, కరీంనగర్– న్యూస్‌టుడే, కరీంనగర్ నేరవార్తలు: తెలంగాణలోని కరీంనగర్‌లో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రోడ్డులోని ఓ నగల దుకాణంలో ఆదివారం ఉదయం కాల్పులు కలకలం సృష్టించాయి. ఐదుగురు దుండగులు దుకాణంలోకి ప్రవేశించి, సిబ్బందిపై కాల్పులు జరిపి కిలోకుపైగా బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. 11 నిమిషాలపాటు సాగిన ఈ బీభత్సంలో నలుగురు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి కరీంనగర్ సీపీ గౌష్ ఆలం వివరాలు వెల్లడించారు. కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో జిల్లా కోర్టు పక్కనే, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కార్యాలయానికి సమీపంలో ఉన్న పీఎంజే జ్యువెలరీ షోరూం వద్దకు ఉదయం 11 గంటల సమయంలో ఒకరి తరువాత ఒకరు మొత్తం ఐదుగురు దుండగులు చేరారు. పథకం ప్రకారం ముందుగా ఒకతను లోపలికి వెళ్లి వజ్రాల ఆభరణాలు చూపించాలని కోరాడు. సిబ్బంది పలు రకాల ఆభరణాల్ని ముందు పెట్టిన కొద్దిసేపటికే మిగతా నలుగురు వరుసగా లోపలికి ప్రవేశించారు. వస్తూనే ఒకతను సెక్యూరిటీ గార్డు తలకు తుపాకీని ఎక్కుపెట్టాడు. మిగతా ముగ్గురు కూడా ఆయుధాలతో అక్కడున్న 8 మంది సిబ్బందిని భయపెట్టారు. 'మిమ్మల్ని ఏమీ అనం.. మాకు సహకరించాలి' అని ఒక వ్యక్తి తెలుగులో మాట్లాడుతూ సిబ్బందిని హెచ్చరించగా.. మిగతా వారంతా హిందీలో మాట్లాడారు. నగలన్నింటినీ వారితోపాటు తెచ్చుకున్న రెండు బ్యాగుల్లో వేయమని ఆదేశించారు. మొదట సిబ్బంది స్పందించకపోవడంతో వారిలో కొందరిని మోకాళ్లపై కూర్చోబెట్టి చేతులు వెనక్కి వంచి టేపు చుట్టారు. నోటికి కూడా టేపును అతికించారు. దీంతో మిగతావారు భయపడి నగలను బ్యాగుల్లో వేశారు.

కాల్పులు జరిపి.. ఒక బ్యాగు వదిలేసి..

సైగల ద్వారా మాట్లాడుకున్న కొందరు సిబ్బంది ఒక్కసారిగా వారిపై తిరగబడ్డారు. ఈ చర్యతో ఉలిక్కిపడిన దుండగులు వారిపై ఇష్టారీతిన నాలుగు రౌండ్ల కాల్పులు జరిపారు. దీంతో సిబ్బంది రాజేశ్, మహ్మద్ ముస్తాక్, మధుకర్, కమలాసన్ మోచేతులకు, తలకు, ఛాతీకి గాయాలయ్యాయి. ఈ హడావుడిలో దుండగులు ఒక నగల బ్యాగును అక్కడే వదిలేసి ఒక దానితో రెండు ద్విచక్రవాహనాలపై పారిపోయారు. ఈ సమయంలో ఒకతను బైక్‌పై నుంచి కింద పడిపోగా అతడి చేతిలో ఉన్న తుపాకీ కిందపడిపోయింది. దాన్ని తిరిగి తీసుకోగా.. మ్యాగజైన్ రోడ్డు పక్కన ఉండిపోయింది. ఈ దృశ్యం సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. చోరీ గురించి సమాచారం అందుకున్న తెలంగాణ మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, సీపీ గౌష్ ఆలం ఇతర పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడ్డ సిబ్బందిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఇందులో కమలాసన్‌కు ఛాతీ భాగంలో బుల్లెట్ దిగడంతో శస్త్రచికిత్స నిర్వహించారు. వీరెవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. చోరీ అయిన ఆభరణాలు కిలోకుపైగా ఉంటాయని, వీటి విలువ రూ.1.50 కోట్లు ఉంటుందని పోలీసులు గుర్తించారు. ద్విచక్రవాహనాలపై సిరిసిల్ల-వేములవాడ మార్గంలో పారిపోయిన దుండగులను పట్టుకునేందుకు పలు బృందాలు గాలిస్తున్నాయి. మహారాష్ట్ర లేదా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ముఠాగా భావిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నలుగురు దొంగల ఫొటోలను విడుదల చేశారు. వారిని గుర్తించి సమాచారం అందించిన వారికి రూ.లక్ష రివార్డును అందిస్తామని పోలీసులు ప్రకటించారు.

శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో ఆలయం వద్దకు చేరుకున్న న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో పండితులు వేదాశీర్వచనం, తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో జస్టిస్ పీఎస్ నరసింహ

విశాఖలో నూతన కోర్టుల ప్రారంభం



గాజువాకలో కుటుంబ న్యాయస్థానాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ. చిత్రంలో జస్టిస్ రవి చీమలపాటి, విశాఖ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తదితరులు

విశాఖపట్నం (గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: విశాఖ నగరంలో హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం నూతన కోర్టులను ప్రారంభించారు. తొలుత భీమిలి కోర్టుల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీనియర్ సివిల్ జడ్జి కోర్టును హైకోర్టు న్యాయమూర్తి, విశాఖపట్నం అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రవినాథ్ తిల్హరీ ముఖ్య అతిథిగా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవి చీమలపాటి గౌరవ అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. భీమిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రథమ న్యాయమూర్తిగా డి.సోని బాధ్యతలు స్వీకరించి కేసులను విచారించారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు, మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి వెంకటరమణ, భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.సౌజన్య, భీమిలి బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం విశాఖ జిల్లా కోర్టు ప్రాంగణంలో మూడు నూతన న్యాయస్థానాలతో పాటు గాజువాకలో కుటుంబ న్యాయస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తులు ప్రారంభించారు.

పెదపేట రామాలయ పునర్నిర్మాణ పనులకు అంకురార్పణ

శంకుస్థాపన చేసిన రఘురామ దంపతులు



పూజలు చేస్తున్న రఘురామకృష్ణరాజు దంపతులు. చిత్రంలో తితిదే మాజీ ఛైర్మన్ బాపిరాజు దంపతులు

ఈనాడు డిజిటల్, భీమవరం: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులోని పెదపేట రామాలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం అంకురార్పణ జరిగింది. స్థపతి శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు, రమాదేవి దంపతులు శాస్త్రోక్తంగా ఉదయం 7.14 గంటలకు పనులకు శంకుస్థాపన చేశారు. క్షేత్రశుద్ధి కోసం వాస్తుహోమం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం రఘురామకృష్ణరాజు భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఎనిమిది శతాబ్దాల పాటు నిలిచేలా కృష్ణశిలతో నిర్మిస్తున్న రామాలయాన్ని ఎన్ని అడ్డంకులు ఎదురైనా పూర్తిచేస్తామన్నారు. శంకుస్థాపన పనులు అడ్డుకునేందుకు సామాజిక మాధ్యమాల్లో కొందరు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రతి వాహనాన్నీ పోలీసులు తనిఖీచేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన 120 మంది బీఎస్పీ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.

EENADU Vol: 31, Issue: 28 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt. Ltd. Printed at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh and M/s. Kalajyothi Process Private Limited, Survey No. 94 B, C & D, Nidumukkala Village, Tadikonda Mandal, Guntur District - 522 016, Andhra Pradesh and Published at Eenadu Press, Survey No. 393/1, Door No. 108-6, Potturu Village, Guntur Rural Mandal, Guntur District - 522 005, Andhra Pradesh. Editor: M Nageswara Rao. RNI No. 63819/1996. Regd. No. GTR/21/2024-26, Phones: 0863-2512142. Mobile No. 9959021812. Air Surcharge. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao

ఈనాడు సినిమా

థియేటర్లలో కనిపించే కొత్త పోస్టర్ ఎంత కిక్ ఇస్తుందో.. అభిమాన తారల నుంచి వినిపించే కొత్త కబురు అంతే స్థాయిలో కిక్ ఇస్తుంటుంది. అందుకే చిత్రసీమలో కొత్త కలయికలు ప్రచారంలోకి వచ్చాయంటే చాలు.. సినీప్రియులంతా ఆవైపు ఆసక్తిగా దృష్టి సారిస్తుంటారు. అవి కార్యరూపంలోకి రావాలని.. తమ కథానాయకుల్ని కొత్త కథల్లో చూడాలని ఆశపడుతుంటారు. ప్రస్తుతం ఇలా కొన్ని కాంబినేషన్లపై చిత్రసీమలో బలమైన ప్రచారం జరుగుతోంది.

వినిపిస్తారా.. కొత్త కబురు!



'స్వాగ్' దర్శకుడితో రవితేజ?



ఈ సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు రవితేజ. ప్రస్తుతం ఆయన 'ఇరుముడి' సినిమాని ముగించే పనిలో ఉన్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ చిత్రం ఈ ఏడాది ద్వితీయార్ధంలోనే తెరపైకి రానుంది. అయితే దీని తర్వాత తను చేయనున్న చిత్రమేదన్నది ఇంకా ప్రకటించలేదు. కానీ, ప్రస్తుతం దీనికి సంబంధించి చిత్రసీమలో ఓ ఆసక్తికర వార్త వినిపిస్తోంది. 'రాజ రాజ చోర', 'స్వాగ్' చిత్రాలతో అలరించిన యువ దర్శకుడు హసిత్ గోలితో రవితేజ చేతులు కలపనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనిపై చర్చలు జరుగుతున్నాయని.. ఈ ప్రాజెక్ట్‌ని దిల్‌రాజు నిర్మించే అవకాశముందని తెలుస్తోంది.

ఎన్టీఆర్ డబుల్ ట్రీట్ ఖాయమా!

కథానాయకుడు ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ బహుభాషా చిత్రం చేస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా నుంచి తారక్ పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 20న ఓ ప్రచార చిత్రం బయటకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అయితే మరోవైపు అదేరోజు ఆయన నుంచి మరో కొత్త కబురు వినిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. 'అరవింద సమేత వీరరాఘవ' తర్వాత ఎన్టీఆర్ - త్రివిక్రమ్ ఓ మైథాలజీ సినిమా కోసం కలిసి పనిచేయనున్నట్లు గతంలో ప్రకటించారు. కానీ, ఆ తర్వాత అది తారక్ నుంచి అల్లు అర్జున్ చేతుల్లోకి వెళ్లినట్లు గుసగుసలు వినిపించాయి. అయితే ఇప్పుడిది ఎన్టీఆర్‌తోనే ఖరారైనట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఆయన పుట్టినరోజే దీనిపై ఓ అధికారిక ప్రకటన రానుందని టాక్. ఇదే జరిగితే తారక్ తన అభిమానులకు డబుల్ ట్రీట్ ఇచ్చినట్లే.

రామ్.. చెప్పేస్తారా!



కథానాయకుడు రామ్ పోతినేని చేయనున్న తదుపరి సినిమాపై సందిగ్ధత కొనసాగుతోంది. ఇటీవల ఆయన లోగి విఘ్నేశ్ అనే కొత్త దర్శకుడికి ఓకే చెప్పినట్లు బలమైన ప్రచారం జరిగినా అధికారికంగా స్పష్టత రాలేదు. మరోవైపు తనిప్పటికే స్వయంగా ఓ కథ కూడా సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. నిన్నమొన్నటి వరకు దీన్ని మరో దర్శకుడి చేతుల్లో పెట్టనున్నట్లు వార్తలొచ్చినా.. ఇప్పుడు దాన్ని రామ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించాలన్న ఆలోచనతో ఉన్నట్లు ప్రచారం జోరందుకుంది. దీనికి సంబంధించి ఈ నెల 15న తన పుట్టినరోజు సందర్భంగా స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

శ్రీవిష్ణు కోసం మరో కథ..



కథానాయకుడు శ్రీవిష్ణు వరుస సినిమాలతో తీరిక లేకుండా గడిపేస్తున్నారు. ప్రస్తుతం ఆయన దర్శకుడు రామ్ అబ్బరాజుతో చేస్తున్న చిత్రం చిత్రీకరణ దశలో ఉండగా.. దర్శకుడు జానకి రామ్‌తో చేస్తున్న 'కామ్రేడ్ కళ్యాణ్' తుది మెరుగులు దిద్దుకుంటోంది. అలాగే సన్నీ సంజయ్ దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలో ఓ చిత్రం చేయాల్సి ఉంది. కాగా, ఇప్పుడీ జాబితాలోకి మరో సినిమా చేరింది. 'రంగబలి' ఫేమ్ పవన్ బసంశెట్టి దర్శకత్వంలో ఓ కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించిన కథా చర్చలు పూర్తయ్యాయని.. ఎస్ఎల్వీ సినిమాస్ సంస్థ దీన్ని నిర్మించే అవకాశముందని తెలుస్తోంది. అంతే కాదు 'సామజవరగమన' చిత్రానికి ఓ రచయితగా వ్యవహరించిన భాను భోగవరపు దర్శకత్వంలోనూ ఒక సినిమా చేయనున్నట్లు ప్రచారం వినిపిస్తోంది.

భావోద్వేగాల యాక్షన్ డ్రామా



గోపీచంద్, అనార్కలి నజర్

కథానాయకుడు గోపీచంద్ 34వ చిత్రం శ్రీకారం చుట్టుకుంది. ప్రముఖ ఫైట్ మాస్టర్ వి.వెంకట్ దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాని విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో మలయాళ కథానాయిక అనార్కలి నజర్ తెలుగులోకి అడుగు పెట్టనుంది. ఈ సినిమా ఆదివారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి శ్యామ్ ప్రసాద్ రెడ్డి క్లాప్ కొట్టగా.. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. శివ నిర్వాణ, కేఎల్ దామోదర్ ప్రసాద్, వై రవిశంకర్ స్క్రిప్ట్ అందించారు. దిల్‌రాజు గౌరవ దర్శకత్వం వహించారు. "బలమైన భావోద్వేగాలతో నిండిన సరికొత్త యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందనుంది. గోపీచంద్ దీంట్లో శక్తిమంతమైన యాక్షన్ పాత్రలో అలరించనున్నారు" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ త్వరలో మొదలు కానుంది. ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, కూర్పు: శ్రీకర్ ప్రసాద్, ఛాయాగ్రహణం: షామ్ దత్.



'పతి పత్నీ ఔర్ వో దో'

ప్రజాపతి పాండే రహస్యం ఏంటి?

"నేను మంచి ప్రవర్తన గల వ్యక్తిని.. విధేయుడైన భర్తను. అంతే కాకుండా నేను అటవీ శాఖలో సీనియర్ అధికారిని. ఇంకా నా జీవితంలో సమస్యలకు తావే లేదు" అంటున్నాడు ఓ భర్త. మరి నిజంగా ఆయన విధేయుడైన భర్తనేనా? అనేది తెలుసుకోవాలంటే 'పతి పత్నీ ఔర్ వో దో' సినిమా చూడాల్సిందే. బాలీవుడ్ కథానాయకుడు ఆయుష్మాన్ ఖురానా, అందాల తారలు రకుల్ ప్రీత్ సింగ్, సారా అలీఖాన్, వామికా గబ్బీ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. ముదస్సర్ అజీజ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 15న థియేటర్లలోకి రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్లో భాగంగా సామాజిక మాధ్యమాల వేదికగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "ప్రజాపతి సంచలనం సృష్టించబోతున్నారు. మరి ఆయన రహస్యమేంటో తెలుసుకోండ"నే వ్యాఖ్యను జోడించింది. ఇందులో ఫారెస్ట్ ఆఫీసర్ ప్రజాపతి పాండేగా ముగ్గురు భామలతో సందడి చేస్తూ సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నారు ఆయుష్మాన్. భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మించారు.

ఆ ఒత్తిడిని తట్టుకోలేకే తప్పుకున్నాను



సుందర్.సి

అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్‌లను ఒకే తెరపై కలిసి చూడాలని ఎంతో మంది అభిమానులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నారు. వారందరికి 'తలైవార్ 173' (వర్కింగ్ టైటిల్)తో గతేడాదే మంచి తీపి కబురు వినిపించారు ఈ ఇద్దరు తారలు. దీనికి సుందర్.సి దర్శకత్వం వహిస్తారని అప్పట్లోనే వెల్లడించారు. కానీ ఈ ప్రకటన వచ్చిన కొన్ని రోజులకే తాను ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు సుందర్.సి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈయన.. ఆ ఒత్తిడిని తట్టుకోలేకపోయానంటూ ఈ సినిమా నుంచి వైదొలగడానికి కారణాలను తెలిపారు. "నిజం చెప్పాలంటే ఆ సినిమా విషయంలో నాపై చాలా ఒత్తిడి ఉండేది. గత 16ఏళ్లుగా నాకు నచ్చినట్లుగా, ప్రేక్షకులకు ఏం కావాలో అదే తీస్తూ వస్తున్నాను. కానీ ఇంత భారీ ప్రాజెక్టును హ్యాండిల్ చేసే క్రమంలో నా ఆలోచనలను ఇతరులకు వివరించి ఒప్పించే సామర్థ్యం నాకు లేదనిపించింది. నాకు కథను అద్భుతంగా నెరేట్ చేయడం రాదు. అదే సమయంలో ఎవరైనా మార్పులు చెబితే ఎదురు తిరగకుండా వెంటనే రాజీ పడిపోతుంటా. అంత పెద్ద సినిమాలో నా సొంత నిర్ణయాలకు తావు ఉండదని అర్థమైంది. సినిమాకు గానీ, ఆ ఇద్దరు లెజెండ్స్‌కు గానీ నేను పూర్తి న్యాయం చేయలేనని గ్రహించి ప్రాజెక్ట్ ప్రారంభ దశలోనే తప్పుకున్నా" అని అన్నారు. ఈయన స్థానంలో ఈ చిత్రానికి శిబి చక్రవర్తి దర్శకత్వం వహిస్తున్నారు.

కేన్స్ చిత్రోత్సవాలకు బాలన్ - ది బాయ్



'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఇప్పుడాయన నుంచి రానున్న కొత్త సినిమా 'బాలన్ - ది బాయ్'. కేవీఎన్ ప్రొడక్షన్స్, తెస్పియన్ ఫిల్మ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రలు పోషించారు. త్వరలో థియేటర్లలోకి రానున్న ఈ సినిమా ఈనెల 14న ప్రఖ్యాత కేన్స్ చిత్రోత్సవంలో ప్రదర్శితం కానున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ సందర్భంగా దర్శకుడు చిదంబరం మాట్లాడుతూ.. "ప్రపంచ సినిమాకి కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఇల్లు లాంటిది. అక్కడి ప్రేక్షకులు సినిమాని నమ్ముతారు. అలాంటి నిజమైన సినీ ప్రేమికుల్ని మా 'బాలన్..' తప్పక హత్తుకుంటుంది. దీన్ని చూస్తూ ప్రేక్షకులు ఓ కొత్త అనుభూతికి లోనవుతారు. మనం ఎక్కడి నుంచి వచ్చాం, ఎక్కడికి ప్రయాణిస్తున్నామన్నది తెలుసుకోవాలనే తపనతో రూపొందించిన చిత్రమిది. ఇలాంటి భావోద్వేగాల్ని అనుభవించినా.. చెప్పేందుకు మాటలు దొరకని వ్యక్తి కోసం ఈ సినిమా తెరకెక్కించాం" అన్నారు. "ప్రతిఒక్కరూ చర్చించుకునేలా చేసే చిత్రమిది. దీన్ని 14న కేన్స్ బిజినెస్ వింగ్ మార్ష్ డు ఫిల్మ్‌లో స్క్రీనింగ్ చేయనున్నాం" అన్నారు నిర్మాత వెంకట్ కే నారాయణ.

ఓనమ్‌కి మమిత సందడి



మమితా బైజు

'కర' సినిమాతో ఇటీవలే తెరపై సందడి చేసింది మలయాళ భామ మమితా బైజు. తనదైన నటనతో యువతను విశేషంగా ఆకట్టుకుంటోన్న ఈ తార.. ప్రస్తుతం పలు ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఆమె, హీరో నివిన్ పౌలీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బెత్లెహాం కుటుంబ యూనిట్'. 'ప్రేమలు' ఫేమ్ గిరీష్ ఏడీ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు తెలుపుతూ.. సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టింది మమిత. "విజయవంతంగా చిత్రీకరణ ముగిసింది. నటీనటులకు, సాంకేతిక బృందానికి, తెరవెనుక ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఈ ఏడాది ఓనమ్ పండగ సందర్భంగా ఈ ప్రేమకథ థియేటర్లలోకి రాబోతుంద"ని ఆ పోస్టులో పేర్కొంది. రొమాంటిక్ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రంలో సంగీత్ ప్రతాప్, సురేశ్ కృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. భావనా స్టూడియోస్ నిర్మిస్తుంది.

డబ్బులిస్తే.. మన ఇల్లు నేనే శుభ్రం చేస్తా



'పరిమళ అండ్ కో'

దీపావళి పండగొస్తుంది.. ఇంటి పని చేయడానికి బయటి మనిషి రెండు వేల డిగిందని.. ఆ వెయ్యి రూపాయలేవో నాకే ఇవ్వు నేనే ఇల్లు శుభ్రం చేసుకుంటానంటోంది ఓ ఇల్లాలు. అయ్యో అదెలా కుదురుతుంది.. ఇద్దరం చెరో రూ.500 పంచుకుని సంతోషంగా ఆ పని పూర్తి చేసేద్దాం అంటున్నాడామె భర్త. ఈలోగా వారి ఇద్దరి కూతుళ్లు 'నాన్న మిమ్మల్ని నమ్మం.. డబ్బులిస్తే మేమూ రంగంలోకి దిగుతాం..'లాంటి సంభాషణలతో సరదా వాతావరణంలో సాగుతున్న కుటుంబ కథా చిత్రమే 'పరిమళ అండ్ కో'. జయరాం, ఊర్వశీ ప్రధాన పాత్రల్లో దర్శకుడు పాండి రాజ్ తెరకెక్కిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో హీరో సంతోష్ శోభన్, అనంతిక సనీల్ కుమార్, సంజనా క్రిష్ణమూర్తి, యోగిబాబు, మిస్కిన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు.

అలియానే ఖరారు?



అలియా భట్

'ఆల్ఫా' సినిమాతో రెండేళ్ల తర్వాత ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతోంది హీరోయిన్ అలియా భట్. దీంతోపాటు ఆమె.. కథానాయకులు రణ్‌బీర్ కపూర్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న 'లవ్ అండ్ వార్' చిత్రాన్ని చకచకా పట్టాలెక్కించేస్తుంది. వరుస చిత్రాలతో బిజీగా ఉన్న ఈ తార ఇప్పుడు 'తుంబాడ్ 2' చిత్రంలో మెరవనున్నట్లు తెలుస్తోంది. హారర్ మైథలాజికల్‌గా ఆదేశ్ ప్రసాద్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో సోహమ్ షా, నవాజుద్దీన్ సిద్దిఖీ నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో కీలకమైన పాత్ర కోసం పలువురు అగ్ర కథానాయికల పేర్లు పరిశీలిస్తున్నారని ఇటీవల జోరుగా ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. తాజాగా దీనికోసం చిత్రబృందం అలియాని ఖరారు చేసిందని తెలిసింది. "తుంబాడ్ 2' చిత్రంలో అలియా భట్ ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించనుంది. పాత్ర చిన్నదే అయినా.. సినిమాపై ఆమె కీలకమైన ప్రభావం చూపనుంది. త్వరలో అలియా తన పాత్రకు సంబంధించిన షూటింగ్‌లో పాల్గొననుంద"ని చిత్ర సన్నిహిత వర్గాలు వెల్లడించినట్లు సమాచారం.

వినోదం నిండిన ప్రేమకథ



త్రిగుణ్, పాయల్

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ జంటగా మధుదీప్ చెలికాని తెరకెక్కించిన చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. అరవింద్ మండ్యం నిర్మాత. అనీష్ కురువిల్లా, శివాజీ రాజా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా శ్రీ వెంకట సాయి ఫిల్మ్స్, ముత్యాల రాందాస్ డిస్ట్రిబ్యూషన్‌లో ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాతలు మాట్లాడుతూ.. "నిజాయతీ గల అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకుంటే ఆ ప్రయాణం ఎంత వినోదాత్మకంగా ఉంటుందన్నదే ఈ చిత్ర కథాంశం" అన్నారు.

ఆ 'రెడ్ బ్యాగ్'లో ఏముంది?



ఈషాన్, రాధ్య

కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక ప్రధాన పాత్రధారులుగా రవికుమార్ సీరపు తెరకెక్కించిన చిత్రం 'ది రెడ్ బ్యాగ్'. హరికృష్ణ సోమిశెట్టి నిర్మించారు. స్నేహా సింగ్, ఆకాంక్ష తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఇటీవల కాన్సెప్ట్ పోస్టర్‌ను విడుదల చేశారు. "ఇది ఓ బ్యాగ్ చుట్టూ తిరిగే ఆసక్తికర కథతో క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందింది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

ఆమిర్ అలీ ప్రతీకారం ఆరోజే



పృథ్వీరాజ్ సుకుమారన్

దర్శకుడిగా, నటుడిగా వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు మలయాళ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఖలీఫా'. వైశాఖ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే ఈ చిత్రం నుంచి విడుదలైన గ్లింప్స్ సినీప్రియుల్ని ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ చిత్ర విడుదల తేదీని ప్రకటిస్తూ.. ఇన్‌స్టా వేదికగా ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు పృథ్వీరాజ్. "ఈ ఓనమ్ నాడు.. ఒక వారసత్వం పునరుజ్జీవిస్తుంది. ఆమిర్ అలీ తన ప్రతీకారాన్ని ఆరోజే తీర్చుకోబోతున్నాడు. 'ఖలీఫా' ఆగస్టు 20న థియేటర్లలోకి రాబోతుంద'నే వ్యాఖ్యల్ని జోడించారు. ఆ పోస్టర్‌లో శక్తిమంతమైన అవతారంలో ఆమిర్ అలీగా కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు పృథ్వీరాజ్. ఇందులో అగ్రహీరో మోహన్‌లాల్ అతిథి పాత్రలో మెరవనున్నారు. గోల్డ్ మాఫియా చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుంది.

హైందవ ధర్మ గొప్పదనాన్ని చాటి చెప్పే చిత్రం



విశ్వనాథ్

పిడుగు విశ్వనాథ్ హీరోగా ఎస్వీ కృష్ణారెడ్డి తెరకెక్కించిన చిత్రం 'వేద వ్యాస్'. అచ్చిరెడ్డి సమర్పణలో కొమ్మూరి ప్రతాపరెడ్డి నిర్మించారు. జూన్ హ్యాంజీ కథానాయిక. సాయికుమార్, సుమన్, శివాజీ రాజా తదితరులు కీలక పాత్రలు పోషించారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్ర విజువల్ లోగోని ఆవిష్కరించారు. "హైందవ ధర్మ గొప్పదనాన్ని ఆవిష్కరిస్తూ.. కుటుంబ సమేత కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించాం. ఇది మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాం" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

ఈనాడు బిజినెస్

బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహానికి రూ.37,500 కోట్ల పథకం



దిల్లీ: బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల కోసం రూ.37,500 కోట్ల ప్రోత్సాహక పథకానికి కేంద్ర మంత్రివర్గం త్వరలో ఆమోదం తెలిపే అవకాశం ఉంది. స్వచ్ఛ ఇంధన ఉత్పత్తిని పెంచడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం కోసం ఈ పథకాన్ని తీసుకురానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ పథకం కోసం బొగ్గు మంత్రిత్వ శాఖ రూ.37,500 కోట్ల ఆర్థిక వ్యయంతో ఇప్పటికే కేబినెట్ నోట్‌ను సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను వేగవంతం చేయడం ద్వారా ఎల్ఎన్‌జీ, యూరియా, అమ్మోనియం నైట్రేట్, మిథనాల్ వంటి కీలక కమొడిటీల దిగుమతులను తగ్గించి.. స్వయం సమృద్ధిని సాధించడమే ఈ పథకం లక్ష్యం. 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు గ్యాసిఫికేషన్ సామర్థ్యాన్ని సాధించాలనే జాతీయ లక్ష్యానికి ఇది తోడ్పడుతుంది. ఈ పథకంలో ఒక ప్రాజెక్టుకు లభించే గరిష్ఠ ఆర్థిక సహాయాన్ని రూ.3,000 కోట్లుగా నిర్ణయించారు. గత పథకంలో ఒక ప్రాజెక్టు కింద ప్రైవేట్ రంగానికి గరిష్ఠంగా రూ.1,000 కోట్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు రూ.1,350 కోట్ల ప్రోత్సాహకమే లభించేది.

● పశ్చిమాసియాలో ఇటీవల తలెత్తిన ఉద్రిక్తతలు, ఇంధన సరఫరాలో అంతరాయాలు కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ బొగ్గును ఇంధనాలు, రసాయనాలుగా మార్చడం ద్వారా ఇంధన భద్రత పటిష్ఠం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం మన దేశంలో 401 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. దేశ ఇంధన అవసరాల్లో 55 శాతానికి పైగా బొగ్గు తీరుస్తోంది.

జూన్‌లో ముడి చమురు ఉత్పత్తి పెంపు!

● హార్ముజ్ అంతరాయాలున్నా ఒపెక్+ అంగీకారం

● కాగితాలకే పరిమితం కావొచ్చంటున్న విశ్లేషకులు



లండన్: ఒపెక్+ దేశాలు ముడి చమురు ఉత్పత్తి పెంపునకు ప్రణాళికలు రూపొందించినట్లు సంబంధిత వర్గాలు ఆదివారం తెలిపాయి. అయితే అమెరికా-ఇరాన్ యుద్ధ పరిణామాల్లో, గల్ఫ్ చమురు సరఫరాలకు అంతరాయం కలుగుతున్నంత కాలం.. ఈ పెంపు కాగితాలకే పరిమితమవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 7 ఒపెక్+ దేశాలు జూన్‌లో చమురు ఉత్పత్తి లక్ష్యాన్ని రోజుకు సుమారు 1,88,000 బ్యారెళ్ల మేర పెంచడానికి సూత్రప్రాయంగా అంగీకరించినట్లు సమాచారం. ఉత్పత్తి పెంపునకు ఒపెక్+ దేశాలు అంగీకరించడం ఇది వరుసగా మూడో నెల. యుద్ధం ఆగాక, చమురు సరఫరా పెంచడానికి ఈ దేశాలు సిద్ధంగా ఉన్నాయని ఈ చర్య సూచిస్తోంది.

యూఏఈ వైదొలగినా..

గత వారం కూటమి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) వైదొలగినప్పటికీ.. ఉత్పత్తి లక్ష్యాలను పెంచే ప్రణాళికలతో ఒపెక్+ ముందుకు సాగుతోంది. సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్, అల్జీరియా, కజకిస్థాన్, రష్యా, ఒమన్ దేశాలు ఆదివారం సమావేశమయ్యాయి. యూఏఈ వైదొలగడంతో, ఇరాన్‌తో పాటు ఒపెక్+లో ప్రస్తుతం 21 సభ్య దేశాలున్నాయి. ఇటీవల కొన్నేళ్లుగా చూస్తే 7 దేశాలు, యూఏఈ మాత్రమే నెలవారీ ఉత్పత్తి నిర్ణయాల్లో పాలుపంచుకుంటున్నాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఇరాన్ యుద్ధం, దాని ఫలితంగా హార్ముజ్ జల సంధి మూసివేత కారణంగా ఒపెక్+ సభ్య దేశాలైన సౌదీ అరేబియా, ఇరాక్, కువైట్‌లతో పాటు యూఏఈ నుంచి చమురు ఎగుమతులు కుంటుపడ్డాయి. ఈ కూటమిలో ఉత్పత్తిని పెంచగలిగిన దేశాలు ఇవే.

హార్ముజ్ జల సంధి తెరిస్తేనే..

హార్ముజ్ జల సంధిలో నౌకా రవాణా ప్రారంభమయ్యే వరకు, చమురు ఉత్పత్తి పెంపు ప్రభావం చాలా వరకు నామమాత్రంగానే ఉంటుందని, ఆ తర్వాత కూడా సాధారణ స్థితికి రావడానికి కొన్ని వారాలు పడుతుందని అంచనా. చమురు సరఫరాల్లో అంతరాయం కారణంగా 1-2 నెలల్లో విమాన ఇంధన కొరత ఎదురవ్వొచ్చని, ప్రపంచ ద్రవ్యోల్బణం అధికమవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. గత వారం చమురు బ్యారెల్ ధర, నాలుగేళ్ల గరిష్ఠమైన 125 డాలర్లకు చేరిన సంగతి విదితమే.

● అన్ని ఒపెక్+ సభ్య దేశాల ముడి చమురు ఉత్పత్తి.. మార్చిలో సగటున రోజుకు 35.06 మిలియన్ బ్యారెళ్లుగా ఉంది. ఫిబ్రవరితో పోలిస్తే ఇది రోజుకు 7.7 మి.బ్యారెళ్లు తక్కువ అని ఒపెక్ గత నెలలో తెలిపింది. ఎగుమతులపై ఆంక్షల కారణంగా ఇరాక్, సౌదీ అరేబియా అత్యధికంగా చమురు ఉత్పత్తిలో కోత విధించాయి.

ఐటీ వ్యయాలు పెంచుదాం

● ప్రభుత్వ రంగ బ్యాంకుల సన్నాహాలు

● ఆంథ్రోపిక్ మిథోస్‌తో సైబర్ ముప్పు నేపథ్యం



ప్రభుత్వ రంగ బ్యాంకులు తమ ఐటీ వ్యవస్థలను పటిష్ఠం చేయడానికి, ఖాతాదారుల డేటాను కాపాడేందుకు ఐటీ వ్యయాల పెంపునకు సిద్ధమవుతున్నాయి. ఆంథ్రోపిక్ సంస్థకు చెందిన క్లాడ్ మిథోస్ ఏఐ టూల్ వల్ల ఆర్థిక డేటా భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్న ఆందోళనలే ఇందుకు నేపథ్యం. ఐటీ వ్యవస్థల సైబర్ సెక్యూరిటీ బలహీనతలను గుర్తించి, బయటపెట్టడంలో మిథోస్ అధునాతన సామర్థ్యాలు బలంగా ఉన్నందున.. బ్యాంకింగ్ వ్యవస్థలకు ముప్పు ఏర్పడుతుందనే ఆందోళనలు పెరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ లోపాలు బయటపడిన తర్వాత, వాటిని ఆయుధంగా మార్చుకునే సమయం గతంలో 19 రోజులుగా ఉండగా, ప్రస్తుతం అది 72 గంటల కంటే తక్కువకు పడిపోయింది. ఈ నేపథ్యంలోనే బ్యాంకులు అప్రమత్తమయ్యాయి.

మనుగడకు తప్పదు

సైబర్ దాడులను నిరోధించేందుకు ఐటీ వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయడానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐటీపై ఖర్చు పెంచనున్నట్లు పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ ఎండీ, సీఈఓ స్వరూప్ కుమార్ సాహా తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం కంటే ఈ సారి ఐటీ వ్యయాలు ఎక్కువగా ఉంటాయని, అందులో ప్రధాన భాగం సైబర్ భద్రతకే కేటాయిస్తామని యూకో బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్వనీ కుమార్ స్పష్టం చేశారు.

● ప్రభుత్వ చర్యలు ఇలా: మిథోస్ వల్ల కలిగే ముప్పు అంచనా వేయడానికి, నివారణ చర్యలను సూచించడానికి ఎస్‌బీఐ ఛైర్మన్ సి.శ్రీనివాసులు శెట్టి నేతృత్వంలో ఒక కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఐటీ వ్యవస్థలను సురక్షితం చేసుకోవడానికి అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు.

● ఏప్రిల్ 7న క్లాడ్ మిథోస్ పైలట్ సేవల ప్రారంభం.. హ్యాకింగ్ సామర్థ్యాలపై ఆందోళనను రేకెత్తించింది. ఈ మోడల్ సైబర్ భద్రత, హ్యాకింగ్‌ల్లో మనుషుల కంటే నైపుణ్యాన్ని చూపించిందని ఆంథ్రోపిక్ పేర్కొంది. ప్రతి ప్రధాన ఆపరేటింగ్ సిస్టమ్, వెబ్ బ్రౌజర్‌లో భద్రతా లోపాలను గుర్తించిందని తెలిపింది.

డీమార్ట్ లాభం రూ.656 కోట్లు



దిల్లీ: డీమార్ట్ పేరిట విక్రయశాలలను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్, గత ఆర్థిక సంవత్సరం (2025-26) జనవరి-మార్చిలో రూ.656.42 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.550.79 కోట్లతో పోలిస్తే ఇది 19.17% అధికం. కార్యకలాపాల ఆదాయం రూ.14,871.86 కోట్ల నుంచి 18.9% పెరిగి రూ.17,683.86 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 18.5% శాతం పెరిగి రూ.16,797.86 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయంతో కలిపి కంపెనీ మొత్తం ఆదాయం 18.83% పెరిగి రూ.17,702.03 కోట్లకు చేరింది. 2025-26 పూర్తి ఆర్థిక సంవత్సరానికి అవెన్యూ సూపర్‌మార్ట్స్ నికర లాభం 9.7% పెరిగి రూ.2,969.86 కోట్లకు; మొత్తం ఏకీకృత ఆదాయం 15.8% పెరిగి రూ.68,894.84 కోట్లకు చేరింది.

వాహన తయారీ సంస్థలపై రూ.25,000 కోట్ల ప్రభావం !

పర్యావరణ పరిరక్షణ నిబంధనల అమలు నేపథ్యం

దిల్లీ: పర్యావరణ పరిరక్షణ (కాలం చెల్లిన వాహనాలు) నిబంధనలు 2025 అమల్లోకి రావడంతో, గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి దేశీయ వాహన పరిశ్రమ నికర లాభాలపై స్థూలంగా రూ.25,000 కోట్ల ప్రభావం పడుతుందని సంస్థలు అంచనా వేస్తున్నాయి. గతంలో విక్రయించిన వాహనాలకు సంబంధించి పర్యావరణ నష్టపరిహారం కోసం, వాహన తయారీదార్లు కేటాయింపులు జరపాల్సి రావడం ఇందుకు నేపథ్యం. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ 2025 జనవరిలో నోటిఫై చేసిన పర్యావరణ పరిరక్షణ (కాలం చెల్లిన వాహనాల) నిబంధనలు వాహన తయారీదార్లను కలవరపెడుతున్నాయి. ఆ నోటిఫికేషన్‌లోని నిబంధన 4 (6) ప్రకారం.. ఉత్పత్తి సంస్థ తన కార్యకలాపాలను నిలిపివేసిన సందర్భంలో, మార్కెట్‌లో అప్పటికే అందుబాటులో ఉంచిన వాహనాలకు సంబంధించి తన విస్తరించిన ఉత్పత్తిదారు బాధ్యత (ఈపీఆర్)కు కట్టుబడి ఉండాలి. ఈ నిబంధన 'ప్రొవిజన్స్, కంటింజెంట్ లయబిలిటీస్ అండ్ కంటింజెంట్ అసెట్స్' అనే అకౌంటింగ్ ప్రమాణం ఐఎన్‌డీ ఏఎస్ 37ను ప్రేరేపిస్తుంది. దీని ప్రకారం వాహన తయారీదారులు గత 20 ఏళ్లుగా విక్రయించిన ప్రైవేటు వాహనాలకు, 15 ఏళ్లుగా అమ్మిన వాణిజ్య వాహనాలకు ఈపీఆర్ సర్టిఫికెట్ల వ్యయం కోసం గణనీయంగా ఆర్థిక కేటాయింపులు చేయాల్సి ఉంటుంది.

కొత్త నిర్మాణ నిబంధనలతో ఆసుపత్రులకు మేలు

నాట్‌హెల్త్ అంచనా

దిల్లీ: ఆసుపత్రి భవనాల ఎత్తుకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనలు.. నగరాల్లో ఎదురవుతున్న స్థలాల కొరత, పడకల సామర్థ్యం వంటి సమస్యలను పరిష్కరిస్తాయని ఆరోగ్య సంరక్షణ పరిశ్రమ సంఘం నాట్‌హెల్త్ పేర్కొంది. 'నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ స్టాండర్డ్స్ (ఎన్‌బీసీఎస్) 2026'ను ప్రభుత్వం నోటిఫై చేయడాన్ని సంస్థ స్వాగతించింది. దీని ప్రకారం.. ఆసుపత్రి భవనాల ఎత్తుపై ఉన్న పరిమితులను ప్రభుత్వం సడలించింది. మెరుగైన అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, 45 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో కూడా ఐసీయూ (అత్యవసర చికిత్సా విభాగం) ఏర్పాటు చేసేందుకు ఈ కొత్త నిబంధనలు అనుమతిస్తాయి. నగరాల్లో భూమి ధరలు ఎక్కువ ఉండటం వల్ల ఆసుపత్రుల విస్తరణ కష్టతరంగా మారింది. ఇప్పుడు మరిన్ని అంతస్తులు నిర్మించేందుకు అనుమతి లభించడం వల్ల, ఉన్న స్థలంలోనే గరిష్ఠంగా మౌలిక సదుపాయాలు కల్పించుకోవడానికి వీలు కానుంది. దేశంలో భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను సిద్ధం చేయడానికి ఈ సంస్కరణలు దోహదపడతాయని నాట్‌హెల్త్ ప్రెసిడెంట్, అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ సంగీతా రెడ్డి తెలిపారు.

ఎయిరిండియా బోర్డు సమావేశం 7న

దిల్లీ/ముంబయి: టాటా గ్రూప్ విమానయాన సంస్థ ఎయిరిండియా బోర్డు సమావేశం ఈ నెల 7న ముంబయిలో జరగనుంది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనుంది. వ్యయ నియంత్రణ ప్రణాళికలు, కొత్త సీఈఓ ఎంపిక వంటి అంశాలు చర్చకు రానున్నాయి. పశ్చిమాసియా యుద్ధం కారణంగా, ముడిచమురు ధరలకు అనుగుణంగా విమాన ఇంధన ధర పెరగడం, కొన్ని దేశాలు తమ గగనతలాన్ని మూసివేయడంతో, విమానయాన సంస్థలకు ఆర్థిక భారం పెరిగింది. విమాన ఇంధన ధర పెరిగిన నేపథ్యంలో, టికెట్ ధరల నుంచి భోజనాన్ని వేరు చేయడం, బిజినెస్ క్లాస్ ప్రయాణికులకు లాంజ్ సదుపాయాన్ని ఐచ్ఛికం చేయడం వంటి కఠిన నిర్ణయాలను కూడా ఎయిరిండియా బోర్డు పరిశీలించొచ్చని చెబుతున్నారు. సంస్థ ప్రస్తుత సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ ఈ ఏడాది చివర్లో పదవి నుంచి తప్పుకోనున్నారు. ఆయన స్థానంలో కొత్త సీఈఓను ఎంపిక చేయడంపై బోర్డు చర్చించనుంది.

మారుతీకి దేశీయ విపణిలో 42% వాటా

ఏప్రిల్‌లో 1,91,122 కార్ల విక్రయాలు



కార్ల తయారీలో దేశీయ అగ్రగామి సంస్థ మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ), గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో మన విపణిలో 42% వాటా సాధించింది. 2024-25 కార్ల విపణిలో సంస్థ వాటా 39 శాతమే. నూతన ఆర్థిక సంవత్సరం (2026-27) ప్రారంభ నెల (ఏప్రిల్)లో రికార్డు స్థాయిలో దేశీయంగా 1,91,122 కార్లను సంస్థ టోకుగా విక్రయించి.. మార్కెట్ వాటాను మరో 3% పెంచుకుంది. ఎంఎస్ఐ మార్కెటింగ్, సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ మాట్లాడుతూ, కంపెనీ మార్కెట్ వాటా పెరుగుదలకు కార్లు ప్రధాన కారణమైనప్పటికీ, స్పోర్ట్స్ వినియోగ వాహనాలు (ఎస్‌యూవీ) కూడా గణనీయ తోడ్పాటు అందించాయని తెలిపారు. ఇప్పటివరకు 2025 డిసెంబరులో విక్రయించిన 1,82,165 కార్లు రికార్డుగా ఉండగా, గత నెల విక్రయాలు తాజా రికార్డుగా నిలిచాయి. 2025 ఏప్రిల్‌తో పోలిస్తే, గత నెలలో ప్రయాణికుల కార్ల విక్రయాలు 68,244 నుంచి 96,725కు చేరాయి. ఎస్‌యూవీల విక్రయాలు 141.6% వృద్ధితో 55,066కు చేరాయి. చిన్న కార్లలో ఆల్టో, ఎస్-ప్రెసో, సెలెరియో, వ్యాగన్ఆర్‌ల విక్రయాలు 74.4% పెరిగాయి. కార్ల తయారీ సంస్థలు కొత్త ఆర్థిక సంవత్సరాన్ని బలంగా ప్రారంభించాయి.

అత్యధికంగా అమ్ముడైన మోడళ్లివీ

ఈ ఏడాది ఏప్రిల్‌లో మారుతీ సుజుకీ తయారు చేస్తున్న సెడాన్ కారు డిజైర్, ఎస్‌యూవీల్లో టాటా పంచ్.. అత్యధికంగా విక్రయమైన మోడళ్లుగా నిలిచాయని పరిశ్రమ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. డిజైర్ కార్లు ఏప్రిల్‌లో 23,580, గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద 2,29,130 విక్రయమయ్యాయి. పంచ్ ఎస్‌యూవీలు గతనెలలో 19,107, 2025-26లో 1,83,980 అమ్ముడైనట్లు సమాచారం.

ఈ ఏడాది చివరకు 160 హోటళ్లు: రాడిసన్

దిల్లీ: ఈ ఏడాది చివరికల్లా మనదేశంలో 157-160 హోటళ్లలో 19,000-19,500 గదులు నిర్వహించాలని రాడిసన్ హోటల్ గ్రూప్ నిర్ణయించింది. చైనాకు చెందిన జిన్ జియాంగ్ ఇంటర్నేషనల్ ఆధీనంలో ఈ గ్రూప్ ఉంది. ప్రస్తుతం దేశంలో 142 హోటళ్లలో 17,000 గదులను తాము నిర్వహిస్తున్నట్లు రాడిసన్ గ్రూప్ దక్షిణాసియా ఎండీ నిఖిల్ శర్మ తెలిపారు. మరో 18 హోటళ్లను డిసెంబరు కల్లా సిద్ధం చేస్తామని, ఇందువల్ల మరో 2000-2500 గదులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇప్పటికే 84 హోటళ్ల అభివృద్ధిలో ఉన్నందున, 2030 కల్లా మొత్తం భారత్‌లో హోటళ్ల సంఖ్యను 500కు చేరుస్తామని వివరించారు.

కోడి గుడ్లు

4న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	525	తూ/ప గోదావరి	515
వరంగల్	527	విశాఖపట్నం	515
విజయవాడ	535	చిత్తూరు	593

పసిడి బలహీనం!

కమొడిటీస్ ఈ వారం

పసిడి



అంతర్జాతీయ ఇంధన సంక్షోభ పరిణామాల నడుమ, పసిడి జూన్ కాంట్రాక్టు గత వారం వెనకడుగు వేసింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లున్నా, వడ్డీ రేట్లు పెంచేందుకు కేంద్ర బ్యాంకులు సిద్ధంగా లేకపోవడం పసిడి ధరలపై ప్రభావం చూపింది. ఈ వారం సానుకూల ధోరణిలో చలిస్తే రూ.1,53,590 వద్ద నిరోధం ఎదురయ్యే అవకాశం ఉంది. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.1,55,828-రూ.1,58,648 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.1,48,532 కంటే దిగువకు వస్తే రూ.1,45,712-రూ.1,43,474 వరకు తగ్గొచ్చు. ఈ స్థాయిల నుంచి నిర్ణయాత్మకంగా ధర తగ్గితే, కొంత కాలం పసిడి బలహీన ధోరణిలో కొనసాగొచ్చు.

వెండి



వెండి జులై కాంట్రాక్టు గత వారం నమోదు చేసిన గరిష్ఠ స్థాయిని అధిగమించకపోతే, మరింత కిందకు దిగి వచ్చే అవకాశం ఉంది. ఇది స్వల్పకాలానికి మాత్రమే. మధ్య, దీర్ఘకాలానికి వెండి ధర తగ్గినప్పుడల్లా మరిన్ని లాంగ్ పొజిషన్లను జత చేసుకోవడం మంచి వ్యూహమే అవుతుంది. రూ.2,40,494 వద్ద తక్షణ మద్దతు, రూ.2,57,862 వద్ద నిరోధం ఎదురుకావచ్చు.

ప్రాథమిక లోహాలు



● రాగి మే కాంట్రాక్టుకు రూ.1,256.20 వద్ద తక్షణ మద్దతు ఉంది. దీన్ని కోల్పోతే రూ.1,230.50-1,214.50 వరకు తగ్గొచ్చు. రూ.1,297.90 కంటే ఎగువన చలిస్తే రూ.1,313.90-1,339.60 వరకు పెరిగే అవకాశం ఉంటుంది.

● సీసం మే కాంట్రాక్టును రూ.192.55-204.60 స్థాయిలో ట్రేడింగ్ చేయడం మంచి వ్యూహమవుతుంది.

● జింక్ మే కాంట్రాక్టు రూ.352.45 పైన నిలదొక్కుకోకుంటే రూ.335.95 స్థాయికి దిగి రావచ్చు.

● అల్యూమినియం మే కాంట్రాక్టును రూ.387.15 స్టాప్‌లాస్‌తో విక్రయించడం మంచి వ్యూహమవుతుంది.

ఇంధన రంగం



● ముడి చమురు మే కాంట్రాక్టుకు అంతర్జాతీయ పరిణామాలు కీలకం కానున్నాయి. హార్ముజ్ జలసంధి విషయమై అమెరికా-ఇరాన్ మధ్య చోటుచేసుకునే పరిణామాలను ట్రేడర్లు గమనించాలి. రూ.10,510 వద్ద తక్షణ నిరోధం, రూ.8,855 వద్ద మద్దతు ఉంది.

● సహజవాయువు మే కాంట్రాక్టు రూ.268 వద్ద నిలదొక్కుకుంటే సానుకూలంగా చలించే అవకాశం ఉంటుంది. లేకుంటే రూ.246, రూ.240 వరకు పడిపోవచ్చు.

వ్యవసాయ ఉత్పత్తులు



● పసుపు మే కాంట్రాక్టుకు రూ.16,357 వద్ద నిరోధం ఉంది. దీన్ని అధిగమిస్తే రూ.16,782; రూ.17,045 వరకు పెరగొచ్చు. ఒకవేళ రూ.15,669 కంటే కిందకు వస్తే రూ.15,406; రూ.14,981 వరకు తగ్గొచ్చు.

● జీలకర్ర మే కాంట్రాక్టు సానుకూల ధోరణిలో చలిస్తే రూ.20,925 వద్ద నిరోధం ఎదురుకావచ్చు. ఈ స్థాయిని అధిగమిస్తే రూ.21,405; రూ.21,885 వరకు పెరిగే అవకాశం ఉంటుంది. ఒకవేళ రూ.19,965 కంటే కిందకు వస్తే రూ.19,485; రూ.19,005 వరకు దిద్దుబాటు కావచ్చు.

– ఆర్ఎల్‌పీ కమొడిటీ అండ్ డెరివేటివ్స్

గతవారం కదలికలు ఇలా

కమొడిటీ	ప్రారంభం	ముగింపు	వృద్ధి/క్షీణత
	(రూ.లలో)		(శాతంలో)
పసిడి (జూన్)	1,52,695	1,51,352	-0.88
వెండి (జులై)	2,49,033	2,51,000	0.79
రాగి (మే)	1,273.70	1,281.90	0.64
సీసం (మే)	197.05	199.40	1.19
జింక్ (మే)	350.95	343.05	-2.25
అల్యూమినియం (మే)	377.05	368.90	-2.16
ముడి చమురు (మే)	8,980	9,652	7.48
సహజ వాయువు (మే)	238.90	264.10	10.55
పసుపు (మే)	16,448	15,932	-3.14
జీలకర్ర (మే)	20,860	20,445	-1.99

స్థిరీకరణ దిశగా సూచీలు

స్టాక్ మార్కెట్ ఈ వారం

● అమెరికా-ఇరాన్ పరిణామాలు కీలకం ● కార్పొరేట్ ఆర్థిక ఫలితాలపైనా దృష్టి

● 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాల ప్రభావమూ ఉంటుంది

● ఐటీ, టెలికాం షేర్లకు సానుకూలతలు ● విశ్లేషకుల అంచనాలు



దేశీయ సూచీలు సోమవారం స్థిరీకరణకు గురికావొచ్చన్నది విశ్లేషకుల అంచనా. పెరుగుతున్న చమురు ధరలకు తోడు, ఇరాన్ నౌకాశ్రయాలను అమెరికా నౌకాదళం మరికొన్ని నెలలు దిగ్బంధించొచ్చన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. నేడు వెలువడే 5 రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కూడా ప్రభావం చూపుతాయి. అంతర్జాతీయంగా సానుకూల పరిణామాలు కనిపిస్తే, సూచీలు లాభాల్లో ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. కార్పొరేట్ సంస్థల మార్చి త్రైమాసిక ఫలితాలు, విదేశీ పెట్టుబడిదార్ల ధోరణి కూడా దిశానిర్దేశం చేయొచ్చు. హార్ముజ్ జలసంధిలో నౌకా రవాణాపై స్పష్టత వచ్చేవరకు మార్కెట్లలో అనిశ్చితి కొనసాగొచ్చని ఓ బ్రోకరేజీ అంటోంది. నిఫ్టీ-50 సూచీకి 24,400 పాయింట్ల వద్ద నిరోధం, 23,600-23,500 వద్ద మద్దతు కనిపిస్తోందంటున్నారు. ఒక వేళ 24,000 స్థాయికి కిందకొస్తే బేరిష్ ధోరణిగా పరిగణించాలని చెబుతున్నారు. ఎఫ్‌పీఐలు ఏప్రిల్‌లో రూ.60,847 కోట్ల విక్రయాలు జరిపారు. తయారీ పీఎంఐ (4న), సేవల పీఎంఐ (6న) గణాంకాలను పరిశీలించాలి. వివిధ రంగాలపై విశ్లేషకులు ఏమంటున్నారంటే..

● నిఫ్టీ **వాహన** సూచీ 25,300-26,800 శ్రేణి వెలుపలకు వస్తేనే ఎటు వైపు వెళ్లొచ్చన్నది తెలుస్తుంది. మహీంద్రా అండ్ మహీంద్రా, హీరో మోటోకార్ప్, బజాజ్ ఆటో ఫలితాలు ఈ వారమే వెలువడనున్నాయి.

● **ఎఫ్ఎంసీజీ** సూచీలో ఇప్పటి దాకా కనిపించిన సానుకూల ధోరణికి కాస్త విరామం ఏర్పడొచ్చు. 51,800 స్థాయికి పైకి వస్తే మరింత పెరగొచ్చు. కమొడిటీ ధరలు 8-10% పెరగ్గా, ఉత్పత్తుల ధరలను 2-5% మేరే పెంచినట్లు హెచ్‌యూఎల్ పేర్కొంది.

● ఆస్తుల నాణ్యత, రుణ వృద్ధి తగ్గే అవకాశం ఉన్నందున **బ్యాంక్** నిఫ్టీపై ఒత్తిడి కొనసాగొచ్చు. 54,000-57,500 స్థాయిలో స్థిరీకరణకు గురికావొచ్చు. 54,500 దిగువన సెంటిమెంటు ప్రతికూలంగా మారొచ్చు.

● **టెలికాం** షేర్లపై విశ్లేషకులు సానుకూలంగానే ఉన్నారు. వొడాఫోన్ ఐడియా స్థూల ఆదాయ బకాయిలను కేంద్రం తగ్గించిన ప్రభావం సోమవారం ట్రేడింగ్‌లో ఉండొచ్చు. కంపెనీ రూ.25,000 కోట్ల నిధుల సమీకరణకు, ఈ నిర్ణయం మద్దతు అందిస్తుందని భావిస్తున్నారు.

● **యంత్రపరికరాల** కంపెనీల షేర్లకు ఒత్తిడి ఎదురుకావొచ్చు. ముడి చమురు ధరల పెరుగుదల వల్ల, జూన్ త్రైమాసికంలో మార్జిన్లపై ప్రభావం పడొచ్చు. ఎంపిక చేసిన స్క్రిప్‌లలో కదలికలుంటాయి. మంగళవారం ఎల్ అండ్ టీ ఫలితాలున్నాయి.

● ఫిబ్రవరి నుంచీ నష్టపోతూ వస్తున్న **ఐటీ** షేర్లు కొంత రికవరీ కావచ్చు. ఇప్పటిదాకా ఫలితాలు ప్రకటించిన కంపెనీల యాజమాన్యాలు 'ఏఐ ఆధారిత ఆదాయం తగ్గొచ్చని' అభిప్రాయపడ్డాయి. ఈ వారం టాటా టెక్నాలజీస్, కోఫోర్జ్, కేపీఐటీ టెక్నాలజీస్, హెగ్జావేర్ టెక్నాలజీస్ ఫలితాలున్నాయి.

● **ఔషధ** కంపెనీల షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. అమెరికా కంపెనీ ఆర్గానన్‌ను సన్‌ఫార్మా కొనుగోలు చేస్తున్న వార్తల మధ్య, ఈ తరహాలో ఇతర కంపెనీల ప్రణాళికలేమైనా ఉన్నాయేమోనని మదుపర్లు పరిశీలిస్తారు. ఫలితాల నేపథ్యంలో ఆయా షేర్లలో కదలికలు ఉండొచ్చు. లుపిన్ 7న ఫలితాలు ప్రకటించనుంది.

● అధిక ముడి చమురు ధరల మధ్య **చమురు**-గ్యాస్ షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. అమెరికా-ఇరాన్ యుద్ధ పరిణామాలను గమనించాలి. ఓఎన్‌జీసీ, ఓఐఎల్, ఆర్ఐఎల్ షేర్లు ఈ వారం రాణించే అవకాశం ఉంది.

● ఇటీవలి నష్టాల అనంతరం **సిమెంటు** కంపెనీల షేర్లు కాస్త పెరిగే అవకాశం ఉంది. మార్చి త్రైమాసికంలో ప్రధాన కంపెనీలు అంచనాలను మించి ఫలితాలు ప్రకటించడం ఇందుకు నేపథ్యం. ఈ వారంలో అంబుజా సిమెంట్స్, శ్రీ సిమెంట్ ఫలితాలు కీలకం కానున్నాయి.

● ఎక్కువ కొనుగోళ్లు జరిగిన నేపథ్యంలో **లోహ** కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. రాబోయే రోజుల్లో ఉక్కుకు గిరాకీ తగ్గొచ్చు.

వాహన	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అశోక్ లేలాండ్	162.09	166.80	157.90
బజాజ్ ఆటో	9,994.00	10,488.00	9,108.00
ఐషర్ మోటార్స్	7,109.00	7,245.70	6,909.70
హీరో మోటోకార్ప్	5,099.00	5,172.30	4,983.30
ఎం అండ్ ఎం	3,097.50	3,157.60	3,017.00
మారుతీ	13,314.00	13,604.70	12,824.70
టీఎమ్‌పీవీ	341.55	358.20	329.20
టీవీఎస్ మోటార్	3,492.90	3,579.60	3,371.80

ఎఫ్ఎంసీజీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా ఇండస్ట్రీస్	5,726.00	5,815.30	5,599.30
కోల్గేట్ పామోలివ్	2,096.20	2,159.00	2,058.60
డాబర్ ఇండియా	441.50	461.60	430.30
ఇమామీ	444.50	465.60	433.30
హిందుస్థాన్ యునిలీవర్	2,250.90	2,434.30	2,119.90
ఐటీసీ	314.90	319.40	311.00
మారికో	775.00	787.20	759.50

యంత్రపరికరాలు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	352.41	362.60	336.90
సీజీ పవర్	813.35	834.90	793.20
ఎల్ అండ్ టీ	4014.00	4144.70	3924.70
సీమెన్స్	3808.20	3909.90	3683.70
థెర్మాక్స్	4077.60	4221.30	3850.70

బ్యాంకింగ్	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	771.70	787.50	754.40
ఐసీఐసీఐ బ్యాంక్	1,263.40	1,278.10	1,251.70
ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్	69.64	70.60	68.50
ఇండస్‌ఇండ్ బ్యాంక్	916.05	935.20	885.70
కోటక్‌మహీంద్రా బ్యాంక్	383.30	393.40	370.30
పీఎన్‌బీ	109.36	112.10	106.70
ఎస్‌బీఐ	1,068.45	1,084.40	1,055.00

ఔషధ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	1,389.50	1,416.10	1,365.30
బయోకాన్	359.65	365.90	351.10
సిప్లా	1,309.60	1,339.60	1,290.00
డాక్టర్ రెడ్డీస్	1,322.90	1,352.30	1,298.90
గ్లెన్‌మార్క్ ఫార్మా	2,406.30	2,486.20	2,345.60
నాట్కో ఫార్మా	1,095.75	1,116.50	1,076.60

లోహ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	1,038.00	1,077.50	1,010.60
హిందుస్థాన్ కాపర్	534.85	563.90	517.50
ఎన్ఎమ్‌డీసీ	90.37	93.10	88.40
సెయిల్	184.62	188.90	177.50
టాటా స్టీల్	211.36	218.20	206.60
వేదాంతా	271.55	300.70	254.10

ఐటీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	1,199.10	1,228.60	1,169.20
ఇన్ఫోసిస్	1,181.80	1,207.30	1,146.90
పర్సిస్టెంట్ సిస్టమ్స్	4,800.00	4,865.50	4,728.70
టీసీఎస్	2,473.90	2,520.60	2,414.60
టెక్ మహీంద్రా	1,473.50	1,503.40	1,430.60
విప్రో	200.65	203.10	198.80

చమురు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
రిలయన్స్ ఇండస్ట్రీస్	1,430.80	1,464.20	1,376.40
బీపీసీఎల్	300.45	306.30	292.70
హెచ్‌పీసీఎల్	374.55	381.10	366.10
ఐఓసీఎల్	142.25	144.50	140.00
ఓఎన్‌జీసీ	299.55	311.90	290.80
ఆయిల్ ఇండియా	490.80	512.00	474.80

సిమెంటు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1,422.10	1,454.00	1,390.00
అంబుజా సిమెంట్స్	444.20	454.90	434.70
ఇండియా సిమెంట్స్	395.90	411.40	382.80
శ్రీ సిమెంట్	24,195.00	24,798.30	23,498.30
అల్ట్రాటెక్ సిమెంట్	11,586.00	11,908.70	11,322.70

టెలికాం	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భారతీ ఎయిర్‌టెల్	1,886.80	1,930.30	1,838.30
ఎమ్‌టీఎన్ఎల్	31.18	31.80	30.30
టాటా కమ్యూనికేషన్స్	1,580.50	1,601.40	1,557.80
వొడాఫోన్ ఐడియా	10.22	10.50	9.90

ఆర్‌ఎల్‌డీఏలో ఇంజినీర్లు

భారత ప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆర్‌ఎల్‌డీఏ).. ఒప్పంద ప్రాతిపదికన సైట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

● సైట్ ఇంజినీర్ (ఎలక్ట్రికల్/సివిల్): 40

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 55 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం) సివిల్ లేదా ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్‌తో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** మే 22, 2026 నాటికి 45 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు రూ.76,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 22. **ఎంపిక:** అభ్యర్థుల విద్యార్హత మార్కులు, పని అనుభవం, చివరి వేతనం, ఇంటర్వ్యూలతో. ప్రారంభంలో ఏడాది కాలానికి ఉద్యోగంలోకి తీసుకుంటారు. ఆ తర్వాత ఈ వ్యవధిని పొడిగించవచ్చు.

వెబ్‌సైట్: https://rlda.indianrailways.gov.in/



యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) 1865 అప్రెంటిస్‌ల భర్తీకి ప్రకటన వెలువరించింది. డిగ్రీతో దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్షలో ప్రతిభతో అవకాశం కల్పిస్తారు. ఎంపికైనవారు పని చేస్తోన్న ప్రాంతాన్ని బట్టి ప్రతి నెలా రూ.15,000 - 20,000 స్టైపెండ్ అందుకోవచ్చు.

యూనియన్ బ్యాంకులో అప్రెంటిస్ అవుతారా!

ప్రభుత్వ, అనుబంధ సంస్థలు నియామకాల్లో అప్రెంటిస్ విధానానికి ప్రాధాన్యమిస్తున్నాయి. వ్యవధి ఏడాదే అయినప్పటికీ ప్రతి నెలా స్టైపెండ్ అందుతుంది. ఈ అనుభవంతో ప్రైవేటు సంస్థల్లో కొంచెం సులువుగానే ఉద్యోగం పొందవచ్చు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలకు మార్గం ఏర్పడుతుంది. అందువల్ల తాజా గ్రాడ్యుయేట్లు బ్యాంకుల్లో అప్రెంటిస్ ఉద్యోగాలకు ప్రయత్నించవచ్చు.

అప్రెంటిస్‌గా ఏడాది సేవల తర్వాత ప్రైవేటు బ్యాంకులు, ఇన్స్యూరెన్స్ సంస్థలు, ఆర్థిక సేవలు అందించే ఇతర కంపెనీల్లో ఉపాధి పొందగలరు. ముఖ్యంగా బ్యాంకు ఉద్యోగాలే లక్ష్యంగా ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడమే మంచిది. ఈ పరీక్ష రాయడం వల్ల సన్నద్ధత ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడానికీ వీలవుతుంది. తర్వాత రాసే పరీక్షలకు మంచి అనుభవంగానూ పనికొస్తుంది. ఇప్పటికే బ్యాంకుల్లో అప్రెంటిస్‌గా సేవలందించినవారికి అవకాశం ఉండదు.

అర్హతలు, ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కోరుకున్న రాష్ట్రంలో ఖాళీలకు పోటీ పడొచ్చు. ఆ రాష్ట్ర అధికారిక భాషల్లో మాట్లాడటం, చదవటం, రాయటం వచ్చుండాలి. అప్రెంటిస్‌గా విజయవంతమైనవారికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎన్‌ఎస్‌డీసీ) సర్టిఫికెట్ అందిస్తుంది. అప్రెంటిస్ పనిచేసే ప్రదేశాన్ని బట్టి స్టైపెండ్ మారుతుంది. రూరల్ బ్రాంచీల్లో రూ.15,000, అర్బన్ ప్రాంతాల్లో రూ.18,000, మెట్రో నగరాల్లో రూ.20,000 ప్రతి నెలా చెల్లిస్తారు.

పరీక్ష

ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. వంద మార్కులకు ఉంటుంది. ఇందులో జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్, జనరల్ ఇంగ్లిష్, క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్/సబ్జెక్టు నాలెడ్జ్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్.. ఒక్కో విభాగం నుంచీ 20 చొప్పున 100 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ప్రతి సరైన జవాబుకూ ఒక మార్కు. రుణాత్మక మార్కులు లేవు.

పరీక్షలో అర్హులకు స్థానిక భాషలో పరీక్ష నిర్వహిస్తారు. పోటీ పడుతోన్న రాష్ట్రానికి చెందిన స్థానిక భాషను పది లేదా ఇంటర్‌లో చదువుకున్నవారికి మినహాయింపు ఉంటుంది. స్థానిక భాషలో ఉత్తీర్ణులకు.. ధ్రువపత్రాలు పరిశీలించి, వైద్య పరీక్షలు నిర్వహించి, అప్రెంటిస్‌గా నియమిస్తారు. ఏపీ, తెలంగాణల్లో ఖాళీలకు పోటీపడటానికి తెలుగు భాష చదివినవారై ఉండాలి. లేదా తెలుగు రావాలి.

ప్రశ్నాంశాలు

జనరల్/ఫైనాన్షియల్ అవేర్‌నెస్: ఈ విభాగంలో ఆర్థికాంశాలకు ప్రాధాన్యం. ఆర్‌బీఐ, బ్యాంకింగ్ వ్యవస్థ, బ్యాంక్ పదజాలం, బీమా, రెపో, రివర్స్ రెపో, వడ్డీరేట్లు, బ్యాంకుల కార్యకలాపాలు, బ్యాంకుల విలీనం, తాజా ఆర్థిక నిర్ణయాలు, బ్యాంకులు-ప్రధాన కార్యాలయాలు-అధిపతులు.. తెలుసుకోవాలి. జనరల్ అవేర్‌నెస్‌లో భాగంగా తాజా సంఘటనలకు ప్రాధాన్యమివ్వాలి. దేశ చరిత్ర, సంస్కృతి, భూగోళం, పాలిటీ, సైన్సుల్లో ప్రాథమిక అవగాహననూ పరిశీలిస్తారు. వీటికోసం 8,9,10 తరగతుల్లోని ముఖ్యాంశాలు చదువుకుంటే సరిపోతుంది. వర్తమాన వ్యవహారాల కోసం జులై, 2025 నుంచి పరీక్ష తేదీ వరకు ముఖ్య సంఘటనలు అంటే.. నియామకాలు, అవార్డులు, విజేతలు, ఎన్నికలు, పుస్తకాలు-రచయితలు, ప్రముఖుల పర్యటనలు, మరణాలు..ఇవన్నీ చదవాలి.

జనరల్ ఇంగ్లిష్: ఖాళీలు పూరించడం, వాక్యంలో తప్పును గుర్తించడం, సమానార్థాలు, వ్యతిరేక పదాలు, తప్పుగా ఉన్న పదాన్ని గుర్తించడం, జాతీయాలు, సామెతలు, ప్రత్యక్ష, పరోక్ష వాక్యాలుగా మార్చడం, వాక్యంలో పదాలను క్రమ పద్ధతిలో అమర్చడం, కాంప్రహెన్షన్.. తదితర విభాగాల నుంచే వీటిని అడుగుతారు. హైస్కూల్, ఇంటర్మీడియట్ స్థాయి ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లోని వ్యాకరణాంశాలు బాగా చదువుకున్నవారు ఎక్కువ మార్కులు పొందవచ్చు.

క్వాంటిటేటివ్ అండ్ రీజనింగ్ ఆప్టిట్యూడ్: క్వాంటిటేటివ్ విభాగంలో.. నంబర్ సిస్టమ్, ఫండమెంటల్ అరిథ్‌మెటికల్ ఆపరేషన్స్ నుంచి ప్రశ్నలు వస్తాయి. అరిథ్‌మెటిక్ ఆపరేషన్స్‌లో భాగంగా.. శాతాలు, నిష్పత్తి, సరాసరి, చక్రవడ్డీ, బారువడ్డీ, లాభనష్టాలు, కాలం-పని, కాలం-దూరం, డిస్కౌంట్ బాగా చదవాలి. రీజనింగ్‌లో వెర్బల్, నాన్ వెర్బల్ ప్రశ్నలు ఉంటాయి.

కంప్యూటర్ నాలెడ్జ్: కంప్యూటర్ ఉపయోగించి, చిన్న పనులు పూర్తిచేయగలరా, లేదా తెలుసుకునేలా ప్రశ్నలు ఉంటాయి. వర్డ్, ఎక్సెల్, ఇంటర్నెట్, వెబ్ బ్రౌజింగ్, ఈమెయిల్, యూఆర్‌ఎల్, హెచ్‌టీటీపీ, వెబ్‌సైట్లు.. వీటి గురించి తెలుసుకోవాలి. కంప్యూటర్ సైన్స్ నేపథ్యం ఉన్నవారు సులువుగానే సమాధానాలు గుర్తించగలరు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రొడక్ట్స్ అండ్ సర్వీసెస్: ఈ విభాగానికి 20 మార్కులు. ఇందుకోసం యూబీఐ వెబ్‌సైట్‌ను పరిశీలించాలి. ఆ బ్యాంకు అందిస్తోన్న పలు సేవల గురించి అవగాహన పెంచుకుంటే పూర్తి మార్కులు పొందవచ్చు. డిపాజిట్లు, పలు లోన్ల వడ్డీ రేట్లు.. ఇలా ఆ బ్యాంకుకు సంబంధించిన విషయాలన్నీ తెలుసుకోవాలి.

సన్నద్ధత

✦ ఈ పరీక్షకు అతి తక్కువ సమయమే అందుబాటులో ఉంటుంది. జూన్ 15లోగా నిర్వహించవచ్చు. ఉన్న వ్యవధిని సద్వినియోగం చేసుకుంటేనే విజయం సాధ్యమవుతుంది.

✦ ఒక్కో ప్రశ్నకూ గరిష్ఠంగా 36 సెకన్ల సమయమే ఉంటుంది. ఇంత తక్కువ వ్యవధిలో సరైన సమాధానం గుర్తించాలంటే.. పరీక్షకు ముందు వీలైనన్ని మాదిరి ప్రశ్నలు సాధన చేస్తేనే సాధ్యమవుతుంది. వేగంతో పాటు కచ్చితత్వమూ ముఖ్యమే.

✦ సమాధానం కోసం ఎక్కువ సమయం తీసుకునే ప్రశ్నల జోలికి వెళ్లకుండా సులువుగా ఉండి, తక్కువ వ్యవధిలో జవాబు రాబట్టగలిగేవే ముందు ప్రయత్నించాలి.

✦ రుణాత్మక మార్కులు లేనందున బాగా ఆలోచించి, విచక్షణతో తెలియని ప్రశ్నలకూ జవాబులు గుర్తించడమే మంచిది.

✦ గతంలో నిర్వహించిన అప్రెంటిస్ ప్రశ్నాపత్రాలు వీలైనన్ని సాధన చేయాలి.

✦ కనీసం పది నమూనా పరీక్షలైనా రాసి, జవాబులు విశ్లేషించుకోవాలి. ఇబ్బంది పడుతోన్న విభాగం/చాప్టర్లను ప్రాధాన్యంతో చదివి, వీలైనన్ని ప్రశ్నలు సాధన చేస్తే పరీక్షలో ఎక్కువ మార్కులు పొందడానికి అవకాశం ఉంటుంది.

✦ పరీక్షకు ముందు నేర్చుకున్నవన్నీ పునశ్చరణ చేసుకోవాలి.

వివరాలు

ఖాళీలు: 1865. ఏపీలో 303, తెలంగాణలో 164.

అర్హత: డిగ్రీ. ఏప్రిల్ 1, 2022 తర్వాత ఉత్తీర్ణులైనవారే అర్హులు.

వయసు: ఏప్రిల్ 1, 2026 నాటికి 20-28 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులకు గరిష్ఠ వయసులో సడలింపు ఉంది.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు ఇంటిమేషన్ చార్జీ రూ.200 చెల్లిస్తే సరిపోతుంది. జనరల్, ఓబీసీ మహిళలు రూ.600, మిగిలిన వారు రూ.800 చెల్లించాలి. జీఎస్టీ అదనం.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 19. **ఆన్‌లైన్ పరీక్షలు:** మే/జూన్‌లో.

వెబ్‌సైట్: https://www.unionbankofindia.bank.in/en/home

కలంకారీ కళలో డిప్లొమా, సర్టిఫికెట్

తిరుమల తిరుపతి దేవస్థానాల (తితిదే) పరిధిలోని శ్రీ వెంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాల.. 2026-27 విద్యా సంవత్సరానికి డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైనవారికి వసతి, భోజనం ఉచితంగా అందిస్తారు. శిక్షణలో చేరిన విద్యార్థి పేరు మీద తితిదే రూ.లక్ష బ్యాంకులో డిపాజిట్ చేస్తుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఆ మొత్తాన్ని అందిస్తుంది.

● నాలుగేళ్ల డిప్లొమా కోర్సు (సంప్రదాయ కలంకారీ కళ)

● రెండేళ్ల సర్టిఫికెట్ కోర్సు (సంప్రదాయ కలంకారీ కళ)

అర్హత: పదో తరగతి. **దరఖాస్తులకు చివరి తేదీ:** 20.06.2026. **వివరాలకు ఫోన్ నంబర్:** 0877-2264637. సీట్ల సంఖ్య, ఎంపిక, వయసులకు సంబంధించిన పూర్తి సమాచారం వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

వెబ్‌సైట్: https://www.tirumala.org/

అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముంబయి.. 15 అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● రిస్క్ మేనేజ్‌మెంట్: 05 ● ఫైనాన్స్ అండ్ అకౌంట్స్: 05 ● క్రెడిట్ ఆఫీసర్: 05

అర్హత: సంబంధిత విభాగంలో బీఎస్సీ, ఎంబీఏ, బీఈ/బీటెక్, సీఏ/ సీఎఫ్ఏ/ సీఎంఏతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 33 - 45 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో. **దరఖాస్తు ఫీజు:** ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/మహిళలకు రూ.175, ఇతరులకు రూ.850. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 17.05.2026. **ఆన్‌లైన్ పరీక్ష తేదీ:** జూన్ 2026 (తాత్కాలిక). **ఇంటర్వ్యూ తేదీ:** జూన్ 2026 (తాత్కాలిక).

వెబ్‌సైట్: https://centralbank.bank.in/en/recruitments

జూనియర్ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్లు

సౌత్ ఈస్టర్న్ కోల్ ఫీల్డ్ లిమిటెడ్.. జూనియర్ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● జూనియర్ టెక్నికల్ ఇన్‌స్పెక్టర్: 43 పోస్టులు

అర్హత: గ్రాడ్యుయేషన్ (కెమిస్ట్రీ) ఉండాలి. **ఎంపిక:** రాత పరీక్షతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 20.05.2026.

వెబ్‌సైట్: https://www.secl-cil.in/index.php

ఐఐఎస్ఈఆర్ తిరుపతిలో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (ఐఐఎస్ఈఆర్), తిరుపతి.. పలు విభాగాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ప్రొఫెసర్ - 07 ● అసిస్టెంట్ ప్రొఫెసర్ - 28

అర్హత: సంబంధిత విభాగంలో పీజీ/పీహెచ్‌డీతో పాటు అనుభవం ఉండాలి. **వేతనం:** ప్రొఫెసర్‌కు నెలకు రూ.1,59,100 అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500. **ఎంపిక:** దరఖాస్తుల షార్ట్ లిస్టింగ్, సెమినార్ ప్రజెంటేషన్, ఇంటర్వ్యూలతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 28.05.2026.

వెబ్‌సైట్: https://www.iisertirupati.ac.in/

స్పోర్ట్స్ కోచ్ అవ్వాలనుంది. ఇందుకోసం ఏ కోర్సులు చదవాలి, వీటిని అందించే సంస్థలేవి, ఉద్యోగ అవకాశాలు ఎక్కడ ఉంటాయి? - చంద్రశేఖర్

స్పోర్ట్స్ కోచ్ అవ్వాలంటే?



■ కొన్ని దశాబ్దాల నుంచీ దేశంలో క్రీడలకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఒకప్పుడు వీటిని వినోదం, శారీరక దృఢత్వం కోసం మాత్రమేనని భావించేవారు. ఇప్పుడివి మేటి అవకాశాలు అందించే కెరియర్‌గానూ మారాయి. ముఖ్యంగా 1982 ఆసియా క్రీడల అనంతరం దేశంలో క్రీడా మౌలిక వసతులు, శిక్షణా విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహం విస్తరించాయి. ఫలితంగా క్రీడల్లో ప్రతిభావంతులకు అనేక మార్గాలు తెరుచుకున్నాయి.

▸ క్రీడలకు సంబంధించిన కోర్సులు దేశవ్యాప్తంగా పలు పేరున్న సంస్థలు అందిస్తున్నాయి. వీటిలో లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ - గ్వాలియర్, తిరువనంతపురంతో పాటు నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ - పాటియాలా ముఖ్యమైనవి. ఇవి కేంద్ర క్రీడా ప్రాధికార సంస్థ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో పనిచేస్తూ, దేశంలో క్రీడల అభివృద్ధికి ముఖ్య పాత్ర వహిస్తున్నాయి. ఈ సంస్థలు బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లతో పాటు డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్ కోర్సు అందిస్తున్నాయి. ఈ కోర్సుల్లో పలు క్రీడలకు సంబంధించి కోచింగ్ టెక్నిక్స్, సైకాలజీ, న్యూట్రిషన్ లాంటి అంశాలు బోధిస్తారు.

▸ దేశంలో క్రీడలకు పేరున్న సంస్థల్లో నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ - మణిపూర్ ఒకటి. ఇక్కడ బీఎస్సీ/ఎమ్మెస్సీ - స్పోర్ట్స్ కోచింగ్, యూజీ, పీజీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ కోర్సులు అందిస్తున్నారు. పలు క్రీడల్లో ప్రతిభావంతులకు వీటిలో ప్రవేశం లభిస్తుంది. కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ సంస్థ నడుపుతున్నారు. ఇక్కడ ఎమ్మెస్సీలో స్పోర్ట్స్ సైకాలజీ, అప్లయిడ్ స్పోర్ట్స్ న్యూట్రిషన్ కోర్సులూ ఉన్నాయి.

▸ ఈ కోర్సుల్లో చేరాలంటే కనీసం ఇంటర్మీడియట్ ఉండాలి. క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ లేదా విశ్వవిద్యాలయ స్థాయి పోటీల్లో పాల్గొనడం లేదా ప్రతిభ చూపడం ఎంతో కీలకం. సంస్థలు నిర్వహించే పరీక్షల్లోనూ ప్రతిభ చూపాలి.

▸ నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ - పాటియాలాతో పాటు బెంగళూరు, కోల్‌కతా, తిరువనంతపురంలో ఉన్న ప్రాంతీయ కేంద్రాల్లోనూ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్ కోర్సు అందిస్తోంది. ఆర్మీ స్పోర్ట్స్ అకాడమీలూ క్రీడా శిక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. వివిధ యూనివర్సిటీల్లో ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్లు, ప్రయివేటు ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలు కూడా బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, మాస్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్స్‌ను అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ఆ సంస్థలు ఉమ్మడిగా నిర్వహించే పరీక్ష రాయాలి.

▸ క్రీడల శిక్షణలో చదువులు పూర్తిచేసుకున్నవారికి విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ లాంటి సంస్థల్లో కోచ్, ట్రెయినర్‌గా ఉద్యోగాలు పొందవచ్చు. పాఠశాలలు, కళాశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్‌గా పనిచేయవచ్చు. ప్రయివేటు స్పోర్ట్స్ అకాడమీలు, ఫిట్‌నెస్ సెంటర్లలోనూ అవకాశాలు ఉంటాయి.

క్రీడలపై ఆసక్తి ఉన్న యువత సరైన శిక్షణ పొందితే ఈ రంగంలో గొప్ప భవిష్యత్తు నిర్మించుకోవచ్చు. ప్రస్తుత సమాజంలో క్రీడలు హాబీగా కాకుండా, ఒక స్థిరమైన, గౌరవప్రదమైన కెరియర్ మార్గంగా మారుతున్నాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఐఐఎం ముంబయిలో బీఎస్ కోర్సు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం), ముంబయి.. బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్) డిజిటల్ సైన్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సు ప్రారంభించింది. జేఈఈ మెయిన్ స్కోరుతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్వ్యూతో సీట్లు కేటాయిస్తారు. ఈ కోర్సులో చేరిన వారిని సాంకేతికత దన్నుతో వ్యాపారాన్ని సమర్థంగా నిర్వహించడానికి కావాల్సిన నైపుణ్యాల్లో ప్రావీణ్యం పొందేలా తీర్చిదిద్దుతారు.



బీఎస్ కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 8 సెమిస్టర్లు ఉంటాయి. పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో అందిస్తున్నారు. ఆగస్టు చివరి వారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. కోర్సు ఫీజు నాలుగేళ్లకు రూ.31.20 లక్షలు. ఈ కోర్సు 'టెక్నో-మేనేజర్స్'ను రూపొందించడానికి డిజైన్ చేశారు. ఇందులో డిజిటల్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ అంశాలు నేర్పుతారు.

డిజిటల్ సైన్స్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), డేటా సైన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ లాంటి ఆధునిక అంశాలు నేర్పిస్తారు.

బిజినెస్ మేనేజ్‌మెంట్: మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్, స్ట్రాటజీ లాంటి మేనేజ్‌మెంట్ పాఠాలు ఉంటాయి.

● టెక్నాలజీని వ్యాపారానికి ఎలా వాడుకోవాలో తెలిసిన వారు సంస్థలకు ఎంతో అవసరం. ఆ నైపుణ్యాన్ని ఈ కోర్సు అందిస్తుంది.

● కోర్సులో చేరిన ఏడాది తర్వాత వైదొలిగితే సర్టిఫికెట్, రెండేళ్లు పూర్తి చేసుకుంటే డిప్లొమా, మూడేళ్ల తర్వాత మానేస్తే అడ్వాన్స్‌డ్ డిప్లొమా అందిస్తారు. నాలుగేళ్ల కోర్సు పూర్తిచేసుకుంటే బీఎస్ డిగ్రీ ప్రదానం చేస్తారు.

● బీఎస్ కోర్సు పూర్తి చేసుకున్నవారు ఇక్కడి నుంచే మరో ఏడాది చదువుకుని ఎంబీఏ పట్టా పుచ్చుకోవచ్చు. ఇందుకోసం పలు అంశాలు ప్రామాణికంగా తీసుకుంటారు.

● బీఎస్ కోర్సు పూర్తిచేసుకున్నవారు బిజినెస్ అనలిస్ట్, డిజిటల్ మార్కెటింగ్ స్పెషలిస్ట్, ఆపరేషన్స్ మేనేజర్, డేటా అనలిస్ట్, ఇ-కామర్స్ మేనేజర్.. తదితర హోదాలతో పలు బహుళ జాతి సంస్థల్లో రాణించవచ్చు.

ప్రవేశం

జేఈఈ మెయిన్ పేపర్-1 స్కోరుతో దరఖాస్తు చేసుకోవాలి. ఇంటర్మీడియట్‌లో 60 శాతం మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీలైతే 55 శాతం సరిపోతాయి. సెప్టెంబర్ 30, 2026 నాటికి వయసు గరిష్ఠంగా 20 ఏళ్లు మించకూడదు. ఆగస్టు 1, 2006 తర్వాత జన్మించినవారే అర్హులు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఐదేళ్లు మినహాయింపు వర్తిస్తుంది. జేఈఈ మెయిన్ స్కోరు ప్రకారం అభ్యర్థులను ఇంటర్వ్యూ కోసం షార్ట్ లిస్టు చేస్తారు. సీట్ల కేటాయింపు జేఈఈ మెయిన్ స్కోరు, పర్సనల్ ఇంటర్వ్యూలతో ఉంటుంది.

వివరాలు

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 15.

ఇంటర్వ్యూలు: జూన్ చివర్లో లేదా జులై ప్రారంభంలో.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1000. మిగిలిన అందరికీ రూ.2000. **వెబ్‌సైట్:** https://iimmumbai.ac.in/admissions/

కరెంట్ అఫైర్స్



◆ బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం ఆసియాలోనే అత్యంత సంపన్న వ్యక్తిగా ఇటీవల ఎవరు నిలిచారు?
జ: గౌతమ్ అదానీ

◆ దేశవ్యాప్తంగా ఆకాంక్షిత జిల్లాలు, ఆకాంక్షిత బ్లాకుల్లో పోషణ, ఆరోగ్య ఫలితాలను మెరుగుపరచడానికి నీతి ఆయోగ్ ఏ సంస్థతో ఓ భాగస్వామ్య

మాదిరి ప్రశ్నలు

ఒప్పందం కుదుర్చుకుంది?
జ: యూనిసెఫ్ ఇండియా

◆ అంతరించిపోతున్న అటవీ గుడ్లగూబను ఇటీవల మొదటిసారిగా ఏ రాష్ట్రంలోని కునో జాతీయ పార్కులో గుర్తించారు?
జ: మధ్యప్రదేశ్
(ఫ్లెవిట్ గుడ్లగూబ అని కూడా పిలిచే ఫారెస్ట్ గుడ్లగూబ ఐయూసీఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) రెడ్‌లిస్ట్‌లో అంతరించిపోతున్న జాబితాలో చేర్చారు.)

◆ ఏ దేశానికి ఇండియా 13 టన్నుల బీసీజీ వ్యాక్సిన్‌ను సరఫరా చేసింది?
జ: అఫ్గానిస్థాన్ (క్షయ వ్యాధి రాకుండా బీసీజీ వ్యాక్సిన్ ఇస్తారు.)

◆ ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన- III (పీఎంజీఎస్‌వై-III) పథకం గడువును కేంద్రం ఎప్పటి వరకు పొడిగించింది?
జ: 2028, మార్చి

◆ దేశంలోనే మొదటిసారిగా పూర్తిగా సౌర శక్తితో నడిచే ఏటీఎమ్ వ్యాన్‌ను ఇటీవల ఏ బ్యాంకు ప్రారంభించింది?
జ: త్రిపుర గ్రామీణ బ్యాంకు
(నాబార్డు సహకారంతో 'టీజీబీ ఆన్ వీల్స్' పేరిట త్రిపుర గ్రామీణ బ్యాంకు ఈ ఏటీఎమ్ వ్యాన్‌ను ప్రారంభించింది.)

మరింత సమాచారం

Control and Coordination



Living organisms must use systems providing control and coordination. In keeping with the general principles of body organisation in multicellular organisms, specialised tissues are used to provide these control and coordination activities.

Control: Regulation of different body activities (speed, intensity and duration etc.,).

Coordination: Linking together different organs or systems so they function harmoniously.

10th Class Bridge Course
Biological Science

Importance of Control and Coordination:

1) To respond to every stimulus properly.

2) To maintain balance between different systems.

3) To ensure survival in changing environment.

Animals - Nervous System

In animals, such control and coordination are provided by nervous and muscular tissues.

Nervous tissue is made up of an organised network of nerve cells or neurons and is specialised for conducting information via electrical impulses from one part of the body to another. ● Each nerve cell contains of a cell body with a prominent nucleus. ● There are fine projections mainly of two types extending from the cell body of the nerve cell. ● The small projections are dendrites while a long one that extends to different parts of our body is called Axon. ● The axon surrounded by a specialised insulator sheath called myelin sheath. ● This sheath is interrupted at regular intervals called nodes of ranvier.

For more Concepts

Dendrites of one nerve cell connect to the other or to the axons of other nerve cell through connections called as a 'Synapse'.

Synapse is the functional region of contact between two neurons, where information from one neuron is transmitted or relayed to another neuron.

Reflexaction

● The process of detecting a signal or an input and responding to it by an output action might be completed quickly. Such a connection is commonly called reflex arc.

● Reflex arcs are formed in the spinal cord itself, although the information input also goes on to reach the brain.

Mangalampalli Sathyanarayana Murthy

స్వర్ణాంధ్ర విజన్ - 2047

(ఏపీ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు)

దీర్ఘకాలిక ప్రగతికి దీటైన వ్యూహం!



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలందరికీ సామాజిక భద్రత కల్పించడం, సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఆర్థికంగా అండగా నిలవడమే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఆధునిక సాంకేతికత ప్రయోజనాలను అన్నివర్గాలకు చేరవేసే విధంగా విభిన్న కార్యక్రమాలను ప్రారంభించింది. ఒక వైపు పేదరికంపై వ్యవస్థాగత పోరాటం సాగిస్తూ, మరోవైపు సుస్థిర అభివృద్ధి ప్రణాళికలతో పర్యావరణానికీ ప్రాధాన్యం ఇస్తోంది. సంక్షేమ, అభివృద్ధి ఎజెండాలో భాగంగా కొనసాగుతున్న పథకాలు, వాటి ఉద్దేశాలు, లబ్ధిదారుల అర్హతలు, వారికి అందే ప్రయోజనాలు తదితర వివరాలు పోటీ పరీక్షార్థులకు తెలియాలి. రేపటి తరంలో నైపుణ్యాలను పెంచడానికి, దీర్ఘకాలిక సమాజ అభివృద్ధికి అవి దోహదపడుతున్న తీరును, ఇందులో కేంద్ర నిధులతో పాటు, ప్రైవేటు భాగస్వామ్యానికి ఉన్న ప్రాముఖ్యతను అర్థం చేసుకోవాలి.

స్వర్ణాంధ్ర విజన్@2047 అనేది స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యేనాటికి ఆంధ్రప్రదేశ్‌ను సంపన్న, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ఒక దీర్ఘకాలిక అభివృద్ధి వ్యూహం. 2047 నాటికి 100% అక్షరాస్యత సాధించడం, ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికి డిజిటల్ అక్షరాస్యత కల్పించడం, 40% భూములను ప్రకృతి సేద్యంలోకి తీసుకురావడం, 2047 నాటికి పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించి సున్నా ఉద్గారాల స్థాయిని సాధించడం, పేదరికాన్ని నిర్మూలించడం, 2047 నాటికి రాష్ట్ర స్థూల ఉత్పత్తి(జీఎస్‌డీపీ)ని 2.4 ట్రిలియన్ డాలర్లకు పెంచడం, తలసరి ఆదాయాన్ని 42,000 డాలర్లకు చేర్చడం, ఏటా రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధిరేటు 15% సాధించడం లాంటివి స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలు.

స్వర్ణాంధ్ర విజన్ 2047 - పది ముఖ్య సూత్రాలు

1) శూన్య పేదరికం 2) ఉపాధి, మానవ వనరుల అభివృద్ధి 3) నైపుణ్యాభివృద్ధి 4) జల భద్రత 5) రైతు - వ్యవసాయ సాంకేతికత 6) గ్లోబల్ - బెస్ట్ లాజిస్టిక్స్ 7) వ్యయ ఆప్టిమైజేషన్ (శక్తి, ఇంధనం) 8) ఉత్పత్తి పరిపూర్ణత (మేడ్ ఇన్ ఆంధ్ర) 9) స్వచ్ఛ ఆంధ్ర 10) డీప్ టెక్, ఆవిష్కరణ.

ఎన్టీఆర్ బేబీ కిట్ పథకం: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులకు అవసరమైన శిశు సంరక్షణా వస్తువులను ఉచితంగా అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2025-2026లో పునఃప్రారంభించిన సంక్షేమ పథకం ఇది. సురక్షితమైన సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించడం, శిశు మరణాలను తగ్గించడం ఈ పథకం లక్ష్యం. దుస్తులు, పరిశుభ్రతా ఉత్పత్తులు, నవజాత శిశువుకు అవసరమైన 13 రకాల వస్తువులు ఈ కిట్‌లో ఉంటాయి. ఒక్కో కిట్ విలువ సుమారు రూ.1,989 ఉంటుంది. ఎన్టీఆర్ బేబీ కిట్ పథకం ద్వారా ఏటా సుమారు 3.50 లక్షల మంది తల్లులు లబ్ధి పొందుతున్నారు.



చంద్రన్న బీమా: చంద్రన్న బీమా పథకాన్ని ఆంధ్రప్రదేశ్‌లోని పేద, అసంఘటిత రంగంలోని కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడానికి ఉద్దేశించారు. 18-70 ఏళ్ల మధ్య వయసు ఉన్న అసంఘటిత కార్మికులు (భవన నిర్మాణ కార్మికులు, రవాణా, గీత కార్మికులు మొదలైనవారు), నెలకు రూ.15,000 కంటే తక్కువ ఆదాయం ఉండే పేద కుటుంబాలవారు ఈ పథకానికి అర్హులు. ఈ పథకం ద్వారా ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత వైకల్యానికి రూ.10 లక్షల వరకు బీమా సౌకర్యం, సహజ మరణానికి రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.2.5 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుంది. తక్షణ సహాయం కింద రూ.10,000 ఆర్థిక ఉపశమనం (మట్టి ఖర్చుల కోసం) కూడా అందిస్తారు. చంద్రన్న బీమా అమలుకు 'కార్మిక శాఖ' నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. బీమా క్లెయిమ్ మొత్తం లబ్ధిదారుడి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో 15 రోజుల్లోపు జమచేస్తుంది.

అడవి తల్లి బాట కార్యక్రమం: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 2025, ఏప్రిల్ 7న అల్లూరి సీతారామ రాజు జిల్లా దుంబ్రిగడ ప్రాంతంలో 'అడవితల్లి బాట' కార్యక్రమాన్ని ప్రారంభించారు. 600కు పైగా మారుమూల గిరిజన నివాసాలను కలుపుతూ రహదారులు నిర్మించడమే దీని లక్ష్యం. పీఎం - జన్మన్, ఉపాధి హామీ నిధుల తోడ్పాటుతో గిరిజన ప్రాంతాల్లో డోలీ రవాణా (మనుషులు మోసే తాత్కాలిక స్ట్రెచర్)ను నిర్మూలించి, ఆరోగ్యం, విద్య అందుబాటును మెరుగుపరుస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా గిరిజన జీవనోపాధి పెంపు, స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం, అక్రమ కార్యకలాపాలను నిరుత్సాహపరచడం, కాఫీ సాగు (లక్ష ఎకరాల్లో) చేయడం, పర్యావరణ పర్యాటకాన్ని ప్రోత్సహించడం లాంటి వన్నీ చేపడతారు.



అడవి తల్లి బాట కార్యక్రమంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



మార్గదర్శి - బంగారు కుటుంబం

ఈ కార్యక్రమాన్ని 2025, మార్చి 30న ఉగాది రోజు అమరావతిలో సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. దీని ప్రధాన లక్ష్యం పేదరిక నిర్మూలన, సమాజ అభివృద్ధి. ఈ కార్యక్రమం పీ4 నమూనా (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్ట్‌నర్‌షిప్) ఆధారంగా అమలవుతుంది. సమాజంలోని ధనవంతులు, పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు 'మార్గదర్శులుగా' వ్యవహరిస్తారు. వీరు పేద కుటుంబాలను దత్తత తీసుకుని, వారికి అవసరమైన సాయాన్ని అందిస్తారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందే కుటుంబాలను 'బంగారు కుటుంబాలు'గా పిలుస్తారు. దీని అమలుకు 'సమృద్ధి బంధనం' అనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించారు.

జనరల్ స్టడీస్
ఆంధ్రప్రదేశ్ ఎకానమీ

ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్



విద్యార్థుల్లో (ముఖ్యంగా గ్రామీణ) అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచడానికి 'ఏపీ మేకర్ ల్యాబ్ ఆన్ వీల్స్' కార్యక్రమాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ 2025, జనవరిలో ప్రారంభించారు. రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఉచితంగా డిజిటల్, 'స్టెమ్' విద్యను అందించడం ఈ కార్యక్రమం లక్ష్యం. ఈ ప్రాజెక్టును ప్రభుత్వం 'ఇన్ఫోసిస్' సహకారంతో నిర్వహిస్తోంది. ఇందుకోసం ఏర్పాటుచేసిన మొబైల్ ల్యాబ్ (వాహనం)లో ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, 3డీ ప్రింటర్లు, రోబోటిక్స్ కిట్లు, ఇంటర్నెట్ సదుపాయం ఉంటాయి. ఇది మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలకు వచ్చి విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), రోబోటిక్స్ లాంటి అంశాలపై 90 నిమిషాల పాటు శిక్షణ ఇస్తారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ప్లాట్‌ఫామ్ ద్వారా సర్టిఫికెట్లు అందజేస్తారు.



రచయిత: పి.వి.సుబ్బారెడ్డి

తాడులో ఉండేది తన్యత.. నేలపై జరిగేది ఘర్షణ!



నిశ్చలంగా ఉన్న కొండ దగ్గర నుంచి వేగంగా తిరిగే ఫ్యాన్ వరకు, అంతరిక్షంలో ప్రయాణించే గ్రహాల నుంచి మనిషి నడిచే అడుగుల వరకు ప్రతిచోటా యాంత్రిక శాస్త్రం దాగి ఉంది. భౌతిక శాస్త్రంలో అతి ముఖ్యమైన ఈ విభాగం వస్తువుల స్థితిని, వాటిపై పనిచేసే బలాలను, వాటి వల్ల కలిగే చలనాలను లోతుగా విశ్లేషిస్తుంది. సాధారణంగా వస్తువుల కదలికలను కేవలం 'చలనం' అంటారు. కానీ, శాస్త్రీయంగా చూస్తే అవి స్థానాంతర, భ్రమణ, వృత్తాకార, డోలాయమాన, ఆవర్తన చలనాలుగా విడిపోతాయి. ఒక సైకిల్ చక్రం తిరగడం వెనుక భ్రమణ చలనం ఉంటే, అది రోడ్డుపై ముందుకు సాగడం వెనుక స్థానాంతర చలనం ఉంటుంది. ఇలాంటి సూక్ష్మ భేదాలను అర్థం చేసుకోవడమే యాంత్రిక శాస్త్రం ప్రధాన ఉద్దేశం. అంతేకాకుండా, చలనాన్ని నిరోధించే ఘర్షణ బలం, తాడులో ఉండే తన్యతా బలం, భూమికి ఉండే గురుత్వాకర్షణ బలం మొదలైనవి వస్తువులపై చూపే ప్రభావాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. సంబంధిత ప్రాథమిక భావనలను నిత్యజీవిత ఉదాహరణలతో అన్వయించుకుంటూ చదవాలి.

యాంత్రిక శాస్త్రం

జనరల్ స్టడీస్ - భౌతిక శాస్త్రం

1. కింది వాటిలో సరికాని వాక్యాన్ని గుర్తించండి.
   1) యాంత్రిక శాస్త్రం భౌతిక శాస్త్రంలో ఒక విభాగం. ఇది వస్తు చలనాలను, స్థితులను వివరిస్తుంది.
   2) న్యూటన్ గమన నియమాలతో నియంత్రిత బలాల ప్రభావంతో వస్తువులు, గ్రహాల చలనాలను అధ్యయనం చేసేది సాంప్రదాయ యాంత్రిక శాస్త్రం.
   3) సాంప్రదాయ నియమాలు విఫలమైనా, పరమాణు, వాటి కణాల స్థాయుల్లో కాంతి ప్రవర్తనను వివరించేది క్వాంటం యాంత్రిక శాస్త్రం.
   4) కాంతి వేగానికి దగ్గరగా కదిలే వస్తువులను కాంతి యాంత్రిక శాస్త్రం వివరిస్తుంది.

2. కింది వాటిలో సరైన వాక్యం?
   ఎ) యాంత్రిక శాస్త్రంలో ప్రధాన భాగాలు 1) స్థితి శాస్త్రం 2) గతి శాస్త్రం 3) శుద్ధగతి శాస్త్రం
   బి) వస్తువుల సమతాస్థితి, దానిపై పనిచేసే బలాలను వివరించేది - స్థితి శాస్త్రం
   సి) వస్తువు చలనాన్ని కారణంతో సంబంధం లేకుండా వివరించేది - గతి శాస్త్రం
   డి) వస్తువు చలనాన్ని బల ప్రభావంతో వివరించేది - శుద్ధగతి శాస్త్రం
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి 3) ఎ, సి, డి 4) ఎ, బి, సి

3. కింది వాటిలో చలనానికి సంబంధించి సరైన వాక్యం?
   ఎ) వస్తువు సమాన కాలాల్లో సమాన దూరాలు ప్రయాణిస్తే ఆ చలనం క్రమచలనం.
   బి) వస్తువు సమాన కాలాల్లో అసమాన దూరాలు ప్రయాణిస్తే ఆ చలనం క్రమరహితమైన చలనం.
   సి) జనం మధ్యలో నడుస్తున్న మనిషి చలనం - క్రమచలనం
   డి) సైకిల్ చక్రం చలనం కదలిక క్రమచలనం.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి 3) ఎ, బి 4) ఎ, డి

4. ఒక వస్తువు అది కదులుతున్న మార్గం ఆధారంగా దాని చలనాల్లో రకం కానిది?
   1) వృత్తాకార చలనం 2) డోలయమాన చలనం 3) రేఖీయ చలనం 4) సమ చలనం

5. కింది వాటిలో రేఖీయ చలనం కానిది?
   1) కవాతు చేసే సైనికులు
   2) తిన్నని గీతల మధ్య పరుగు పందెం
   3) కీ ఇచ్చిన ఆటబొమ్మ కారు
   4) క్యారంబోర్డుపై నెట్టిన కాయిన్

6. కింది వాటిలో ఏదైనా వస్తువు సరళరేఖలో కాకుండా వక్రరేఖీయ ఆకారంలో కలిగే చలనం కానిది?
   1) కదులుతున్న పాము
   2) మలుపు తిరుగుతున్న వాహనాలు
   3) చెట్టు నుంచి కిందకు పడే కాయలు
   4) ఐస్ స్కేటింగ్ చేసే వ్యక్తి

7. ఏదైనా ఒక వస్తువు ఒక స్థిర బిందువును ఆధారంగా చేసుకుని దాని చుట్టూ తాను వక్ర మార్గంలో తిరిగే చలనమే భ్రమణ చలనం. ఈ చలనానికి సంబంధించి సరికానిది?




   1) తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్
   2) సైకిల్ చక్రం చలనం
   3) గుడి చుట్టూ తిరిగే మనిషి
   4) కర్రలు కోసే మెషీన్ చక్రం

8. కొండపైకి ఘాట్ రోడ్ మీదకు ప్రయాణిస్తున్న బస్సు, దాని చక్రాలు కదలికలో ఉండే చలనం?
   1) స్థానాంతర చలనం 2) భ్రమణ చలనం
   3) స్థానాంతర, భ్రమణ చలనం
   4) భ్రమణ, వృత్తాకార చలనం

9. కింది వస్తువుల కదలికలో స్థానాంతర, భ్రమణ చలనాలు రెండూ లేని సందర్భం ఏది?
   1) గాలిలో పైకి విసిరిన బంతి
   2) నేలపై దొర్లించిన నాణెం
   3) గోడలకు రంధ్రాలు చేసే బర్మా
   4) సైకిల్ చైన్ కదలిక

10. ఏదైనా ఒక వస్తువు చలనాల్లో సరైనవి?
   ఎ) వస్తువు ఆధారానికి అటు ఇటు లేదా పైకి కిందకు కదులుతూ ఉండే చలనం - డోలయమాన చలనం



   బి) ఏదైనా వస్తువు స్థిర బిందువు కేంద్రంగా దాని చుట్టూ వక్రమార్గంలో తిరిగే చలనమే - వృత్తాకార చలనం
   సి) వస్తువు ఒక చోటు నుంచి మరో చోటుకు కదులుతూ దాని స్థానంలో మార్పు జరిగితే ఆ చలనం - స్థానాంతర చలనం
   డి) స్థానాంతర చలనంలో ఉన్న వస్తువు వక్రరేఖ ఆకారంలో కదిలితే ఆ చలనం - వక్రరేఖీయ చలనం
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) ఎ, సి, డి 4) ఎ, డి

11. కింది చలనాల్లో డోలన చలనానికి సంబంధించి సరికానిది?
   1) చెట్టుకు కట్టి ఊపుతున్న ఊయల.
   2) రాయికి కట్టిన దారం చేతితో గిరగిరా తిప్పడం.
   3) U ఆకారంలో ఉన్న నీటి పైపులో నీటి చలనం.
   4) వీణలో తీగ మీటినప్పుడు చలనం.

12. కింది వస్తు చలనాల్లో సరికాని జతను గుర్తించండి.
   1) చలనంలో ఉన్న సైకిల్ హ్యాండిల్ చలనం - డోలన చలనం
   2) కుట్టు మెషీన్‌లో సూది చలనం - స్థానాంతర చలనం
   3) భూమి చుట్టూ తిరుగుతున్న చంద్రుడి చలనం - వృత్తాకార చలనం
   4) గ్లోబ్‌ను తిప్పినప్పుడు దాని చలనం - భ్రమణ చలనం


13. ఏదైనా వస్తువు పలుమార్లు ఒకే మార్గాన్ని పునఃశ్చరణ చేస్తే, దాని చలన కాలవ్యవధి సమానంగా ఉంటే, ఆ చలనాన్ని ఏమని పిలుస్తారు?
   1) భ్రమణ చలనం 2) డోలన చలనం
   3) ఆవర్తన చలనం 4) సంవృత చలనం

14. ఏదైనా వస్తువు స్థిర బిందువు కేంద్రంగా సమాన వ్యాసార్థంలో వృత్తాకార మార్గంలో చలిస్తూ దాని వడి సమానంగా/స్థిరంగా ఉంటే ఆ చలనం?
   1) సమ చలనం 2) వృత్తాకార చలనం
   3) సమ వృత్తాకార చలనం 4) ఆవర్తన చలనం

15. సమవృత్తాకార చలనానికి సంబంధించి సరికానిది?
   1) దీనిలో ప్రతి బిందువు వద్ద గీసిన స్పర్శరేఖ దిశలో దాని వేగ దిశ ఉంటుంది.
   2) దీనిలో ప్రతి బిందువు వద్ద గీసిన స్పర్శరేఖ దిశలో దాని వడి దిశ ఉంటుంది.
   3) ఈ చలనానికి అనంతమైన స్పర్శరేఖలు వస్తువుకు గీయవచ్చు.
   4) ఈ చలన వస్తువుకు వడి, వేగం రెండూ స్థిరంగా ఉంటాయి.

16. కింది వాటిలో బలానికి సంబంధించి సరికానిది?
   1) వస్తువు స్థితిని/ స్థానాన్ని మార్చేది బలం. వీటిని మార్చడానికి ప్రయత్నించేది కూడా బలమే.
   2) బలానికి SI ప్రమాణం న్యూటన్. అంటే 10^7 డైనులు.
   3) బలానికి మరో ప్రమాణం కిలోగ్రామ్. మీ/సె^{2}.
   4) 12 డైనులు అనేవి 12×10^{-5} న్యూటన్‌లకు సమానం.

17. కింది వాటిలో సరైంది గుర్తించండి?
   ఎ) ఒక వస్తువు లేదా వ్యవస్థల లోపల ఉన్న బలాలను అంతర్గత బలాలు అంటారు.



అంతర్గత బలాలు

   బి) ఈ అంతర్గత బలాల వల్ల వస్తువు స్థితిలో మార్పు ఉండదు.
   సి) బస్సు సీటులో కూర్చున్న వ్యక్తి, ఎదుట సీటుపై బలం ప్రయోగించినా బస్సు స్థితిలో ఏ మార్పు ఉండదు.
   డి) అణుబాంబు విస్ఫోటం జరగడానికి కారణం దాని లోని అంతర్గత బలాలే.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, డి

18. కింది వాటిలో సరికానిది గుర్తించండి?
   ఎ) ఒక వస్తువు మరొక వస్తువు మీద ప్రయోగించే బలమే బాహ్య బలం.
   బి) ఒక వ్యక్తి శరీరంలో అంతర అవయవాలు పనిచేయడానికి కావాల్సింది - కండర బలం
   సి) ఒక వ్యక్తి చెట్టు ఎక్కుతున్నాడు. దీనికి యాంత్రిక బలం ఉపయోగపడుతుంది.
   డి) చేతితో బెలూన్‌ను ఒక వ్యక్తి అదుముతున్నాడు. దీనికి కారణం కండర బలం.
   1) ఎ, బి, సి, డి 2) బి 3) సి 4) డి

19. కింది వాటిలో బలానికి సంబంధించి సరైన వాక్యాలను గుర్తించండి?
   ఎ) వస్తువు మీద బలం ప్రయోగిస్తే అది బల ప్రయోగ దిశలో కదిలితే ఆ బలం - యాంత్రిక బలం.
   బి) ఆగి ఉన్న ఆటోను నెడుతున్నప్పుడు అది కదిలింది. దీనికి కారణం యాంత్రిక బలం.
   సి) అయస్కాంతం సహాయంతో వేరే వస్తువును కదిలిస్తే దీనికి అవసరమైన బలం - అయస్కాంత బలం.
   డి) వ్యక్తి దిక్సూచిలో ముల్లు దిశను వేరొక అయస్కాంతంతో మార్చాడు. దీనికి కారణమైన బలం - అయస్కాంత బలం.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, బి, సి 3) ఎ, బి, డి 4) ఎ, సి

20. కింది వాటిలో సత్యవాక్యాలను గుర్తించండి?
   ఎ) ఒక ఆవేశపూరిత వస్తువు ఆవేశరహిత వస్తువుపై ప్రయోగించే బలం - స్థావర విద్యుత్తు బలం
   బి) టీవీ పక్కన చేయి ఉంచితే చేతి వెంట్రుకలను ఆకర్షించడం - అయస్కాంత బలం



   సి) ఒక వస్తు ద్రవ్యరాశి వేరొక ద్రవ్య వస్తువును ఆకర్షించే బలం - గురుత్వాకర్షణ బలం
   డి) చెట్టు నుంచి కాయలు కిందకు పడటం - గురుత్వాకర్షణ బలం.
   1) ఎ, బి 2) ఎ, సి, డి 3) బి, డి 4) ఎ, సి

21. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి?
   ఎ) తాడులో ఉన్న బిగుసుదనం వల్ల కలిగే బలం- తన్యతా బలం.
   బి) ఒక వస్తువును పట్టుకోవడానికి కలిగి ఉండే బలం - తన్యతా బలం.
   సి) అభిలంబ బలం అనేది గురుత్వాకర్షణ బలానికి వ్యతిరేకం.
   డి) అభిలంబ, తన్యతా బలాలు గురుత్వాకర్షణ బలాలకు సమానం అయితే వస్తువులు కిందకు పడతాయి.
   1) ఎ, బి, సి, డి 2) ఎ, డి 3) ఎ, సి 4) బి, సి, డి

22. కింది వాటిలో సరికాని వాక్యం?
   ఎ) ఇంట్లో ఫొటోఫ్రేమ్ తగిలించి ఉంది. అది పడకుండా మేకులో ఉండే బలం - అభిలంబ బలం.
   బి) ఈ బలమే వస్తు చలనానికి నిరోధకారి - తన్యతా బలం.
   సి) నేలపై దొర్లించిన గోళీ కొంత దూరంలో ఆగిపోయింది. దీనికి కారణమైన బలం - ఘర్షణ బలం.
   1) ఎ, బి, సి 2) ఎ 3) బి 4) సి

సమాధానాలు

1-4; 2-2; 3-3; 4-4; 5-3; 6-3; 7-3; 8-3; 9-4; 10-1; 11-2; 12-2; 13-3; 14-3; 15-4; 16-2; 17-1; 18-3; 19-1; 20-2; 21-3; 22-3.

స్థూపం - II



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
అరిథ్‌మెటిక్

స్థూపాన్ని తయారు చేసేందుకు కరిగించాల్సిన నాణేల సంఖ్య?

ముఖ్యాంశాలు

- ఒక స్థూపం వక్రతల వైశాల్యంలో మార్పు శాతం $= \left(x + y + \frac{xy}{100}\right)\%$
  r లో మార్పును x గా, h లో మార్పును y గా సూచిస్తారు.
- రెండు స్థూపాల వ్యాసార్ధాల నిష్పత్తి $= r_1 : r_2$, ఎత్తుల నిష్పత్తి $= h_1 : h_2$ అయితే
  వాటి వక్రతల వైశాల్యాల నిష్పత్తి $= r_1h_1 : r_2h_2$
  ఘనపరిమాణాల నిష్పత్తి $= r_1^2 h_1 : r_2^2 h_2$
- ఒక వస్తువును కరిగించి కొన్ని ఒకేరకమైన చిన్న వస్తువులుగా మార్చితే వాటి సంఖ్య
  $(n) = \frac{\text{పెద్ద వస్తువు ఘనపరిమాణం}}{\text{చిన్న వస్తువు ఘనపరిమాణం}}$
- 'R' వ్యాసార్ధం ఉన్న స్థూపంలో 'r' వ్యాసార్ధం ఉన్న గోళాకార గోళీని వేస్తే అందులో పెరిగిన నీటిమట్టం ఎత్తు $(h) = \frac{4r^3}{3R^2}$
- ఒక స్థూపం వక్రతల వైశాల్యం $\propto r \times h$,
  ఘనపరిమాణం $\propto r^2 \times h$
- దీర్ఘచతురస్రాకారపు కాగితం పొడవు వెంబడి చుట్టి స్థూపాన్ని తయారుచేస్తే కాగితం పొడవు $= 2\pi r$ (భూచుట్టుకొలత)
  కాగితం వెడల్పు = స్థూపం ఎత్తు (h)

మాదిరి ప్రశ్నలు

1. ఒక క్రమ వృత్తాకార స్థూపం వక్రతల వైశాల్యం, దాని ఘనపరిమాణాల సంఖ్యా విలువల నిష్పత్తి 3 : 4. ఆ స్థూపం వ్యాసార్ధం, ఎత్తుల నిష్పత్తి 4 : 9. అయితే ఆ స్థూపం సంపూర్ణతల వైశాల్యం ఎంత? (చ.యూ.లలో)

1) $\frac{461}{9}$ 2) $\frac{416}{9}\pi$ 3) $\frac{461}{9}\pi$ 4) $\frac{416}{9}$

సాధన: $r = 2 \times \frac{\text{ఘ. ప}}{\text{వ. త. వై}} = 2 \times \frac{4}{3} = \frac{8}{3}$ యూనిట్లు

లెక్క ప్రకారం $\frac{r}{h} = \frac{4}{9} \Rightarrow h = \frac{9}{4} r = \frac{9}{4} \times \frac{8}{3} = 6$ యూనిట్లు

$\therefore$ స్థూపం సంపూర్ణతల వై. $= 2\pi r(r + h) \Rightarrow 2\pi \times \frac{8}{3}\left(\frac{8}{3} + 6\right)$

$= \frac{16}{3}\pi \times \frac{26}{3} = \frac{416}{9}\pi$ చ.యూ.

సమాధానం: 2

2. 10 సెం.మీ. ఎత్తు, భూవ్యాసార్ధం 5 సెం.మీ. ఉన్న స్థూపం తయారు చేయడానికి 0.625 సెం.మీ. వ్యాసార్ధం 0.25 సెం.మీ. మందం ఉన్న నాణేలను ఎన్నింటిని కరిగించాలి?

1) 2650 2) 2500 3) 2560 4) 2460

సాధన: R = 5 సెం.మీ., H = 10 సెం.మీ.,

$h = 0.25 = \frac{1}{4}$ సెం.మీ., $r = 0.625 = \frac{5}{8}$ సెం.మీ.

లెక్క ప్రకారం, $n \times \pi r^2 h = \pi R^2 H$

$\Rightarrow n \times \frac{5}{8} \times \frac{5}{8} \times \frac{1}{4} = 5 \times 5 \times 10 \Rightarrow n = 2560$

సమాధానం: 3

3. 28 సెం.మీ వ్యాసం ఉన్న ఒక స్థూపాకార ట్యాంక్ నిండా నీళ్లు ఉన్నాయి. 11 లీటర్ల నీటిని తొలగిస్తే ఆ ట్యాంకులో నీటిమట్టం ఏ మేరకు పడిపోతుంది? (సెం.మీ.లలో)

1) $17\frac{6}{7}$ 2) $17\frac{3}{7}$ 3) $17\frac{5}{7}$ 4) $17\frac{4}{7}$

సాధన: తొలగించిన నీటి ఘ.ప = 11 లీ. = 11 × 1000 ఘ.సెం.మీ.

d = 28 సెం.మీ. ⇒ r = 14 సెం.మీ., h = ?

లెక్క ప్రకారం, $\pi r^2 h = 11 \times 1000 \Rightarrow \frac{22}{7} \times 14 \times 14 \times h = 11000$

$\Rightarrow h = \frac{125}{4}$ సెం.మీ. $= 17\frac{6}{7}$ సెం.మీ.

సమాధానం: 1

4. ఒక వృత్తాకార స్థూపం ఎత్తు 9 మీ. దాని రెండు వృత్తాకార ముఖాల వైశాల్యాల మొత్తానికి నాలుగురెట్లు, ఆ స్థూపం వక్రతల వైశాల్యానికి మూడురెట్లు సమానం. అయితే ఆ స్థూపం భూమి వ్యాసార్ధం ఎంత? (మీ.లలో)

1) $6\frac{1}{5}$ 2) $6\frac{1}{4}$ 3) $6\frac{3}{5}$ 4) $6\frac{3}{4}$

సాధన: h = 9 మీ. లెక్కప్రకారం $4 \times 2\pi r^2 = 3 \times 2\pi rh$

$\Rightarrow r = \frac{3}{4} h \Rightarrow r = \frac{3}{4} \times 9 = \frac{27}{4}$ మీ. $= 6\frac{3}{4}$ మీ.

సమాధానం: 4

5. ఒక బకెట్ వృత్తాకార పైభాగం, అడుగు భాగాల వ్యాసార్ధాలు వరుసగా 21 సెం.మీ., 12 సెం.మీ. దాని లోతు 14 సెం.మీ. అయితే ఆ బకెట్ ఘనపరిమాణాన్ని లీటర్లలో కనుక్కోండి.

1) 12.672 లీ. 2) 12.627 లీ.
3) 12.726 లీ. 4) 12.276 లీ.

సాధన: R = 21 సెం.మీ., r = 12 సెం.మీ., h = 14 సెం.మీ.

$R^2 = 441, r^2 = 144, Rr = 252 \Rightarrow R^2 + r^2 + Rr = 837$

బకెట్ ఘనపరిమాణం $= \pi\frac{h}{3}(R^2 + r^2 + Rr)$

$= \frac{22}{7} \times \frac{14}{13} \times 837 = 12{,}276$ ఘ.సెం.మీ. ⇒ 12.276 లీ.

సమాధానం: 4

6. ఒక స్థూపం వ్యాసార్ధాన్ని 18% తగ్గించి, ఎత్తును 32% పెంచితే, దాని వక్రతల వైశాల్యంలో వచ్చే మార్పు శాతం ఎంత?

1) 11.4% తగ్గుతుంది 2) 11.4% పెరుగుతుంది
3) 8.24% పెరుగుతుంది 4) 8.24% తగ్గుతుంది

సాధన: ఇక్కడ x = −18%, y = +32%

వక్రతల వైశాల్యంలో మార్పు శాతం $= \left(x + y + \frac{xy}{100}\right)\%$

$= \left(-18 + 32 + \frac{-18 \times 32}{100}\right)\% = (14 - 5.76)\%$

= 8.24% పెరుగుతుంది.

సమాధానం: 3

7. ఒక దీర్ఘచతురస్రాకార కాగితం పొడవు 33 సెం.మీ., దాని వెడల్పు 16 సెం.మీ. ఆ కాగితం పొడవు వెంబడి చుట్టి ఒక స్థూపాన్ని తయారు చేస్తే ఆ స్థూపం ఘనపరిమాణం ఎంత?

1) 1056 ఘ.సెం.మీ. 2) 1386 ఘ.సెం.మీ.
3) 1368 ఘ.సెం.మీ. 4) 528 ఘ.సెం.మీ.

సాధన: దీర్ఘ చతురస్రాకార కాగితం పొడవు వెంబడి చుట్టినప్పుడు, దాని పొడవు స్థూపం భూమి చుట్టుకొలత, వెడల్పు స్థూపం ఎత్తు అవుతాయి.

h = 16 సెం.మీ., 2πr = 33

$\Rightarrow 2 \times \frac{22}{7} \times r = 33 \Rightarrow r = \frac{21}{4}$ సెం.మీ.

$v = \pi r^2 h = \frac{22}{7} \times \frac{21}{4} \times \frac{21}{4} \times 16 = 1386$ ఘ.సెం.మీ.

సమాధానం: 2

8. 18 సెం.మీ. భూవ్యాసార్ధం ఉన్న ఒక స్థూపాన్ని కరిగించి అదే ఎత్తులో రెండు సమాన స్థూపాలను తయారు చేస్తే, ప్రతి స్థూపం భూమి వ్యాసార్ధం ఎంత? (సెం.మీ.లలో)

1) 9 2) 14
3) $9\sqrt{2}$ 4) 12

సాధన: R = 18 సెం.మీ.,

$r_1 = r_2 = ?$

$r_1 = \frac{R}{\sqrt{2}} = \frac{18}{\sqrt{2}} = \frac{18\sqrt{2}}{2}$

$= 9\sqrt{2}$ సెం.మీ.

సమాధానం: 3



రచయిత
డా. వంగల శ్రీనివాస్
విషయ నిపుణులు

1000 Word of the Day

Sallow

Telugu meaning: పాలిపోయిన, జబ్బుచిక్కిన

English meaning: The word sallow (శాలో) is an adjective that describes a pale, unhealthy, or yellowish complexion.

Synonyms: Pale, Sickly; *Antonyms:* Healthy, Radiant

Usage: 1. After weeks of illness and lack of proper nutrition, his face appeared sallow and lifeless, alarming his family members.

2. The long hours of stress and sleepless nights gave her a sallow complexion that reflected her deteriorating health.

కరెంట్ అఫైర్స్



మహారాష్ట్రలోని ప్రతిష్ఠాత్మక ముంబయి-పుణె ఎక్స్‌ప్రెస్ వే 'మిస్సింగ్ లింక్' ప్రాజెక్టులో భాగంగా, ప్రపంచంలోనే అత్యంత వెడల్పైన భూగర్భ సొరంగాన్ని నిర్మించిన ఘనతను హైదరాబాద్ సంస్థ నవయుగ ఇంజినీరింగ్ దక్కించుకుంది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ చోటు సంపాదించుకుంది. ఈ నూతన మార్గం అందుబాటులోకి రావడంతో ముంబయి-పుణె ప్రయాణ సమయంలో 30 నిమిషాలు ఆదా అవడమే కాకుండా, ఖండాలా ఘాట్లలోని విపరీతమైన ట్రాఫిక్ రద్దీని తప్పించుకోవచ్చు.



హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు 22వ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా కె.రవి నియమితులయ్యారు. ఇప్పటి వరకు సీఎండీగా సేవలు అందించిన డాక్టర్ కె.సునీల్ స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టినట్లు సంస్థ 2026, మే 1న ప్రకటించింది. హెచ్ఏఎల్‌లో మూడు దశాబ్దాలుగా తయారీ, డిజైనింగ్, ఎలక్ట్రానిక్స్ తదితర విభాగాల్లో రవి సేవలు అందించారు



స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన స్టెల్త్ ఫ్రిగేట్ యుద్ధనౌక 'మహేంద్రగిరి' భారత నౌకాదళం చేతికి అందింది. శక్తిమంతమైన ఆయుధాలు, అధునాతన సెన్సర్లు ఈ వార్‌షిప్ సొంతం. ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ సంస్థ దీన్ని నేవీకి అందించింది. మహేంద్రగిరి.. నీలగిరి తరగతి (ప్రాజెక్ట్-17ఏ)లో ఆరో యుద్ధనౌక.



సూరత్-భరూచ్ సెక్షన్‌లోని చోరయాసి టోల్ ప్లాజాను దేశంలో తొలి బహుళ వరుసల బ్యారియర్ లెస్ టోల్ ప్లాజాగా తీర్చిదిద్దినట్లు కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ గడ్కరీ 2026, మే 1న ప్రకటించారు. ఫాస్టాగ్‌కు తోడు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఎ.ఎన్.పి.ఆర్) పద్ధతిని ఉపయోగించడం వల్ల వాహనదారులు టోల్ గేట్ వద్ద ఆగకుండానే ముందుకు సాగవచ్చు. వారి ఫాస్టాగ్ వ్యాలెట్ నుంచి సుంకం చెల్లింపులు ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


బొగ్గు గని కార్మికుల దినోత్సవం

జనరల్ నాలెడ్జ్ – చరిత్రలో ఈనాడు – మే 4

ప్రకృతిలో లభించే అత్యంత ముఖ్యమైన శిలాజ ఇంధనాల్లో బొగ్గు ఒకటి. ఇదొక ఇంధన ఖనిజం. దీన్ని నల్ల బంగారం అని పిలుస్తారు. విద్యుత్, పారిశ్రామిక ఉత్పత్తి సహా వివిధ ప్రయోజనాల కోసం దీన్ని విరివిగా వినియోగిస్తారు. భూమిలో నుంచి దీన్ని వెలికితీయడం శ్రమతో పాటు ప్రమాదకరం కూడా. బొగ్గు గనుల్లో పనిచేసే కార్మికుల కృషిని, అంకితభావాన్ని గుర్తించాలనే లక్ష్యంతో మన దేశంలో ఏటా ఏప్రిల్ 4న బొగ్గు గని కార్మికుల దినోత్సవం (Coal Miners Day)గా నిర్వహిస్తారు. బొగ్గును అందుబాటులోకి తెస్తోన్న కార్మికుల శ్రమను గుర్తుంచుకోవడంతోపాటు దేశ ఆర్థికాభివృద్ధిలో వారి పాత్రను స్మరించుకోవడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

బొగ్గు ఏర్పడటం..

- బొగ్గు శిలాజ ఇంధనం. ఇది జీవుల కళేబరాల అవశేషాల నుంచి తయారవుతుంది. భూమి లోపల అత్యధిక ఉష్ణోగ్రత, పీడనాల వద్ద ఏర్పడుతుంది. శిలాజ ఇంధనం ఏర్పడేందుకు కొన్ని వేల సంవత్సరాలు పడుతుంది. బొగ్గు ఘనరూప శిలాజ ఇంధనం కాగా పెట్రోలియం ద్రవరూప శిలాజ ఇంధనం. దీన్ని 'ద్రవ బంగారం' అంటారు. సహజ వాయువు అనేది వాయు రూప శిలాజ ఇంధనం.



- సుమారు 300 మిలియన్ ఏళ్ల క్రితం ప్రకృతి వైపరీత్యాల కారణంగా నేలపై ఉన్న మొక్కలు భూమి లోపలి పొరల్లో చేరి మట్టితో కూరుకుపోయాయి. ఆ తర్వాత కాలక్రమంలో అధిక ఉష్ణోగ్రత, పీడనానికి గురికావడంతో వాటి అవశేషాలు నల్లటి ఘనపదార్థంగా మారాయి. ఈ విధంగా ఏర్పడిన పదార్థాన్నే నేల బొగ్గు అంటారు. వృక్ష అవశేషాలు నెమ్మదిగా నేల బొగ్గుగా మారే ప్రక్రియను 'కార్బొనైజేషన్' అంటారు.
- నేలబొగ్గులో ప్రధానంగా ఉండే మూలకం కార్బన్. నేలబొగ్గును మండిస్తే కార్బన్ డైఆక్సైడ్ వెలువడుతుంది.
- నేలబొగ్గును వంట చెరకుగా, రైలు ఇంజిన్ నడపడానికి, థర్మల్ పవర్ ప్లాంట్‌లలో విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తారు. పరిశ్రమల్లో ఇంధనంగానూ ఉపయోగిస్తారు.

చారిత్రక నేపథ్యం, ఇతర అంశాలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ

భారత ప్రజాప్రాతినిధ్య చట్టాలు



ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటారు. అందులో పాలకులు, పాలితులు 'ప్రజలే'. భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా ఉంది. ప్రజల తరఫున చట్టసభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు రాజ్యాంగ నియమాలకు లోబడి వ్యవహరించాలి. చట్టసభలకు ఎన్నికయ్యే ప్రజాప్రతినిధుల అర్హతలు, అనర్హతల గురించి 'ప్రజాప్రాతినిధ్య చట్టాల్లో' (Representation of the people acts) వివరించారు.

సుప్రీంకోర్టు తీర్పులు: "శిక్షకు గురైన ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులు. హైకోర్టులో అప్పీలు పెండింగ్‌లో ఉందనే కారణంతో చట్టసభల సభ్యుల అనర్హతకు వాయిదా కల్పిస్తున్న ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 8(4) రాజ్యాంగ విరుద్ధం" - సుప్రీంకోర్టు

- క్రిమినల్ నేరాల్లో దోషులుగా నిర్ధారణై, రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం జైలుశిక్షకు గురైన పార్లమెంట్ లేదా రాష్ట్రాల శాసనసభల సభ్యులు తక్షణమే అనర్హులవుతారని 2013లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది.

భారత ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 - కీలక సెక్షన్లు, వాటి వివరణ; యూపీఏ ప్రభుత్వ ఆర్డినెన్స్, ప్రజాప్రాతినిధ్య (సవరణ) చట్టం, 2013; ప్రజాప్రాతినిధ్య (సవరణ, ధ్రువీకరణ) చట్టం, 2013; రాజ్యాంగ సమీక్ష కమిషన్ సిఫార్సులు; అనర్హతకు గురయ్యే సందర్భాలు; సభ్యత్వం కోల్పోయిన వారు మొదలైన అంశాలు సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Faculty Posts

The All India Institute of Medical Sciences (AIIMS), Raipur, invites applications for the recruitment of faculty posts across various departments on a direct recruitment basis. The total number of posts is 92. The application fee is Rs.3,000. Eligible candidates can apply online before 15 May 2026.

Apprentice Posts

The Institute for Plasma Research (IPR), located in Gandhinagar, is inviting applications to fill Graduate and Technician Apprenticeships across various disciplines for the year 2026-27. The total number of posts is 50. Eligible candidates can apply online before 11 May 2026.

Did You Apply..?

Today (May 4) is the last date for the following Jobs

- SSC Selection Post Phase-XIV - 2,919 posts. **Eligibility:** Matriculation (10th), Higher Secondary (10+2), and Graduation & Above.
- 58 Faculty Positions at ESIC Punjab. **Eligibility:** MBBS/MD/MS/DNB.

For more information and other notifications - scan QR code

SSC Exams – English

Cloze Test

Directions (Qs. 1 - 10): *In the following passage, some words have been deleted. Read the passage carefully and select the most appropriate option to fill in each blank.*

The Right to Education (RTE) Act, enacted in 2009, represents a landmark step in India's journey towards ensuring inclusive and equitable education for all children between the ages of six and fourteen. Recognized as a fundamental right under Article 21A of the Constitution, it aims not only to guarantee access to schooling but also to function as a powerful instrument of social integration by bringing together children from diverse socio-economic, cultural, and linguistic backgrounds into a common educational framework. Education, in this sense, becomes a means of reducing inequality and fostering unity among citizens. One of the most significant provisions of the Act is the reservation of 25% seats in private schools for children from economically weaker sections, which is intended to create a more **.... (1) ....** and inclusive classroom environment. However, despite its progressive vision, the implementation of RTE faces several challenges that hinder its effectiveness. Many private institutions perceive this provision as a financial burden, leading to resistance and partial compliance, which weakens the intended impact. Additionally, children admitted under this quota sometimes face subtle discrimination, thereby **.... (2) ....** the goal of social integration. Another critical issue is the quality of education in government schools, where inadequate infrastructure, shortage of trained teachers, and lack of accountability result in poor learning outcomes. This creates a significant disparity between students of different schooling systems, making it difficult to achieve true equality. Therefore, ensuring **.... (3) ....** standards of education across all institutions becomes essential. Furthermore, social integration cannot be fully realized without addressing deep-rooted societal prejudices related to caste, class, and gender, which often find reflection within school environments. Teachers, being key agents of change, must adopt **.... (4) ....** teaching practices that promote respect, empathy, and collaboration among students from diverse backgrounds. In addition, curriculum reforms should emphasize constitutional values such as equality, secularism, and fraternity to build a sense of belonging. Another challenge lies in weak monitoring and evaluation mechanisms, which lead to policy **.... (5) ....**, where intended benefits fail to reach the target population effectively. Strengthening institutional frameworks and improving coordination among stakeholders can help overcome such issues. Moreover, community participation plays a crucial role in the success of RTE, as active involvement of parents and local bodies ensures accountability and transparency in the system. Awareness campaigns are also necessary to educate citizens about their rights and responsibilities, thereby encouraging greater engagement. Such collective efforts can contribute to building a more **.... (6) ....** and unified education system. In addition, the government must allocate adequate financial resources and ensure their efficient utilization to address infrastructural gaps and improve teacher training programs. Without sufficient investment, the objectives of the Act cannot be fully achieved. It is also important to adopt innovative approaches, such as digital learning and skill-based education, to make the system more relevant and adaptable to changing needs. Furthermore, regular assessment and data-driven policymaking are required to identify gaps and implement timely corrective measures. This will help in **.... (7) ....** the effectiveness of educational interventions and ensuring better outcomes. Ultimately, while the RTE Act has laid a strong foundation for universal education, its success as an instrument of social integration depends on continuous reforms and committed implementation. Addressing issues related to quality, equity, and inclusivity is essential to ensure that education truly becomes a means of empowerment and national development. If these challenges are not adequately addressed, the transformative potential of the Act may remain **.... (8) ....**, limiting its impact on society. Therefore, a holistic and **.... (9) ....** approach is required to tackle these issues effectively. In conclusion, the Right to Education Act has the potential to bridge social divides and promote national unity, but this can only be achieved through sustained efforts and a longterm commitment to educational reform and **.... (10) ....** development.

1. A) fragmented B) cohesive C) rigid D) isolated
2. A) strengthening B) promoting C) undermining D) achieving
3. A) unequal B) declining C) selective D) uniform
4. A) inclusive B) discriminatory C) passive D) outdated
5. A) success B) innovation C) failure D) expansion
6. A) balanced B) divided C) isolated D) fragile
7. A) reducing B) enhancing C) ignoring D) distorting
8. A) realized B) fulfilled C) expanded D) limited
9. A) narrow B) fragmented C) comprehensive D) casual
10. A) economic B) sustainable C) temporary D) uneven

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

గల్ఫ్ యుద్ధ సెగలు లాటిన్ అమెరికాలో..!

ఎక్కడో దెబ్బ తగిలితే మరెక్కడో నొప్పి రావడం అంటే ఇదే. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం లాటిన్ అమెరికా దేశాలను కుంగదీస్తోంది. ఇంధన ధరల మంట ఈ దేశాల్లో లక్షల మంది జీవితాల్ని ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ప్రజా రవాణా తలకిందులవుతోంది. ఆహార ధరలు ఒక్కసారిగా పెరుగుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధం ఇప్పటికిప్పుడు ఆగిపోయినా.. లాటిన్ అమెరికా ఆర్థిక వ్యవస్థలు కోలుకోవడానికి చాలాకాలం పడుతుందని ఆర్థికవేత్తలు విశ్లేషిస్తున్నారు.

అర్జెంటీనా



ద్రవ్యోల్బణం కట్టడికి ఆపసోపాలు పడుతున్న అర్జెంటీనాకు పశ్చిమాసియా యుద్ధం గోరుచుట్టుపై రోకలిపోటులా తయారైంది. జీవనవ్యయం విపరీతంగా పెరుగుతోంది. [illegible] యుద్ధం మొదలైనప్పటి నుంచి అర్జెంటీనాలో ఇంధన ధరలు 20% కంటే ఎక్కువగా పెరిగాయి. దీంతో ప్రభుత్వం ప్రజా రవాణాకు కోతపెడుతోంది. బస్సుల సంఖ్యను తగ్గిస్తోంది. ఫలితంగా నగర కేంద్రాల్లో, రద్దీ సమయాల్లో పొడవైన క్యూలైన్లు, అసహనానికి గురైన ప్రయాణికులు కనిపిస్తున్నారు. యుద్ధం కారణంగా మార్చిలో ఇంధన ధరలు 9%, దేశీయ విమాన ఛార్జీలు 24%, నగరాల మధ్య రవాణా ఛార్జీలు 22% పెరిగాయి. నిత్యావసర ధరల పెరుగుదల 10% నమోదైంది. రానున్న నెలల్లో ధరల మోత మరింతగా ఉండొచ్చని బ్యూనస్ఎయిర్స్ మాజీ ఆడిటర్ జనరల్ హ్యూగో వాస్క్వెస్ అంటున్నారు.

కోస్టారికా



దశాబ్దాలుగా ఇంధన దిగుమతులపైనే ఆధారపడిన కోస్టారికాకు ఈ యుద్ధం పెను శాపమైంది. ఇంధన ధరలు తడిసిమోపెడవుతున్నాయి. రవాణా, ఆహార ఖర్చులు కుటుంబ బడ్జెట్లను తలకిందులు చేస్తున్నాయని లాటిన్ అమెరికా, కరీబియన్ ఆర్థిక [illegible] (ఈసీఎల్ఏసీ) విశ్లేషకులు వివరిస్తున్నారు. యుద్ధం వల్ల కోస్టారికా ప్లాస్టిక్, ఆహార శుద్ధి, ప్యాకేజింగ్ పరిశ్రమలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. కోస్టారికాలో ప్లాస్టిక్ పరిశ్రమ [illegible]. ముడిసరకు ధరలు పెరుగుదలతో ఈ రంగం ఇప్పుడు డీలాపడింది.

మెక్సికో



యుద్ధం వల్ల ఇంధన ధరలు పెరిగినా ద్రవ్యోల్బణం అదుపులోనే ఉందని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ చెబుతున్న మాటలు ఆచరణలో తాజా గణాంకాలు రుజువుచేస్తున్నాయి. గత ఏడాది 3.7 శాతం ఉన్న ద్రవ్యోల్బణం ఇప్పుడు దాదాపు 5 శాతానికి చేరింది. దీనివల్ల మెక్సికన్ల సంప్రదాయ ఆహారమైన టోర్టిల్లాల ధరలు [illegible]. మెక్సికో చేసే అవసరాల్లో దాదాపు 75% వంటగ్యాస్‌ను, 50 శాతం పెట్రోలును అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటుంది. ధరల మంట తగ్గించడానికి ఇంధన ధరలపై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నా.. ఉపశమనం ఉండట్లేదు. సబ్సిడీల భారం ఇతర రంగాలపై పడుతుందని మెక్సికో జాతీయ స్వయంప్రతిపత్తి విశ్వవిద్యాలయం ఆర్థిక పరిశోధన సంస్థ ప్రొఫెసర్ మారిట్జ్ క్రూజ్ అంటున్నారు.

ఈక్వెడార్



స్వయానా ఇంధన ఉత్పత్తిదారు అయిన ఈక్వెడార్‌లో చమురు ధరలు తరచూ ప్రజా నిరసనలకు కారణమవుతుంటాయి. ధరల సెగ [illegible] తాజాగా ఉంటుంది. ఇంధన ధరల్లో కొంత భారాన్ని ప్రభుత్వం భరిస్తున్నా.. ప్రముఖ రవాణా [illegible] డీజిల్ ధర గాలన్‌కు దాదాపు 3 డాలర్ల మేర పెరిగాయి. ఇక నిత్యావసరాల ధరలు వారికి చుక్కలు చూపిస్తున్నాయి. డీజిల్ ధరల పెరుగుదలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయకపోతే రవాణా రంగం కుదేలవుతుందని ఈక్వెడార్ రవాణా సమాఖ్య హెచ్చరిస్తోంది.

హైతీ



ఎక్కువగా హైతీ ఆహార అభద్రతను ఎదుర్కొంటోంది. దేశ జనాభాలో దాదాపు సగం మంది ప్రాథమిక ఆహార అవసరాలను కూడా తీర్చుకోలేకపోతున్నారని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం చెబుతోంది. సాయుధ ముఠాల హింసతో తలెత్తిన ఆహార అత్యవసర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. సుమారు 58 లక్షల మంది హైతీ ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. గోటిచుట్టపై రోకటిపోటులా ఇప్పుడు ఇంధన సమస్య వారిని మరింత క్షోభ పెడుతోంది.

—ఈనాడు ప్రత్యేక విభాగం



బిహార్ రాజధాని పట్నాలో ఆదివారం సద్భావ్ యాత్రను ప్రారంభిస్తున్న సందర్భంగా తన తండ్రి, బిహార్ మాజీ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఆశీస్సులు తీసుకుంటున్న జేడీయూ నేత నిశాంత్ కుమార్

నెదర్లాండ్స్ యువరాణులపై హత్యాయత్నం
పోలీసుల అదుపులో నిందితుడు



ఇంటర్నెట్ డెస్క్: నెదర్లాండ్స్ యువరాణులు కేథరినా- అమాలియా (22), అలెక్సియాలపై (20) హత్యాయత్నానికి ప్రయత్నించిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. డచ్ రాజ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకున్న 33 ఏళ్ల నిందితుడు ఫిబ్రవరిలో యువరాణులిద్దరినీ హత్య చేసేందుకు యత్నించినట్లు పోలీసులు వెల్లడించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ విషయాన్ని ఇప్పటి వరకూ బయటకు వెల్లడించలేదని, ఇటీవల నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితుడివద్ద రెండు గొడ్డళ్లు, విద్వేషపూరిత వ్యాఖ్యలతో కూడిన కాగితాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నెదర్లాండ్స్ రాజు విల్లెం-అలెగ్జాండర్ 59వ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన కింగ్స్ డే వేడుకల్లో రాజ కుటుంబం పాల్గొన్న సందర్భంగా అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. నిందితుడిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. యువరాణి కేథరినా-అమాలియా గతంలోనూ అనేక భద్రతాపరమైన సమస్యలు ఎదుర్కొన్నారు. 2020లో ఓ వ్యక్తి సోషల్ మీడియాలో అత్యాచార, హింస బెదిరింపులకు పాల్పడటంతో ఆమె అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. రెండేళ్ల తర్వాత ఆమ్‌స్టర్‌డామ్‌లోని విద్యార్థి వసతి గృహాన్ని ఖాళీ చేసి.. హేగ్‌లోని అత్యంత పటిష్ఠమైన భద్రత గల రాజభవనానికి మారారు. తర్వాతా పలు అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠాలు బెదిరింపులకు పాల్పడడంతో నెదర్లాండ్స్‌ను వదిలి.. ఏడాది పాటు స్పెయిన్‌లో ఆమె తలదాచుకున్నారు.

ఆర్మీ అధికారి భార్య గుండెతో 14 ఏళ్ల బాలుడికి ప్రాణదానం

దిల్లీ: మెదడులో తీవ్ర రక్తస్రావంతో బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించిన ఓ ఆర్మీ అధికారి భార్య(41) గుండె ప్రాణాపాయ స్థితిలో ఉన్న పద్నాలుగేళ్ల బాలుడికి కొత్త జీవితాన్ని ఇచ్చింది. హరియాణాలోని పంచకులలో గల చండీమందిర్ కమాండ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను బ్రెయిన్‌డెడ్ కేసుగా శనివారం వైద్యులు ప్రకటించారు. భారత సైన్యంలో పని చేస్తున్న భర్తతోపాటు ఆ దంపతుల ఇద్దరు కుమార్తెలు కొండంత విషాదాన్ని దిగమింగి, అవయవదానానికి సమ్మతి తెలిపారు. ఆసుపత్రివారు అందించిన సమాచారంతో ప్రైవేటు జెట్‌లో వచ్చిన ఇంద్రప్రస్థ అపోలో ఆసుపత్రి సిబ్బంది ఆమె గుండెను హుటాహుటిన దిల్లీకి తరలించారు. హరియాణా, పంజాబ్, దిల్లీ ట్రాఫిక్ పోలీసులతోపాటు చండీగఢ్ విమానాశ్రయ అధికారులు ఇందుకు సహకరించారు. దిల్లీలో చికిత్స పొందుతున్న బాలుడికి ఆ గుండెతో పునర్జన్మ లభించింది. ఐసీయూ పర్యవేక్షణలో ఉన్న అతడి ఆరోగ్య పరిస్థితి కుదురుగా ఉందని అపోలో ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ముకేశ్ గోయెల్ తెలిపారు.

నేపాల్‌లో 1,500 రాజకీయ నియామకాల రద్దు

కాఠ్‌మాండూ: నేపాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన దాదాపు 1,500 రాజకీయ నియామకాలను రద్దు చేస్తూ అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రద్దు చేసిన నియామకాలన్నీ దేశంలో నాయకత్వ మార్పు జరిగిన మార్చి 26కు ముందు చోటుచేసుకున్నాయని ప్రభుత్వ యంత్రాంగం పేర్కొంది. నేపాల్‌లో జెన్‌జీ నిరసనల అనంతరం ఈ ఏడాది మార్చి 5 జరిగిన ఎన్నికల్లో బాలేంద్ర షా నేతృత్వంలోని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. గతంలో ఉన్న ప్రభుత్వం, తాత్కాలిక ప్రభుత్వాల హయాంలో జరిగిన వివిధ రాజకీయ నియామకాలను రద్దు చేస్తూ అధ్యక్షుడు తాజాగా ఈ ఆదేశాలను వెలువరించడం గమనార్హం. ప్రభుత్వ కార్యకలాపాలతోపాటు ప్రజా సంక్షేమంపై ఈ నిర్ణయం ప్రభావం చూపే అవకాశముందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

మానసిక క్రూరత్వానికి విడాకులు సబబే
జైపుర్ కోర్టు సమర్థన

జైపుర్: సామాజిక మాధ్యమాల్లో ప్రవర్తిస్తున్న తీరు, వేరే కాపురం పెట్టాలని ఒత్తిడి చేయడం కచ్చితంగా క్రూరత్వమేనని రాజస్థాన్‌లోని జైపుర్ కుటుంబ న్యాయస్థానం పేర్కొంది. ఆ కారణాలతో ఒక జంటకు విడాకులు మంజూరు చేసింది. మరొకరితో ఉన్న ఛాయాచిత్రాలను సామాజిక మాధ్యమాల్లో ఆమె పంచుకుంటున్న తీరు సాధారణ సంబంధాలకు మించి ఉందని, భర్తకు ఇది కచ్చితంగా మానసిక వేదనే అని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. 'సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పంచుకునే టప్పుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ఈ కేసులో భార్య- వేరు కాపురం కోసం ఒత్తిడి చేయడమే కాకుండా భర్తను దుర్భాషలాడుతూ వచ్చింది. ఇవి వేధింపులే. వివాహ బంధంలో పరస్పర గౌరవం ముఖ్యం. పదేపదే అవమానించడం క్రూరత్వమే. బంధువైనా, స్నేహితుడైనా.. మరో పురుషుడితో హద్దులకు మించి ప్రవర్తించడం, వాటిని సోషల్ మీడియాలో ఉంచడం వివాహ బంధానికి హానికరం. కచ్చితంగా క్రూరత్వం. దీనిని వైవాహిక దుర్వర్తనగా పరిగణించాలి' అని ఇటీవల వెలువరించిన తీర్పులో పేర్కొన్నారు. దంపతులకు 2015లో వివాహమైంది.

పుణెలో చిన్నారిపై వృద్ధుడి హత్యాచారం.. విచారణకు సిట్ ఏర్పాటు

పుణె, ముంబయి: మహారాష్ట్రలోని పుణె జిల్లాలో నాలుగేళ్ల చిన్నారిపై 65 ఏళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడి, హతమార్చిన ఘటనపై దర్యాప్తు కోసం ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. తినడానికి ఏదైనా ఇస్తానని మభ్యపెట్టిన నిందితుడు శుక్రవారం చిన్నారిని ఓ పశువుల పాకలోకి తీసుకెళ్లి ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు ఆమె కోసం వెతుకుతుండగా ఒక ఇంటి సీసీటీవీ ఫుటేజీతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. నిందితుడిపై పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రతిపక్షాల ఆందోళనల నేపథ్యంలో ఈ కేసు విచారణ కోసం తాజాగా సిట్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ హామీ ఇచ్చారు.

మూడేళ్ల మనవరాలిపై లైంగిక దాడి..

బీడ్, ఠాణె: మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో తన మూడేళ్ల మనవరాలిపై లైంగిక దాడికి పాల్పడిన ఆరోపణలపై 54 ఏళ్ల వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. గత నెల ఏప్రిల్ 16- 25 తేదీల మధ్య బాలికపై పలుమార్లు లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నిందితుడిపై ఆరోపణలున్నాయి. ఈ విషయం తెలిసిన బాలిక అమ్మమ్మ స్వచ్ఛంద సంస్థ సహకారంతో పోలీసులను ఆశ్రయించడంతో నిందితుడిని అరెస్టు చేశారు.

◆ నాసిక్ జిల్లాలో మూడేళ్ల బాలికపై ఈ నెల 1న అఘాయిత్యానికి ఒడిగట్టిన 19 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితురాలి తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో లోపలికి వెళ్లిన సమీర్ అనే యువకుడు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

నిధుల్లేక 57 పాఠశాలల్లో 9, 10 తరగతుల నిలిపివేత

పాల్ఘర్: నిధుల కొరత, ఉపాధ్యాయుల జీతాలకు సంబంధించిన న్యాయపరమైన చిక్కుల కారణంగా మహారాష్ట్రలోని పాల్ఘర్ వ్యాప్తంగా ఉన్న 57 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 9, 10 తరగతులను నిలిపేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉపాధ్యాయ నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆమోద ముద్ర లేనందున నిధులు కేటాయించేందుకు గిరిజనాభివృద్ధిశాఖ నిరాకరించిందని జిల్లా పరిషత్ పేర్కొంది. ఇప్పటి వరకు వీరికి జీతాలు చెల్లించేందుకు అభివృద్ధి పనులకు కేటాయించిన ప్రత్యేక నిధులను జిల్లా పరిషత్ వినియోగించింది. ఇతర ఒప్పంద సిబ్బంది సమానత్వం కోరితే న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయంతో తరగతులను నిలిపేసేందుకు నిర్ణయించినట్లు యంత్రాంగం తెలిపింది. ప్రభావిత విద్యార్థులు సమీప ప్రైవేటు, ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో వచ్చేనెల 10 లోగా చేరాల్సిందిగా విద్యాశాఖ సూచించింది. ఈ పరిణామంతో బడి మానేసే వారిలో ముఖ్యంగా విద్యార్థినుల సంఖ్య పెరిగే అవకాశముందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

కైలాశ్ మానసరోవర్ యాత్ర మార్గంపై నేపాల్ అభ్యంతరం

కాఠ్‌మాండూ: లిపులేఖ్ పాస్ ద్వారా కైలాశ్ మానసరోవర్ యాత్రను నిర్వహించాలన్న భారత ప్రణాళికలపై నేపాల్ అభ్యంతరం వ్యక్తం చేసింది. లిపులేఖ్ తమ భూభాగమని పేర్కొంది. తమను సంప్రదించకుండా ఆ మార్గంలో యాత్రకు ప్రణాళికలు రూపొందించడమేంటని ప్రశ్నించింది. నేపాల్ విదేశాంగ శాఖ ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. లిపులేఖ్, లింపియాధురా, కాలాపానీ తమ భూభాగాలేనని అందులో పేర్కొంది. లిపులేఖ్ ద్వారా యాత్ర ప్రణాళికలను రూపొందించినందుకు మైనాకూ తమ అభ్యంతరం తెలియజేశామంది. మరోవైపు- నేపాల్ అభ్యంతరాన్ని భారత్ తిరస్కరించింది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పాస్ గుండా కైలాశ్ మానసరోవర్ యాత్ర దశాబ్దాలుగా సాగుతోందని గుర్తుచేసింది. భూభాగాల విషయంలో ఏకపక్షంగా ప్రకటనలు చేయడం ఎంతమాత్రమూ అంగీకార యోగ్యం కాదంటూ హితవు పలికింది.

పాక్‌లో ఫెడరల్ సివిల్ సర్వీసుకు ఇద్దరు హిందూ అభ్యర్థుల ఎంపిక

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌లో మైనారిటీలైన హిందూ వర్గానికి చెందిన ఇద్దరు అభ్యర్థులు ఫెడరల్ సివిల్ సర్వీసులో చేరేందుకు అర్హత సాధించారు. పాక్ ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇటువంటి వర్గాల ప్రాతినిధ్యం చాలా తక్కువ. సెంట్రల్ సుపీరియర్ సర్వీసెస్‌లో (సీఎస్ఎస్) చేరేందుకు ఉత్తీర్ణత సాధించిన 170 మంది అభ్యర్థుల్లో సింధ్ ప్రావిన్సుకు చెందిన జీవన్ రెబారీ, ఖేమ్‌చంద్ జండోరాలకు చోటు లభించింది.

ప్రైవేటు బస్సు బోల్తా
హిమాచల్‌లో 28 మందికి గాయాలు

నుర్‌పుర్: డ్రైవింగ్ చేస్తున్న సమయంలో డ్రైవర్‌కు ఛాతీలో నొప్పి రావడంతో ఓ ప్రైవేటు బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 28 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వీరిలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులున్నారు. నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది.



ఉత్తరాఖండ్‌లోని చమోలీ జిల్లాలో ప్రఖ్యాత శ్రీ హేమ్‌కుండ్ సాహిబ్ గురుద్వారాను తెరుస్తున్న నేపథ్యంలో, ఆ మార్గంలో పేరుకుపోయిన మంచును తొలగిస్తున్న ఆర్మీ సిబ్బంది



మణిపుర్‌లో జాతుల మధ్య హింస మొదలై మూడేళ్లవుతున్న సందర్భంగా, బిష్ణుపుర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన శాంతి ర్యాలీలో పాల్గొన్న స్థానికులు

అక్కడ కోడింగ్.. ఇక్కడ కుకింగ్



హరియాణాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీరు రచిత్ మదన్ తన కుటుంబం మాట మన్నించి సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉద్యోగం చేస్తూనే.. సొంత ఆసక్తి మేరకు ఫుడ్‌స్టాల్ యజమానిగానూ రాణిస్తున్నారు. ఫరీదాబాద్‌లోని సెక్టార్-28 మార్కెట్‌లో ఉన్న 'వాహ్ తందూర్' ఫుడ్‌స్టాల్‌కు సాయంత్రమైతే జనం వరుస కడతారు. ఓ ప్రముఖ ఐటీ కంపెనీలో విజయవంతమైన కోడర్‌గా పని చేస్తూనే, చిన్ననాటి అభిరుచిని లాభదాయకమైన వ్యాపారంగా మదన్ మార్చారు. రూర్కీలో ఇంజినీరింగ్ చదివాక పెద్ద కంపెనీలో ఉద్యోగం వచ్చింది. కానీ ఇతరుల కోసం వంట చేయడం, వడ్డించడమంటే ఎంతో సరదాపడే ఈ యువ టెకీ వంటవాడి అవతారం ఎత్తారు. మదన్ ఫుడ్‌స్టాల్‌లో మోమోస్‌కు మంచి పేరుంది. స్వయంగా ఆయన తయారుచేసే తందూరీ గ్రేవీ, మలై గ్రేవీ మోమోస్‌ను వినియోగదారులు ఎక్కువగా ఇష్టపడతారు.

ఉదయ్‌పుర్ స్పెషల్.. వందేళ్ల 'గులాబ్ పాషా'

ఈటీవీ భారత్ — యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి



రాజస్థాన్‌లోని సరస్సుల నగరం ఉదయ్‌పుర్‌కు ఉన్న మరో ప్రత్యేకత గులాబ్ పాషా మిఠాయి. నగరంలోని జగదీశ్ మందిర్ కూడలి సమీపంలో ఈ మిఠాయి దుకాణాన్ని ఓ కుటుంబం నాలుగు తరాలుగా నిర్వహిస్తోంది. వందేళ్ల చరిత్ర గల గులాబ్ పాషా తయారీని ప్రస్తుతం 81 ఏళ్ల సత్యనారాయణ్, ఆయన వారసుడు రవిప్రకాశ్ కొనసాగిస్తున్నారు. ఇన్నేళ్లలో ఈ దుకాణాన్ని నిర్వహించే తరాలు మారినా మిఠాయి రుచి, సువాసన, నాణ్యత అస్సలు మారలేదని స్థానికులు చెబుతారు. ఉదయ్‌పుర్‌కు విరివిగా వచ్చే విదేశీ పర్యాటకులు గులాబ్ పాషాను రుచి చూడటమే కాకుండా ప్యాక్ చేయించుకుని తీసుకెళ్తారు. కేజీ గులాబ్ పాషా ధర రూ.440. స్వచ్ఛమైన పాలు, నెయ్యి, తాజా గులాబీ రేకుల రసం, యాలకులు, కుంకుమపువ్వు ఈ మిఠాయి తయారీలో వాడతారు. గులాబ్ పాషాకు ఉదయ్‌పుర్ రాజ కుటుంబీకులతోనూ అనుబంధం ఉంది. ఇప్పటికీ మాజీ రాజ కుటుంబ సభ్యులు ప్రత్యేక సందర్భాల్లో ఈ మిఠాయి ఆర్డర్ చేస్తారని సత్యనారాయణ్ తెలిపారు.

వెన్నెముక వైకల్యాలకు దిల్లీ ఎయిమ్స్ సరికొత్త శస్త్రచికిత్స

దిల్లీ: వెన్నెముకలో తీవ్ర, సంక్లిష్ట వైకల్యాలు ఉన్నవారికి ఉపశమనం కల్పించే సరికొత్త శస్త్ర చికిత్సను దిల్లీలోని ఎయిమ్స్ వైద్యులు కనిపెట్టారు. ఒకప్పుడు ఎంతో ప్రమాదంతో కూడుకున్నవిగా భావించే కేసుల్లో ఫలితాలు అద్భుతంగా ఉన్నాయని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. డాక్టర్ భవూక్ గర్గ్ నేతృత్వంలో ఆసుపత్రిలోని ఎముకల వైద్య విభాగం ఏడేళ్లు శ్రమించి ఈ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. గతంలో 'పోస్టీరియర్ వెర్టెబ్రల్ కాలమ్ రెసెక్షన్ (పీసీఆర్)' శస్త్రచికిత్సల్లో అనేక చిక్కుముళ్లు ఎదురయ్యేవని, మెరుగుపరిచిన విధానంలో వాటిని అధిగమించగలిగామని వైద్యులు తెలిపారు. సంప్రదాయ వైద్య విధానాల్లో ప్రాణానికి ముప్పుండే కొన్ని ఇబ్బందులు సైతం తలెత్తేవని, కొత్త విధానంలో వాటిని అధిగమించడంతోపాటు వెన్నెముక స్థిరత్వం మెరుగుపడిందని వివరించారు. తీవ్ర వైకల్యం ఉన్నవారు మెలితిరిగిన వెన్నెముకవల్ల నొప్పి భరిస్తూ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడుతూ, నిటారుగా నిల్చోలేక మానసికంగానూ తీవ్ర ఒత్తిడికి గురవుతుంటారని తెలిపారు. కొత్త విధానంలో వీటిని అధిగమించడంతో ఫలితాలు బాగున్నాయని చెప్పారు.

సరస్సులో మునిగిన తేలియాడే హట్స్

- 30 మంది పర్యాటకులను రక్షించిన సహాయ బృందాలు

న్యూ తెహ్రీ, పౌరీగఢ్వాల్: తుపాను కారణంగా ఉత్తరాఖండ్‌లోని డోబ్రా-చాంటి సరస్సులో తేలియాడే హట్స్ పాక్షికంగా నీట మునగడంతో అందులో చిక్కుకున్న 30 మంది పర్యాటకులను సహాయక బృందాలు రక్షించాయి. ఈ ఘటన న్యూ తెహ్రీ నగర సమీపంలో శనివారం సాయంత్రం జరిగింది. పెను గాలుల కారణంగా భారీగా అలలు రావడంతో సరస్సులో ఏర్పాటు చేసిన తేలియాడే హట్స్ మునిగిపోయే స్థితికి వచ్చాయి. సమాచారం అందుకున్న ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలికి చేరుకొని పర్యాటకులను కాపాడినట్లు అధికారులు తెలిపారు.

చార్‌ధామ్ పర్యాటకులకు గైడ్ వేధింపులు

ఓ ట్రావెల్ ఏజెన్సీకి చెందిన గైడ్ చార్‌ధామ్ యాత్రికులపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఉత్తరాఖండ్‌లోని పౌరీ గఢ్వాల్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన బృందం చార్‌ధామ్ యాత్ర కోసం ప్రైవేట్ ట్రావెల్స్ ఏజెన్సీ నుంచి వాహనాన్ని బుక్ చేసుకున్నారు. శనివారం రాత్రి భోజనం కోసం ఓ దాబావద్ద వీరు ఆగారు. ఈ క్రమంలో బృందంలోని కొందరిపై గైడ్ దురుసుగా ప్రవర్తించడంతోపాటు దాడికి పాల్పడ్డాడు. దీంతో గైడ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు యాత్రికులను సురక్షితంగా శ్రీనగర్‌కు తరలించారు.

రూ.48వేల కోట్లు.. 7 కొత్త కారిడార్లు
దిల్లీ మెట్రో విస్తరణ: సీఎం రేఖా గుప్తా

దిల్లీ: ఏడు కొత్త కారిడార్లు, 65 స్టేషన్లతో దిల్లీ మెట్రోను 97 కిలోమీటర్ల మేర విస్తరిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేఖా గుప్తా తెలిపారు. ఆదివారం జరిగిన దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ 32వ ఆవిర్భావ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. దిల్లీ మెట్రో ఐదో దశ కింద రాజధాని శివారు ప్రాంతాలను అనుసంధానిస్తూ రూ.48,204 కోట్ల వ్యయంతో ఏడు కారిడార్లు, 65 స్టేషన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

శత్రు యుద్ధనౌకల ఆయువుపట్టుపై దాడి!

సరికొత్త అస్త్రాన్ని పరీక్షించిన భారత్



యుద్ధరంగంలో శత్రువుపై దాడి చేయడమే కాదు.. సరిగ్గా ఆయువుపట్టును చూసి చావుదెబ్బ కొట్టాలి! లేకుంటే ప్రతి దాడి చేయడానికి ప్రత్యర్థికి వీలు దొరుకుతుంది!! సాగరంలో శత్రు యుద్ధనౌకలకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా వాటి ఆయువుపట్టుపై దాడిచేసే సత్తా కలిగిన ఒక క్షిపణిని భారత్ రూపొందించింది. ప్రత్యర్థిని గుక్కతిప్పుకోకుండా చేసేలా శరపరంపరగా వీటిని ప్రయోగించే సామర్థ్యాన్ని కూడా ఇటీవల విజయవంతంగా పరీక్షించి చూసింది.



—ఈనాడు ప్రత్యేక విభాగం

ఏమిటీ క్షిపణి?

ఈ అస్త్రం పేరు నేవల్ యాంటీ షిప్ మిసైల్ షార్ట్ రేంజ్ (నాసమ్-ఎస్ఆర్). యుద్ధనౌకలపై మోహరించే హెలికాప్టర్లకు దీన్ని అమరుస్తారు. ఇటీవల దీన్ని ఒడిశా తీరానికి చేరువలో విజయవంతంగా పరీక్షించారు. ఒకే హెలికాప్టర్ నుంచి వెనువెంటనే రెండు నాసమ్-ఎస్ఆర్‌ల ప్రయోగం జరిగింది. దీన్ని 'శాల్వో' పద్ధతిలో పరీక్షించడమంటారు. ఈ అస్త్రాన్ని ఇలా పరీక్షించడం ఇదే మొదటిసారి.

ఈ తరహా క్షిపణుల పాత్రేమిటి?

యుద్ధనౌకలపై మోహరించి ఉండే ఈ హెలికాప్టర్లకు ఈ క్షిపణులను అమరుస్తారు. ఆ హెలికాప్టర్లు శత్రువుకు దగ్గరకు వెళ్లి, దానిపైకి క్షిపణులు ప్రయోగించి మళ్లీ సురక్షితంగా మాతృనౌకపైకి తిరిగొస్తాయి. ఈ క్రమంలో మాతృనౌకకు ప్రత్యక్ష ముప్పు లేకుండా చూస్తాయి.

భారత నౌకాదళం వద్ద ఇప్పటికే సీ ఈగిల్ అనే నౌకావిధ్వంసక క్షిపణులు ఉన్నాయి. వీటిని సీకింగ్ హెలికాప్టర్లలో మోహరించారు.

మరి కొత్త క్షిపణులెందుకు?

సీ ఈగిల్ క్షిపణులు 1980ల నాటివి. ఆధునిక సామర్థ్యాలు లేవు. ఒక క్షిపణి ఏకంగా 580 కిలోల బరువును కలిగి ఉంది. ఈ నేపథ్యంలో మరింత తేలికపాటి, ఆధునిక క్షిపణిని రూపొందించాలని రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) నిర్ణయించింది. దీనివల్ల ఒక హెలికాప్టర్‌లో మరిన్ని క్షిపణులను మోహరించొచ్చని భావించింది. ఈ మేరకు నాసమ్-ఎస్ఆర్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. ఈ అస్త్రం బరువు 380 కిలోలు. 55 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు.

నాసమ్-ఎస్ఆర్ ప్రత్యేకతలు

- మ్యాన్-ఇన్-లూప్: దీనివల్ల క్షిపణిని ప్రయోగించాక కూడా దాని ప్రయాణమార్గాన్ని మార్చుకునే వెసులుబాటు సైనికాధికారికి ఉంటుంది. పొరపాటున సాధారణ నౌకలను ధ్వంసంచేసే పరిస్థితి తప్పుతుంది. అధిక బ్యాండ్‌విడ్త్ కలిగిన టూ-వే డేటా లింక్ వల్ల ఇది సాధ్యమవుతోంది. క్షిపణికి, హెలికాప్టర్‌లోని అధికారికి మధ్య ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్‌కు వీలు కల్పిస్తుంది. కదులుతున్న లక్ష్యాలను కచ్చితత్వంతో ధ్వంసం చేయడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. పాత సీ ఈగిల్స్ క్షిపణుల్లో ఈ వెసులుబాటులేదు.
- వాటర్‌లైన్ హిట్: నౌక హల్ భాగం.. నీటిని తాకే భాగం లేదా దానికి కొంచెంపైన క్షిపణి ఢీ కొడితే దాన్ని వాటర్‌లైన్ హిట్‌గా పేర్కొంటారు. నౌకలో ఇది దుర్బల ప్రదేశం. అక్కడ ఢీ కొడితే నౌకలోకి వేగంగా నీరు చేరి అది నిర్వీర్యం కావడమో వేగంగా మునిగిపోవడమో జరుగుతుంది. మునుపటి సీ ఈగిల్ క్షిపణిలో ఆ సామర్థ్యం లేదు.


చాంపియన్స్

ఐపీఎల్‌లో ఈనాడు
ముంబయి × లఖ్‌నవూ
వేదిక: ముంబయి, రా॥ 7.30

వరుసగా అయిదు విజయాలతో ప్లేఆఫ్స్ దిశగా దూసుకెళ్తున్న జట్టు సన్‌రైజర్స్ హైదరాబాద్. అటు చూస్తే 8 మ్యాచ్‌ల్లో రెండే నెగ్గిన కోల్‌కతా నైట్‌రైడర్స్. మ్యాచ్ వేదికేమో సన్‌రైజర్స్ సొంతమైదానంలో. ఆతిథ్య జట్టు దెబ్బకు నైట్‌రైడర్స్ ఏమాత్రం నిలుస్తుందో అనుకుంటే.. ఉప్పల్‌లో ఊహించనిది జరిగింది. కోల్‌కతా బౌలర్ల ధాటికి సన్‌రైజర్స్ బ్యాటర్లు చేతులెత్తేశారు. ఇన్నింగ్స్ రెండో అర్ధంలో చతికిలపడే పాత బలహీనతను పునరావృతం కావడంతో ఓ మోస్తరు స్కోరుతో సరిపెట్టుకున్న హైదరాబాద్.. ఛేదనలో కోల్‌కతా బ్యాటర్లు సమష్టిగా సత్తా చాటడంతో ఓటమి తప్పించుకోలేకపోయింది.

సన్‌రైజర్స్‌కు చెక్

- సొంతగడ్డపై అనూహ్య పరాజయం
- విజృంభించిన కోల్‌కతా బౌలర్లు


వరుణ్ 3/36

ఈనాడు - హైదరాబాద్

ఐపీఎల్-19లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న సన్‌రైజర్స్‌కు బ్రేక్ పడింది. గత మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై 244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన కమిన్స్ సేన.. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా చేతిలో ఏడు వికెట్ల తేడాతో చిత్తయింది. సునీల్ నరైన్ (2/31), వరుణ్ చక్రవర్తి (3/36)ల స్పిన్ మాయాజాలానికి తలవంచిన సన్‌రైజర్స్ మొదట 19 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌటైంది. ట్రావిస్ హెడ్ (61; 28 బంతుల్లో 9×4, 3×6), ఇషాన్ కిషన్ (42; 29 బంతుల్లో 4×4, 2×6) మాత్రమే రాణించారు. అనంతరం కోల్‌కతా మరో 10 బంతులు మిగిలివుండగానే లక్ష్యాన్ని ఛేదించింది. అంగ్‌క్రిష్ రఘువంశీ (59; 47 బంతుల్లో 5×4, 2×6), కెప్టెన్ అజింక్య రహానె (43; 36 బంతుల్లో 4×4, 1×6) సత్తాచాటడంతో కోల్‌కతా 18.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ సీజన్‌లో సన్‌రైజర్స్‌కు ఇది నాలుగో పరాజయం కాగా.. కోల్‌కతా మూడో గెలుపుతో ప్లేఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది.

కోల్‌కతా అలవోకగా..: లక్ష్యం పెద్దది కాకపోయినా.. ఈ సీజన్లో కోల్‌కతా బ్యాటింగ్, సన్‌రైజర్స్ బౌలింగ్ సాగుతున్న తీరు దృష్ట్యా ఛేదన అంత తేలిక కాదనుకున్నారంతా. అయితే ఓపెనర్ ఫిన్ అలెన్ (29; 13 బంతుల్లో 3×4, 2×6) మెరుపు ఆరంభాన్నిచ్చి కోల్‌కతా జట్టులో జోష్ తీసుకొచ్చాడు. కమిన్స్ వేసిన నాలుగో ఓవర్లో రెండు సిక్సర్లు, రెండు ఫోర్లతో ఏకంగా 27 పరుగులు పిండుకున్నాడు. అదే ఓవర్లో ఆఖరి బంతికి అలెన్‌ను కమిన్స్ బోల్తా కొట్టించాడు. అయితే రహానెతో మొదటి వికెట్‌కు 49 పరుగులు జోడించిన అలెన్.. లక్ష్యం, బంతుల అంతరాన్ని బాగా తగ్గించాడు. అనంతరం రహానె, రఘువంశీ జట్టును లక్ష్యం దిశగా నడిపించారు. వికెట్‌ను కాపాడుకుంటూనే ఇద్దరూ చక్కటి షాట్లు ఆడారు. దీంతో 9.2 ఓవర్లలో కోల్‌కతా స్కోరు 100కు చేరుకుంది. అయితే పిచ్ బాగా నెమ్మదించడం.. బంతిపై బౌలర్లకు నియంత్రణ లభిస్తుండటంతో బ్యాటింగ్ కొంచెం కష్టమైంది. దీంతో రహానె, రఘువంశీ షాట్లకు వెళ్లకుండా జాగ్రత్తగా ఆడారు. ఈ క్రమంలోనే రఘువంశీ 39 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాడు. పరుగుల వేగం పెంచే ప్రయత్నంలో రహానె, రఘువంశీ ఔటైనా.. అప్పటికే కోల్‌కతా సురక్షిత స్థితికి చేరుకుంది. రింకు సింగ్ (22 నాటౌట్; 11 బంతుల్లో 2×4, 1×6), గ్రీన్ (3 నాటౌట్) మిగతా పని పూర్తిచేశారు.

హెడ్, ఇషాన్ మాత్రమే: ఈ సీజన్‌లో వరుసగా అయిదు.. సొంతగడ్డపై వరుసగా మూడు విజయాలతో జోరుమీదున్న సన్‌రైజర్స్.. ఆదివారం భారీ స్కోరు చేసేలా కనిపించింది. టాస్ గెలిచిన కెప్టెన్ కమిన్స్ బ్యాటింగ్ ఎంచుకోగా.. ఆరంభం నుంచే హెడ్ విరుచుకుపడ్డాడు. వైభవ్ అరోరా (1/25) బౌలింగ్‌లో హెడ్ 4 ఫోర్లు కొట్టాడు. క్రీజులో అసౌకర్యంగా కనిపించిన అభిషేక్ (15; 10 బంతుల్లో 1×4, 1×6)ను కార్తీక్ త్యాగి (2/30) వెనక్కి పంపినా.. సన్‌రైజర్స్‌కు ఇబ్బంది లేకపోయింది. హెడ్‌కు ఇషాన్ తోడవగా.. ఇద్దరూ దూకుడుగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో పవర్‌ప్లేలో 71 పరుగులు చేసిన సన్‌రైజర్స్.. 8.5 ఓవర్లలోనే 100 పరుగుల మైలురాయిని దాటేసింది. ఈ క్రమంలోనే హెడ్ 22 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. వరుణ్ చక్రవర్తి ఓవర్లో ఇషాన్ 2 బౌండరీలు రాబట్టగా.. సిక్సర్ బాదిన హెడ్ మరో భారీషాట్‌కు ప్రయత్నించి డీప్ మిడ్‌వికెట్లో గ్రీన్ చేతికి చిక్కాడు. అప్పటికి సన్‌రైజర్స్ స్కోరు 9 ఓవర్లలో 105/2. హెడ్ ఔటయ్యాక మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. పిచ్ నెమ్మదించడంతో ఫీల్డింగ్, బౌలింగ్‌లో మార్పులతో బ్యాటర్లపై కోల్‌కతా ఒత్తిడి పెంచింది. నరైన్, వరుణ్ సహా కోల్‌కతా బౌలర్లంతా పక్కా వ్యూహంతో బౌలింగ్ వేశారు. పదో ఓవర్లో నరైన్ కేవలం 2 పరుగులే ఇవ్వడంతో సన్‌రైజర్స్‌పై ఒత్తిడి మరింత పెరిగింది. దీంతో గ్రీన్ (1/34) బౌలింగ్‌లో ఎదురుదాడికి దిగిన హెన్రిచ్ క్లాసెన్ (11; 8 బంతుల్లో 1×4, 1×6) సిక్సర్, బౌండరీతో మెరిశాడు. అయితే క్లాసెన్ మరో భారీ షాట్‌కు ప్రయత్నించగా.. డీప్ మిడ్ వికెట్లో పావెల్ ఒంటి చేత్తో అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. అక్కడ్నుంచి సన్‌రైజర్స్ కోలుకోలేకపోయింది. నరైన్ 16వ ఓవర్లో మొదటి, చివరి బంతులకు సలీల్ అరోరా (2), ఇషాన్‌లను ఔట్ చేసి సన్‌రైజర్స్‌ను మరింత ఇబ్బందుల్లోకి నెట్టాడు. 10-19 మధ్య 10 ఓవర్లలో 60 పరుగులే చేసిన సన్‌రైజర్స్.. 8 వికెట్లు కోల్పోవడం గమనార్హం. 8 ఓవర్లు వేసిన నరైన్, వరుణ్.. 67 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టారు.


హెడ్ 61


మ్యాచ్ వీక్షిస్తున్న బీసీసీఐ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు చాముండి, స్టార్ షట్లర్ పి.వి.సింధు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ (సి) గ్రీన్ (బి) త్యాగి 15; హెడ్ (సి) గ్రీన్ (బి) వరుణ్ 61; ఇషాన్ (సి) రాయ్ (బి) నరైన్ 42; క్లాసెన్ (సి) పావెల్ (బి) గ్రీన్ 11; స్మరణ్ (సి) రహానె (బి) వరుణ్ 4; అనికేత్ (సి) రహానె (బి) వరుణ్ 6; సలీల్ అరోరా (బి) నరైన్ 2; కమిన్స్ (సి) అండ్ (బి) రాయ్ 10; శివాంగ్ (సి) రఘువంశీ (బి) అరోరా 1; హర్షల్ (సి) అరోరా (బి) త్యాగి 6; మలింగ 2 నాటౌట్; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం:** (19 ఓవర్లలో ఆలౌట్) **165; వికెట్ల పతనం:** 1-44, 2-105, 3-117, 4-122, 5-135, 6-139, 7-148, 8-156, 9-156; **బౌలింగ్:** సునీల్ నరైన్ 4-0-31-2; వైభవ్ అరోరా 3-0-25-1; కార్తీక్ త్యాగి 4-0-30-2; కామెరూన్ గ్రీన్ 3-0-34-1; వరుణ్ చక్రవర్తి 4-0-36-3; అనుకుల్ రాయ్ 1-0-8-1

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: రహానె (సి) స్మరణ్ (బి) సకిబ్ 43; అలెన్ (సి) క్లాసెన్ (బి) కమిన్స్ 29; రఘువంశీ (సి) మలింగ (బి) శివాంగ్ 59; రింకు సింగ్ నాటౌట్ 22; గ్రీన్ నాటౌట్ 3; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం:** (18.2 ఓవర్లలో 3 వికెట్లకు) **169; వికెట్ల పతనం:** 1-49, 2-133, 3-151; **బౌలింగ్:** అభిషేక్‌శర్మ 2-0-14-0; కమిన్స్ 4-0-47-1; ఇషాన్ మలింగ 3.2-0-42-0; శివాంగ్‌కుమార్ 4-0-31-1; హర్షల్ పటేల్ 2-0-17-0; సకిబ్ హుస్సేన్ 3-0-17-1

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	నె.రన్‌రేట్
పంజాబ్	9	6	2	1	13	0.855
బెంగళూరు	9	6	3	0	12	1.420
హైదరాబాద్	10	6	4	0	12	0.644
రాజస్థాన్	10	6	4	0	12	0.510
గుజరాత్	10	6	4	0	12	-0.147
చెన్నై	9	4	5	0	8	0.005
దిల్లీ	9	4	5	0	8	-0.895
కోల్‌కతా	9	3	5	1	7	-0.539
ముంబయి	9	2	7	0	4	-0.803
లఖ్‌నవూ	8	2	6	0	4	-1.106

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, ఫ.తే: ఫలితం తేలనివి


హోల్డర్ 4/24

ఈ ఐపీఎల్‌లో ఓటమన్నదే ఎరుగకుండా ఆరు విజయాలు సాధించి 13 పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది పంజాబ్ కింగ్స్. శ్రేయస్ సేనకు ఎదురే లేదనుకుంటే.. ఆ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడిపోయింది. గత మ్యాచ్‌లో రాజస్థాన్ చేతిలో కంగుతిన్న ఆ జట్టు.. తాజాగా గుజరాత్ టైటాన్స్‌కు తలొంచింది. పేసర్లు విజృంభించడంతో పంజాబ్‌ను కట్టడి చేసిన జీటీ.. సాయి సుదర్శన్ నిలకడతో హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఆ జట్టు 12 పాయింట్లతో 5వ స్థానంలో నిలిచింది. వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడినా.. పంజాబ్ అగ్రస్థానంలోనే ఉంది.

గుజరాత్ హ్యాట్రిక్

- పంజాబ్‌పై విజయం
- మెరిసిన హోల్డర్, రబాడ, సుదర్శన్

అహ్మదాబాద్

పంజాబ్‌కు మరో ఝలక్.. గుజరాత్‌కు విజయాల హ్యాట్రిక్. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో టైటాన్స్ 4 వికెట్ల తేడాతో పంజాబ్‌ను ఓడించింది. ఆదివారం మొదట పంజాబ్.. హోల్డర్ (4/24), రబాడ (2/22), సిరాజ్ (2/28) ధాటికి 20 ఓవర్లలో 9 వికెట్లకు 163 పరుగులే చేయగలిగింది. సుయాంశ్ షెడ్గే (57; 29 బంతుల్లో 3×4, 5×6), స్టాయినిస్ (40; 31 బంతుల్లో 5×4, 1×6) రాణించారు. ఛేదనలో సాయి సుదర్శన్ (57; 41 బంతుల్లో 5×4, 1×6), వాషింగ్టన్ సుందర్ (40 నాటౌట్; 23 బంతుల్లో 5×4, 1×6) సత్తా చాటడంతో గుజరాత్ 19.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది.

మెరిసిన సుదర్శన్, సుందర్: ఛేదనలో గుజరాత్ కూడా ఆరంభంలో తడబడింది. రెండో ఓవర్లోనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (5) వికెట్‌ను కోల్పోయింది. ఈ స్థితిలో సాయి సుదర్శన్, బట్లర్ ఇన్నింగ్స్‌ను నడిపించారు. సుదర్శన్ ఆచితూచి ఆడగా.. బట్లర్ (26) బ్యాట్ ఝుళిపించాడు. దీంతో పవర్ ప్లే ఆఖరికి గుజరాత్ 58/1తో లక్ష్యం దిశగా సాగింది. తొమ్మిదో ఓవర్లో బట్లర్‌ను వైశాక్ ఔట్ చేసి పంజాబ్‌కు బ్రేక్ ఇచ్చాడు. కెరీర్‌లో తొలి ఐపీఎల్ మ్యాచ్ ఆడుతున్న నిశాంత్ సింధు (15) కూడా కాసేపే నిలిచాడు. అతడిని స్టాయినిస్ ఔట్ చేయడంతో 11.3 ఓవర్లకు జీటీ 94/3తో నిలిచింది. అయితే వికెట్లు పడుతున్నా సుదర్శన్ పరుగుల వేటను కొనసాగించాడు. అతడికి సుందర్ నుంచి సహకారం లభించడంతో గుజరాత్ లక్ష్యం దిశగా సాగింది. ఈ క్రమంలో సుదర్శన్ 37 బంతుల్లో అర్ధసెంచరీ అందుకున్నాడు. సుదర్శన్‌తో పాటు సుందర్, తెవాతియా (2) ఔటైనా.. సుందర్ జట్టును గెలుపుబాటలోనే ఉంచాడు. 12 బంతుల్లో 17 పరుగులు చేయాల్సిన స్థితిలో.. 19వ ఓవర్లో హోల్డర్ (5)ను పెవిలియన్ చేర్చి అర్ష్‌దీప్ 6 పరుగులే ఇచ్చాడు. దీంతో ఆఖరి ఓవర్లో జీటీ విజయానికి 11 పరుగులు అవసరమయ్యాయి. అర్షద్ ఖాన్ వేసిన ఈ ఓవర్లో తొలి 4 బంతుల్లో 8 పరుగులు వచ్చాయి. 2 బంతుల్లో 3 పరుగులు అవసరమవగా, అయిదో బంతికి సుందర్ సిక్స్ బాది గుజరాత్‌ను గెలిపించాడు.

ఆదుకున్న సుయాంశ్, స్టాయినిస్: అంతకుముందు హోల్డర్, రబాడ, సిరాజ్ దెబ్బకు పంజాబ్ తీవ్రంగా తడబడి.. ఆపై నిలదొక్కుకుని పోరాడే స్కోరు చేయగలిగింది. ఆ జట్టు ఇన్నింగ్స్ ఆరంభమే పేలవం. సిరాజ్ తొలి ఓవర్లోనే ప్రియాంశ్ (2), కూపర్ కనోలీ (0)లను వరుస బంతుల్లో ఔట్ చేసి ప్రత్యర్థికి షాక్ ఇచ్చాడు. సిరాజ్, రబాడ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 4 ఓవర్లకు పంజాబ్ 27 పరుగులే చేయగలిగింది. ఈ స్థితిలో శ్రేయస్ (19) స్కోరు బోర్డును కదిలించాడు. పంజాబ్ కోలుకుంటుందని అనిపిస్తున్న సమయంలో ఆ జట్టుకు షాక్‌ల మీద షాక్‌లు తగిలాయి. హోల్డర్, రబాడ విజృంభించడంతో స్వల్ప వ్యవధిలో పంజాబ్.. ప్రభ్‌సిమ్రన్ (15), నెహాల్ వధేరా (0), శ్రేయస్ వికెట్లు కోల్పోయి 8.4 ఓవర్లకు 47/5తో కష్టాల్లో కూరుకుపోయింది. ఈ స్థితిలో సుయాంశ్ షెడ్గే ఎదురుదాడికి దిగాడు. సుతార్ వేసిన 14వ ఓవర్లో అతడు వరుసగా 6, 6, 4, 4, 6 కొట్టడంతో ఏకంగా 27 పరుగులు దక్కాయి. పంజాబ్ స్కోరు 100 దాటేసింది. అదే ఊపులో సుయాంశ్.. 24 బంతుల్లోనే అర్ధసెంచరీ చేశాడు. అతడికి స్టాయినిస్ నుంచి మంచి సహకారం లభించింది. వీళ్లిద్దరితో పాటు యాన్సెన్ (20) కూడా ఓ చేయి వేయడంతో పంజాబ్ ఓ మోస్తరు స్కోరు చేయగలిగింది.


సుదర్శన్ 57

పంజాబ్ ఇన్నింగ్స్: ప్రియాంశ్ ఆర్య (సి) నిశాంత్ సింధు (బి) సిరాజ్ 2; ప్రభ్‌సిమ్రన్ (సి) సుతార్ (బి) రబాడ 15; కనోలీ (సి) బట్లర్ (బి) సిరాజ్ 0; శ్రేయస్ అయ్యర్ (బి) హోల్డర్ 19; నెహాల్ వధేరా (సి) బట్లర్ (బి) హోల్డర్ 0; సుయాంశ్ షెడ్గే (సి) బట్లర్ (బి) రబాడ 57; స్టాయినిస్ (సి) సుందర్ (బి) హోల్డర్ 40; యాన్సెన్ (బి) గిల్ (బి) రషీద్ 20; బార్ట్‌లెట్ (బి) హోల్డర్ 0; వైశాక్ నాటౌట్ 1; అర్ష్‌దీప్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 8 **మొత్తం:** (20 ఓవర్లలో 9 వికెట్లకు) **163; వికెట్ల పతనం:** 1-2, 2-2, 3-35, 4-36, 5-47, 6-126, 7-141, 8-141, 9-162; **బౌలింగ్:** సిరాజ్ 4-0-28-2; రబాడ 4-1-22-2; హోల్డర్ 4-0-24-4; అర్షద్ ఖాన్ 3-0-29-0; రషీద్ ఖాన్ 4-0-32-1; మానవ్ సుతార్ 1-0-27-0

గుజరాత్ ఇన్నింగ్స్: సుదర్శన్ (సి) బార్ట్‌లెట్ (బి) వైశాక్ 57; గిల్ (సి) కనోలీ (బి) అర్ష్‌దీప్ 5; బట్లర్ (సి) అయ్యర్ (బి) వైశాక్ 26; నిశాంత్ సింధు (సి) వైశాక్ (బి) స్టాయినిస్ 15; సుందర్ నాటౌట్ 40; తెవాతియా (సి) బార్ట్‌లెట్ (బి) యాన్సెన్ 2; హోల్డర్ (సి) కనోలీ (బి) అర్ష్‌దీప్ 5; అర్షద్ నాటౌట్ 8; ఎక్స్‌ట్రాలు 9, **మొత్తం:** (19.5 ఓవర్లలో 6 వికెట్లకు) **167; వికెట్ల పతనం:** 1-16, 2-69, 3-94, 4-124, 5-140, 6-152; **బౌలింగ్:** బార్ట్‌లెట్ 4-0-38-0; అర్ష్‌దీప్ 4-0-24-2; యాన్సెన్ 4-0-33-1; వైశాక్ 4-0-31-2; స్టాయినిస్ 2.5-0-26-1; చాహల్ 1-0-13-0

లక్ష్మి మిత్తల్ చేతికి రాజస్థాన్ రాయల్స్

దిల్లీ: రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం మారబోతోంది. ఉక్కు దిగ్గజం లక్ష్మీ మిత్తల్.. రాయల్స్‌ను కొనుగోలు చేశాడు. తన కొడుకు ఆదిత్య మిత్తల్, సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈఓ అదర్ పూనావాలాతో కలిసి లక్ష్మీ మిత్తల్ రూ.15,660 కోట్లకు రాయల్స్‌ను సొంతం చేసుకోనున్నాడు. పార్ల్ రాయల్స్, బార్బడోస్ రాయల్స్ కూడా ఈ ఒప్పందంలో భాగంగా కొత్త యజమానుల చేతికి వెళ్తాయి. ఈ అమ్మకాన్ని బీసీసీఐ ధ్రువీకరించాల్సివుంది. ఇకపై రాయల్స్‌లో మిత్తల్ కుటుంబానికి 75 శాతం, పూనావాలాకు 18 శాతం వాటా ఉంటుంది. మిగతా ఏడు శాతం వాటాను ప్రస్తుత యజమానులు అట్టిపెట్టుకున్నారు. నిజానికి కల్ సోమాని నేతృత్వంలోని కన్సార్షియం.. రాజస్థాన్ రాయల్స్ కోసం మార్చిలో విజయవంతంగా బిడ్ వేసింది. కానీ ఆ తర్వాత వివిధ కారణాల వల్ల వెనక్కి తగ్గింది. ఒప్పందం కుదరలేదు.

దీపికకు 2 కాంస్యాలు


దీపిక

ఈనాడు, హైదరాబాద్: ఐటీటీఎఫ్ ప్రపంచ పారా ఛాలెంజర్స్ టేబుల్ టెన్నిస్‌లో తెలంగాణ అమ్మాయి గంగాపట్నం విజయ దీపిక సత్తా చాటింది. ఈ పోటీల్లో 15 ఏళ్ల దీపిక రెండు కాంస్యాలు సొంతం చేసుకుంది. మాంటెనెగ్రోలోని పోడ్గొరికాలో జరిగిన పోటీల్లో మహిళల డబుల్స్‌లో సోనాల్ పటేల్ (గుజరాత్)తో కలిసి దీపిక సత్తా చాటింది. క్వార్టర్స్‌లో దీపిక జంట 11-9, 13-11, 8-11, 11-4తో పుష్పాషేవా-ఎలీనా (రష్యా) జోడీపై గెలిచింది. అయితే సెమీఫైనల్లో భారత జోడీ 3-11, 16-18, 7-11తో సాండ్రా-జానా (జర్మనీ) ద్వయం చేతిలో ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇసాకోవ్ గ్రెగరీ (రష్యా) తోడుగా దీపిక సెమీఫైనల్ వరకు వెళ్లింది. కానీ సెమీస్‌లో దీపిక జంట 11-6, 5-11, 5-11, 12-10, 7-11తో చెంగ్ మింగ్-లిన్ యెన్ యింగ్ (చైనీస్ తైపీ) జోడీకి తలొంచింది. రెండు విభాగాల్లో సెమీఫైనల్లో ఓడినా.. దీపిక కాంస్య పతకాలను సొంతం చేసుకుంది. అంతర్జాతీయ స్థాయిలో దీపిక ఇప్పటిదాకా 10 పతకాలు గెలిచింది.

ఆమె స్థానాన్ని భర్తీ చేయడం కష్టమే


అమన్‌జ్యోత్ కౌర్

ముంబయి: గాయపడి టీ20 ప్రపంచకప్‌కు దూరమైన ఆల్‌రౌండర్ అమన్‌జ్యోత్ కౌర్ స్థానాన్ని భర్తీ చేయడం కష్టమేనని భారత మహిళల క్రికెట్ జట్టు కోచ్ అమోల్ మజుందార్ అన్నాడు. "అమన్‌జ్యోత్‌కు గాయమైంది. ఆమె లాంటి ప్లేయర్‌ను మరొకరితో భర్తీ చేయడం సాధ్యం కాదు. అమన్‌జ్యోత్.. భారత్ తరఫున స్థిరంగా రాణించింది. కచ్చితంగా ఆమె లేకపోవడం లోటే. గాయం కారణంగా 4-5 నెలలు ఈ ఆల్‌రౌండర్ మైదానంలోకి దిగే అవకాశం లేదు. అమన్‌జ్యోత్ త్వరలోనే కోలుకుని పునరాగమనం చేస్తుందని ఆశిస్తున్నా" అని మజుందార్ తెలిపాడు. ప్రపంచకప్ కోసం భారత్ సరైన దిశలో సన్నద్ధమవుతోందని మజుందార్ చెప్పాడు. "ప్రపంచకప్ కోసం భారత్ సరైన దిశలో సన్నద్ధమవుతుంది. ఈ టోర్నీకి ముందు ఇంగ్లాండ్‌తో సిరీస్ ఆడబోతుండడం జట్టుకు మేలు చేసేదే" అని అతనన్నాడు. మే 10 నుంచి 16 వరకు బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భారత్ జట్టు సాధన చేయనుంది. భారత్-ఇంగ్లాండ్ మధ్య మూడు టీ20ల సిరీస్ ఈ నెల 28న ఆరంభం కానుంది.

అవమానం నుంచి జాతీయ రికార్డు దాకా..


కుల్‌దీప్

కోల్‌కతా: ఈ ఏడాది ఆరంభంలో రైలు ప్రయాణం చేస్తూ అవమానానికి గురైన కుల్‌దీప్ కుమార్.. భువనేశ్వర్‌లో జరిగిన భారత ఇండోర్ ఓపెన్‌లో పోల్‌వాల్ట్ పోటీలో 5.41 మీటర్లు దూకి జాతీయ రికార్డు నెలకొల్పాడు. జనవరిలో తన సహచరుడు దేవ్‌కుమార్ మీనాతో కలిసి రైల్లో ప్రయాణిస్తుండగా.. వారితో ఉన్న క్రీడా పరికరాలు స్టీల్ వస్తువులంటూ టికెట్ పరిశీలకులు ఇద్దరినీ బోగీ నుంచి దింపేశారు. ఆ తర్వాత మహారాష్ట్రలోని పన్వేల్ స్టేషన్లో వారిని నిర్బంధించడం గమనార్హం. "ఉత్తమ ప్రదర్శన చేస్తానని పోటీలకు ముందు ఆత్మవిశ్వాసంతో ఉన్నాను. నేను, దేవ్ చాలా శ్రమించాం. జాతీయ రికార్డు నెలకొల్పడం సంతోషంగా ఉంది. భారత్‌లో పోల్‌వాల్ట్ గురించి ఎక్కువ మందికి తెలియదు. కానీ దీన్ని జనాల్లోకి తీసుకెళ్లడానికి మా ప్రదర్శన దోహదపడుతుందని ఆశిస్తున్నా" అని 21 ఏళ్ల కుల్‌దీప్ అన్నాడు. దేవ్ కుమార్ మీనా 5.20 మీటర్లతో కాంస్యం గెలిచాడు.


వినేశ్ ఫొగాట్

ఆ ఆరుగురిలో నేనూ ఉన్నా

దిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ ఫిర్యాదు చేసిన ఆరుగురు మహిళల్లో తాను కూడా ఉన్నానని రెజ్లర్ వినేశ్ ఫొగాట్ వెల్లడించింది. ఈ నెల 10న మొదలయ్యే జాతీయ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నీలో పాల్గొనడంలో తన అసౌకర్యం గురించి చెప్పింది. ఈ టోర్నీ ఉత్తర్ ప్రదేశ్‌లోని గొండాలో జరగనుంది. గొండా.. బ్రిజ్‌భూషణ్ సొంత ఊరు. "అతడిపై ఫిర్యాదు చేసిన ఆరుగురిలో నేను ఒకదాన్ని. కేసు ఇంకా కోర్టులో ఉంది. అతడికి పట్టున్న ప్రాంతంలో పోటీ పడడం నన్ను మానసిక ఒత్తిడి గురి చేస్తుంది. అక్కడి వ్యక్తుల్లో చాలా మంది అతడికి సన్నిహితులే అయ్యుండొచ్చు. అలాంటి పరిస్థితుల్లో నేను సరైన ప్రదర్శన చేయగలనని అనుకోవట్లేదు" అని సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఓ వీడియోలో వినేశ్ పేర్కొంది. పోటీల సందర్భంగా తనకు లేదా తన జట్టు సభ్యులకు ఏం జరిగినా భారత ప్రభుత్వానిదే బాధ్యత అవుతుందని ఆమె హెచ్చరించింది. పారిస్ ఒలింపిక్స్ అనంతరం ఆటకు గుడ్‌బై చెప్పిన వినేశ్.. పునరాగమనం చేస్తున్నట్లు ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆమె 57 కిలోల విభాగంలో పోటీపడనుంది. అయితే 1400పైగా క్రీడాకారులు జాతీయ టోర్నీలో ఆడుతున్నారని.. ఇప్పటికిప్పుడు వేదికను మార్చడం సాధ్యం కాదని డబ్ల్యూఎఫ్ఐ అధికారులు స్పష్టం చేశారు.

ధోని లాంటి వికెట్‌కీపర్‌ను చూడలేదు


అశ్విన్

దిల్లీ: మహేంద్రసింగ్ ధోని లాంటి మరో వికెట్‌కీపర్‌ను తన కెరీర్‌లో చూడలేదని మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. 2011 ఐపీఎల్ ఫైనల్లో క్రిస్ గేల్‌ను డకౌట్ చేసిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ అతడు మహిపై ప్రశంసలు కురిపించాడు. "ధోని అద్భుతమైన ఫినిషర్. అలాగే కెప్టెన్సీ గురించి అందరూ ఎంతో చర్చించుకుంటారు. కానీ తనలా వికెట్ కీపింగ్ చేసే వారిని నా కెరీర్‌లో చూడలేదు. వికెట్ల వెనుక అతడి పనితనం, స్పష్టమైన ఆలోచన విధానం వల్లే కెప్టెన్‌గా కంటే కీపర్‌గా ధోనికి ప్రశంసలు వచ్చాయి. 2011 ఐపీఎల్ ఫైనల్లో అతను పట్టిన క్యాచ్ వల్లే గేల్‌ను డకౌట్ చేయగలిగాను. రాజస్థాన్ రాయల్స్ తరఫున మూడు సీజన్లు ఆడినప్పటికీ.. టైటిల్ గెలవకపోవడం నన్ను బాధిస్తుంటుంది. 2018లో పంజాబ్ కింగ్స్‌కు ఆడేటప్పుడు బట్లర్ రనౌట్ (మన్కడింగ్)పై నేనేమీ పశ్చాత్తాప పడట్లేదు. ఒకవేళ ఆ నియమం క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ఉంటే.. ఐసీసీ దాన్ని తొలగించేది కదా. మ్యాచ్ గెలవడం కోసమే అలా చేశాను. అందులో సిగ్గుపడాల్సిందేముంది" అని అశ్విన్ చెప్పాడు.

సత్తా చాటిన భారత బాక్సర్లు

తాష్కెంట్: ఆసియా అండర్-17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో తొలి రోజు భారత బాక్సర్లు సత్తా చాటారు. అయిదుగురు బాలికలు శుభారంభం చేశారు. ఆదివారం తొలి రౌండ్లో రాఖీ (48కేజీ), ఒవి (50కేజీ), మమత (52 కేజీ), లక్ష్మి (54కేజీ), నవ్య (57కేజీ) విజయాలు సాధించారు. బాలుర విభాగంలో నరేంద్ర కుమార్ (46కేజీ) తొలి రౌండ్‌ను అధిగమించాడు. దక్ష్ పవార్ (48కేజీ) ఓడిపోయాడు.

మాడ్రిడ్ ఓపెన్ విజేత సినర్

మాడ్రిడ్: ప్రపంచ నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు యానిక్ సినర్ మరో టైటిల్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఇటలీ ప్లేయర్ ఆదివారం మాడ్రిడ్ ఓపెన్ టెన్నిస్ టోర్నీ విజేతగా నిలిచాడు. ఫైనల్లో అతడు 6-1, 6-2తో అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ను చిత్తు చేశాడు. ఈ విజయంతో మాస్టర్స్ 1000 ఈవెంట్లలో వరుసగా అయిదు టైటిళ్లు నెగ్గిన తొలి ప్లేయర్‌గా సినర్ ఘనత సాధించాడు. ఈ ఏడాది మాంటె కార్లో, మయామి, ఇండియన్ వెల్స్ టోర్నీల్లో విజేతగా నిలిచిన అతడు.. గత ఏడాది పారిస్ ఈవెంట్ గెలిచాడు.